మిసిమి

చింతనాత్మక సారస్వతం

...పాతికేండ్ల సారస్వత సేవ...

మాసపత్రిక మార్చి, 2014 ₹ 25



చరిత్ర పుటలు

మిసిమి
మాసపత్రిక

"All that we are is the product of what we have thought"
- Dammapada.

సంపుటి 25 **మార్చి 2014** **సంచిక 3**

ప్రధాన సంపాదకుడు
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

సంపాదకుడు
వల్లభనేని అశ్వినీకుమార్

సహాయ సంపాదకుడు
కాంద్రేగుల నాగేశ్వరరావు

సమాలోచక మండలి

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

సంస్థాపక సంపాదకులు
రవీంద్రనాథ్ ఆలపాటి

Printed & Published by

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹ 25 సంవత్సరానికి : ₹300
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060

ఈ నెల...

లేఖ 3
నాట్యతత్త్వం 5
– పసుపులేటి పూర్ణచంద్రరావు
ఆగమగీతి – ఆలూరి బైరాగి 13
– ప్రొ. రావినూతల సత్యనారాయణ
బళ్ళారి మళ్లీ మనదైతే 22
– గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి
ఇందులేఖ 28
– చందు మీనన్; మిసిమి డెస్క్
బ్రిటన్ నాటక రంగం 33
– చాట్ల శ్రీరాములు
సుగాలీల సామెతలు 38
– దుంగావత్ నరేష్ కుమార్ నాయక్
మేఘదూతంలో యక్షుడు 42
– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
తెలుగు స్వీయచరిత్రలలో – తల్లి ప్రస్తావన 46
– కణుగుల వేంకటరావు
తెలుగు సంస్కరణోద్యమం 52
– ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి
కళా రంగంలో నూజివీడు 57
– జి.వి.ఆర్.కె. సుబ్బరాయమూర్తి
భారతీయ చిత్రలేఖనోదయము 63
– తలిశెట్టి రామారావు
ప్రసార సాధనాలలో తెలుగు 71
– బి. నాగశేషు
మా తెలుగు మాష్టారు... 74
– వేలూరి వేంకటేశ్వర రావు
నాయకురాలు నాగమ్మ 77
– వై. హెచ్. మోహన్‌రావు
నాటి పాలీ భాష 79
– కుర్రా జితేంద్రబాబు
భగవద్గీతలో బౌద్ధం 85
– భదంత ఆనంద కౌసల్యాయన్ ; జె. లక్ష్మిరెడ్డి
పుస్తక పరిచయం 92
నవ్వులు 94

ముఖచిత్రం : ఈ బొమ్మ నాది
రెండవ అట్ట : చరిత్ర పుటలు
మూడవ అట్ట : దక్కన్ పీఠం
నాల్గవ అట్ట : ఈ నేల నాది

చిత్రకారులు – రోటమ్ గ్రూప్, విజయ్ చౌహాన్, రోహిణీకుమార్, మార్టిన్ గ్రిల్లీ

వివరాలు 48వ పుటలో...

ఎన్నోమార్లు **మిసిమి** సంపాదకమండలి చర్చల్లో 'సాహిత్యం' చోటుచేసుకుంటోంది. ఏది 'సాహిత్యం'? ఆంగ్లంలో 'లిటరేచర్' అనే పదాన్ని మనం 'సాహిత్యం'గా అనువదించుకున్నాం. లిటరేచర్ అనేది చాలా విస్తృతార్థంలో వాడబడింది. నిజానికి పాశ్చాత్య దేశాల్లో లిటరేచర్‌ని కూడా ఆర్ట్ అనే అంటారు.

మన పండితులు భారత, రామాయణాలనే సాహిత్యమన్నారు. మిగతా రచనలను వాఙ్మయమనే వర్గీకరించారు, ప్రబంధ కావ్యాలతో సహా. ఇప్పుడు మనం తెలుగులో రాయబడిందంతా సాహిత్యమనే అంటున్నాం. శాస్త్రవిజ్ఞాన పుస్తకాలు, గణిత శాస్త్రాన్ని మినహాయింపు ఇస్తున్నా– చరిత్ర కథనాలను, యాత్రా కథనాలను, చివరికి స్వీయ చరిత్రలు, పరాయి చరిత్రలు ఇవన్నీ కూడా – సాహిత్యంగానే చెలామణి అవుతున్నాయి. సంపాదకమండలి చర్చల్లో **మిసిమి** సాహిత్యంతో నిండిపోతున్నదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీన్ పాల్ సార్త్రే What is Literature? అని సాంద్రతగల చర్చ చేశారు. మన సాహిత్య విమర్శకులు తప్పక చదివే ఉంటారని ఆశించవచ్చు.

గ్రంథ పరిశీలనలు, పరిశోధనా వ్యాసాలు, వ్యక్తిత్వ విశ్లేషణ, సాహిత్యం కాబోదనే ఆశిస్తాం. అది వాఙ్మయమే. ధర్మబోధనలు ఏ వర్గీకరణంలోకి వస్తాయో ఇంతవరకు చెప్పబడలేదు. అరవిందుడు, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి, జిడ్డు కృష్ణమూర్తి – వీరందరి రచనలో, ప్రసంగాలో, జీవితచరిత్రలో – ఏవైనా, ఎలా వర్గీకరిస్తాం? కల్పిత కథలను సాహిత్యమనలేము కదా! అయితే ఇంక సాహిత్యం ఎక్కడ మిగిలింది? నిజానికి **మిసిమి**లో భారత, రామాయణాలపై చర్చగాని, విశ్లేషణలుగాని అంతగా చోటుచేసుకోవు. అనువాదాలు సాహిత్యం కాకపోయినా, అనువాద సాహిత్యమనే చెలామణి చేస్తున్నాం. వాఙ్మయాన్ని నాటకాలుగా మలిచారు, ప్రదర్శించారు. నాట్యంగా మార్చుచేశారు, అభినయిస్తున్నారు. చివరికి సంగీతంగాను విడగొట్టి పాడుతున్నారు. ఇక సినిమాపాటల సాహిత్యానికి పెద్దలే పెద్దపీట వేస్తున్నారు. ఏది సాహిత్యం అందాం, దేనిని సాహిత్యం కాదందాం?

"ఏముంది ఈ సాహిత్యంలో? పురాతనమైనా, ఆధునికమైనా, పదాలు, వాక్యాలు, పేర్లు, ఊర్లే కదా! స్వానుభవంలోనికి రానిది, కానిది సాహిత్యమని ఎలా అనాలి?" అని కదా రెండువందల ఏళ్లనాడే పెర్సీ బైషీ షెల్లీ వాపోయాడు.

ఇవన్నీ చర్చనీయాంశాలే. విశ్వవిద్యాలయ ఆచార్యులు, పండితులు, ఈ చర్చలో పాల్గొంటే **మిసిమి**కి ఎంతో మేలు చేసినవారవుతారు. వారపత్రికలు, సినిమాపత్రికలు సాహిత్య సేవ చేస్తున్నట్లు పరిగణించాలా? ఇప్పుడు అన్ని హంగులతో, పంచరంగులతో ప్రతిదినము వస్తున్న దినపత్రికల మాటేమిటి – వారు ప్రత్యేకంగా 'సాహిత్య అనుబంధం' అని అంటూ ప్రచురించేది ఏమిటి?

సాంఘిక నవలలో సమకాలీన జీవన చిత్రం, చరిత్రలు ఉంటాయి. ఉదాహరణకు ఈ సంచికలోని 'ఇందులేఖ' విశ్లేషణ. స్వీయ చరిత్రల్లో స్వానుభవం గాఢంగా ఉంటుంది. ఉదాహరణకు ఈ సంచికలోని 'స్వీయ చరిత్రల్లో తల్లి ప్రస్తావన'. ఆలూరి బైరాగి 'అగమగీతి' ఎటువంటి సాహిత్యం? తనకు, సంఘానికి జరిగిన ఘర్షణతాలూకు రవ్వలు కాదా. ఇది స్వానుభూతిలో సాంఘిక చరిత్ర కాదా. ఈ సంచికలోనే సంస్కరణోద్యమ రచనలను ఏమని వర్గీకరిద్దాం?

తెలివిగల వక్తిత్వ వికాస నిపుణులు 'భగవద్గీత'ను, వివేకానందుని రచనలను చివరికి భీష్ముని మరణ శాసనాలను విజయసోపానాలకు అన్వయించి సాహిత్య సృష్టి చేస్తున్నారు. మనం నిత్యమూ మాట్లాడుకునే 'సంకల్ప బలా'న్ని ఇప్పటి ఎన్.ఎల్.పికి – 'బ్రెయిన్ యువర్ బ్రెయిన్'గా విశ్లేషించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇవన్నీ పుస్తకాలుగా అంటే లిటరేచర్‌గా, అంటే సాహిత్యంగా చెలామణి అవుతున్నాయి. కిం కర్తవ్యం?

ఇప్పుడు తెలుగులో సాహిత్యం కానిదేముంది? ఉన్నదాంట్లో ఏమున్నదో చూడాలి. కొత్త విషయం, కొత్తకోణం ఆవిష్కరింపబడిందా? ఆలోచింపచేస్తుందా? ఎంతవరకు పరిశోధనాంశాలున్నాయి అని పరిశీలించాలి.

అంతగా లోతులేని ఈ సాహిత్య సముద్రంలో మన వేట సాగించటమే మన కర్తవ్యం అనుకోవటంలో కొంత ఊరట.

– సంపాదకులు

మహిళా సభ అధ్యక్షత

ఆర్యా –

తమ లేఖ జేరినది. ఆహ్వాన సంఘము వారు, నన్ను రాబోయే కమ్మవారి మహిళా సభకు అధ్యక్షురాలిగా యెన్ను కొన్నందుకు నా కృతజ్ఞతా వందనములను అందుకొనుడు. జ్ఞాన విద్యా సంపత్తిలో నా కన్న మిన్నలగు సుప్రసిద్ధ కమ్మ విదుషీమణులెందరో యున్నప్పటికిని, తామెల్లరు నాకొసంగదలచిన యా గౌరవము, స్థానము నాకు చిరకాలము స్మరణీయమై యుండును.

కాని, నేనీ బాధ్యతను అంగీకరింప జాలనందులకు విచారముగా ఉన్నది. దేశీయులెల్లరు, దేశ మోక్షమునకై స్వరాజ్య సంప్రాప్తికై యీ దినాలలో సంఘ మత విభేదముల మరచి సేవ చేయవలసి వున్నది. కాని మన పురుషులలోనే ప్రజ్వరిల్లుచున్న, సాంఘిక తత్త్వము, మతాభిమానము, మన దురదృష్టవశాత్తు, మన జాతీయ ప్రయత్నములకు, అత్యంతముగా ఎదురగు చున్నది. వెనకటి కాలపు స్త్రీలలోనే గాక, ఉద్యోగాలు కోరే విద్యావంతులైన వారిలో కూడ కులతత్త్వము పెచ్చు పెరుగుచున్నది. బ్రిటీషు వారికి కూడ, యాకులతత్త్వము మన యందు ప్రజ్వరిల్లటమే ఉపయోగము. కనుకనే భారత దేశపు నారీమణుల సంఘము వారి కోర్కెను నిర్లక్ష్యపరచి, రౌండు టేబులు సభలో శ్రీమతి బీగము షానవాజ్ గారు కోరినట్లు, భారతీయ స్త్రీ లోకమునంతను ఒకే బృందముగా ఎన్నికల కోసము లెక్కించనైరి.

సాంఘికావమానముల రెచ్చగొట్టుట వలన పురుషులు తమకు లొంగిపోయినారని తెలుసుకున్న బ్రిటిషు వారు స్వాతంత్ర్యమును, ఒక్క రాజకీయ విషయాలలోనేగాదు సాంఘిక, ఆర్థిక వ్యవహారాలలో కూడాను, తీవ్రముగా కోరుచున్న మన స్త్రీలయందు గూడా విభేదాలు వృద్ధి చేయడానికి పూనుకొన్నారు. అందుకనియే హిందూ స్త్రీలందరు హిందూ యువతులను, మహమ్మదీయ సోదరీ మణులు, మహ్మదీయ స్త్రీలను, తమ తమ ప్రతినిధులుగా, రాబోయే శాసన సభలకు ఎన్నుకోవాలని బ్రిటిషు వారు తీర్మానించారు.

శ్రీ గాంధీమహాత్ముని దయవలన, పట్టణములందేయుండి, ఉద్యోగులు కుటుంబీకులైన స్త్రీలకు చెందియుండిన, భారత నారీమణుల యుద్యమము, పల్లెటూళ్ళ స్త్రీల పరమైనది. ఘోషాయందు, ఘోష పడుచున్న స్త్రీలు గ్రామాలలో పూర్వాచారములకు లొంగిపోయి యుండిన స్త్రీలు రైతాంగమందు, అణగి మణగి పోయి యుండిన స్త్రీలు, దిక్కు మొక్కులేక, అజ్ఞానమందేగాక, జీవితంలో మెచ్చుకొనదగిన లక్ష్యములేని స్త్రీలు, మహాత్ముని దివ్యశక్తివలన కండ్లు తెరచినారు. రాచకీయ స్వాతంత్యము కోరుచున్నారు. సాంఘిక స్వాతంత్ర్యము పొందుతున్నారు. స్త్రీ లోకమందు జాతీయోద్రేకము, దేశాభిమానము స్వార్థత్యాగ బుద్ధి ప్రజ్వరిల్లు చున్నది. ఇట్టి పరిస్థితులలో మనము, కుల బేధాలను తిరిగి పెద్దజేయటం న్యాయముకాదు. రైతాంగ మందు, అణగిమణగి పోయి యుండిన స్త్రీలు, దిక్కు మొక్కులేక, అజ్ఞానమందే గాక, జీవితంలో మెచ్చుకొనదగిన లక్ష్యములేని స్త్రీలు, మహాత్ముని శక్తివలన కండ్లు తెరచినారు. రాచకీయ స్వాతంత్ర్యము కోరుచున్నారు. సాంఘిక స్వాతంత్ర్యము పొందుచున్నారు. స్త్రీ లోకమందు జాతీయోద్రేకము, దేశాభిమానము స్వార్థత్యాగ బుద్ధి ప్రజ్వరిల్లు చున్నది. ఇట్టి పరిస్థితులలో మనము, కుల బేధాలను తిరిగి పెద్ద జేయటం న్యాయము కాదు.

రైతాంగ స్త్రీలందరికి ఒకే విధమైన అవసరాలు కలవు. రైతాంగంలో మిళితమైన కమ్మ, రెడ్డి, తెలగ, వెలమ, హరిజన కులాలు స్త్రీలకు, గణింప దగిన వేరు వేరు అవసరాలు లేవు. భారత నారీమణులందకీ అవసరమైన కనీసపు

అవసరాలు తీర్చుటకే, మన దేశాన తగినంత ఆందోళన వున్నప్పుడు, వివిధ కులాల ప్రత్యేక అవసరాల గురించీ ఆలోచించడానికి యిది అదును కాదేమో.

గాంధీ మహాత్ముని పిలుపు ననుసరించి, జైలునకు పోయి వచ్చిన నేను, జాతీయాభివృద్ధికై, రైతాంగ లాభమునకై, భారత నారీమణుల శ్రేయమునకై, నాకు అవకాశము కల్గినప్పుడెల్లను సాధ్యమైనంత సాయము చేయ ప్రయత్నించుట తప్పనిసరిగదా!

ఇట్లనుటవలన నాకు సంఘాభిమానం లేదని గాదు. నాకును, నా స్వకులము యెడల ప్రేమ కలదు. అభిమానము గలదు. కమ్మ యువతీమణులు క్రిందటి జాతీయ సంరంభమందు త్యాగము చేయుటలో, కష్టముల భరించడములో, ఆంధ్రనారీ లోకమున ప్రథమ తాంబూలము పొందగలరని నేను గూడా గర్వించు చున్నాను. కమ్మ యువతులు చేబ్రోలులోను, రేపల్లె తాలూకాలోను, హరిజన సేవ చేయడంలో, అంటరాని తనాన్ని రూపు మాపడంలో ముందంజ వేయు చున్నందులకు హర్షించు చున్నాను. కమ్మ కులమునకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన కీ॥శే॥ అన్నపూర్ణాదేవిని ప్రేమ పూర్వకంగా స్మరించు కొంటున్నాను. అర్పించిన, సంఘ సంస్కారులలో చుక్కమ్మగారు, తుమ్మల దుర్గాంబగారు

భారతీదేవి రంగా

తన యావదాస్థిని, స్త్రీలోక మోక్షమునకై ప్రథమురాలు మూల్పూరి కమ్మవారని సంతోషపడుచున్నాను.

కాని నాకు తోచినంత వరకు జాతీయ భారతీయులందరి అభ్యుదయ మందే, యొక్క, విజృంభణమందే, నా అభివృద్ధి, గౌరవ మర్యాదల పెంపు కనుక నాపై సభానిర్వహణ భారము చున్నాను. నేను మీరు చూపెట్టిన నందులకు నా సంఘములో కొందరు ఐనను జాతీయ స్వాతంత్ర్యమును మరొక విధంగా ప్రవర్తించుటకు మన్నింతురుగాక!

స్వాతంత్ర్య సంపాదనలోనే, భారత నారీమణుల త్యాగ మహిమ స్వసంఘీయుల యొక్క మోక్షము, యిమిడి యున్నవని భావించు చున్నాను. మోపవద్దని మిమ్ముల ప్రార్థించు గౌరవమును అంగీకరించజాల నాపై కినిసెదరని యెరుంగుదును. వాంఛించు యీ దినములలో, నేను సావకాశములేదని గ్రహించి నన్ను

కమ్మవారి స్త్రీలేగాక పురుషులు గూడా ప్రయత్నింతురుగాక. కమ్మస్త్రీలు ఘోషా లోకమునకు సిరి శోభలను కల్గింతురు గాక!

దేశమాత ఋణము తీర్చుకొన నుండి స్వాతంత్ర్యము పొంది, రైతు

నేను అనారోగ్యముగా యుండుట వలనను, గ్రామమున లేని కారణముచే, మీకు జవాబిచ్చుటలో ఆలస్యమైనందులకు క్షమించ వేడుచున్నాను.

రామినీడు విద్యాలయం
నిడుబ్రోలు
12-3-1934

ఇట్లు
మీ సోదరి
భారతీదేవి రంగా

(మార్చి 8, ప్రపంచ మహిళా దినోత్సవం)

నాట్య తత్త్వం

– పసుపులేటి పూర్ణచంద్ర రావు

నృత్త, నృత్య, నాట్య ప్రక్రియల ప్రాచీనతని, తాత్త్వికతని, సామాజికతని, రాజకీయతనీ సమగ్రంగా చర్చించడం ఈ బృహత్ వ్యాసం 'నాట్య తత్త్వం' ఉద్దేశ్యం.

ఈ వ్యాసం దృక్కోణానికి కొంతమేరకు నటరాజ రామకృష్ణగారి ఆలోచనా విధానంతో అవినాభావ సంబంధం ఉంది. వారి ఆలోచననీ, అవగాహననీ అనేక రెట్లు దాటిన విస్తృతమైన సమాచారం కూడా ఈ వ్యాసంలో ఉంది.

విషయపరంగా ఈ బృహత్ వ్యాసాన్ని మరికొన్ని 'ఉప-వ్యాసాలుగా' విభజించడం జరిగింది. ప్రతి ఉపవ్యాసంలోనూ మళ్లీ అనేక ఉపశీర్షికలున్నాయి. ఇవీ మీరు చదవబోయే ఉపవ్యాసాలు :

1. నటరాజ రామకృష్ణగారి దగ్గర నా శిష్యరికం

2. మాతృస్వామ్య నృత్య సాంప్రదాయం

3. దేవాలయ-సభా నృత్య సాంప్రదాయం

4. నటరాజ రామకృష్ణగారి పోరాటం.

ఈ విషయ విభజన ప్రకారం మనం "నాట్యతత్తం" చర్చని కొనసాగిద్దాం.

నటరాజ రామకృష్ణగారి శిష్యరికం

నేను కూడా నటరాజ రామకృష్ణ గారి శిష్యుడ్నే...! వారి దగ్గర నాట్యం నేర్చి కాదు; నాట్య శాస్త్రానికి సంబంధించిన కొద్దిపాటి జ్ఞానాన్ని నటరాజ వారి పాదాల దగ్గిర జేరి సంపాదించినందుకు...!

"THE OXFORD CAMPANION TO INDIAN THEATRE" కు-తెలుగు సాంప్రదాయ ప్రదర్శనా రూపాల మీద-నేను రాసిన అనేక వ్యాసాలకు సంబంధించిన మౌలిక జ్ఞానాన్ని నటరాజ వారి శిష్యరికం నుంచి సంపాదించినవే. ముఖ్యంగా 'కలాపం', 'యక్షగానం' లాంటి పెద్ద వ్యాసాల్ని నటరాజ వారికి చదివి వినిపించింతర్వాతే నేను ఆక్స్‌ఫర్డ్ ప్రెస్‌కు పంపించాను.

భారతదేశంలోని నాట్య గురువుల్లో నటరాజ రామకృష్ణగారు కూడా ఒకరైనా, నాట్య విద్యలకు సంబంధించిన శాస్త్ర విషయాల్లో మాత్రం ఆయనో దిగ్గజం లాంటి వారు. మానవల్లి రామకృష్ణ కవి గారి తర్వాత నాట్య శాస్త్ర విషయంలో నటరాజ వారు మాత్రవే నిజమైన అథారిటీ.

మానవల్లి వారి రచనలు 'భరతకోశం' వంటి విశేష రచనలు కావడం వల్ల, వారి స్కాలర్‌షిప్ సామాన్య తెలుగు పాఠకులకంతగా చేరలేదు. ఒక్క నటరాజ రామకృష్ణ గారు మాత్రవే తెలుగు పాఠకుల్ని చేరిన మొట్టమొదటి నాట్య సంబంధ రచయిత. పాప్యులర్ పద్ధతిలో వారు రాసిన అనేక వ్యాసాలు, చిన్నా, పెద్దా పుస్తకాలు నాట్య సంబంధమైన అనేక విషయాల గురించి తెలుగు పాఠకులకు పరిచయ జ్ఞానాన్ని కలిగించాయి.

ఈ పాప్యులర్ రచనల కన్నా లోతైన శాస్త్ర రచనల్ని చేయగలిగిన సత్తావుండి కూడా నటరాజ వారెందుకో అటువంటి రచనల్ని చేయలేదు...!

ఇంటర్వ్యూలో కూడా వారెందుకో పాప్యులర్ ధోరణిని మించి మాట్లాడేవారు కాదు...! అలా సంపూర్ణంగా వ్యక్తం కాని నటరాజ వారి జ్ఞానపు లోతుల్ని కొంతమేరకు తవ్వి తీయగల అవకాశం, నాకు కలిగింది.

నటరాజ రామకృష్ణగారి సంపూర్ణమైన శాస్త్ర విజ్ఞానానికి నిజమైన సాక్షి గిడుగు రామ్మూర్తి గారు. వీరు గురజాడ అప్పారావు గారి సమకాలీనులైన గిడుగు రామమూర్తి పంతులుగారి మనవడు...! గిడుగు సీతాపతి గారబ్బాయి...! నేను కలిసే నాటికి ఈ మనవడు - రామ్మూర్తిగారి వయసు కూడా డెబ్భయికి పైనే వుంటుంది. నటరాజ వారి ఆశీర్వాదంతో పాటుగా, ఈ రామ్మూర్తి గారి స్నేహం కూడ

నాకు పుష్కలంగా లభించడం వల్లనే నా శాస్త్రాధ్యయనం సులభసాధ్యవయ్యింది.

ఇక నటరాజ వారి నాట్య విద్యకు నిజమైన వారసుడు కళాకృష్ణ. సాంప్రదాయేతరుల్లో Female Impersonation విద్యని అపూర్వంగా మథించిన అతి తక్కువ మందిలో కళాకృష్ణ తలమానికం లాంటి వాడు.

నటరాజ వారితో సాంగత్యం అంటే – రామ్మూర్తిగారు, కళాకృష్ణగారి సాంగత్య భాగ్యమే కాక, అవకాశం వచ్చి నప్పుడల్లా సాంప్రదాయ నాట్య విద్యలను కాచి వడపోసిన అనేక మంది విదుషీమణుల నించి కూడా అవగాహనని పెంచుకొనే అదృష్టం అన్నమాట...!

నా అధ్యయనం : ఇక్కడ నటరాజ వారితో నాకు సాన్నిహిత్యం ఎలా కలిగిందో కొంత చెప్పాలి. అంతకన్నా ముందు నాట్య సంబంధమైన నా అధ్యయన ప్రారంభం గురించి కూడా ఒక ముక్క చెప్పాలి.

ఆధునిక నాటకరంగం గురించి కాస్తో కూస్తో చదువుకున్న నాకు సాంప్రదాయ నాట్య రీతుల గురించి కూడా కొద్దిపాటి అధ్యయనం అవసరం అనిపించింది. ముందుగా భరతుడి *"నాట్యశాస్త్రాన్ని"*, దాని తెలుగు అనువాదంలో చదవడానికి ప్రయత్నం చేశాను. సొంతగా అర్థం చేసుకోవడం చాలా కష్టం అనిపించింది. నేను కొద్దిగా మొండి విద్యార్థిని కనుక–తగిన గురువుని సంపాదించుకోడానికి ముందే–నాట్యశాస్త్రంలో అర్థంకాని అనేక విషయాల గురించి కొంత 'నోట్స్' రాశాను. దాంతో పాటుగా ఓ 'ప్రశ్నావళి'ని కూడా తయారు చేశాను. అలా నేను చేసిన హోంవర్క్‌నంతా తీసుకొని నాట్యశాస్త్రాన్ని తెలుగులో అనువాదం చేసిన పోణంగి శ్రీరామ అప్పారావుగారి దగ్గరకెళ్ళాను.

నా హోంవర్క్‌నంతా చూసి "మీరు ఏ డాక్టరేటూ చేయడం లేదు కదా, మరి ఇంత లోతుగా నాట్యశాస్త్రం గురించి అడుగుతున్నారెందుకూ...?" అన్నారు అప్పారావు గారు.

ఆ తర్వాత "మీ ప్రశ్నావళి కంతటికీ నానుంచి జవాబు కోరుతున్నారా...?'' అని కూడా అడిగారాయన. అవుననట్టుగా తల ఉపాన్నేను. ఇక ఆయన చాలాసేపు మౌనంగా వుండి పోయారు నా ప్రశ్నావళి వంక చూస్తూ...! ఆ తర్వాత కాగితం పెన్నూ తీసుకొని నా ప్రశ్నావళి నుంచి కేవలం రెండు ప్రశ్నల్ని మాత్రమే రాసుకొని, నన్ను నాలుగు రోజుల తర్వాత రమ్మన్నారు.

రమ్మన్నట్టుగానే వెళ్లాక, ఆయన చెప్పిన జవాబులతో నేను చాలా డిజప్పాయింట్ అయ్యాను. ఆ తర్వాత నేనడిగిన అనుబంధ ప్రశ్నలక్కూడా వెంటనే జవాబివ్వకుండా, వాటిని మళ్ళీ రాసుకొని, నన్ను మళ్లీ రమ్మన్నారు... ! వారానికి రెండు సార్లు చొప్పున అలా నేను మూడు నెల్లపాటు అప్పారావుగారి దగ్గరికెళ్లిరావడం చేశాక, నేననవసరంగా వారిని ఇబ్బంది పెడుతున్నానని గ్రహించి, చివరికి వెళ్లడం మానేశాను.

ఇక అంతటితో నా నాట్యశాస్త్ర అధ్యయనాన్ని విరమించుకొని కూర్చొన్న తర్వాత, ఒకరోజు అప్పారావుగారే ఫోన్ చేసి ''మీరు వెంటనే నటరాజ రామకృష్ణగార్ని కలవండి" అని చెప్పారు. వారే నటరాజ వారి ఫోన్ నెంబరు కూడా ఇచ్చారు.

నేనంతకు పూర్వవే నటరాజ రామకృష్ణ గారు రాసిన పుస్తకాల్ని చాలావరకు చదివేశాను. అయితే వారి పాప్యులర్ ధోరణి నా కంతగా ఉపయోగించదనిపించి నేనెన్నడూ నటరాజ వార్ని కలవాలనుకోలేదు...! కానీ ఇప్పుడు పోణంగి వారి సలహా మేరకు తిరికి కలుద్దాం అనిపించి వెళ్ళి నటరాజ వార్ని కలిశాను. ఇది 1980ల చివర్లో... !

నా ప్రశ్నావళిని తిరగేస్తూ ముందు చిరునవ్వు నవ్వారు. నటరాజ వారు. దానర్థం ఏవిటో తెలియక తికమక పడ్డాను నేను. ఆ తర్వాత నా ప్రశ్నావళిని కొంత మేరకు పైకి చదివి, పక్కనే వున్న గిడుగు రామ్మూర్తి (జూనియర్) గారి వంక చూశారు. ఆ తర్వాత నా ప్రశ్నావళిని మరికొంత చదివి, సడన్‌గా, ఆపి, "నాకెంత ఆనందంగా వుందంటే రామ్మూర్తిగారూ!" అన్నారు నటరాజ వారు–చాలా స్పష్టంగా పరమానంద పడిపోతూ...!

"అందరూ నేను చెప్పింది వినేవారే కానీ, ఇంత లోతుగా నన్ను ప్రశ్నలడిగిన వారే లేరు...!" అని కూడా అన్నారు నటరాజ వారు. ఆ తర్వాత నా అరచేతిని వారి రెండు చేతుల్లోకీ తీసుకొని మృదువుగా నొక్కారు నటరాజ వారు. అంత మృదువుగానే మరుక్షణం తన మెథడాలజీని స్పష్టం చేశారు–"నేను మీ ప్రతి ప్రశ్నకీ జవాబు చెప్పడం లేదు. ముందు నేను విషయాన్ని స్థూలంగా చెబుతాను; ఆ తర్వాత సూక్ష్మంగా వెళదాం" అన్నారాయన.

ఆ వెంటనే నటరాజ వారు నన్నో ప్రశ్న అడిగారు – "మీకు శాస్త్రాన్ని శాస్త్రంగా తెలుసుకోవాలని వుందా...? లేదా ప్రాచీన కాలం నుంచీ ఈ నాటి దాకా కొనసాగుతున్న అనేక

నాట్యరీతుల్ని అర్థం చేసుకొంటూ శాస్త్రాధ్యయనం చేయాలని వుందా...?" అంటూ.

"Pure grammer కావాలా...? Contextual grammer కావాలా...?" అని అడిగినప్పుడు "ప్యూర్ గ్రామరే కావాలి" అనేంత మూర్ఖుడ్ని కాను కదా నేను ...! అలా నటరాజ వారు అడిగిన ప్రశ్నతో నాకేం కావాలో నాకు స్పష్టం అయ్యింది. వెంటనే – ''ప్రాచీన కాలంనుంచీ ఇప్పటిదాకా కొనసాగుతున్న నాట్య రీతుల శాస్త్రమే నాకు కావాలి" అని తేల్చి చెప్పాను. అలా నా అధ్యయనానికి ఓ స్పష్టత నేర్పరచారు నటరాజ వారు.

ఆహా...! "ఘనుడైన గురుడు దొరికిన నా భాగ్యమునేమని చెప్పుదు...!" అని మురిసిపోయాను. అప్పటినుంచీ వారానికి కనీసం రెండు రోజుల చొప్పున నేను నటరాజ వారి దగ్గిరకెళ్లి కూర్చొనేవాణ్ణి. అక్కడి వాతావరణంలో భాగస్వామినౌతూ, వచ్చేపోయే వారిని చూస్తూ, మధ్య మధ్య గిడుగు రామ్మూర్తిగారి చలోక్తుల్ని ఆస్వాదిస్తూ, తోచినప్పుడల్లా నటరాజ వారు చెప్పే సందర్భోచిత శాస్త్రపాఠాల్ని వినే వాణ్ణి...!

దాక్షిణాత్య నాట్యరీతులన్నిటినీ స్థూలంగా ప్రస్థావిస్తూ, వాటిలో రకరకాల పేర్లతో శిల్పవైరుధ్యాలు ఎన్నివున్నా, వాటన్నిటిలో అల్లుకొని ప్రవహిస్తున్న ఏక సూత్రాన్ని – నాకు అవగతం చేశారు నటరాజ వారు.

అత్యంత ప్రాచీనకాలం నాటి భరతుడి నాట్యశాస్త్రంలో నాట్యవిద్యల సమస్తానికీ మౌలిక వ్యాకరణంగా చెప్పబడిన "నృత్త" వర్గీకరణే ఈ నాటి వర్తమాన భారతీయ నాట్యరీతులన్నిటిలోనూ కొనసాగుతున్న మూలసూత్రం అని నటరాజ వారు నాకు స్పష్టం చేశారు.

''ఇప్పటికీ ఈ ''నృత్త" సంబంధితమైన కరణ – అంగహారాల ప్రాథమిక పాఠాలతోనే భారతదేశంలోని గురువులందరం పిల్లలకి నేర్పిస్తూ వుంటాం" అని ఆయన డిమాన్‌స్ట్రేట్ చేస్తూ మరీ చూపించేవారు.

నాట్యశిల్పం ఏదైనా ప్రాథమికంగా ఈ కరణ–అంగహారాల సమాహారాలుగానే ప్రారంభవై ఆ తర్వాత certain permutations and combinations లో పాఠ్యానికి, పాత్రకీ అనుగుణమైన ఒక 'ఫార్ములా'ని గురువులు ఏర్పరుచుకొంటారు. ఈ ప్రాథమిక 'ఆంగికం' మీదనే ఆయా నాట్యరీతులు తమవైన 'ఆహార్యాలనూ', 'అభినయాలనూ' నగిషీలుగా దిద్దుకొని తమ తమ వైరుధ్యాలని ప్రదర్శిస్తూ ఉంటారు అని కూడా నటరాజ వారు తేల్చి చెప్పారు.

తమ నాట్యరీతులకు ఇలా తమ తమ వైరుధ్యాలని తెలియపరిచే అనేక ఉపగ్రంథాలు కూడా మధ్య యుగాలలోనేవెలువడ్డాయి.

నందికేశ్వరుడు రాసిన ''అభినయదర్పణం'' తెలుగుదేశం నాలుగు చెరగులా ప్రసిద్ధులైన భాగవత కళాకారులందరికీ ప్రామాణిక గ్రంథంగా మారింది. కూచిపూడి, కపట్రాల, కోరుకొండ, మేలట్టూరులకు సంబంధించిన ''బ్రాహ్మణ భాగవతులైనా''; బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్టణం ప్రాంతాల్లో ప్రదర్శించే సామాన్య కులాలకు చెందిన "తూర్పు భాగవతులైనా"; తెలంగాణా, రాయలసీమకు చెందిన "వీధి భాగవతులైనా"; ఉభయ గోదావరి జిల్లాల్లో విశేషంగా ప్రబలిన స్త్రీ సాంప్రదాయ "భాగవతారిణులైనా" అందరికీ ప్రామాణిక గ్రంథం ఈ నందికేశ్వరుడి అభినయ దర్పణమే...!

అలాగే కాకతీయ కాలంనాటి పాశుపత శైవ ఆరాధనా తాండవ–నృత్త ప్రక్రియలన్నిటికీ జాయపసేనాని రాసిన "నృత్త రత్నావళి" ప్రామాణిక గ్రంథం.

అలాగే ఒడిస్సీ, కథక్, కథాకళి వంటి నాట్య విద్యలకు కూడా వాటి వాటి ప్రామాణిక ఉపగ్రంథాలువున్నాయి. వీటిన్నిటికీ మూల గ్రంథం భరతుడి నాట్యశాస్త్రమే అయినా తమ తమ ఆచరణల్లో ఈ భారతీయ నాట్య ప్రక్రియలేవీ డైరెక్ట్‌గా భరతుడి నాట్య శాస్త్రాన్ని రిఫర్ చేయాల్సిన అవసరం ఉండదు– ఎవరైనా ఆధునికులు ఆసక్తి కొద్దీ చదువుకోదలిస్తే తప్ప!

ఈ భిన్నత్వంలోని ఏకత్వాన్ని, ఏకత్వంలోని భిన్నత్వాన్నీ నటరాజ వారు చెప్పినంత స్పష్టంగా తమ తమ నాట్యరీతుల్లో చిక్కుకు పోయిన ఇతర గురువులెవరికీ చెప్పడం సాధ్యం కాని పని. ఈ అపూర్వమైన సమగ్రతే నటరాజ వారి ప్రత్యేకత.

నాట్య – నట్టువ మేళాలు : పైన ప్రస్తావించిన భాగవత విద్యలన్నీ "నాట్య విద్యలు". "నాట్యం" అంటే సమగ్రమైన నాటక శబ్దంగా భరతుడు ప్రయోగించాడు. ఇది ఒక కథాంశాన్ని, బహునటీనటుల చేత నృత్య, గాన, వాయిద్య భరితమైన సమగ్ర విద్యగా ప్రదర్శించగల సంక్లిష్ట ప్రక్రియ.

భరతుడు చెప్పిన "నాట్య" విద్య ఓ సంపూర్ణ సంగీత – నాట్య రూపకం. భాస, కాళీదాసాది కవుల సంస్కృత నాటకాలేవీ ఈ కోవకి చెందినవి కావన్న కీలక సత్యాన్ని

నటరాజ వారు స్పష్టం చేసినంత స్పష్టంగా మరొకరు చేయడం నేను చూడలేదు...!

కాళీదాసాది సంస్కృత నాటకాలన్నీ ప్రధానంగా-గ్రీకు నాటకాల్లాగా సంభాషణా నాటకాలు.

ఈ కోవకి చెందిన నాటకాలనీ భరతుడు తన "దశరూపక" అధ్యయనంలో సంక్షిప్తంగా ప్రస్థావించాడు. అది కేవలం సందర్భోచిత ప్రస్థావన మాత్రవే! భరతుడి ప్రయారిటీ అంతా సంగీత-నృత్త భరితమైన 'నాట్యం' గురించే...!

కానీ ఈ స్పష్టత - నాట్య శాస్త్రాన్ని అనువాదం చేసిన పోణంగి అప్పారావు గారిలో లేకపోవడాన్ని నేను గమనించి షాక్ అయ్యాను...!

'నాట్యం' సమగ్రమైన సంగీత-నృత్త నాటకం అయితే, మరి "నృత్యం" అన్న శబ్దానికి అర్థం ఏవిటి...? 'నృత్యం' అన్న శబ్దాన్ని భరతుడు అనలు తన గ్రంథంలో ప్రస్థావించనేలేదు...! నర్తనానికి మౌలిక వ్యాకరణంగా కరణాంగ హారాలతో కూడిన 'నృత్త' శబ్దాన్ని మాత్రవే భరతుడు ప్రయోగించాడు.

అయినా తర్వాతి కాలంలో నాట్య రచయితలందరూ 'నృత్యం' అన్ని శబ్దాన్ని వాడారు! భరతుడు చెప్పిన రస రహితమైన 'నృత్తా'నికి, రస భరితమైన సంగీత-గీతాలని జోడించి, ప్రదర్శిస్తే ఆ సమ్మేళన విద్య 'నృత్యం' అవుతుంది అన్నది ఒక నిర్వచనం...! ఎక్కువగా ఈ నిర్వచనాలే ప్రాచుర్యంలో వుంది.

ఇక్కడ గమనించ వలసిన మరో విశేషం ఏవిటంటే - మౌలికంగా 'నృత్యం' అన్నది ఏకనటి నర్తించే విద్య. ఈ ఏక నటీ నర్తనాన్ని 'కేళిక' అని కూడ అంటారు.

ఈ నృత్య - కేళిక ఏక నటీ విద్యని నటరాజ వారు "నట్టువ మేళం"గా తను విద్యార్థులకు చెప్పేవారు. ఈ ఏక నటీ ప్రదర్శనలకు భిన్నంగా జరిగే బహు నటీనట నృత్యగాన నాటక ప్రదర్శనలను నటరాజ వారు "నాట్య మేళా"లుగా సంబోధించేవారు. ఈ నాట్య - నట్టువ మేళా శబ్దాలు రెండూ దాక్షిణాత్య సాంప్రదాయాలు.

ఏక నటి నర్తనాలు-లేదా- కేళికలైన ఈ నట్టువ మేళాల్ని ప్రధానంగా దైవ ప్రాంగణాల్లో గానీ, సభా ప్రాంగణాల్లోగానీ, ప్రాచీన కాలంలో ప్రదర్శించేవారు. ఇది అత్యంత ప్రాచీనమైన స్త్రీ సాంప్రదాయం.

నటరాజ వారు ప్రస్థావించే నాట్య-నట్టువ మేళా సాంప్రదాయాల్ని రెండింటినీ మేళవించి పలక గలిగిన అత్యంత ప్రాచీనమైన సమగ్ర శబ్దం (generic term) ఒకటుంది...; ఆ శబ్దం పేరు "యక్షగానం"..! ఈ యక్షగాన శబ్దాన్ని భరతుడు సైతం ప్రయోగించక పోయినా, అది భరతుడికన్నా పూర్వ శబ్దం అని-వివరాలలోకి పోతే - నిరూపించవచ్చు...!

ఈ "యక్షగాన" సాంప్రదాయం కిందికి నాట్య-నృత్య విద్యలే కాక, అత్యంత ప్రాచీనమైన ''కథాగాన'' (narrative singing) ప్రక్రియలన్నీ వస్తాయి...! ఒకే శబ్దం కింద ఇంత సమగ్రంగా ప్రదర్శనా విద్యలన్నిటినీ చెప్పుకోగలగడం అన్నది ఒక దృక్కోణం. ఈ దృక్కోణం నించే నేను "OXFORD COMPANION" ఆక్స్‌ఫర్డ్ కంపెనీయన్‌కి "యక్షగానం" పేరుతో ఒక సమగ్రమైన వ్యాసాన్ని రాశాను. ఈ యక్షగాన శబ్దం తెలంగాణా, రాయలసీమ, కర్ణాటక, కొంత మేరకు దక్షిణ మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ నాటికీ ప్రజలు వాడుతున్న శబ్దం.

నటరాజ వారి వంటి విజ్ఞులకు యక్షగాన శబ్ద పూర్వాపరాలు తెలియనివి కావు. కానీ వారెందుకో తమ నాట్య విద్యలకు మాత్రం ఈ శబ్దాన్ని వాడేవారు కాదు...! స్త్రీ సాంప్రదాయ విద్యలన్నీ పరిపక్వతని సాధించిన తంజావూరి నాయక రాజుల సభల్లో కూడా-ఈ స్త్రీల నాట్య మేళాల్ని "యక్షగాన నాటకాలు" అనే పిలిచేవారు. ఒక్క దేవాలయ ఆరాధనా నృత్యాల్ని వదిలి, మిగతా కథాగాన నృత్య నాట్య ప్రక్రియలన్నీటినీ "యక్షగానాలు" గానే పిలవవచ్చు...!

ఇక సాహిత్య పరంగా కూడా దక్షిణ భారతం మొత్తంలో తెలుగు నాటే యక్షగాన సాహిత్యం విశేషంగా వికసించింది-16వ శతాబ్దం నాటికే యక్షగాన రచనా శిల్ప లక్షణాల్ని వివరిస్తూ - "లక్షణ సార సంగ్రహం" అన్న లక్షణ గ్రంథం వచ్చింది (చిత్రకవి పెద్దన్న). అంటే అంతకన్నా అనేక శతాబ్దాల ముందు నుంచే ఈ యక్షగాన రచనా శిల్పం తెలుగు దేశంలో ప్రాచుర్యంలో వుందనే కదా దీనర్థం! యక్షగాన సాహిత్యం ఎప్పుడూ పద్యాలుగా చదువుకొనేది కాదు; యక్షగానా లెప్పుడూ ఆడుతూ-పాడుతూ చెప్పుకొనే కథా ప్రదర్శనాలు.

ఇక మనం నటరాజ వారికి అత్యంత ప్రీతిపాత్రమైన "దేవాలయ నృత్య సంప్రదాయం" గురించి చెప్పుకుందాం. అయితే ఈ సాంప్రదాయ బీజాలన్నీ మాతృసామ్య యుగంలో

వున్నాయి కనుక, ముందు ''మాతృస్వామ్య నృత్య సాంప్రదాయం" గురించి చెప్పుకోవాలి.

మాతృస్వామ్య నృత్య సాంప్రదాయం :

మాతృస్వామ్య నృత్య సాంప్రదాయాన్ని ఒక సరళ రేఖలో అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఇది అధ్యయనం పూర్తిగా కరువైన అంశం కనుక కొన్ని కాన్‌సెప్ట్‌ని ముందునించే స్పష్టం చేసుకోవడం చాలా అవసరం. మాతృస్వామ్య విద్యల్ని అధ్యయనం చేయడానికి – ''విద్యలన్నీ స్త్రీలు సృష్టించినవే...!" అన్న మౌలిక సత్యాన్ని ముందు అర్థం చేసుకోవడం చాలా అవసరం. మాతృ విద్యల్ని అర్థం చేసుకోవడానికి ముందు" మాతృ మతాన్ని గురించి అర్థం చేసుకోవాలి. ఆ మతంతో పాటుగా ఆ మతానికి చెందిన అనేకానేక గాథల్ని కూడా...!

మాతృ మతంతో పాటుగా – చాలా మందికి తెలియని – "గాణాపత్యం" గురించి కూడా ...!

ఈ ఉపశీర్షికలో ''మాతృస్వామ్య నృత్య సాంప్రదాయాన్ని" మనం అధ్యయనం చేద్దాం :

- అన్నీ స్త్రీ విద్యలే...!
- మాతృ దమన గాథలు
- గాణాపత్యం
- ఈ నాటికీ కొనసాగుతున్న మాతృ గాథలు
- విశ్వవ్యాప్తి సమాంతర గాథలు
- నిజంగా ఎంత ప్రాచీనం...?
- అధ్యయన లేమి.

* * *

అన్నీ స్త్రీ విద్యలే ...!

మాతృస్వామ్య యుగాల్లో సహజంగా అన్ని విద్యల్నీ స్త్రీలే సృష్టించారు. అయితే అవన్నీ స్త్రీలు తమకోసం తాము సృష్టించుకొన్నవి కాకుండా, సమాజం మొత్తం కోసం సృష్టించినవి.

చరిత్ర కాలం (Historical times) లోని దేవాలయ నృత్య సాంప్రదాయంలో స్త్రీలు వ్యక్త పరిచిన సంగీత, నృత్య, నాట్య విశేషాలన్నిటికీ బీజాలు చరిత్ర పూర్వకాలం(Pre-historic times)లోని మాతృస్వామ్య యుగాల్లో రూపుదిద్దుకున్నవే...!

ఒకప్పుడు కేవలం "mythical" అనుకొన్న మాతృస్వామ్య యుగాల సమాచారం ఇప్పుడు archeologicalగా, anthro-pologicalగా కూడా లభిస్తోంది.

మాతృస్వామ్య వివరాలలోనికి పోవడానికి నటరాజ వారికి అవకాశం లేకపోయినా, ఈ స్త్రీ నృత్య సాంప్రదాయం ఖచ్చితంగా దేవాలయ కాలం కన్నా పాతదే అన్న భావన ఆయనలో వుండేది.

"ఎప్పుడో దేవతల కాలంలో అప్సరసలు నాట్యం చేశారూ అంటే, ఈ నాట్య శిల్పం ఆనాటిదే అని కదా అర్థం...!" అని నటరాజ వారు వాదించేవారు.

"పైగా ఇవాల్టి నాట్యజాతుల స్త్రీలందరూ కూడ ఆ అప్సరసల సంతతి వారవే అని కూడ అంటున్నారు" అని నవ్వేవారు నటరాజ వారు.

''బుద్ధుడి కాలంలో ఖచ్చితంగా ఈ స్త్రీ నృత్య సాంప్రదాయం వుండేది" అని కూడా నటరాజ వారు చెబుతుండే వారు.

ప్రపంచ వ్యాప్త మాతృస్వామ్య యుగపు సంస్కృతిని, మతాన్ని, ఆరాధనా విధానాన్నీ శాస్త్రీయంగా అధ్యయనం చేసిన Marija Gimbutas, Anne Bearing, Tules Cashford లాంటి ఆధునిక పరిశోధకులు తేల్చి చెప్పిన సత్యం ఏవిటంటే –

మాతృస్వామ్య కాలంలో నిండు గర్భంతోవున్న చిన్న చిన్న నగ్న స్త్రీ విగ్రహాల ముందు తమ ఆరాధనలో భాగంగా స్త్రీలు సామూహికంగా నగ్నంగా నర్తించేవారని...!

ఇవన్నీ ఏవో ఆటవిక నృత్యాలు అని కొట్టిపారేసి – చేతులు దులుపు కొవడం వల్ల చారిత్రక అధ్యయనం అంతటితో ఆగిపోయే ప్రమాదం ఉంది...!

అంతకన్నా మానవతత్వంలో గల నర్తన బీజాలు వికసించి ప్రకటించబడిన తొలి రూపం ఆ నర్తనం అని అర్థం చేసుకొంటే, చారిత్రక అధ్యయనం ఇక అక్కడినించి పరవళ్లు తొక్కుతూ పొంగి పొర్లుతుంది...!

పైగా మానవ తత్వంలోని ఈ తొలి నర్తనా ప్రకటనం ఒక ఆరాధనా రూపంలో వెలవడింది అంటే ఈ మానవ నర్తనా ప్రకటనలోని సంక్లిష్టతని కూడా మనం మరింత జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సి వుంటుంది.

అంతకన్నా విశేషం – ఈ తొలి మానవ నర్తనా ప్రకటనం స్త్రీల శరీరాల్లోంచీ, మనసుల్లోంచీ వెలువడడం...!

పైన చెప్పిన ఆధునిక పరిశోధకులు ప్రయత్న పూర్వకంగా సమాచారాన్ని సేకరించి ఈ సత్యాన్ని మనకు చెప్పినా, మనకి మనకే ఈ విషయాన్ని అర్థం చేసుకొనేందుకు తగిన అధ్యయానికి ఆధారాలు మనదగ్గరే వున్నాయి...!

మన కడప జిల్లాలో వున్న చింతగుంట గ్రామంలో గుర్తించబడిన అత్యంత ప్రాచీనమైన "Rock Painting" సముదాయంలో మనం పైన చెప్పుకొన్న "మాతృ దేవత సమక్షంలో స్త్రీలు నర్తించే" బొమ్మలున్నాయి...!

ఈ చింతగుంట మాతృదేవత "ఉత్థాన పాద" (తొడ కింది మర్మాంగాన్ని గర్వంగా ప్రదర్శించే భంగిమలు) ముద్రలో 'శివంగి' వంటి జంతువు మీద కూర్చొన్న ఆమె ముందు అర్ధనగ్నంగా ఇద్దరు స్త్రీలు నర్తిస్తున్న బొమ్మ కూడ వుంది.

ఇలాంటి 'ఉత్థాన పాద' బొమ్మలు, విగ్రహాలు భారత ఉపఖండం అంతా లభించాయి. తర్వాతికాలంలో ఈ దేవతని 'లజ్జాగౌరి' అనీ, ఆమె ముందు నర్తించే స్త్రీలని 'అప్సరసలనీ' అనడం పరిపాటి అయ్యింది.

భారతదేశంలోని "Rock Paintings" మీద విశేష పరిశోధన చేసి, *'Lines on Stone'* అన్న సమగ్రమైన పుస్తకాన్ని ప్రచురించిన ఆధునిక పరిశోధకుడు Erwin Neumayer అంచనా ప్రకారం ఈ చింతగుంట మాతృదేవత పెయింటింగ్ దాదాపు 2500 B.C. నాటిది...!

ఈ తొలిరూపంనించి స్త్రీల నృత్య ఆరాధనా సాంప్రదాయం స్త్రీ స్వామ్యంలోనే అంచెలంచెలుగా వికసించి అది అపురూపమైన "లాస్య" విద్యగా పరిణతి చెందింది. మాతృస్వామ్య జీవనాన్ని కొనసాగించిన అనేక "స్త్రీ జాతులు (matriarcheal ethnic groups) అనేకానేక రూపాలకు చెందిన ''లాస్య'' నృత్యాల్ని రూపొందించుకొన్నాయి. పూర్వపుస్వాధ్యాయగార్లు కూడా కొనసాగిన ఈ స్త్రీ జాతుల్నే "పురుష సాహిత్యం" అప్సరసలుగా, "కన్యలు"గా (nymphs) గా వర్ణించింది. ఈ అప్సరసలకూ, లాస్య నృత్యాలకూ ఎప్పుడూ అవినాభావ సంబంధం వుండేది.

ఈ స్త్రీల నృత్య – నాట్య విద్యల్ని పూర్తిగా పురుష విద్యలుగా మార్చడానికి మొట్టమొదటి ప్రయత్నం భరతుడి 'నాట్యశాస్త్రం'లో జరిగింది. ఈ పాపం కూడా నిజానికి 'ప్రాచీన భరతుడి'ది కాదనుకుంటా...! ఈ మార్పుచేర్పులన్నీ భరతుడి పేర తర్వాతి కాలంలో జరిగినవి...! అయినా తప్పని సరిగా ప్రస్తావించ వలసిన కొన్ని సందర్భాలలో దొంగతనం బైటపడిపోతూ వుంటుంది – ఈ నాట్య విద్యలన్నీ నిజానికి మాతృస్వామ్య కాలం నాటివనీ; మాతృస్వామ్య జాతుల వనీ...!

సాక్షాత్తూ భరతుడే 'మంజుకేశి' వంటి అప్సరసల దగ్గిర 'లాస్య' విద్యని అభ్యసించాడని 'నాట్యశాస్త్రం' లోనే వుంది...!

ప్రాచీన మౌఖిక నాట్యశాస్త్రంలోని శాస్త్ర భాగాలన్నిటినీ అలాగేవుంచి, ఆ శాస్త్రాన్నంతా దేవతలు పురుషస్వామ్య జాతులకు ప్రసాదించినట్టుగా దబాయించే మొదటి అంకాన్ని కొత్తగా అతికించినట్టున్నారు తర్వాతి కాలంలో లిఖిత నాట్యశాస్త్రాన్ని సంకలనం చేసిన వాళ్ళెవరో...!

ఎంత బొంకినా అతకని చోట అతుకులూడి నిజాలు అనేక చోట్ల బైటపడిపోయాయి...!

అలాంటి అతుకుల్లో "పూర్వరంగా"నికి సంబంధించింది ఒకటుంది నాట్యశాస్త్రంలో. ప్రాచీన స్త్రీ సాంప్రదాయానికి చెందిన "పూర్వరంగ" ritualsని విస్మరించి, స్త్రీల నాట్య శిల్పాన్ని తమదిగా చేసుకొని దేవతల ముందు ప్రదర్శిస్తున్న భరతుడి బృందాన్ని 'దైత్యులు' అడ్డగించి, భరతుడు మొట్టమొదట ప్రదర్శించిన వాళ్లు భగ్నం చేశారన్న–చెప్పగూడని సత్యాన్ని–నాట్య శాస్త్రంలో చెప్పడం జరిగింది...! అవకతవకల 'ప్రక్షిప్తాల' వల్ల గానీ, తప్పని సరిగా చేయవలసివచ్చిన ప్రస్తావనలవల్లగానీ ఇలా అతుకులూడి నిజాలు బైటపడుతూవుంటాయని చెప్పాను కదా...!

ఇంతకీ 'దైత్యు' లెవరు...? దైత్యులు 'దితి' సంతానం. ఈ దైత్యులు మాతృస్వామ్య పరిరక్షకులు; దేవతలకు, వాళ్ళు వెన్ను కాస్తున్న పురుషస్వామ్య జాతులకూ బద్ధ శత్రువులు...!

ఇక దేవతలు 'అదితి' సంతానం. అదితి కూడా ఆర్య జాతికి చెందిన ఒక మాతృదేవతే...! ఆమె సంతానాన్ని ప్రాథమికంగా 'ఆదిత్యులు' అన్నారు. ఈ ఆదిత్యుల్లో మొదటి వాడైన వరుణుడే ఆర్య జాతిలో మొట్టమొదటిసారిగా పురుషస్వామ్యాన్ని నెలకొల్పినవాడు. ఇతను 'రితమ్' (Rtm) అన్న సమతుల్యపు ధర్మాన్ని తొలినాటి ఆర్య జాతుల్లో నెలకొల్పాడు. కానీ ఇంద్రుడు పరిపాలన కొచ్చేసరికి ఈ సమతుల్యం పూర్తిగా దెబ్బతిని ఆర్యజాతుల్లో విశృంఖలత్వం పెచ్చుమీరిపోయింది.

ఈ సమాచారాన్ని – 'ఋగ్వేదం' లోనే అక్కడక్కడా 'మార్మికంగా' లభించే సూచనల వల్ల – "ఇండాలజిస్టులు" (Indologists) reconstruct చేయగలిగారు.

దైత్య మాత 'దితి', దేవ మాత 'అదితి' ఇద్దర్నీ ఋగ్వేదంలో అనేకసార్లు జంటగానే సంబోధించడం జరిగింది. దేవతలకు 'కజిన్స్'గా పరిగణించవలసిన దైత్యులు కూడా ఆర్య సంతతివారే; కానీ తర్వాతి కాలంలో పురాణాలు

ఈ దైత్యుల్ని రాక్షసుల, దానవుల వరసలోనే జమకట్టాయి...! ఈ దైత్యులు దేవతలకు సమాంతరంగా తమదైన విశేష నాగరికతని నెలకొల్పారు. వీళ్ళు మాతృదేవతా ఆరాధకులని ముందే చెప్పుకొన్నాం.

ఇది ఋగ్వేద-పూర్వస్థితి...! ఆర్య జాతులేవీ భారత ఉపఖండపు పొలిమేరల్లోని సప్తసింధు ప్రాంతాన్ని కూడా చేరకముందు - ఆర్య జాతులు వారి మాతృభూముల్లోనే ఎక్కడో వున్నప్పటి ఋగ్వేద - పూర్వ సమాచారం...! ఈ మేరకు సూచనలు మాత్రం ఋగ్వేదంలో వున్నాయి. దీనికి సమాంతరమైన గ్రీకు సమాచారం గ్రీకు మైథాలజీ నించి కూడా లభిస్తుంది. పేర్లమార్పుతో...!

ఇక ఋగ్వేదంలోనే ప్రస్తావించబడిన దేవతల మరో శత్రు జాతి 'దానవులు'. వీళ్లు, 'దాను' అన్న స్థానిక మాతృదేవత సంతానం. ఋగ్వేదంలో చెప్పబడిన *'సప్తపుర ధ్వంసం', 'దశ పుర ధ్వంసం'*లోని పురాలన్నీ ఈ దానవులవే...! ఈ దానవులు సప్తసింధు ప్రాంతంలోని అనేక నదుల మీద ఆనకట్టలు కట్టి నీటిని వ్యవసాయానికి వినియోగించేవారన్న సూచన ఋగ్వేదంలోనే వుంది. వీరి ఆనకట్టల్ని ధ్వంసం చేసి ఇంద్రుడు నీళ్లకు విముక్తి కలిగించాడని కూడ ఋగ్వేదంలో వుంది. ఈ ఆనకట్టల్ని విధ్వంసం చేయడాన్ని ఘనకార్యంగా ఋగ్వేదం వర్ణిస్తుంది...! దానవుల నాయకుడు, 'దాను' మాత కొడుకైన 'వృత్ర'ని ఇంద్రుడు తన వజ్రంతో సంహరించాడని కూడా ఋగ్వేదంలో వుంది.

దేవతల శత్రువర్గంలో ఇంతవరకూ మనం దైత్య, దానవ శబ్దాలను గురించి చెప్పుకొన్నాం - ఈ దైవ శత్రువులు ఇద్దరూ మాతృదేవతా ఆరాధకులే అన్న context లో...!

ఇక్కడ దేవతల శత్రువులుగా చెప్పబడే మరో రెండు శబ్దాల గురించి కూడ ఒక్కో ముక్కా చెప్పుకొంటే పోతుంది కదా...!

ఆ రెండూ 'అసుర', 'రాక్షస' శబ్దాలు...! 'అసుర' అంటే ఋగ్వేదంలో 'మహాదేవుడు', 'రాజాధిరాజు' అని అర్థం...! అత్యంత ప్రాచీన ఆర్య దేవుడైన 'వరుణుడి'కి ఈ 'అసుర' అన్న బిరుదు నామం వుండేది. ఈ 'అసుర' టైటిల్ కోసం ఇంద్రుడు చాలా తంటాలు పడ్డాడు కానీ దేవతలెవరూ ఇంద్రుడ్ని 'అసురుడి'గా కీర్తించలేదు...! ఋగ్వేదానికి సోదరి వంటి గ్రంథం 'జెండ్ అవెస్తా' (పార్సీల పవిత్ర గ్రంథం) లో ఈ అసుర శబ్దవే 'అహుర'గా మారినా, అక్కడ అది తన ప్రాచీనార్థాన్ని పరిరక్షించుకుంది. అలా 'అహుర మర్జా' అంటే పర్షియన్ భాషలో మహాదేవుడని అర్థం. ఈ నాటికీ ఆ 'అహుర మర్జా'యే పార్సీవాళ్ల దేవుడు.

ఇక ఒక జాతి శబ్దంగా 'రాక్షస' శబ్దం అన్నది ఋగ్వేదంలో లేనేలేదు...! ప్రాచీన ఋగ్వేద సంస్కృతపు etymology ప్రకారం 'రాక్షస' శబ్దం 'రక్షక' శబ్దానికి పర్యాయపదం మాత్రవే...! 'రాక్షస' అంటే అదేదో వికృత జాతి అన్న వికృతార్థం పురాణాల కల్పన మాత్రవే...! పురాణాల తర్వాత బ్రాహ్మణ్యం - ఈ దైత్య, అసుర, దానవ, రాక్షస శబ్దాలన్నిటినీ అజ్ఞానంగా కలగాపులగం చేసేసింది...!

ఋగ్వేద సూక్తాలన్నీ శత్రునింద మీద, శత్రు వినాశనం మీదనే దృష్టి పెట్టిన గ్రంథం. ఈ దైవ శత్రువుల ఔన్నత్యం మనకు 'between the lines readings' వల్ల, ఇతరత్రా సమాచారం వల్ల తెలుస్తోంది. మాతృస్వామ్య జాతులన్నీ ఆర్య జాతులకన్నా చాలా ఉన్నతమైన నాగరికతని, నగర జీవనాన్నీ, వ్యవసాయాన్నీ, వ్యాపారాన్నీ, సంగీత-నాట్య-విద్యల్నీ ప్రాచీన కాలం నుంచీ కలిగివున్నాయని మనం ప్రాచీన మెసపొటేనియన్ సంస్కృతి నించి అర్థం చేసుకోవచ్చు. ఆ మధ్య ప్రాశ్చ ప్రాచీన నాగరికత కొనసాగింపే భారత ఉపఖండంలోని మొహంజదారో, హరప్పా సంస్కృతులు...! ఇవి చాలా నాగరికమైన సంస్కృతులు.

తమ శత్రువులతో పోలిస్తే దేవతలు చాలా ఆలస్యంగా సంగీత - నాట్య అవసరాలకు కళ్ళు తెరిచినట్లుగా వున్నారు...! ఆ అవసరాల దృష్ట్యా వాళ్లు తమ శత్రు జాతులనించి సంగీత నాట్య విద్యల్లో కొన్ని దొంగిలించి వుంటారు...! ఆ దొంగతనాన్ని పట్టుకొని దైత్యులు భరతుడి మొదటి ప్రదర్శనని భగ్నం చేసి నట్టున్నారు - అన్న సత్యాన్ని మనం 'నాట్యశాస్త్రం' నించే reconstruct చేయవచ్చు...! నేనదే చేశాను...!

ఇలా myth లోంచి కూడా కొంత realityని మనం రాబట్టవచ్చు...!

చూశారా, విద్యా చౌర్యం ఎంత ప్రాచీనమైందో...!

చరిత్ర కాలం అంతా ఈ దొంగతనం జరుగుతూనే వుంది. ఆధునిక కాలంలో ఈ దొంగతనం మరింత పెచ్చుమీరిపోయింది...!

ఈ దొంగతనం రెండు ముఖాలుగా జరిగింది. తొలిదశలో స్త్రీ విద్యలన్నిటినీ పురుషస్వామ్య విద్యలుగా దబాయించడానికి పురుష స్వామ్య మతాలన్నీ ఈ దొంగతనాన్ని చేశాయి.

ఆ తర్వాత పురుషస్వామ్య ప్రతీకగానే 'బ్రాహ్మణ్యం' కూడా తన సొంత విధానాలతో, తన సొంత స్వార్థం కోసం ఈ విద్యాచౌర్యాన్ని చేసింది...! లిపి వికసించి లిఖిత గ్రంథాలు ప్రాచుర్యంలోకి వస్తున్న కొద్దీ – పాత 'శ్రోత్రీయ' (reciters) వర్గవే 'లేఖక' (Scribes) వర్గంగా మారి తమ కనుగుణంగా ప్రతి అంశాన్నీ మార్చుకొంది...!

వ్యాసుడి పేర సంకలనం చేయబడిన సంస్కృత 'మహాభారతం' నాటికే బ్రాహ్మణ్యం తమ కనుగుణంగా 'సందుల్లో రాతల్ని' రాసుకొనే చౌర్యాన్ని ఒక పథకం ప్రకారం ప్రారంభించింది అని మార్క్స్ మూలర్ స్పష్టం చేశాడు.

ప్రస్తుతం ప్రతి ప్రాచీన గ్రంథాన్నీ 'between the lines' వెదికితే తప్ప సత్యాలు బైటపడవు...!

నాట్యవిద్యల మేరకు ఈ 'బ్రహ్మచౌర్యం' గురించి నటరాజ రామకృష్ణ గారికి బాగా తెలుసు. ఈ చౌర్యాన్ని గురించి నిరంతరం ఆయన బాధ పడుతూనే వుండేవారు. చాలా వరకు సర్దుకుపోయే మనిషే అయినా, ఈ నాట్య విద్యల చౌర్యానికి వ్యతిరేకంగా నటరాజ వారు చేసిన పోరాటం భారతదేశంలో ఇంకే నాట్య గురువూ చేయలేదు.

ఆయన చేసిన పోరాటాన్ని అర్థం చేసుకోవడానికి స్త్రీ విద్యల నేపథ్యాన్ని మనం మరికొంత అర్థం చేసుకోవాలి.

ఇంకావుంది...



సప్తపర్ణి



సప్తపర్ణి (₹ 777/-) **మిసిమి** పాఠకులకు
కేవలం ₹ 500/- లకే అందజేస్తున్నాము.

మిసిమి మాసపత్రిక
Kala Jyothi Process Pvt.Ltd.,
1-1-60/5, R.T.C 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020
Ph : 040-27645536, Cell: 99480 83387

ఆగమగీతి :

ఆలూరి బైరాగి.

– రావినూతల సత్యనారాయణ

ప్రస్తావన :

రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. ప్రపంచ యుద్ధం, పారిశ్రామిక విప్లవ ప్రభావానికి దాదాపు అన్ని దేశాలు కొద్దో, గొప్పో లోనయ్యాయి. సాంఘిక విలువలు మారజొచ్చాయి. చుట్టూ యుద్ధ వాతావరణం, లోపల అసంతృప్తితో పడగ విప్పుతున్న తుఫాను యువక వర్గాన్ని అస్థిమిత పరిచి తీవ్ర అశాంతికి దారి తీశాయి. ఆ తరుణంలో ప్రవేశించాడు బైరాగి సాహిత్య రంగం లోనికి, యువకునిగా!

బైరాగి జననం 03-09-1925న ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో జరిగింది. ఆయన తల్లి తండ్రులు ఆలూరి వెంకట్రాయుడు, శ్రీమతి సరస్వతీ దంపతులు. బైరాగి అనేది కలం పేరుగా అనేకమంది అపోహ పడవచ్చు. కాని, అది ఆయన తల్లి తండ్రులు పెట్టుకొనిన అనలు పేరు. వెంకట్రాయుడు దంపతులు చక్కగా చదువు కొనిన సంస్కారవంతులు. జాతీయ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనుటయే కాక, హిందీ భాషాధ్యయనం వైపు అశేష కృషి చేసి, ఆ భాషలో ప్రావీణ్యం సంపాదించారు.

యువకుడైన బైరాగి మీద తల్లి తండ్రుల ప్రభావం ఎక్కువగానే ప్రస్ఫుటించింది. తెలుగు ప్రాథమిక విద్యతో బాటు, హిందీ భాషాధ్యయనం బైరాగిని ఆకర్షించింది. హిందీ భాషపై గట్టి పట్టు సాధించే నిమిత్తం, చిన్న వయసులోనే బైరాగి బీహారుకి వెళ్ళారు. అచ్చట నాలుగైదు సంవత్సరములు కృషిచేసి హిందీ భాషను క్షుణ్ణంగా నేర్చు కొన్నారు. హిందీతోపాటు బైరాగి ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో విశేష ఆధిపత్యాన్ని గడించారు. సాహితి పిపాసను పెంపొందించు కొని, మూడు భాషల్లోను సమగ్ర సాహిత్య వేత్తగా రూపొందారు. సృజనాత్మక రచనలు (ముఖ్యంగా కవితలు) ప్రారంభించారు. తను ఆర్జించిన హిందీ పరిజ్ఞానం పెక్కుమందికి పంచి పెట్టే ఉద్దేశ్యంతో పత్తిపాడు బోర్డు హైస్కూల్లో హిందీ పండితునిగా అధ్యాపక వృత్తిని స్వీకరించారు. కాని, ఎక్కువ కాలం ఆ పదవిలో కొనసాగ లేదు. తర్వాత చందమామ (మాసపత్రిక) హిందీ విభాగానికి సంపాదకునిగా కొంత కాలం పనిచేశారు. చిన్న పిల్లల కోసం గేయాలు, కథలు రచించారు. చందమామ సంపాదకునిగా పనిచేసే కాలం లోనే, "పలాయన్" అనే హిందీ కవితా సంకలనం ప్రచురించారు. ఆ సమయం లోనే తెలుగు స్వతంత్ర పత్రికలో బైరాగి కవితలు విరివిగా ప్రచురిత మయ్యేవి.

స్వేచ్ఛా జీవి కావడం మూలాన, చందమామలో చేసే ఉద్యోగంలో ఇమడలేక పోయారు. ఆ తర్వాత కాలంలో దక్షిణ భారత హిందీ ప్రచార సభలో అధ్యాపకునిగా పని చేశారు. అచిరకాలంలోనే, దానికి సహితం తిలోద కాలివ్వడం జరిగింది! బైరాగి ఏకాంత ప్రియులు, ఒంటరి జీవి, ఎక్కువగా ఎవరితోనూ కలిసేవారు కారు. తల్లి ఆకస్మిక మరణం ఆయనపై అత్యంత ప్రభావాన్ని చూపించింది. కొంత వరకు బైరాగి సంఘానికి అంటీ అంటనట్లుండె ప్రవృత్తికి కారణం ఆయన తల్లి మరణమే నేమో?!

బైరాగి తొలి తెలుగు కవితా సంపుటి చీకటి నీడలు, రెండవ సంపుటి నూతిలో గొంతుకలు 1955వ సంవత్సరం లో ప్రచురితమైనది. అటు తర్వాత బైరాగి తన రచనలను ప్రచురణకు పంపటమే మానివేసినారు. ఆయన మరణానంతరం (1978 తర్వాత) లభ్యమైన ఆయన

రచనలు ఆగమగీతి అను పేరుతో మిలింద్ ప్రకాశన్ వారు ప్రచురించారు. బైరాగి జీవన కాలంలోనే ఆయన కథా సంకలనం దివ్య భవనం అచ్చైంది.

కవిగా బైరాగి : పరిసర వాతావరణం నుండి రవంత తొలిగి నిలిచి, లోకాన్ని ఆత్మీయతతో, జాలితో, ఆవేశంతో చూడగలిగిన కవితాత్మ బైరాగి (వైరాగి)ది. సాటి మనిషి కష్టాలను పంచుకోలేక పోయినా, సొంతం చేసుకొని, వాటికి తన కవితలలో విశ్వజనీనత కలిగించడం బైరాగి సొత్తు. ఏ "ఇజానికి" చెందిన పడికట్టు పదాలు (JARGON) ఆయన కవితలలో మనకు కనిపించవు. పదాలకు, అర్థానికి అందని గూఢ భావాలు (అర్థాలు) సంతరించగల కవితా శక్తి, బైరాగికి స్వంతం. "అర్థమైన దాని కన్నా అధికంగా స్ఫురించేది, చేతలకు చెంద రానిది, మాటలకు అందరానిది కవిత్వం" అనేది ఆయన స్వయంగా ప్రతిపాదించిన కవిత్వ నిర్వచనంగా మనం భావించాలి!

బైరాగిది స్వయం వ్యక్తిత్వం. ఏ ఉద్యమాన్ని, సంస్థనూ ఊతగా చేతగొని పైకి రాలేదు – ఆయన! అనుసరణలు, అనుకరణలు ఆయనకు నచ్చవు. అందుకే "బైరాగి కేటాయింపయిన కవి వ్యక్తి" అంటారు కె.వి.రమణారెడ్డి. "ఉపనిషత్తులోని మహా కావ్యాలను కావ్యాలలో పొదిగి, వర్తమాన కాలంలోని మానవుని పరిస్థితిని వాఖ్యానించేటందుకు సాధనాలుగా చేసుకోవడం, తన భావాలను తగిలించే చిలక కొయ్యలుగా వాడుకోవడం, ఒక కొత్త తరహా ప్రక్రియ. ఈ ప్రక్రియను బైరాగి పూర్తిగా వాడుకున్నాడు". సాహిత్యాది కళలకు, సామాజిక జీవనానికి పూర్తి ఎడబాటు కలిగినప్పుడు, రచయితలు, మేధావులు తమ చర్మాల లోపలికి దూరి, తమతనానికి బందీలైపోవడం పరిపాటే! ఎజ్రాపౌండ్ లాంటి మేధావులు ఈ పరిస్థితికి లోనైన వారే!

"బైరాగి కవితలలో నైరాశ్యం, నిస్పృహ ముఖ్యమైన ఆవేశాలు. అయితే, బైరాగి నైరాశ్యం మనసును క్రిందికి దిగలాగేది కాదు. అంతరాత్మను ఉర్రూత లూగించే ప్రభంజనం లాంటిది" అని అభిప్రాయ పడ్డారు శ్రీ పాలగుమ్మి పద్మరాజు. బైరాగి, జీవితంలో తానూహించిన మార్పునంతటినీ ఒక పెనుతుఫానుగా భావించాడు! అందుకే, "ఆగబోదు ఈ తుఫాను మీ మేడలు మునుగు వరకు, మీ కోటలు కూలు వరకు" . . . అంటూ ప్రళయ కాలోగ్రుడైన పరశురాముని వలె విజృంభించి కవితా ఘోషణ చేశాడు!

"కవిగా గాని, వ్యక్తిగా కాని, బైరాగిని అర్థం చేసుకొనుట సులభం కాదు. ఎందుకంటే కవిగా ఒక బైరాగి, వ్యక్తిగా ఒక బైరాగి – ఇద్దరు బైరాగులు లేకపోవడం ఇందుకు కారణ మేమో?" అంటారు నార్ల. నార్ల వారి అభిప్రాయానుసారం, "కవిత జీవితాన్ని ప్రతిబింబించాలి; జీవితం అందాలను అది చూపించాలి; జీవితం అర్థాలను వివరించాలి, జీవిత ధ్యేయాలని అది నిర్దేశించాలి. జీవితంతో సన్నిహిత సంబంధం లేనిది కవిత కాదు. అయితే కవితే జీవితం కాదు; ఇదే విధంగా జీవితమే కవిత కాదు. కవితకు, జీవితానికి మధ్యగల సరిహద్దును బైరాగి గుర్తించలేదు. ఒక వేళ గుర్తించి ఉంటే, దాన్ని చెరిపి వేయడానికి ప్రయత్నించాడు. ఇది చేయరాని ప్రయత్నం. ఇటు కవితకు, అటు జీవితానికి కూడా ఫుల్‌స్టాప్ పెట్టగల ప్రయత్నం" ...

కవితకు జీవితానికి మధ్య అంతరం ఎల్లప్పుడు ఉంటుంది. గొప్ప కవులనేవారు దీనిని తప్పక గుర్తిస్తారు. ఈ సూక్ష్మ విషయాన్ని గుర్తించ లేనటువంటి అవజ్ఞుడు కాదు బైరాగి. అయినా అంగాంగంలో, అణువణువునా, కవిగా తప్ప ఊపిరి పీల్చుకొనుట ఆయనకు తెలియదు! ఆ కారణం వల్ల కవితకు జీవితం ఇంత భిన్నంగా ఎందుకున్నదనీ, కవితను జీవితం ఎందుకు పరిహసిస్తున్నదనీ బైరాగి ఖిన్నుడై ఉండాలి? తర్వాత కాలంలో ఆయన మౌనవ్రతానికి, వ్యక్తిగా ఆయన మహాభినిష్క్రమణానికి, అదే ప్రబల కారణమై ఉండాలి. ఏదైనా బైరాగి ఒక ప్రహేళిక! ఒక క్లిష్ట సమస్య! అందుకే కాబోలు ఏ కొద్ది మందికో తప్ప, బైరాగి కవిత్వం సుపరిచయమైనట్లు గోచరించదు!

"సుదీర్ఘ సమాసాలు, ఐచ్చిక పదబంధాలు బైరాగి కవితా శైలిని బరువెక్కించాయి. సమాధానాలు దొరకని ప్రశ్నల ప్రస్తావనలూ, జీవన తత్వసాధనకు ఉపలక్షించిన భావాలు, తిరుగుళ్ళూ, విరుగుళ్ళూ, సుడిగుండాల్లాగా మడుస్తూ, ఆవర్తాలలా అనుక్రమించే కవి సంశయ సందేహాలు, ఇలాంటివన్నీ బైరాగి రచనలను క్లిష్టం, జటిలం చేశాయి". (రమణారెడ్డి).

"మానవుడి సహజ వేదనలో మధనపడి, పూర్ణత్వాన్ని దాదాపు కవిగా బైరాగి అందుకున్నాడా అనిపించింది. అమ్మా! ఎంత గొప్పగా అన్నాడు కవిత్వ తత్వవేది, అచ్చమైన గొప్ప కవి అయిన బైరాగి" అని ఆశ్చర్యం వ్యక్త పరచారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

అభ్యుదయ కవిగా తన స్థానం గట్టిగా నిలబ్రొక్కుకున్న బైరాగి, కవితా దృక్పథంలో, జీవితాన్ని అర్థం చేసుకునే కోణంలో, తర్వాత కాలంలో ఎంతో మార్పు వచ్చినట్లు మనకు కనిపిస్తుంది. "జీవితపు ఇరుకు సందుల్లో తిరిగి, తిరిగి, అలసటతోనో, భయం వలనో, బాధవల్లనో, ఆలోచనాధిక్యత వల్లనో, మేధావి స్పృహవల్లనో, ఏదో ఇదమిద్ధంగా తెలియదు కాని, ఒక కొత్త ఆలోచనా రీతి అతన్ని తనలోకి లాక్కుంది" (కుందుర్తి)... కవి తాను సమాజంలో ఒకడినని భావించినంత కాలం ప్రజలస్థాయిలోనే ఆలోచిస్తాడు. కాని, ఎప్పుడైతే తాను కవిననీ, మేధావిననే అహంకారం వస్తుందో అతడు మహాకవినని అనిపించుకోవచ్చు, ప్రజలకు దూరమై పోతాడు.

అభ్యుదయ కవికి సమాజాన్ని తనతో పాటు ముందుకి తీసుకు పోవడం విద్యుక్త ధర్మం. తనకు ప్రజలకన్నా ముందు పరుగెత్తడం చేతనవును గనుక, ముందుకు పరుగెత్తిన కొలదీ, అతనికీ, వారికీ మధ్య దూరం ఎక్కువవుతూనే వుంటుంది. ఈ ముందు పరుగెత్తడం అనేది అనేక రూపాల్లో వుంటుంది. ఆ విధంగా ప్రజలకంటే ముందు పరుగెత్తిన అభ్యుదయ కవుల్లో బైరాగి ఒకడు.

బైరాగికి రాను రాను లోకం మీద కోపం, కసి ఎక్కువయ్యాయి. ఇది అభ్యుదయ కవులందరి లక్షణమే! కానీ, బైరాగిలో ఇది క్రమేణా అత్యంత నిరాశకు దారితీసింది. అతనికి లోకంతో పాటు, తనమీద తనకే విసుగు పుట్టింది. అదే ఆయన నిర్యాణానికి కారణమైంది. బైరాగి ఆత్మ హననం మార్గమని సూచించాడు. కవిగా అదే మార్గాన్ని అనుసరించాడు.

బైరాగి రచనలు : బైరాగి రచనలు (లభ్యమైనవి) నాలుగు సంపుటాల్లో ప్రచురితమైనవి. వానిలో మూడు కవితా సంపుటాలు, ఒకటి కథా సంపుటి. బైరాగి తొలి రచన "చీకటి నీడలు" అనే కవితా సంపుటి. ఈ సంపుటిలో 21 కవితా ఖండికలున్నవి. కవితలన్నీ దేనికవే స్వతంత్ర రచనలు. విడివిడిగా చదివి ఆనందింపతగినవి. ఈ సంకలనంలో, కవి (బైరాగి) ఊహకీ, వాస్తవానికీ, క్రియకీ, కదలికకీ, మధ్య వ్యవధిలో నీడలు పడుతున్నట్లు సంభావించి, కవితలు రచించారు! కొన్ని కవితా ఖండికలు దీర్ఘ రచనలైతే, మరికొన్ని చిన్న గేయాలు. పేర్లు సహితం కవి మనః స్థితిని వ్యక్తం చేస్తాయి. దీపావళి అనే కవితతో ప్రారంభిస్తారు మొదటి కవితా సంకలనం. దీపావళిని గూర్చి ఆయన వ్యక్త పరిచిన భావాలు గమనించండి.

దీపావళి ఉత్సవ మండి! – దీపావళి చేద్దాం రండి!
ఆకాశం మండిద్దామా? – పాతాళం తగలేద్దామా?...
నరకాసురు డెందుకు? ప్రపంచ – నరకాన్నే మసి చేద్దామా?
కాటుక నల్లని చీకటి – జ్యోతుల బంధించిన వాకిటి
తలుపులు పగలేద్దామా? – పీడిత దరిద్ర శాపంతో
క్రుంగిన ధరిత్రి కడుపు పగిలి – వెలిగిన ప్రళయ ప్రదీపావళి
దీపావళి వచ్చిందండి! అంటూ ముగిస్తాడు.

యుగసంధి అనే మరో గీతికలో మంచికీ, చెడుకూ, పాతకూ, కొత్తకూ గల కలయికను అద్భుతంగా చిత్రిస్తాడు బైరాగి. కవిత అంతటా అభ్యుదయ కవితా ప్రతీకలు కోకొల్లలుగా ప్రస్ఫుటిస్తాయి. మచ్చుకు :

అరుణ కాంతిలో పొగలా –రాజుతున్న చిర అశాంతి
తిరుగుబాటు జెండాలా – ఆకాశం నెత్తురుతో రంగరించి అరుదెంచిన
సంధియుగం! సంధియుగం!

బైరాగి జీవితంలో తానూహించిన మార్పు నంతటినీ ఒక పెను తుఫానుగా భావించుకొంటాడు. అందుకే,

ఆగబోదు ఈ తుఫాను – మీ మేడలు మునుగు వరకు
మీకోటలు కూలు వరకు – మీ అంతఃపుర కాంతలు
భూమిపైన దొరలు వరకు – శోకంతో పొరలు వరకు
ఆగరాదు ఈ తుఫాను ...
రేపు బయలుదేరు నావ – చుక్కానీ మనదేనోయ్!
రేపుదయించెడి సూర్యుడు – మీకొరకై తరుణారుణ
మధు కాంతుల జయ మాలలు – సిద్ధంగా ఉంచుతాడు
రేపే మీ కళ్యాణం! – తుఫాను బిడ్డల్లారా!

అంటూ కొంత ఆశావాదిగా ధ్వనిస్తాడు తుఫాను కవితలో.

వేశ్యా వృత్తి మన సమాజంలోని అత్యంత హేయమైన దురాచారం. హృదయం గల ప్రతి వ్యక్తినీ ఖేదపరుస్తుంది. ఇక బైరాగి లాంటి వారి స్పందన హృదయ విదారకము. మాటలలో వ్యక్త పరచ జాలనిది! వేశ్యా వృత్తిలోని దినచర్యను ఎంత జుగుప్సాకర పదజాలంతో చిత్రించారో చూడండి :

... నెత్తుట తడసిన అడుగుల – కన్నీరుల ఉప్పని మడుగుల
ఒళ్ళంతా పచ్చిపుళ్ళు రసికారే కురుపులు,
మూగుతున్న ఈగలు – ఎందుకు చీదర?
జీవితపు కాళరాత్రి, గుండెలు పిండే చలి
భగ భగ మండే ఆకలి – పాపపు చిరిగిన దుప్పటిలో...
వెచ్చని చలి మంటల కౌగిలిలో
చక్కిలి గింతలు – ఎందుకు చీదర? రా ఇంకా దగ్గిర.

చారిత్రక జ్యోతులు అనే కవిత చరిత్ర విలువలను వ్యంగ్యంగా చాటుతుంది. కవి తనదృష్టిలో చరిత్ర విలువలేమిటో పాఠకులకు వివరిస్తాడు. కవితను చదువు తున్నప్పుడు పాఠకుల కనుల ముందు శ్రీశ్రీ రచించిన

దేశచరిత్రలు మెదులుతుంది! కవితలోని కొన్ని పంక్తులు పరిశీలించండి :

... సామ్రాట్టుల సంకేతంపై – వర్షాదపు నదులై ప్రవహించిన
మహా సైన్య వాహినిలో – కొట్టుక పోయిన జనపదాలు.
ఏమిటి ఈ చరిత్ర? హత్యలు దోపిళ్ళు తప్ప! ...
ప్రాపంచిక సౌఖ్యాలకు – మెరిసే బంగారు నాణ్యాలకు
మానవ మేధస్సును విక్రయించి – తమ హృదయపు నెత్తుటి నమ్మిన
రాజ సభల కవి కుమారులూ ...
చరిత్ర చీకటి గుడిలో – ఆశా నిగూఢ రత్నులు!
భవిష్య యుగ యాత్రికులకు – నవ్య కథా ప్రదర్శన జ్యోతులు!!

విధ్వంసం : బైరాగి పడక కుర్చీలో పవళించి, కలలు కంటూ కవితల్లో ఊహా జీవి కాదు. ఆయన కవిత కమ్మ దనంతో ఉరక లెత్తదు. తీపి దృశ్యాలు చిత్రించదు. చీకటి, తుఫాను, విధ్వంసం, నెత్తురు బైరాగి కవిత్వ మంతటా అలుముకొని ఉంటాయి! మొగ్గలో నిరాశలు, ముళ్లలో హెచ్చరికలు బైరాగిని అమితంగా కలవర పెడ్తాయి. పురాతత్వశాఖ వెలికి తీసిన భూగర్భ నాగరికతా విశేషాలు, భూగర్భ నాగరికతల మిగిలిన గురుతు మరుగుదొడ్లు, అని జుగుప్సతో వానిని ఈసడించుకొంటాడు! విధ్వంసం ద్వారా ఆయన ఆశిస్తున్న దేమిటో మనకు అర్థం కాదు.

బైరాగి కవిగా జీవితం నుండి గత కాలపు ఘనతను గూర్చిన కిరణమునకై వెదుకుట లేదు. ఆయన ఆకాంక్ష మరచిన పాటలోని చరణం అసలే కాదు. కాటుకల చీకట్లను తుడిచే బ్రతుకు సంజె కెంజాయ గుర్తులు! చీకటిలో మంచు బొట్లలా టపటప రాలే అశ్రుబిందువులు – వీడలేక పోతున్న బంధువుల లాంటి అశ్రుబిందువుల ఓదార్పులు. ఈ జీవిత సంఘర్షణలోంచి మార్గం చూపే ప్రపంచాల దివ్వెల కాధారమైన గానుగలోని బ్రతుకుల నెత్తురు తైలం! అందుకే అంటారు బైరాగి :

వినాశ సుందర రూపం – వీక్షించిన వాడెవడూ
వికాస జడ స్తూపం – రక్షింప బూన డెవడూ
జుగుప్స మన ఆదర్శం – ప్రేయసి మన విధ్వంసం.

పైన ఉల్లేఖించిన పంక్తులు అరాచకాన్ని సూచించవు. వానిని మనం వ్యంగ్యంగానే భావించాలి. మరో ముఖ్య విషయం వేమిటంటే బైరాగి కవిత్వాన్ని అందంగా సృజించాలని ప్రయత్నించ లేదు. పట్టరాని ఆవేశంతో రాశాడు. పద చిత్రాలు వాటంతటవే, పుంఖాను పుంఖాలుగా, మంటలుగా ప్రసరించాయి. గమనించండి :

ఆర్పేయండా సూర్య చంద్రులను – చమురు లేని దీపాలను
చీకటిలో ముంచేయండా – నీడల పాపాలను".

తాజమహల్ పడ గొట్టండోయ్ : ఈ కవితను రూపొందించుటలో తాజమహల్‌ను ఒక ప్రతీకగా తీసుకున్నాడు బైరాగి. అయితే, చాలామంది విమర్శకులకు ఈ విషయం స్ఫురించ లేదు. నిజంగా వీరు పోయి తాజమహల్‌ను గునపాలు పెట్టి పగుల గొడతారేమో అన్నంత భయం (భ్రమ) వేసింది! ధ్వని వాదం, ప్రతీక వాదం తెలిసిన విజ్ఞులకు ఆ భయం రాకూడదు కదా?! తెలిసిన వారు సహితం కొందరు విపరీతార్థాలు తీసి బైరాగిని విమర్శించారు. అభ్యుదయ కవులకు సౌందర్య వాదంలో నమ్మకం లేదని, ఆ వాదం పై వర్గాల వారు సృష్టించినదని, అభ్యుదయ కవులు దానికి వ్యతిరేకులనే విమర్శలు బయలు దేరాయి. బైరాగి మాత్రం తాజమహల్‌ను గతకాలపు ఫ్యూడల్ వ్యవస్థకు చిహ్నంగా భావించి దానిని కఠిన పదజాలంతో గర్హిస్తాడు. మచ్చుకు కొన్ని పంక్తులు పరికించండి :

తాజమహల్ పడ గొట్టండోయ్! – వెన్నెల రాత్రుల్లో కలగా
సౌందర్య సాగరపు అలగా – మా పీడిత హృదయాల్ చీల్చీ
మా ఎత్తిన తలలను వాల్చీ – దరిద్రులను హేళన చేస్తూ
మానవులను చులకన చేస్తూ – ఆకాశం వైపుకు చూపే
ఈర్ష్యలతో హృదయం ఊపే – తాజమహల్ పడగొట్టండోయ్!

ఈ విధంగా చీకటి నీడలు కవితలన్నిటినీ వివరణాత్మకంగా విశ్లేషించ వచ్చును. ఒక చిన్న వ్యాసం ద్వారా ఆ పని సంభవము కాదు. విజ్ఞులు క్షమిస్తారని ఆశిస్తాను.

నూతిలో గొంతుకలు : నూతిలో గొంతుకలు బైరాగికి పర్యాయ పదమైపోయింది. ఈ సంకలనంలో నూతిలో గొంతుకలు, సంఘర్షణం, ఒక సమిష్టి ప్రార్థన, కవి సమస్య అనే నాలుగు కవితా ఖండికలు పొందు పరచారు రచయిత బైరాగి.

ఈ కావ్యానికి తొలి పలుకు బైరాగి స్వయంగా వ్రాసు కొన్నారు. ఈ విషయమై బైరాగికీ ఆరుద్ర గారికీ మధ్య జరిగిన ఒక చిన్న సంఘటన పేర్కొనుట అనుచితము కాదేమో? ఆరుద్రగారి "త్వమేవాహం" అనే ఖండ కావ్యం మొదట్లో చాలామందికి అర్థం కాలేదుట. తర్వాత, ఒక వ్యాసంలో దాశరథి గారు ఆరుద్ర భావాలకు వ్యాఖ్యానం చేశారుట. అప్పుడు ఆరుద్రగారు దాశరథికి వ్రాసిన లేఖలో "బైరాగిని లోకం అర్థం చేసుకో లేక పోతున్నందులకు

విచారిస్తూ ... బైరాగి తన పద్యాలను అచ్చువేసే ప్రయత్నంలో ఉన్నాడని అవి అచ్చు అయ్యేటప్పుడు నేను (ఆరుద్ర) వ్యాఖ్యానం లేకపోతే కనీసం టిప్పణి రాస్తానని చెప్పాను. బైరాగి ఒప్పుకున్నాడు"... తీరా ఆ పుస్తకం ప్రచురించేటప్పుడు బైరాగి మనసు మార్చుకున్నాడు. ఆ విధంగా నూతిలో గొంతుకలు అనే సంకలనానికి తనే స్వయంగా తొలిపలుకు వ్రాసుకొన్నాడు. అందులో కొన్ని భావాలు పరిశీలిద్దాం.

బైరాగి అభిప్రాయాను సారం ఏ కావ్యానికైనా భాష్యం అనేది అవసరము లేదు. సామాన్యంగా ప్రతి రచనా స్వతసిద్ధం. దానికి భాష్యకారుని చేయూత అనవసరం. భాష్యకారుడు (వ్యాఖ్యాత) అపరిణత బద్ధులైన పాఠకులకు సహాయకారి కావచ్చు, సాధారణార్థాలు బోధించవచ్చు, ఆ ప్రయత్నంలో అప్పుడప్పుడూ కావ్యంలోని మసృణత్వాన్ని (సున్నిత భావాన్ని) లేదా మనోహరత్వాన్ని చెరచే అవకాశం కూడా లేక పోలేదు. అతి సున్నితంగా వ్రేలిడవలసిన చోట రసాభాస చేసి కూర్చొంటాడు! అందు వలన బైరాగికి భాష్యకారులంటే సదభిప్రాయం లేదు. భాష్యాలను సమర్థించడు.

నూతిలో గొంతుకలు విషయం, పాడుపడ్డ నుయ్యి పతనానికి, మరణానికీ, సంకేతం. అందులో జీవనం ఉండదు. అందులో పడి వున్న వారికి వెలుతురు మృగ్యం. పైకి రావటానికి ఆధారం అసలు కనిపించదు. వారు కేకలు వేస్తారు కాని, వారి అరుపులు బయట వారికి వినిపించవు. చీకటి తప్ప వారికి తోడెవ్వరూ లేరు. "వారు గర్వాంధత వల్ల అభిశప్తులైన నహుషులు. ఆ పాపం వారిది మాత్రమే కాదు. అది సమస్త మానవ కోటికీ వర్తిస్తుంది" (బైరాగి).

నూతిలో గొంతుకలు ఒక సంశయ కావ్యంగా అభివర్ణించారు బైరాగి. ఈ కావ్యంలో వర్ణితమైన మానవుడు "ఏది త్రోవ?" అని ప్రశ్నిస్తున్నాడు. తనకై తాను ఒక నిర్ణీత మార్గాన్ని నిర్ధారణ చేసుకునే స్థితిలో లేడు (కిం కర్తవ్యతా మూఢుడు) ! చీకటిలో ప్రారంభమైన ఈ కావ్యం "ఆవేదనల అనంతంలో అంతమైన జీవితాలను" చర్చిస్తుంది.దీనిలోని నాయకులు హామ్లెట్, అర్జునుడు, రాస్కల్నికోవ్ సందిగ్ధావస్థలో ఒక క్రమబద్ధమైన పరిణామాన్ని సూచిస్తున్నారు. ఉదాహరణకు హామ్లెట్ వేదన కర్మ పూర్వం. అర్జునుడి వేదన కర్మ క్షేత్రంలో తక్షణికం, రాస్కల్నికోవ్ బాధ కర్మ తర్వాత. అది మానవుని సహజ వేదన. అది అతన్ని త్రికాలాల్లోను వెంటాడుతుంది. ఆ బాధలలో మధన పడనివాడు పూర్ణత్వాన్ని అందుకోలేడు. ఆ బాధనుండి అతడు తప్పుకొనే మార్గం లేదా అంటే ఉంది. పలాయనం, కృతక శక్తుల పూజనం, ఆత్మ హననం. "ఈ కావ్యంలో నేను అంటే కవి కాదు. నేనీ మానవుని అనుభూతిలో అధికః తాదాత్మ్యం. స్వీయ బాధ వెలువరించడం కవి పరమావధి కాదు. ప్రపంచం తో ఏకమైన నాడే కవికంఠం సరిగ్గా పలుక గలుగుతుందని నా నమ్మకం" అని వ్రాశారు తన తొలి పలుకులలో బైరాగి. ఇది కావ్య పఠితలందరూ గమనించదగిన విషయం.

నూతిలో గొంతుకలు ఆధునిక తెలుగు కావ్యాలలో ప్రముఖమైనది. దీని లోని కవిత లన్నీ అద్భుత మైనవి, పదే పదే చదివి ఆనందించ తగినవి. నా దృష్టిలో ఒక సమిష్టి ప్రార్థన, కవిసమస్య అనే కవితా ఖండికలు ప్రత్యేకంగా పరిగణించ వలసినవి. సమిష్టి ప్రార్థన వంటి కవితలు వెక్కిరింత లనిపించవచ్చు. కాని అవి వెక్కిరింతలు కావు.

"ఒక్కోసారి భావావేగం అసహాస్యాస్పదంగా కనిపించేటంత తీవ్రమై వక్ర మార్గాలవలంబిస్తుంది. ఆవేదన, వ్యంగ్యం వెనుక దాక్కుంటుంది" అంటారు బైరాగి. సమిష్టి ప్రార్థనలోని కొన్ని పంక్తులు మీ అనుభూతికై ఉదహరించడమైనది.

...ఆడపిల్లల జడలు పట్టుకు లాగిన
అపరాధాన్ని, గోడల మీద రాతలను క్షమించు
డిక్షనరీలో (Dictionary) బూతు మాటల కర్థాలు వెదికితే
అది జ్ఞాన దాహమనే ఎంచు
బిత్తరి చూపు, నూనుగు ముద్దు, ఇబ్బందైన ఇరుకు కౌగిలి
ఘనత వహించిన రొమాన్సులు అవి యన్నీ లెక్క గట్టకు
గురుతు తెలియని చీకటుల సౌకర్యాన్ని
గురుతుతెచ్చి మమ్ములను కష్ట పెట్టకు ...

దేవా! క్షమించు మమ్ము, చేసినవి చేసినందుకు
చేయనివి చేయ నందుకు
పిందెలు కోసినందుకు, పండినవి కోయ నందుకు ...

ఖాళీ పొదరు డబ్బీల, తల నూనె సీసాల
అత్తరు బుడ్డ, అరిగిన బ్లేడ్ల మధ్య మేము
మురికి బట్టల శయ్యపై శాశ్వతంగా కనులు మూసిన తదనంతరం
మా అలసిన శరీరాలను కడిగించు ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీతో
గంధపు చెక్కలు లేకపోతేమాత్రమేమీ
పేర్చమను చితిపై మేము కాల్చిన సిగరెట్టు పీకలన్నీ ...

పడియుండనీ నరకంలోనో నాకంలోనో మమ్ముల నొకమూల,
వై తరణి ఒడ్డయినా పర్వాలేదు, తిరిగి తిరిగి అలసిపోయాం.
సింహానికి పంజానిచ్చి ఏనుగకు దంతామిడిన మహానుభావా!
మ్యాటినీ లేని వేళ మా మొరాలకించవయ్యా ఓ దేవా!

ఒక సమిష్టి ప్రార్థన అనే గేయం ఆధునిక వచన కవిత్వానికి ఆనాడే వేసిన బాటలా కనిపిస్తుంది. అందులోని వ్యంగ్యం, చమత్కారం, హాస్య ప్రియత్వమూ తర్వాత అనేకమంది కవులకు మార్గదర్శకమైంది" అంటారు కుందుర్తి.

కవి సమస్య : "శబ్దాల అసమర్థత ప్రతి కవికీ ఏదో ఒక సందర్భములో తట్టే ఉంటుంది. కవితా కామిని చేలాంచలాల కొస విసురులు ఎప్పుడూ బారెడు దూరానే మాయ మైనట్లు అగుపిస్తాయి" అంటారు బైరాగి. "బైరాగికి మాత్రం ఆ కొస విసురులు దూరాన మాయమైనట్లు గాక, దగ్గరగా వచ్చినప్పుడు అతనిని నిలువునా నిమిరి, అంతరంగాన్ని పలుకరించేవి" (కృష్ణశాస్త్రి). బైరాగి కవి సమస్యలో ప్రత్యేక శబ్ద సమస్యను వ్యక్త పరుస్తారు. అదే భావకుడైన కవికి ఒకానొక ప్రత్యేక మన స్థితిలో ఏదో అస్పష్టమైన అనుభూతి కలుగుతుంది. అది బాధ కావచ్చు, సంతోషం కావచ్చు, దుఃఖం కావచ్చు, ఆనందం కావచ్చు, ప్రేమ కావచ్చు, విరాగం కావచ్చు, యేదైనా అస్పష్టంగా ఉంటుంది. యేదైంది తెలియనంతటి అస్పష్టత (cannot be clearly perceived) అలాంటి అనుభూతిని మాటల్లో వ్యక్తం చేయడమెల్లా? అదీ కవి సమస్య. ఆ అనుభూతి :

పొగమంచు ముసుగులోని యాకృతిలాగా, గాలి బాట
వెంట మాట తెలియరాని ఆరాటపు దూరపు పాట ...
నిదురించే మోవి మీద ముద్దు లాగ
వ్యక్తా వ్యక్తపు వినీల విపినంలో,
కుసుమ కపోల పాళిపై సౌరభ శ్వసనంలా (ఉంటుంది) ...
చల్లని తల్లి ఒడిలా, మక్కువ నిండిన ముగుద కన్నుల్లా (ఉంటుంది)
అర్థమైన దాని కన్నా అధికంగా స్ఫురించేది,
చేతలకు చెందరానిది, మాటలకు అందరానిది. ...
సిగ్గుపడి తలలు వంచిన శబ్దాలు,
అసమర్థతను గుర్తించిన శబ్దాలు
పరా భూత కవి కరంలో విరిగిన విల్లు లాంటి భాష
మొక్క పోయిన అమ్ములీ శబ్దాలు.

పై విధంగా సాగుతుంది నిర్దేశించిన భావాను భూతులను వ్యక్త పరుచుట లోని శబ్దాల అసమర్థత (అసమగ్రత) చిత్రీకరణ. అంతేకాక, నూతన Expression కోసం, నిత్య జీవితం లోని సామాగ్రితో నూతన ఉపమానాలు సంధించడంలో బైరాగి కృషి శ్లాఘనీయం.



దివ్య భవనం : బైరాగి రచనా శక్తి కేవలం కవిత్వ రచనకే పరిమితం కాలేదు. ఆయన చందమామలో పని చేసే రోజుల్లో బాలలకై కథలు వ్రాసే వారుట. కాని అవి చాలా వరకు హిందీ భాషలో రచింప బడినవి. అంతేకాదు, బైరాగి తెలుగులో సహితం మంచి కథా సాహిత్య సృష్టి చేశారు. లభ్యమైన వారి కథలు దివ్య భవనం పేర సంపుటిగా మిలింద్ ప్రకాశన్ వారు అచ్చు వేశారు. ఈ సంపుటిలో 11 కథలు చేర్చబడినవి. అందులో *దరబాను, స్వప్ననీమ, బీజాక్షరి, జేబుదొంగ, కన్నతల్లి, నాగమణి, తండ్రులూ-కొడుకులూ* అందరూ చదివి ఆనందింప తగిన ఉత్తమ కథల కోవలోనివి. *తండ్రులూ-కొడుకులూ* అనే కథ ప్రపంచ కథా సాహిత్యంలో చోటు చేసుకొన దగినది. పాఠకులందరూ తప్పక చదవ వలసిన కథ. అందులోని పాత్రలు చిరస్మరణీయాలు. కథను విపులీకరించిన పద్ధతి మెచ్చుకో దగినది. బైరాగి మరిన్ని మంచి కథలు ఎందుకు వ్రాయ లేదా? అని పఠితలు చింతిస్తారు.

ఆగమగీతి : ఈ కవితా సంకలనం బైరాగి స్వర్గస్తులైన తరువాత ప్రచురితమైనది. ప్రస్తుత ప్రతి 2006లో ముద్రింప బడినది. ఈ సంకలనంలో దాదాపు 140 కవితా ఖండికలు ఉన్నవి. వానిలో 100 స్వీయ రచనలు, మిగతా 39 కవితలు అనువాదాలు. ఈ కవితలన్నీ వివిధ సమయాల్లో రచించారు బైరాగి. అందుచేత ఏ కవిత కా కవిత అనుకూల సమయాల్లో పఠించి పాఠకులు ఆనందించ వచ్చు. అనువాదాల్లో టి.యస్.ఇలియట్ రచనలు, కొన్ని జర్మను రచనల అనువాదాలు పొందు పరచారు. భారతీయ భాషల్లో బెంగాలీ నుండి జీవానంద దాస్ కవితలు, హిందీ నుండి సుమిత్రా నందన్ పంత్ రచనలు, రామ్ ధారీ సింగ్ (దినకర్) కవితలు, ఉర్దూ, ఫారసీ, మరాఠీ కవితల అనువాదాల్ని పొందు పరచారు. ఈ సంకలనంలో తెలుగు పాఠకులకు ఇతర భాషలలోని మంచి కవితలు కొన్ని బైరాగి పరిచయం చేశారు. *ఆగమగీతి* కవితా సంకలనాన్ని ఉత్తమ రచనగా ఎంపిక చేసి కేంద్ర సాహిత్య అకాడెమీ వారు 1984వ సంవత్సరపు జాతీయ పురస్కారాన్ని సమర్పించి బైరాగిని గౌరవించారు. ఈ పురస్కారం బైరాగి జీవన కాలంలో లభించి ఉంటే ఆంధ్ర సాహితీ లోకం

ఎక్కువగా హర్షించి ఆనందించి యుండేది. అటుల జరగలేదు. విధి బలీయం కదా?!

ఆగమగీతి సంకలనాన్ని కృష్ణశాస్త్రి గారి నా వాడు మున్నుడితో అలంకరించుట ముదావహం. ఆ రచనే కృష్ణశాస్త్రి గారి కలం నుండి వెలువడిన ఆఖరి రచనగా మారుట గమనార్హము. "బైరాగి, మన కవులు – ప్రేళ్ళ మీద లెక్క పెట్ట దగిన బహు కొద్ది మందిలో ఒకడు" అని పేర్కొన్నారు కృష్ణశాస్త్రి. ఈ వాక్యం బైరాగి కవితా శక్తిని చాటుతుంది. "బైరాగి వంటి నక్షత్రాలు సాహిత్య రోదసికి అలంకారాలు. ఆంగ్ల సాహిత్యంలో ఫ్రాన్సిస్ థామస్ కెంత ప్రాముఖ్య మున్నదో బైరాగికి మన సాహిత్యంలో అంత ప్రాముఖ్యత ఉంది" అంటారు మహాకవి శ్రీశ్రీ. అలాగే ప్రపంచంలో ఏ ప్రథమ శ్రేణి కవికైనా సరే – వీసమైనా తీసి పోరు అని అభిప్రాయ పడ్డారు ఆరుద్ర. అలాంటి కవి బైరాగి ఆగమగీతి సంకలనం ద్వారా మన ముందుంచిన కవితా స్రవంతిని ఆస్వాదించే ప్రయత్నం చేద్దామా?!

ఆగమగీతి కవితలోని కొంత భాగం :

మానస యజన వాటికపై మరల నేడు
ముసురు తోంది సందేహాల మందేహాంధ దేహచ్ఛాయ
ద్వి దా ధూషిత ద్వ్యాభా సహజాసుర మాయ
సుడిగాలుల వడిలో విడి ఎడమైనాయి
హృదయ వెద హేమంతాల జీర్ణ శీర్ణ వర్ణాలులు
విశ్వాసాలు, ఆస్థలు, శ్రద్ధాసక్తులాచారాలు,
ప్రాత రోత బూతుల తెరిపి లేని ప్రచారాలు
బ్రహ్మాండ కటాహంలో సలసల మరుగుతోంది నూతన జీవన పాకం
ఊహల ఊహల పెనగిన కల్పిత భూతల నాకం.

అంటూ మొదలవుతుంది ఆగమగీతి గేయం!

ఆ గీతికను ముగించిన విధానం గమనించండి :

వృధా కాదు, తామస గర్భ వేదన,
మనుజుని గరళాస్వాదన తామరసం హసిస్తుంది,
శ్వసిస్తుంది ప్రాతర్వాతంలో తన
పరిమళాలు, నిన్నటి శంకాతంకాచ్ఛాదన తొలగి మరల
విరుస్తుంది ధర రుధిరచ్ఛవి జీవన దీప్తి కెరల.
ఈ వంధ్యా ధూళి నుంచి, వికృత భస్మపాళినుంచి
ఉదయిస్తా దనల సంభవు దాత్మధవుడు, నవ మానవుడు;
అతని కొరకే వేచి ఉంది యుగయుగాలనుంచి ధరణి
అతని వ్యోమమార్గంలో ఉల్కాధర ప్రహరి తరణి.

కవితా సారాంశ మేమిటంటే రోతకు ప్రతీకమైన పాత నశిస్తుంది. నూతనోత్తేజంతో నవయుగం మొదలై మానవాళికి మంచిని తెస్తుందిఅని.

త్రిశంకు స్వర్గం అనే కవితలో బైరాగి జీవిత దృక్పథాన్ని వర్ణించిన తీరు గమనించండి :

జీవిత మొక ఆవులింత
జీవిత మొక వొళ్ళు విరుపు
జీవిత మొక గజ్జి కురుపు
మెరసే నున్నని చర్మం పై ప్రాకే దురద విసుగు విసుగు!
జీవితాల ముసుగు.

పలాయనం అనే మరో ఖండికలో –

జీవితం తింటొంది తనను తను,
కాలే కడుపు నింపు కొనేందుకు గాను
క్రొవ్వొత్తిలా తింటోంది తనను తాను ...
చావునుండి పారిపోవటమే బ్రతుకు
బ్రతుకు నుంచి పారిపోవడ మెక్కడికీ? ...
శాంతి నుంచి పారిపోవడమె అశాంతి
అశాంతిని శాంతి పరచట మెలాగా?
జీవితాన్ని గడిపేస్తుంది కాలం
కాలాన్ని గడపి వేయట మెలాగా?
ఖైదీలో నున్నది జైలు
జైలు తప్పించు కోవట మెలాగా?

అంటారు! ఈ సంకలనం లోని అద్భుత కవితా ఖండిక నా క్కొంచెం నమ్మకమివ్వు అనే గేయం. ఈ గేయంలో, తరువాత వచ్చిన దిగంబర కవితోద్యమానికి బీజాలు కనిపిస్తాయి. ఆ విధంగా చూస్తే బైరాగిని దృష్ట గా పరిగణించ వచ్చు. కొత్త తరహా వ్యక్తీకరణ కోసం నిరంతర కృషి చేశారు బైరాగి. ఈనాడు వచన కవితలో కొత్త కొత్త ఉపమానాలు వాడిన విధంగా, బైరాగి ఆనాడే నిత్య జీవితం లోని సామాగ్రితో ఉపమానాలు సృజించడానికి కృషిచేశారు. అందుకే వారి కవిత ఉత్తేజంతో పాటు ఉత్సాహాన్ని పుట్టిస్తుంది పాఠకుల హృదయాల్లో.

ఏ కార్యాన్ని సాధించాలన్నా మనిషికి ఆత్మ నమ్మకం అత్యంత ఆవశ్యకం. నా క్కొంచెం నమ్మక మివ్వు అన్న గేయంలో ఆ విషయాన్ని అత్యంత ఆహ్లాద కరంగా చిత్రించారు ఆలూరి. ఈ కవితను మెచ్చుకొని "Grant me a grain of Faith" అనే పేరుతో ఆంగ్లం లోకి అనువదించారు శ్రీశ్రీ. నా క్కొంచెం నమ్మక మివ్వు నుండి కొన్ని పంక్తులు ఉదహరించదమైనది. పఠితలు ఆస్వాదించండి :

నా క్కొంచెం నమ్మక మివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టొమేటో లాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడం లాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్ళెం లోంచి నెట్టేస్తాను
నాదగు బాహు బంధనం లో ఈ విశాల

బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేస్తాను. ...
ఇంటింటా గగన కుసుమాలు మూడు పూవులుగా
నందన నికుంజాల అమృత ఫలాలు ఆరు కాయలుగా
పూయిస్తాను, కాయిస్తాను. ...
ఆకాశపు ఉదారంగు తాను చించి
చొక్కా లేని వారందరికీ కుట్టిస్తాను
ఒకటేమిటి, ఏదైనా చేస్తాను ...
నమ్మకం లేని బొంది ఖాళీ సిగరెట్టు టిన్ను
నమ్మకం లేని ఆత్మ పుల్లలు లేని అగ్గిపెట్టే
నమ్మకం లేని బ్రతుకు కాలిన సిగరెట్టు బూది
అన్నీ ఉన్నాయి కాని నమ్మక మొకటే లేదు
నా క్కొంచెం నమ్మక మివ్వు! నమ్మక మివ్వు!
నమ్మక మివ్వు! నమ్మక మివ్వు!

వాగ్దత్త వసుంధర అనే ఖండికలో బైరాగి వాస్తవ ప్రపంచం ఎటు మొగ్గు తున్నదో దానితో పాటే తనూ అటే మొగ్గాడు. అందుకే ఆయన కవితా తత్వంలో కొంత మార్పు కనబడుతుంది. గమనించండి :

మనిషికి మనిషికీ మధ్య సంఘర్షణం ఉండదింక
సహ జీవన పావన హర్షం తప్ప,
మనిషికి మనిషికీ మధ్య అమర్షం ఉండదింక
సహజ సులభ స్నేహాకర్షణ తప్ప,
మనిషికి మనిషికీ మధ్య గోడ లుండవు గోతులుండవు,
అదృష్టం గీచిన గీతలుండవు
విప్లవపు బుల్‌డోజర్‌తో మిట్టపల్లా లేకం చేసి
మకిలి గుంటలు పూడ్చేశాం ...
మేధకూ క్రియకూ మధ్య, ఆశయానికీ, సంశయానికీ మధ్య
సాధనకూ, సాధ్యానికి మధ్య పడిన నీడలు తుడిచేశాం.

బైరాగి తను చెప్ప దలచిన దానిని పఠితల మనస్సు హత్తు కొనేటట్టు చెయ్యడానికి ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యా వహకంగా పద ద్యోతక ధ్వనితో చెబుతుంటాడు. పరికించండి:

పత్తనాల రాజ వీధుల పందులు తిరుగు తున్నవి
ఎంగిలికై ఎగబడే నరులను చూచి కుక్కలు మొరుగు చున్నవి.
బియ్యపు కొట్ల వద్ద బారులు తీర్చి నిలబడిన వారు పౌరులు
అమృతం పొంగే ఏరులు పారుతూనే ఉన్నాయి.
శ్రమించే తనువుల స్వేదాలు కారుతూనే ఉన్నాయి.
గిద్దంగులు, చీకటి కొట్లు, వినాయకుల జేబులు నిండుతూనే ఉన్నాయి.
అయినా అన్న పూర్ణ భాండంలో తండులాలు నిండు కొన్నవి.
పొయ్యి లోన రాజని చిచ్చు కడుపులో రగులుతోంది
కన్నీరుల ఆరని మంట ఎదలో ఎదుగు తోంది
పగ సెగలై పొగులు తోంది.
కలలు అడుగంటాయి, వెలలు మిన్నంటాయి.
కడుపు కరువు, గుండె చెరువు, బ్రతుకు బరువు
ఈ స్వరాజ్యం స్వారాజ్యానికి రాచబాట.

అంటూ మన సమాజంలోని దౌర్భాగ్య స్థితికి వ్యధ వ్యక్త పరుస్తాడు పాంచజన్యం అనే కవితలో!

పెంచిన తల్లి అనే గేయం ఆంధ్రరాష్ట్రం ఉమ్మడి మద్రాసు నుండి విడిపోయిన కాలంలో రచించారు బైరాగి. తమిళ దేశాన్ని పెంచిన తల్లిగా సంభావించు కొన్నారు బైరాగి. తమిళ తల్లీ నీకు నేను ప్రేమతో, గౌరవంతో వందనము చేస్తున్నాను అంటారు, బైరాగి ఉద్దేశ్యం లో –

కన్నతల్లి కన్నను
పెంచిన తల్లి ఋణ మెక్కువ
ఏమంటే అందు కన్న తల్లి కుండే నెత్తురు బంధం లేదు.
సహజ రహస్నేహం తప్ప మరొక ఆనందం లేదు.
మాతృ మమతా నిహిత స్వార్థ ద్వందం లేదు.
వెలుగు లాగు, గాలి లాగు, నీరు లాగు అదే గదా ప్రేమంటే.
అని పెంచిన తల్లిని అభివర్ణిస్తారు.

ఆగమగీతిలోని ఖండికలన్నీ వివరణాత్మక, విశ్లేషణీయములే! కాని స్థలాభావముచేత ఆ పని విరమించడ మైనది. విజ్ఞులు మన్నింతురుగాక! ఇంతవరకు స్వీయ కవితలను గూర్చి చర్చించు కొన్నాము. అనువాద కవితలను గూర్చి కొద్దిగా ముచ్చటించుకొని, విశేషాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అనువాద కవితలు పరిశీలిస్తే, టి.యస్.ఇలియట్ రచనలంటే బైరాగికి ఎక్కువ అభిమానమని గ్రహించ వచ్చును. ముఖ్యంగా వారి కవితలు బైరాగిని అధికంగా ప్రభావితుని గావించాయి. ఫ్రెంచి కవితలు సహితం ఆయనను ఆకర్షించాయి. అందుకే అనువాదాలలో ఎక్కువ భాగం ఫ్రెంచి కవితలు. వానిని ఆంగ్ల మాధ్యమ నుండి తెలుగు చేశారు.

భారతీయ భాషల్లో హిందీ నుండి సుమిత్రా నందన్ పంత్, దినకర్ బైరాగి అభిమాన కవులని మనం భావించ వచ్చును. మరాఠీ కవులలో విందా కరందీకర్, బెంగాలి కవులలో జీవానందదాస్ బైరాగిని ఎక్కువగా ఆకర్షించి, ప్రభావితం చేశారు. జీవానందదాస్ కూడా బైరాగి కోవకు చెందిన కవి. "బ్రతుకు బాధ భరించ రానంతగా వున్నట్లు భావించి, జీవితం కొట్టిన కొరడా దెబ్బలకు తట్టుకో లేక, ఆత్మ ఎక్కడి నుండి వచ్చిందో అక్కడికి అంటే మృత్యుగహ్వరం లోకి, అంధకార గర్భంలోకి వెళ్ళి పోవాలనే ఆకాంక్ష ఆయన కవితల్లో చాలా చోట్ల కనిపిస్తుంది. కవితలన్నీ బాధలకు తట్టుకోలేక వేసిన కేకల్లా వినిపిస్తాయి, ... ఆయన కవిత తొలి దశలో స్త్రీ మూర్తి కవితకు కేవలం ఒక ఆశ్రయంగా మాత్రమే ఉండేది. తర్వాత చీకటి గర్భం లోకి పోవాలనే మృత్యు కాంక్షగా పరిణమించింది" (కుందుర్తి). ఈ

సంకలనంలో నీలిమా, వనలతాసేన్ అనే రెండు జీవానంద దాస్ కవితల తెలుగు అనువాదాలు పొందు పరచబడ్డాయి.

ముగింపు : బైరాగి అభ్యుదయ కవిగా సాహితి జగత్తులో ప్రవేశించాడు. అతనిపై ఆధునిక పాశ్చాత్య కవుల ప్రభావం ఎక్కువగా వుంది. బైరాగికి కొన్ని రాజకీయ విశ్వాసాలు ప్రగాఢంగా ఉన్నాయి. బైరాగి తన రాజకీయ విశ్వాసాల కోసం పడ్డ బాధ మాత్రం వెతికితేనే కాని కనబడదు ఆయన కవితలో. బైరాగిని కేవలం అపనమ్మకపు నీడల్లో సంచరించే సంశయాత్మగా చిత్రిస్తే, అది అవగాహనకు లోప చిహ్నం. కావ్యంలో నిరాశలు, నిట్టూర్పులు, భయాలూ, సందేహాలూ అడుగడుగునా ఉంటే, వాటన్నిటినీ బైరాగికి అంటగట్ట కూడదు. కుళ్ళుతో, అవినీతితో, అక్రమాలతో అన్యాయాలతో నిండిన ఈ జీవితపు చీకటి నుంచి ఆకాశపు వెలుతురు లోనికి చొచ్చుకు పోయే స్వేచ్ఛను, బైరాగి జీవిత మంతా అన్వేషించాడు, ఆకాంక్షించాడు.

వచన కవిత్వపు తొలి రచయితల్లో బైరాగిని చేర్చ కుండా ఉండలేము. ఈ ప్రక్రియను తీర్చి దిద్దిన కవుల్లో ఆయన ముఖ్యుడు. ఆయన కవిత పైకి సులభసాధ్యంగా కనిపించక పోయినా, లోతుగా ఆలోచించే వారికి, ఆయన బాగా అర్థమవుతాడు. వచన కవితలో గొప్ప ధారా శుద్ధి గల కవి బైరాగి. చివరి దశలో బైరాగికి, లోకం మీద కోపం ఎక్కువైంది. లోకంతో పాటు తనపైననే తనకు విసుగు పుట్టిందేమో?! ... చివరి రోజుల్లో అసలు బ్రతకడం ఎందుకో ఆయనకు అర్థం కాలేదు! లక్ష్యసిద్ధి భ్రాంతి లేకుండా – అంటే మోక్షాశయం లేకుండా, చావదలచిన యోగీశ్వరు డాయన. ఏమైతే నేమి, ఒక మంచి కవిని కోల్పోయింది తెలుగు తల్లి. బైరాగి మరి కొంత కాలం బ్రతికి ఉంటే ఏం రాసేవాడో? కవిగా ఎంత పేరు ప్రతిష్ఠలు గడించే వాడో ఊహిస్తే భరింపజాలని బాధ కలుగు తుంది.

కృతజ్ఞతలు : శ్రీ ఆలూరి బైరాగిని గూర్చి సాహిత్య పరమైన వివరాలు లభించక, తికమకలవుతున్న తరుణంలో, ఆపద్బాంధవునిగా చేయూతనిచ్చి, అలభ్యమైన ఆలూరి సంస్మరణ సంచిక (1979) నుండి ముఖ్య విషయాలను సేకరించి నాకు అంద జేసిన నా చిరకాల మిత్రులు డా. వెలగా వెంకటప్పయ్య గారికి నే నెంతయో ఋణ పడి యున్నాను. వారికి ఇందు మూలమున నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపు కొంటున్నాను.



ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యులు, హైద్రాబాదు.
ఫోన్ : 9618524702

తారాశశాంక విజయం

గిడుగు రామమూర్తి మేష్టరుగారు మా క్లాసువాళ్ళ నందరినీ తెలుగు గ్రంథాలు చదవవలసిందని ఆర్డరు చేశారు. ఒక రిజిష్టరు పెట్టి ఎవరెవరు ఏయే గ్రంథాలు చదువుతున్నారో అందులో వ్రాయమన్నారు. నేను పెంకెతనానికి పోయి, నా పేరు కింద తారాశశాంక విజయం అని వ్రాశాను. ఒకనాడు మేష్టరుగారు చూశారు. తిడతారనుకున్నాను, కాని అభిమాన విద్యార్థిని గదా తిట్టలేదు. "తారాశశాంక విజయం బాగుంటుంది. అద్భుతమైన ధార!" అని మన కవులకున్న శృంగార పిపాసను గురించి ఉపన్యాసమిచ్చారు.

నేను కొన్ని పద్యాలు అప్పచెప్పాను. సంతోషించారు. అప్పటికింకా వారు ఆంధ్రభాషా విషయమైన పరిశోధనకు పూనుకోలేదు లెండి. **- తాపీ ధర్మారావు**

('ఆంధ్ర విశారద'గా ప్రసిద్ధిపొందిన తాపీ ధర్మారావు వ్యావహారికి భాషా ఉద్యమంలో అగ్రశ్రేణి కార్యకర్త. పత్రికలో వ్యవహార భాష ప్రవేశపెట్టింది ఆయనదే. తెలుగువారిలో హేతువాద ఆలోచనా ధోరణికి, అభ్యుదయాల భావాల ప్రాచుర్యానికి ఆయన జీవితాంతం కృషి చేశారు. పూలబాటలో ముళ్ల పుంతలతో నిండిన ఆయన జీవిత చరిత్రే 'రాలు-రప్పలూ')

బళ్ళారి మళ్లీ మనదైతే

– గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి

1953లో తొలిసారి భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడినప్పుడు కొంత హడావిడిగా చాలా ప్రాంతాలు రాష్ట్రానికి దూరంగా మిగిలాయి. ఆనాడు బిచ్చగాళ్ళలా మనం మన రాష్ట్రంకోసం దేవిరించాము. బిచ్చగాళ్ళకు గృహస్థులేది ఇస్తారో అదే అంగీకరించాలి గానీ, వారికి తనకేమి కావాలో నిర్దేశించడం కుదరదు. కూపం నది సరిహద్దుగా మద్రాసునగరాన్ని విడగొట్టి ఇద్దరూ పంచుకోవాలని ఒక ప్రతిపాదన జరిగింది. సింహంలాంటి తెలుగునాయకుడు దానికి ఒప్పుకోకుండా ఎన్నికల ద్వారా మద్రాసెవరికో తేలుతుందని మొండిపట్టు పట్టాడు. ఆ నాయకునికి వ్యతిరేకదిశలో పయనిస్తూ కౌటిల్యుని మించిన వాడైన మరో తెలుగునాయకునికిది ఇష్టంకాదు. ఎన్నికల్లో ఓడిపోయిన ఆ నాయక సింహం తాముకోల్పోయిందేమో అర్థం చేసుకొనేసరికి జరగాల్సినదంతా జరిగేపోయింది. మద్రాసుతో ఆంధ్రరాష్ట్రంగా దీర్ఘమైన ఆమరణ నిరాహార దీక్షతో పొట్టి శ్రీరాములు అశయం నెరవేరకపోగా, ఆయన ప్రాణాలు ధారపోసేవేళకి హడావిడిగా తగాదాలులేని పదకొండు (11) జిల్లాలతో రాష్ట్రం ఏర్పరిచి, మిగిలినవి తర్వాత తేలుద్దాం అన్నారు పైవాళ్ళు. త్వరగా అధికార పట్టాలు చేబట్టి ప్రజలకు సేవచేయాలన్న ఉబలాటంతో పాపం దానికొప్పుకొని రాష్ట్రం ఏర్పడిందని సంబరాలు చేసుకొన్నారు.

ఆ విధంగా ఒరిస్సాలోని రెండు జిల్లాలూ, మహారాష్ట్రలోని 6 తాలూకాలు, మద్రాస్‌తో పాటు రెండు జిల్లాలు, నేడు కర్ణాటకంగా వున్న నాటి మైసూరు ప్రాంతానికి 3 జిల్లాలూ దఖలు పడిపోయాయి. ఒకరు చెప్పనక్కర లేకుండా, ఇంచుమించు 8/9 జిల్లాల తెలుగు వారు రాష్ట్రేతరులై, ప్రవాసులై అల్ప సంఖ్యాకులై తమ మాతృభాషను పణంగా పెట్టి ఆయారాష్ట్రాల భాషలు ప్రధానంగా నేర్చుకోవలసిన స్థితి ఏర్పడింది.

ఇప్పుడు, నాడు మైసూరు, (కర్ణాటక)లో చేరిన ప్రాంతం గురించి ఇంకాస్త లోతుగా చూద్దాం. ఆ ప్రాంతంలో బళ్ళారి, రాయచూరు, కోలారు జిల్లాలు పూర్తిగాను, కొన్ని పాక్షికంగా తుమకూరు, బెంగుళూరు, చిత్రదుర్గంలోని కొన్ని తాలూకాలు శాశ్వతంగా మన చేతుల్లోంచి జారిపోయాయి.

1956లో రాష్ట్రాలు భాషా పరంగా విడిపోయాయి. బళ్ళారి గురించి విపరీతమైన గొడవలు జరిగాయి. మేధావులు అనేకరీతిగా పరోక్షంగానూ, రాజకీయ నాయకులూ, గోడమీదిపిల్లులూ నిర్దేశించినట్లుగా ఎన్నికలు జరిగి నామమాత్రపు ఆధిక్యతతో (1285) కర్ణాటక వాదులు గెలిచిపోయారు. మేరమీరిన విశ్వాసంవల్లనైతేనేమి 1953 నుండి అక్కడ పాగావేసిన మైసూరు రాష్ట్ర ఉద్యోగులూ, ఏమాయ చేశారోగాని బళ్ళారిని చేజార్చుకొన్నాం. అలా జారిపోయిన బళ్ళారి రక్కసి తంగడి యుద్ధంలో మరికొన్ని క్షణాలలో విజయం తమకు దక్కబోతుందన్న సమయంలో బంగారు కాసుల్ని విసుర్తూ రామరాయలు సేన నడుమకు వచ్చి మోసంతో, తనవాళ్ళనుకొన్న ముస్లిం దళం ఎదురు తిరిగి అతని మరణానికి కారణం అయింది. అంత సైన్యం వుంచుకొని, అన్న రామరాయల మరణంతో పారిపోయిన తిరుమల వేంకటపతిరాయుళ్ళ స్థితే బళ్ళారి తెలుగువాళ్ళది. ఓటింగ్ జరుగుతుండగా కొంత ముందంజలో నున్న తెలుగువాదులకు చివరిదైన మోక ఫిర్కాలో కొచ్చేసరికి మరిక జయం ఖాయమనిపించింది.

ఆ ఫిర్కాలో బోయకులం వారిదే మెజారిటీ. అయిన వాళ్ళంతా భూస్వాముల మనుష్యులు. యజమాని ఏంచెబితే అదే వేదవాక్యం వారికి. తెలుగు తప్ప కన్నడం మాట్లాడ్డానికి

కూడ తడబడే వారు. ఓట్ల లెక్కింపు పూర్తయింది. అక్షరాల పన్నెండు వందల ఎనభై మూడు ఓట్ల తేడాతో కన్నడిగులు విజయం సాధించగా, తెలుగుతనం అక్కడ తల వంచింది. మరుక్షణం కన్నడవాదుల ఆనందోత్సవాల ఊరేగింపు సాగుతూంటే అవనత శిరస్కులై ఆంధ్రవాదులు బ్రతికున్న శవాల్లాగా కనుమరుగైపోయారు. అంత నమ్మకంగా వున్నది ఇలా పేలిపోవడం ఎవరికీ నోళ్ళు పెగలడం లేదు. పరిస్థితి అర్థమయింది కానీ, జీర్ణం కాలేదు. భయంకరమైన మౌనం. మోక ఫిర్కాకు సంబంధించిన ఒక బోయనాయకుణ్ణి అడిగితే అతని సమాధానం ఇది! ''తెలుగో, కన్నడో మాకేం తెలుసయ్యా. మా రెడ్డి యాడెయ్యమంటే ఆడ యేస్తాం''.

ఇంగ్లీషు వారికి నాటి హైద్రాబాదు నిజాం దత్తపరచినవి బళ్ళారి, కడప జిల్లాలు. అప్పుడు కర్నూలు, అనంతపురాలు జిల్లా కేంద్రాలుగా లేవు. బళ్ళారి పరిధి ఇప్పటి హోస్‌పేట నుంచి హిందూపురం దాక! మొత్తం 27 తాలూకాలు. మొత్తం జిల్లాలో 5/6 తాలూకాలలో కన్నడ జనాభా ఎక్కువ వున్నా మిగతా 20కి పైగా తాలూకాల్లో తెలుగే బహుజన భాష. పరిపాలనా సౌలభ్యం కోసం కర్నూలు అనంతపురం జిల్లాలు ఏర్పడి బళ్ళారి జిల్లా కురుచదైపోయింది. అలా అలా దిగివచ్చి తొమ్మిది తాలూకాలు మిగిలేయి.

1930 ప్రాంతాల్లో స్వతంత్రపోరాటం జరుపుతున్న సమయంలో ముందంజలో నున్న బళ్ళారిని విడదీసి, అనంతపురం, కర్నూలు జిల్లాలు ఏర్పడ్డాయి. అప్పుడు బళ్లారి తాలూకాలు తొమ్మిది. భాషావాద ప్రాంత్య ప్రాతిపదికతో మూడు తాలూకాలు-రాయదుర్గం (అనంతపురం)లో ఆలూరు, ఆదోనీలు కర్నూలులో కలిసిపోయాయి, 1930 ప్రాంతాలలోనే. బళ్ళారి కాంగ్రెస్ పార్టీ కర్నాటక కాంగ్రెసు, ఆంధ్రాకాంగ్రెసుగా విడిపోయాయి. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూకు బాగా సన్నిహితుడు తెలుగువాడైన లోకసభ సభ్యుడు తాను బ్రతికివున్నన్నాళ్ళూ పదవిలోనే వున్నాడు. బళ్ళారి కన్నడ కాంగ్రెసు వర్గీయులు ఆయనకు అండగా నిలువగా అతను స్వార్థంతో బళ్ళారిలోని, మరికొందరు నాయకులు పైకిరాకుండా అదుపు చేస్తున్నాడు. ఆ క్రియలో అతను కన్నడ వైపు మొగ్గిపోయాడు. బళ్ళారి కోసం ఆయన తన లోక్‌సభ సభ్యుని పదవి వదలకుండా వుండడానికి! కర్ణాటక కాంగ్రెసులో ముఖ్య పదవిలో వున్నాడు. అలా అతని వర్గం తెలుగుకు దూరమయింది. తెలుగువారి తరఫున ఎన్నికల బరిలో వున్నది ముండ్లూరు గంగప్పగారు. కన్నడిగుల తరఫున ఆరగినడోణి పోటీ పడ్డారు. మావూరు జోళదరాశి రూపన గుడి ఫిర్కాలో వుంది. అక్కడి వరకూ తెలుగు వాదులదే పైచేయిగా వుంది. తాలూకాలో. మోకాపిర్కాతో అనుకొన్న అంచనాలన్నీ తలక్రిందులై కన్నడ ఝండా బళ్ళారిలో రెపరెపలాడింది. బళ్ళారి జిల్లాలో మూడు వర్గాల వారు బలమైన కన్నడవాదులు. వీరు లింగాయతులు, మాధ్వ బ్రాహ్మణ వర్గం, కురబలు. రెడ్లలో 25 శాతం కన్నడం, మిగతా 75 శాతం తెలుగు వాళ్ళు. బోయ, మాల, గొల్ల కోమట్లు మంగలి తెలుగువారైతే చేనేత వారిలోనూ, చాకళ్ళలోనూ రెండు భాషలవారున్నారు. ఇహ ముస్లింలూ, కిరస్తానులు, తెలుగునే చదివేవారు. ఇంట్లో ఏం మాటాడుకొన్నా. ఆ సందర్భంగా వందేళ్ళు పై బడిన కోణం చెన్నబసప్ప అనేక వకీలు, పత్రికా సంపాదకుడు ఏదో సందర్భంగా బళ్ళారిని గెల్చుకొన్నామని అంటే, బహుశ శివమూర్తి స్వామి అనే కన్నడవాది, మనం గెల్చుకొన్నది బళ్ళారిని కాదు విజయనగర సామ్రాజ్యాన్ని అన్నాడని తెలిపారు. ఆయన డిగ్రి చదువు, అనంతపురంలో చదివి హైకోర్టులో చీఫ్ జస్టిస్ (ప్రధాన న్యాయమూర్తి) గా పదవీ విరమణ చేసినవారు.

బళ్ళారి పట్టణంలో అధిక సంఖ్యాకులు 65శాతం తెలుగును బలపరిస్తే, కన్నడవాదలు 35 శాతం లోపేవున్నారు. అంటే బళ్ళారికి తూర్పున వున్న నూతన సర్దుబాట్లలో అనేక తెలుగు తాలూకాలు అనంతపురం కర్నూలులో చేరుకోగా మిగిలిన ఆరు తాలూకాల్లో నాలుగింట కన్నడవాదులు పై చేయిగా వున్నారు. అసలింతమంది కన్నడవాళ్ళెలా వచ్చారీ పల్లెల్లోకి అంటే, మనం విజయనగర సామ్రాజ్యం పతనమైన తదనంతర పరిణామాల్ని గుర్తుకు తెచ్చుకోవాలి.

రామరాయలు చనిపోగానే 550 ఏనుగులపై, రాజకోశాన్ని పెనుగొండకు తిరుమల రాయలు తరలించగా, ఎక్కువ శాతం భూస్వాములు, వ్యాపారస్తులు, నిపుణులైన కంసాలులు మొదలైన పంచశాలూ తమ కుటుంబాల్ని, ఆస్తుల్ని తమ గుర్రాలపైనో, ఎడ్డబళ్ళలో తరలించుకొని తిరుమల రాయలను వెంబడించారు. బీజాపురం, అహ్మద్‌నగర్ సైన్యంలో వీరశైవలింగాయతులు ఎక్కువమంది వున్నారు. వీరు వైష్ణవమతానికి వ్యతిరేకులు.

హంపిలో శైవదేవాలయాలేవీ భగ్నం కాకుండా మిగిలివుండగా ఒక్క కోదండ రామాలయం తప్ప మిగతా వైష్ణవాలయాలు ఇంచుమించుగా అన్నీ కొల్లగొట్టబడినాయి. హంపీలో ఆరు నెలలు తిష్టవేసి తమ ఆస్తుల్ని వదలి ప్రాణభీతితో పలాయన మంత్రం పఠించిన తెలుగు వారి భూముల్ని, భవనాల్ని లింగాయతులు (స్వతహాగా రైతులు కాబట్టి) అంది వచ్చిన అదృష్టం ఇదని తమ కుటుంబాలతో వచ్చి తిష్టవేసుకొని కూర్చొని అలవోకగా అందినకాడికి భూములు ఆక్రమించుకొన్నారు.

వైదిక ధర్మానికి చెందినవారికి సంస్కృతం గౌరవనీయ భాషగా వుండగా, వీరశైవులకి కన్నడం దైవభాష అయింది. అందుకే కన్నడం ప్రబలింది. ఆ నాటి ఆ విపత్తును అనుసరించి లింగాయత ధర్మం వారు తమ క్రింది వారిలోనూ కన్నడాన్ని ప్రబలపరిచే పనిలో విజయులయ్యారు. అందుకే బళ్ళారి పశ్చిమంగా, వాయువ్యంగా పెక్కు సంఖ్యలోవున్న కర్ణాటకులు తూరుపుదెసలో చాల తక్కువ సంఖ్యలో వున్నారు. సాధారణంగా గెలిచి అధికారంలో వున్న భాషకు వారల్పసంఖ్యాకులయినా సరే విలువ ఎక్కువగా వుండి బహు సంఖ్యాకులయినా ఓడిన వారి భాష తన ప్రభావాన్ని కోల్పోడం సహజమే కదా! అంతేకాదు, స్థానికులైన కాపుకులస్తులు తమ బ్రతుకుకోసం వీరశైవదీక్షలు తీసుకొని కన్నడిగులుగా మారిపోయారు.

కర్ణాటకపు పశ్చిమోత్తర ప్రాంతాలలోని గౌడ (వీరు వక్కలిగులు కారు) లూ, పాటిల్, పటేలులు నిజానికి తెలుగు రెడ్లే అయినా తమ మతధర్మం మార్చుకొని వీరశైవులుగా మారిన వారే! అయినా తమ మూలాన్ని మరిచి పోలేక, ఇతర ప్రాంతాల్లోని లింగాయతుల పేర్లలోలాగా కాకుండా వైష్ణవ పేర్లు వెంకట గౌడ, కృష్ణగౌడ... ఇత్యాదులుగా పేర్లతో తమ తమ మూలాల్ని మరచిపోకుండా హేమారెడ్డి, మల్లమ్మ పురాణాల్ని కన్నడ భాషలో చదవడం కర్ణాటక ప్రాంతంలో ఏదో ఒక మూల అది నాటకంగానో, పురాణంగానో ప్రతిరోజూ నడుపబడుతూ వుండడం కాస్త చిత్రంగానే వుంటుంది. భాషాప్రాతిపదికగా రాష్ట్రం ఏర్పడాలన్నప్పుడు బక్కచిక్కిన బళ్ళారి జిల్లాల్లోని తాలూకాల్లో కన్నడం వున్న మూలాన దాని కేంద్రబిందువు బళ్ళారిని కన్నడంలో చేర్చాలని మిశ్రాకమిటీ తేల్చగా, ఫణిక్కర్, ఫజులాలీ కమిషన్‌వారు ఆంధ్రలో చేర్చాలని తెలుపగా, చివరికి ఎన్నికలతో తేల్చాలని నిర్ణయం జరిగింది.

అంతకుముందు నీలం సంజీవరెడ్డి, మృత్యుంజయశాస్త్రి మరో నాయకుడితో జవహర్లాల్ నెహ్రూను కలిసినప్పుడు సంజీవరెడ్డి కోలారు, బళ్ళారిలను గురించి ప్రస్తావించగా, నెహ్రూ, మీరు రెండూ కోరితే ఇవ్వడం అసాధ్యం, ఏదో ఒకటి మాత్రం సాధ్యమన్నారట. ఆ మాటకు శాస్త్రి బళ్ళారిని కోరుకోగా, నీలం సంజీవరెడ్డి కోలారును కోరుకొన్నారట. మూడవ వ్యక్తి నీలంకు వంతపాడారట. ఈ లోగా కార్యసాధకులైన కన్నడిగులు కోలారును పోగొట్టుకోకుండా వుండేందుకు అక్కడి చెంగల్వ రాయరెడ్డి (కె.సి. రెడ్డి) ని మైసూరుకు తొలిముఖ్యమంత్రిని చేసి, భవిష్యత్తులో విశాలాంధ్ర ఏర్పడితే హైద్రాబాదు రాజధానికాగలదని ప్రక్కన గల బెంగుళూరు వదలి హైద్రాబాదుకు వెళ్ళాల్సుంటుందని మడత పేచీ పెట్టి కోలారుజిల్లాను మైసూరు (కర్ణాటక) లోనే వుండేటట్లు అన్ని శక్తులూ ఒడ్డి విజయం సాధించారు. కర్ణాటక రాష్ట్రంలో వుంటూనే తెలుగు చదువుకోవడం ఇబ్బందికరం కాదుకదా! అన్నవాదం బలంగా వినిపించి కోలార్ కర్ణాటకకు దత్తమయిపోయింది.

తుంకూరులోని పావగడ, మధుగిరి, చిత్రదుర్గంలోని మొళకాల్మూరు గుల్బర్గా జిల్లాలోని సేడం, గురుమిట్టకల్లు ఇలాంటి అనేక తెలుగెక్కువగా మాట్లాడే ప్రాంతాలు కర్ణాటకలో చేరిపోయాయి. రాష్ట్రం ఏర్పడిన కొంత కాలానికి విద్యాశాఖ మంత్రి ఒకరు కన్నడ శాసన సభలో ఓ విషయాన్ని తన మహావిజయంగా వర్ణిస్తూ ఇలా అన్నాడు "రాష్ట్రం ఏర్పడేటప్పుడు కోలార్ జిల్లాలో 707 తెలుగు పాఠశాలలుండేవి. ఇప్పుడా తెలుగుబడుల సంఖ్య 7 మాత్రమే". నేను చదివిన మునిసిపల్ స్కూలు (బళ్ళారి) 6వ/7వ తరగతుల్లో 6 సెక్షన్లు తెలుగు భాషవి వుండగా ఒకే ఒక సెక్షనులో కన్నడంవారిదిగా వుండేది. కాలం గడిచేకొద్ది తెలుగు మాధ్యమంలో కాక, తెలుగు ఒక సబ్జెక్టు క్రింద బోధన జరిగేలా సాగుతోంది. తెలుగు సెక్షన్‌లు మాత్రమే ఉండిన సెయింటాన్ హైస్కూల్లో అన్ని క్లాసులూ,సెక్షన్‌లూ కన్నడంలోకి మారిపోయాయి. రాజ్యాంగ విషయాలు అంతగా తెలియని మా నాయనలాంటివారు కొన్ని సంవత్సరాలు తెలుగు బడిని నడిపి, భారమై పదేళ్ళతరువాత మానివేశారు. 3/4 ఏళ్ళల్లో అక్కడ ఉద్యోగరీత్యా పాతుకుపోయిన కన్నడ భాషల వారు తమవంతు కృషిని చేసి స్కూళ్ళన్నీ ఇంచుమించుగా తెలుగు బోధనను మాన్పించివేశారు. మరిక ప్రైవేటురంగంలోని స్కూళ్ళు

ఇంచుమించుగా మన తెలుగు వాళ్ళ యాజమాన్యంలోనివి కేవలం ఇంగ్లీషు మీడియం చదువు చెబుతూ, కన్నడని మాత్రమే బోధిస్తూ తెలుక్కసలు స్థానమే లేకుండా చేశారు. తెలుగు మాట్లాడే వారికి ఒక వారంలో రెండు గంటలు కేటాయించి బోధిస్తే రాబోయే తరాల్లోకూడా తెలుగు వారు తెలుగువారై వుంటారు. లేదా సమీప కాలంలో బళ్లారిలో తుడిచిపెట్టుకు పోతుందన్నది, మాదుగ్ధ. "అలా పెడితే ఎవరూ రారండి. ఇప్పుడే చదువుభారం తడిసి మోపెడవుతూంటే ఇదికూడానా?" అంటున్నారు విద్యార్థులు అని అన్నాడొక నిర్వాహకుడు.

చాలమందిని కదిపి చూస్తే చాలా వరకు "ఏదైతేం ఏం లేప్పా, తెలుగులో చదివితే ప్రభుత్యోగాలు రావంటున్నారు మరి. తెలుగో, కన్నడమో బళ్ళోనే కదా. ఇంట్లో ఎలాగూ వుండనే వుంటుంది. తెలుగు సినిమాలే చూస్తాం" అంటారందరూ. పైగా కన్నడం నిర్భంధ విద్యగా మారింది. వెనుకటి (50 ఏళ్ళ క్రింద) సంగతికీ, ఇప్పటి పరిస్థితికీ పోలిస్తే అజ-గజాంతరం తేడావుంది. అప్పుడయితే బాగా ఏ ధనవంతులో తప్ప బహుభాగం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు కొనేవారు. ఇప్పుడయితే ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని కాన్వెంటు స్కూళ్ళోనే చదివించాలని చూస్తున్నారు.

ఈ నాటి పోటీ ప్రపంచంలో. ఇప్పట్లో ప్రత్యామ్నాయం లేని దుస్థితి. అల్పభాషీయులకు గల సౌలభ్యాలేవీ మాకు (అప్పట్లో) తెలియదు. అందుకే తెలుగు వాళ్ళు 80% తెలుగును, మానుకొంటున్నారు. కన్నడ బాష చాపక్రింద నీరులా వ్యాపిస్తోంది. వెనుకటికి తెలుగు మాత్రమే (చదువుకోక) మాట్లాడే అందరూ కూడ ఏదో ఒకటి చేసి ఇంగ్లీషు మాధ్యమంలో చదవటం దానితోబాటు రాజభాష అయిన కన్నడం తప్పనిసరిగా చదువు కోవలసిన స్థితిలో ఎవ్వరూ ఏమీచేయలేక తెలుగును ప్రక్కకు త్రోసివేశారు.

ఇది కాకుండా తెలుగు మాట్లాడే ప్రజలు మన రాష్ట్రం చుట్టూతా (తమిళనాడు- 40%, కర్ణాటక 25%, మహారాష్ట్ర- 15%, ఒడిస్సా - 25%) ఇలా వుండటంలో ఇక్కడి ప్రభుత్వం ఏ సాయమూ రాష్ట్రేతరాంధ్రులకి చేయలేకుండా అయింది. ఈ రాష్ట్రంలో వున్నవాళ్ళమే మనస్వార్థం కోసం, పదవులకోసం వెంపర్లాటలో రాష్ట్రంలోనే తన్నుకు చస్తూవుంటే ఇహ బయట రాష్ట్రాల తెలుగువారిని ఎలాగమనించగలం?

20 యవ శతాబ్దం వరకూ కూడ తెలుగుసాహిత్య నిర్మాణంలో బళ్ళారి ఓ వెలుగు వెలిగింది. నాటకాలయితే అత్యున్నత స్థానం లభించేది. సుమారు 1960 సుమారుగా కూడ బళ్ళారిలో అన్నిచోట్లా తెలుగే వినపడేది. తెలుగు నాటకరంగంలో ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులూ, ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడు కోలాచలం శ్రీనివాసరావు, ఇంకా ఆంధ్రుల తరఫున లండన్‌లో జరిగిన కాంగ్రెసు సభలో కోలాచలం వేంకటరావు పాల్గొన్నారు. ఇహ రాఘవ గురించి ఏం చెప్పగలం? ఆ నాటి కళా ప్రపూర్ణునికి సమవుజ్జీ ఉండడు సరే! ఉంటాడని ఆలోచనైనా చేయగలమా? రావాడ వెంకటరామశాస్త్రి, రూపనగుడి నారాయణరావు, కప్పగల్లు సంజీవమూర్తుల్లాంటి, సాహిత్య సింధువులు, ముఖ్యంగా భాస్కర పంతుల రామచంద్రస్వామి పండిత ధర్మవరం గోపాలాచార్యులూ మున్నగువారు నాటక రచనలో నటనలో, వీరందరి తరువాత రెండో స్థానం కోసమే చూసుకోవలసి వచ్చేది.

తెలుగులో మొట్టమొదటి పత్రిక సత్యదూత పేరుతో బళ్ళారి నుంచే వెలువడేది. కన్నడ భాషలో ఇంత ఉధృతంగా సాహిత్యం ఎప్పుడూ వెలువడింది లేదు. ఆలోచించండి. సుమారు రెండు లక్షల ఓటర్లలో 1285 సుమారు 1 శాతం కన్నా బాగా తక్కువ శాతం తేడాతో మేం మా భాషను గూర్చిన అన్ని హక్కుల్నీ కోల్పోయాము. పూవులమ్మినచోట కట్టెలమ్మలేకనో ఏమో ప్రభుత్వాధికారులు బళ్ళారి వదిలిపెట్టి తెలుగు రాష్ట్రంలోకి చేరుకొన్నారు. (ఈ వ్యాసకర్తకూడా ఆ స్థితిలోనే ఇక్కడికి చేరుకొన్నాడు).

నెమ్మదిగా చాపకింద నీరులా వస్తున్న కన్నడభాష ఝంఝులా రూపుదిద్దుకొని ఉరకలెత్తుతోంది. మాకుగల అవకాశాలు, మా మాతృభాషలో చదువుకొనేవీలులేదు. రాష్ట్రంలో ఈనాడు సుమారు 9 కోట్ల తెలుగు ప్రజలుండగా 7 కోట్ల జనం బయట వుండి ఆయా రాష్ట్రాల అధికార భాషలోనే చదువుకోవాల్సి వస్తోంది. లేకపోతే ఉద్యోగ విషయంగా సందేహాలు తలెత్తుతాయి. అందుకే జవసత్వాలు పూర్తిగా నశించిన తీరులో జడత్వం ఆవరించినట్లు స్రుక్కిపోయిన తెలుగుతనం నెమ్మదిగా కన్నడం ఆవరించుకొంటూంటే నిలువుకన్నులేసుకొని చూస్తూ నోర్లు పెగలక మౌనంగా వుండిపోయాం.

కేవలం 1 శాతంకన్నా తక్కువ (0.65%) తేడాతో ఎక్కువున్నవారికి మేమంతా తలవొగ్గవలసిందే నా? స్వతంత్ర భారతదేశంలో ఇంతగా మా హక్కుల్ని కోల్పోయామా?

బళ్ళారిని ఈ విధంగా పోగొట్టుకోవడంలో మరి ముప్పురి పాత్రవుంది. మొదటి వారు నీలం సంజీవరెడ్డి, బళ్ళారి వాడైనా హోలహర్వి సీతారామరెడ్డి (మద్రాసు ప్రభుత్వంలో మంత్రిగా వున్నవ్యక్తి) తో అంతగా సరిపోయేది కాదుట. అందుకని ఆయన బళ్ళారి కూడ ఆంధ్రలో కలిస్తే తనకంతగా ప్రాధాన్యత వుండదని తలచి బళ్ళారి బదులుగా కోలారును కోరుకున్నారట! జరిగిందేమో, అవ్వాపాయే-బువ్వాపాయె.

రెండవ వ్యక్తి బెజవాడ గోపాలరెడ్డి. ఆ నాటి గృహశాఖామంత్రి గోవింద వల్లభ పంత్ వద్ద పి.ఏగా వున్న కృష్ణమూర్తిరావు అనే మధ్వ కన్నడ బ్రాహ్మణులో కరువుండి. ఆయన ప్రేరణవల్ల బళ్ళారి రాయచూరుల్ని కర్ణాటకంలో (నాడు మైసూరు) కలపడానికి రంగం సిద్ధమౌతుందని తెలుసుకొన్న బూర్గుల రామకృష్ణారావు (అనాడు నైజాంలో ముఖ్యమంత్రి) సంజీవ, గోపాలుర్ని ఢిల్లీకి రమ్మని చెప్పి, ఆపైన కలిసికట్టుగా వెళ్ళి నెహ్రూగారిని కలిసి వెళ్ళి కర్ణాటకలో కలవకుండా ఆపుదాం అన్నారట. సంజీవరెడ్డి మరేదో పనికోసం వచ్చి ఢిల్లీలోనే వున్నారట. ఢిల్లీ చేరకముందే బూర్గుల వారికి విపరీతంగా జ్వరం పట్టుకుందట 103^0 జ్వరంతో కదలకుండా పడిపోయారట. బూర్గుల వారు వీరినిద్దరినీ వెళ్ళమన్నారట. మీరులేకపోతే నేను రాలేనని సంజీవరెడ్డి తమ అశక్తతను బయట పెట్టారట. గోపాలరెడ్డిని, బూర్గులవారు కనీసం మీరయినా వెళ్ళి వాళ్ళకు అభ్యంతరం తెలిపి రమ్మన్నారట. అదీ కుదరలేదు. బెజవాడ గోపాలరెడ్డి గారు (రాజాజీ బృందంవారు) వెళ్ళలేక పోయారట. చివరికి రెండింట మనకేదీ దక్కలేదని తేలిపోయింది.

పరోక్షంగా మన బళ్ళారి జారిపోవడానికి కట్టమంచి రామలింగారెడ్డిగారు కూడ కారణమయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీని ఏర్పాటు చేశాక బెజవాడ కేంద్రంగా పని ప్రారంభింది ప్రభుత్వం. అప్పుడు అంతకు ముందు మద్రాసు యూనివర్శిటీకి చెందిన అనేక ప్రాంతాలవారు ఆంధ్రయూనివర్శిటికీ చేరిపోయారట బళ్ళారితో సహా. ఇంతలో ఆ మహానుభావుడు వి.సి.గా వున్న కట్టమంచి, యూనివర్శిటీ కేంద్రాన్ని, వాతావరణం దృష్ట్యా అనుకూలంగా వుంటుందని, విశాఖపట్టణానికి మార్చటం జరిగింది. అప్పుడు అంతవరకూ ఆంధ్రయూనివర్సిటీలో చేరిన వారు, విశాఖపట్టణం తమకు చాల దూరమని మళ్ళీ మద్రాసుకు అంటుకుపోయారట. రాష్ట్రాల ఏర్పాటు వేళ బళ్ళారి ఆంధ్రయూనివర్సిటీలో వుండి వుంటే అది సహజంగానే ఆంధ్ర రాష్ట్ర పరిధిలో వుండేది అని తెలిసింది.

ఇప్పటికీ రాయలసీమలోని వారితో బళ్ళారి అనేక విధాలుగా వాణిజ్యరీత్యానైతేనేమి సాంఘికంగానైతేనేమి బళ్ళారి, కడప కర్నూలు అనంతపురాలతోనే బాగా కలిసివుంది. తెలుగు తెలియని కన్నడిగుల్ని అక్కడికి చేరవేయటం మూలాన్ని కన్నడ ప్రభావం పెరిగింది. దీనికి కారణం ఇంచుమించు ఆ ప్రాంతం అంతా మొదట్లో బళ్ళారి జిల్లాకు చేరినవవడం. అనేక విధాల బళ్ళారి వారికీ, రాయలసీమలోని మిగతా జిల్లాల వారికి పరస్పరాను బంధాలు ఎక్కువ. సంస్కృతీపరంగా చూసినా ఇంచు మించుగా అంతా ఒక్కటే

చారిత్రకంగా చూస్తే హండే హనుమప్ప అనే ఒక బోయనాయకుని పాలనలో (బీజాపురము వారికి సామంతుడుగా) వుంటూ వాళ్ళకుటుంబం వారే చానాళ్ళు పాలించారు. క్రీ.శ. 1800 సుమారుగా నిజాం చేతుల నుంచి ఇంగ్లీషు వారు దత్తమండలాలలో భాగంగా బళ్ళారి చేరిపోయాక దాన్ని వారు తమ పరిపాలనా కేంద్రంగా మలచుకోవడం జరిగింది. అప్పట్నుంచి బళ్ళారి ప్రాముఖ్యత బాగా పెరిగింది.

ఇలా తుంగభద్రా నదిలో ఎంతో జలసంపద జారిపోగా చిన్నపాటి కుతంత్రం వల్ల అసహజంగా కర్ణాటకలో చేరిపోయింది మరి. మరి ఈ ప్రాంతపు తెలుగువాళ్ళు ఇలా వుండవలసిందే నా? దీనికేమయినా పరిష్కారం వుందా? అంటే ఇలా చేస్తే ఎలా వుంటుంది?

ఇది చాలా రోజుల్నించీ మధనం చేయగా తేలిన ఫలితం. రాయలవారి ఏలుబడిలో తెలుగు ప్రాంతాలుగా గుర్తింపబడిన కృష్ణగిరి నుండి బీదరు వరకూ ఒక రాష్ట్రంగా ఏర్పడాలి. బళ్ళారి మధ్యభాగంగా వస్తుంది కాబట్టి అది రాజధానిగా రాయలసీమ రూపుదిద్దుకోవాలి. తెలుగూ, కన్నడమూ కూడా అధికార భాషలుగా వుంటే సామరస్యం ఏర్పడి ఈ ప్రాంతమంతా బాగా అభివృద్ధి చెందే అవకాశం

వుంది. భాష ఒక్కటే ఆ భాషీయుల్ని బంధించగలదు అన్నది అసాధ్యం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్థితి కళ్ళకు కట్టినట్లుగా చూపుతోంది. తెలుగు, కన్నడాలు రెండు లిపులూ ఏకమై ఏకలిపిగా ఏర్పడితే బంధం మరింత చిక్కనౌతుంది. ఈ నాడిలా వున్న పరిస్థితిలో ఇంతకన్న పరిహారం మరేదీ నాకు తోచడం లేదు. సుమారుగా 14 జిల్లాలతో ఏర్పడిన రాష్ట్రం నిశ్చయంగా అభివృద్ధిసాలులోకి చేరుకొంటుంది. దీనికి కొంత ఔదార్యం, విశాల హృదయం అవసర మౌతుంది. తద్వారా అనేక క్లిష్ట సమస్యలు సులభంగా పరిష్కారమౌతాయి.

దయచేసి ఈ విధంగా ఆలోచించి చూడండి. ఈ నాడున్న పోటీ యుగంలో ఇది సాధ్యమేనా అనిపించడం సహజమే. కర్ణాటకంలో తెలుగు మిగలాలంటే ఈ మూడింట ఏదో ఒకటిగానీ, సమిష్టిగా గాని అమలు చేయాలి.

మొదటిది : తెలుగు, కన్నడాల ఏకలిపి. నిజానికిది ఇప్పటికే తయారై ఉపయోగానికి సిద్ధంగావుంది. తంగిరాల సుబ్బారావు బెంగుళూరు వి.విలో తెలుగు శాఖాధిపతిగా వున్న వారు. ప్రొఫెసర్ చిదానంద మూర్తి ప్రముఖ కన్నడ సాహితీవేత్త అప్పటి ప్రభుత్వం పూనికతో ఏకలిపి తయారు చేశారు. కొన్ని తేడాల వల్ల మాకు తెలుగు రాదండీ అనేమాట పోయి అక్షరాలు చక్కగా చదువ గలం కనుక భాష నిత్య వ్యవహారంలో ఉంటుంది కనుక తెలుగును కన్నడిగులూ, కన్నడాన్ని తెలుగువారూ సులభంగా నేర్చుకొనే అవకాశం ఏర్పడుతుంది. ఏ మాత్రం ఎక్కువ శ్రమ లేకుండా రెండు భాషలూ పరోక్షమార్గంలో బలాన్ని పుంజుకొంటాయి.

రెండవది : ఆయా రాష్ట్రాల అధికార భాషకు గల సౌకర్యాలు, అవకాశం మేర కల్పించటం. ఇది సాధ్యమే కానీ కాస్త శ్రమ పడాల్సి వుంటుంది.

మూడవది : కేంద్ర ప్రభుత్వంలో తెలుగును సంఖ్యాపరంగా చూస్తే రెండవ స్థానంలో వుంది కనుక తెలుగును రెండవ అధికార భాషగా ప్రకటించాలి. దాని వలన ఎక్కడున్నవారయినా తెలుగు చదువుకోగలుతారు. ఇవే మీ వెంటనే తలపెట్టకపోతే చదువు హెచ్చిన కొద్దీ, తెలుగు వాళ్ళు తరిగిపోతారు, మాయమౌతారు.

గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి
విశ్రాంత ఇంజనీరు,
తెలుగు, కన్నడ భాషా ప్రవీణులు,
హైద్రాబాదు. ఫోన్ : 9177945559

డి.వి. సుబ్బారావు గారికి (ప్రఖ్యాత నటులు) సన్మానం గజారోహణ.
బళ్లారి రాఘవగారు వారి ఇంటికి వెళ్లి ఆయన ముందు
ఠీవిగా నిలుచున్నారు.
వరండాలో కూర్చున్న డి.వి.గారు వారిని చూచి వారి
కాళ్లమీద పడి "మీరు మా యింటికి రావటమా?
ఇంతకంటె సన్మానం నాకు వద్దు.
నేను ఏనుగును ఎక్కను" అని మొండికేశారు.
వారిరువురూ ఆలింగనం చేసుకున్నారు.
తరువాత నచ్చజెప్పి వారిని ఏనుగు మీద ఎక్కించారు.

బళ్లారి రాఘవ

చందు మీనన్

ఇందులేఖ

మళయాళ భాషలో 19వ శతాబ్దంలో వచ్చిన నవలా విశ్లేషణ

– మిసిమి డెస్క్

మళయాళ భాషలో మొదటి నవల 1858వ సంవత్సరంలో ప్రచురించబడింది. ఆ క్రమంలో ఇందులేఖ అయిదవ నవల. మొదటి మూడు నవలలు అనువాదాలు. నాల్గవ నవల పౌరాణికమైనది. ఇందులేఖ మొట్టమొదటి స్వతంత్ర, సాంఘిక, కాల్పనిక నవల.

ఇందులేఖ రచయితయిన చందు మీనన్ 9-1-1847 లో మలబారులో జన్మించారు. సాంప్రదాయానుసారమైతే అతని పేరు చిట్టెఝూట్ చందు మీనన్ అయివుండేది. తండ్రి ఆంగ్ల ప్రభుత్వంలో న్యాయశాఖలో ఉద్యోగి. తల్లస్సెరి తహసిల్దారుగా ప్రభుత్వం అతన్ని బదిలీ చేయటంతో భార్యా పిల్లలతో అతను అక్కడే ఉన్నాడు. ఉద్యోగ రీత్యా అతని కుటుంబం మాతృస్వామ్యానికి బదులు, పితృస్వామ్యాన్ని అనుసరించవలసి వచ్చింది.

చందు మీనన్, తండ్రి మరణానంతరం ప్రభుత్వ ఉద్యోగిగా నియామకం పొంది 1871లో కాలికట్ సచివాలయంలో ఉద్యోగిగాను 1872 కాలికట్ సివిల్ కోర్టులో హెడ్ క్లర్క్‌గా ఉద్యోగం చేశాడు. జూన్ 1889వ సంవత్సరంలో ఇందులేఖ నవల మొదలు పెట్టి రెండు మాసాల్లో పూర్తి చేశాడు. 7-9-1899లో మరణించాడు. ఈ నవల ఇంచుమించుగా వీరేశలింగంగారు వ్రాసిన రాజశేఖర చరిత్రకు సమకాలీనము. ఇందులో అప్పటి వాస్తవ మళయాళీల జీవన విధానం ఎంతో సహజంగా చిత్రించబడింది.

ఈ నవలాకాలం 1868వ సంవత్సరం. ఇది మాధవన్ అనే ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఒక వ్యక్తికి, అంతకంటే మరింత ప్రతిభావంతురాలైన ఇందులేఖ మధ్య జరిగిన ప్రేమ, అపోహల సారాంశమే ప్రధాన ఇతివృత్తం. దీని నేపథ్యంలో ఆనాటి సాంఘిక జీవన విధానం ఎంతో సహజంగా చిత్రించబడింది.

ఇందులేఖ, కిలిమనూరు రాజవంశానికి చెందిన రాజా రవివర్మ ఆ అమ్మాయి తండ్రి. రెండున్నర సంవత్సరాల వయస్సులో తండ్రి పరమపదించటంతో పెద్ద మేనమామ కూచు కృష్ణమీనన్ ఆమెను తనతో మద్రాసు తీసుకువెళ్ళి, ఆంగ్లం, సంస్కృతం, మళయాళ భాషలు నేర్పించటమే కాక, పియానో, వయొలిన్, వీణ వంటి సంగీత పరికరాలపై సాధన చేయించాడు. మేనమామ కూచు కృష్ణమీనన్ మరణించటంతో ఇందులేఖ తల్లైన లక్ష్మీకుట్టి, తాతైన పంచు మీనన్‌తో పూవరంగ్‌లో ఉంటున్నది. చదువు సంధ్యలు పూర్తి చేసి మానసిక పరిపక్వత వచ్చిన తరువాత ఇందులేఖ తనకు నచ్చిన వాడిని వరించాలని ఆ కుటుంబ కోరిక. ఆమె మేధోపరంగా తన కాలంకంటె ఎంతో ముందున్నది.

మద్రాసులో లా చదివిన మాధవన్ (వరసకు బావ) చిన్నవయసు నుండే ఇందులేఖను ప్రేమిస్తూ ఉంటాడు. ఇందులేఖ కూడా అతన్ని ప్రేమించినా ఏనాడూ బయటపడదు. మాధవన్ తల్లి పార్వతి కుట్టియమ్మ, తండ్రి గోవింద ఴణిక్కర్. పంచు మీనన్ ఇందులేఖ మాతామహుడు. ఇతను తరవాద్ నిర్వహణదారు కరణవన్. ఒక విషయంలో పంచు మీనన్‌కు, మాధవన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు రావటంతో పంచు మీనన్ ఇందులేఖకు ధనిక సంబంధమైతే బావుంటుందని అదికూడ ఆమె అంగీకారంతోనే చేయాలని ఉబలాటపడటమే కాక తన ఇష్ట దేవతపై ఒట్టు వేసుకుంటాడు. అతను "నా బిడ్డకు పట్టే అదృష్టం ఇంతకన్నా వేరే ఏముంటుంది? ఆడవారు పచ్చగా ఉంటే వారు వారి తర్వాద్‌లను కూడా పచ్చగా ఉంచగలుగుతారు. కనుక స్త్రీ ఎప్పుడూ మంచివాడినే – అంటే బాగా డబ్బున్న వాడినే భర్తగా చేసుకోవాలి" అని అంటాడు. ఇందుకు గాను సూరి నంబూద్రిపాద్ అనే నలభైఅయిదు సంవత్సరాల వయసు ఉన్న ఒక ధనికుడికి ఇందులేఖను ఇచ్చి చేయాలనుకుంటాడు. సూరి ఇంతవరకూ

వివాహం కాకపోయినా అతనికి లెక్కకుమించి స్త్రీ సాంగత్యాలు వున్నాయి. మొదటిసారిగా ఇందులేఖను చూసినప్పుడు ఆమె అందానికి మైమరుస్తాడు. అలానే ఆమె తల్లయిన లక్ష్మీమీనన్‌ను చూసిన వెంటనే మరులుగొన్న వావివరుసలు లేని భ్రష్టుడు. ఈ నవల ఆద్యంతం అతను డబ్బు కలిగి ఉండి ఎందుకూ పనికిరాని శుంఠగా, మూఢునిగా చిత్రించబడ్డాడు. పదివేళ్ళకు పది ఉంగరాలు ధరించి జరీ బట్టలు వేసుకుని అదే గొప్ప జీవితం అనే ప్రదర్శనా పటాటోపం మినహా అతనిలో చెప్పుకోదగ్గ మరే గుణాలు కనించవు. ఇందులేఖ అతనితో సంబంధానికి నిరాకరించటంతో అదే రోజు పనిచేసేవాని కుమార్తె సంబంధం కుదుర్చుకొని వరువుపోకుండా తాను ఇందులేఖను పెళ్ళి చేసుకొని తీసుకువెళ్తున్నానని అందరితో అబద్ధాలు చెప్పి మేనాకు తెరలు వేసి తీసుకుపోతాడు. అప్పుడే మద్రాసు నుంచి వస్తున్న మాధవన్ ఆ అబద్ధాన్ని నమ్మి ఇంటికి రాకుండా దేశాటనకు వెళ్తాడు. రచయిత చాలాచోట్ల నాటకంలానే సంభాషణలతోనే నవలను నడిపిస్తాడు. ఇందులో ముఖ్యమైనది ఇందు, మాధవన్‌ల మధ్య జరిగిన ఈ సంభాషణ.

నంబూద్రి యువకుడు

మాధవన్ తన మాటలలో...

మళయాళంలో మాట్లాడుకునే ఈ భూమ్మీద, పురుషుల్ని ఏడిపించే స్వేచ్ఛ, అవకాశం స్త్రీలకు కావలసినంత!

అంటే ... అలా అనిగాదు. దేశంలో మిగిలిన ప్రాంతాల్లోలాగ మన ప్రాంతంలో స్త్రీలు తమ భర్తలతో నిజాయితీతో వ్యవహరించరు. తమ ఇష్టానికి భర్తల్ని మార్చేసుకుంటారు. వీరు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిధి మిగిలిన ప్రాంతాల్లో వారికున్న దానికంటే ఎక్కువ కనుక కాస్త పొగరుగా ఉంటారు అని వెళ్లబుచ్చుతాడు.

దానికి ఇందులేఖ సమాధానంగా "మళయాళ స్త్రీలపట్ల నీ అభిప్రాయం ఇదన్నమాట! బాగా చదువుకున్నవాడివి. ఎంతో తెలిసిన వాడివి. అటువంటి నువ్వే ఇలా మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా ఉంది. కాస్త తెలివి, ఇంగితం ఉన్న ఏ మళయాళ స్త్రీ అయినా దీన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తుంది. ఏమిటన్నావ్? మళయాళ స్త్రీలు తమ మొగుళ్ళతో నిజాయితీగా ఉండరనా? ఘోరం, దారుణం! దేశంలోని మిగతా ప్రాంతాల్లోని ఆడవారి లాగే, మళయాళ స్త్రీలు– ఎక్కువమంది – తిరుగుబోతులేనా? నే నొప్పుకోను. ఇక్కడని కాదు. రంకు ఎక్కడైనా ఉండొచ్చు. దీనికి – జాతి, మతాలకు సంబంధం లేదు. ఐనా నంబూద్రి స్త్రీల వలె, చదువు సంధ్యలేక, పరాయి వారితో మాట్లాడటానికి కూడా వీలుగాక, కూపస్థ మండూకాల్లాగా, బయట ప్రపంచంతో సంబంధం లేకుండా మృగప్రాయులమై లేము గనక, కేరళలోని అందమైన స్త్రీలు సరదాగా ఉన్నట్లనిపిస్తే, వారు తిరుగుబోతులనే తప్పుడు అభిప్రాయం చాలామందికి అభిప్రాయం ఉంది." అంటూ సమాధానం చెప్పింది.

"అంతేకాక మళయాళపు ప్రాంతంలో మా స్త్రీజాతికున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మమ్మభినందించాలి. ఇటువంటి స్వేచ్ఛ ఐరోపాలో కూడా లేదు. ఐరోపా, అమెరికాల్లోని కొందరు గొప్పవారు, మేధావులు తమ దేశాల్లో స్త్రీలక్కూడా ఇలాంటి స్వేచ్ఛ కోరుకుంటున్నట్లు చదివాను. యూరపులో గాని, ఇండియాలోగాని సంసార బంధంలో చిక్కి, ఇమడలేక, బయటపడే స్వేచ్ఛ లేక దుఃఖపడుతూనే బలవంతంమీద విధిలేక – సంసారాన్ని సాగదీస్తున్న స్త్రీ పురుషులు ఎందరో! దుర్వినియోగం చెయ్యకుండా, అవసరమైన చోట, తప్పని పరిస్థితుల్లో ఈ స్వేచ్ఛని వాడుకుంటే దానివల్ల మంచే జరుగుతుంది. అసలామాటకొస్తే స్వేచ్ఛ ఉండి కూడా ఎంతమంది భార్యలు తమ భర్తలనొదిలేస్తున్నారు? అలాగే భార్యల నొదిలేస్తున్న భర్తలెందరు? సరైన లెక్కలు తీయగలిగితే, గత పది సంవత్సరాలుగా వెయ్యిమందిలో ఒక్కరు కంటె ఉండరు. ఎక్కడన్నా చెదురుగా విడిపోతే, దానిక్కూడా బలమైన కారణమేదో ఉండే ఉంటుంది. అంతేగాని, ఊరికే ధిక్కార ధోరణితో, కావాలని తెగ్గొట్టుకునే భర్తగాని, భార్య గాని ఉండటమనేది చాలా అరుదు."

ఈ సంభాషణ ద్వారా ఇందులేఖ మానసిక పరిపక్వత పాఠకులు తెలుసుకోగలుగుతారు.

నాటి సాంఘిక పరిస్థితులు :

నంబూద్రిలు : వీరు బ్రాహ్మణులు. భూస్వాములు. ప్రధాన వృత్తి పౌరోహిత్యం. నంబూద్రిపాడ్‌లు, నంబూద్రిల కంటె సాంఘికంగా పైస్థాయి వారు. ఆచారం ప్రకారం నంబూద్రి కుటుంబ సంతానంలో పెద్దవాడు మాత్రమే నంబూద్రి అమ్మాయిని పెళ్ళి చేసుకోవటానికి అర్హుడు. ఈ పెళ్ళినే 'వేలి' అంటారు. మిగిలిన సంతానం (మగ పిల్లలు) నాయర్ల అమ్మాయిలతో సంబంధం పెట్టుకుంటారు. దీన్ని

'సంబంధం' అనే అంటారు. వీరిలో బహు భార్యాత్వం ఉన్నది. అంటే నంబూద్రి అబ్బాయి ఎంతమంది అమ్మాయిల తోనైనా సంబంధం పెట్టుకోవచ్చును. నంబూద్రిలది పితృ స్వామ్యం. నర్మద, కృష్ణ, కావేరి నదీపరీవాహక ప్రాంతాల నుంచి వచ్చిన బ్రాహ్మణులు వెయ్యి సంవత్సరాల క్రితం కేరళ ప్రాంతానికి కాందిశీకులుగా వచ్చి నంబూద్రిలుగా పిలువబడుతున్నారు.

ఇందులేఖ లోని ప్రధాన పాత్రలు నాటి మలబార్, ట్రావన్‌కోరు (నేటి కేరళ) ప్రాంతాలకు చెందిన నంబూద్రి, నాయర్ కులాలకు చెందిన వారు.

నాయర్లు : వీరు శూద్రులు. పోరాటపటిమ గలవారు. వీరికి వ్యవసాయ భూములున్నాయి. వ్యవసాయమే వీరి ప్రధాన వృత్తి. వీరి ఉమ్మడి కుటుంబాన్ని తరవాద్ అంటారు. సోదరి సంతానానికి సంబంధించిన మరుమక్కతాయం అనే వారసత్వపు చట్టానికి లోబడి తరవాద్ నిర్వహణ ఉంటుంది. నాయర్లది మాతృస్వామ్య వ్యవస్థ. తరవాద్ ఆస్తిపాస్తులు అవిభాజ్యం. తరవాద్ సభ్యులైన స్త్రీలందరికీ ఆస్తిపై హక్కు ఉంటుంది. తరవాద్‌కు చెందిన ఆస్తిని దాన ధర్మాల క్రింద ఇవ్వాలన్నా, అమ్మాలన్నా – అది స్త్రీలందరి ఉమ్మడి ఆస్తి కనుక వారందరి అంగీకారం అవసరం. వారిది ఉమ్మడి కుటుంబమే కాదు; వారి నివాసం కూడా ఒక ఇంట్లోనే.

నాలుకెట్టు లేదా ఎట్టుకెట్టు అనే కట్టడమే వారి ఆవాసము. నాలుకెట్టుకు మధ్య చతుర్భుజాకారంలో ఆవరణ. ఆ ఆవరణచుట్టూ వరండా (పంచ); పంచలో నుండి గదుల్లోకి వాకిళ్ళు. ఎట్టుకెట్టు అయితే చతుర్భుజాకారం ఆవరణలు రెండు ఉంటాయి. పైన (మేడ) ఉండే గదులు ఎక్కువగా ఆడవారికే కేటాయించబడతాయి.

తరవాద్ నిర్వహణ, ఆస్తిపాస్తుల వ్యవహారం, జమాఖర్చులు మొదలైనవన్నీ నిర్వహించవలసిన వాడు కరణవన్. తరవాద్‌లో అందరికంటె పెద్దవాడు ఇతనే. ఇతని కంటె చిన్నవారిని (పురుషులను) ఆనన్తరవన్నుగా వ్యవహరిస్తారు. తిండి, బట్ట, తైలం ఇంకా ఇతర కనీస నిత్యావసరాలకు ఉమ్మడి ఆదాయాన్నే వెచ్చిస్తారు. తరవాద్‌లోని ఒక్కో ఆడపడుచు కుటుంబం ఒక్కో 'తవజ్జి'. ఈ తవజ్జీలన్నీ తరవాద్‌కు శాఖలే.

19వ శతాబ్దంలో నాయర్ తరవాద్‌కు చెందిన ఆడపిల్లలకు సంబంధించి 'తాళికెట్టు కళ్యాణము' అనే ఆచారము అమల్లో ఉండేది. రజస్వల అయిన ఆడపిల్ల తనకు నచ్చినవాడితో సంబంధం పెట్టుకునే వీలు ఈ ఆచారం కల్పిస్తుంది. తాళికెట్టు కళ్యాణములో ఇప్పటి పెళ్ళిళ్ళలో లాగా విందులు, వినోదాలు ఉండేవి కావు. అది చాలా సాదాసీదాగా జరిగిపోతుంది. సంబంధం నాయర్‌తోగాని, నంబూద్రితోగాని పెట్టుకోవచ్చు. కళ్యాణంతో, ఆ అమ్మాయికి ఇష్టమైతే అతన్నే వరుడిగా పరిగణించ వచ్చు. సంబంధానికి గుర్తుగా అబ్బాయి ఆ అమ్మాయికి ఇవ్వవలసిన వస్త్ర విశేషాన్ని 'పుడవ' లేదా 'పొడముర' అని వ్యవహరిస్తారు. సంబంధం ఏర్పడ్డ తరవాత కూడా అతను తల్లికి చెందిన తరవాద్ సభ్యుడే. అక్కడే ఉంటాడు. సంబంధం ఏర్పడ్డ అమ్మాయికోసం రావచ్చు, పోవచ్చు. అంతవరకే గాని, అతనికక్కడ భోజనాది సదుపాయాలు ఉండవు. వీరిద్దరికీ ముఖ్యంగా అమ్మాయికి ఇష్టం లేకపోతే సంబంధం వదులుకోవచ్చు. వేరే మరొకరితో సంబంధం పెట్టుకునే స్వేచ్ఛ ఇద్దరికీ ఉంటుంది. వారికి సంతానం కలిగితే, పిల్లల బాధ్యత గాని, హక్కుగాని అతనికి ఉండవు. సంతానానికి బంధమంతా తల్లితోనూ, ఆమె తరవాద్‌తోనూ మాత్రమే. కొన్ని సందర్భాలలో తండ్రి ఎవరో కూడా పిల్లలకు తెలియదు. తెలియ వలసిన అవసరమూ లేదు.

ఈ సంప్రదాయం ఇప్పటిది కాదు. క్రీ.శ. 12వ శతాబ్దం నుండీ ఆచరణలో ఉన్నది. నాయర్ ఆడపిల్లలు నాయర్లతోనేగాక నంబూద్రిలతో కూడా సంబంధాలు పెట్టుకోవటంవల్లనూ, 'మరుమక్క తాయం' వారసత్వపు చట్టం కారణంగా ఆస్తులు అవిభాజ్యం అవటం వల్లనూ,

ఎట్టు కెట్టు



నాయర్ స్త్రీల భోజనం

వీరి ఆస్తులు పెరిగి సమాజంలో వారు పై స్థాయికి ఎదిగారు. నిజానికి నాయర్లు గాని, నంబూద్రిలు గాని స్వయంగా వ్యవసాయం చేయకుండానే పెద్ద మొత్తాలలో ఫలసాయం పొందుతున్నారు.

19వ శతాబ్దంలో మలబారు ప్రాంతం ఆంగ్లేయుల పాలనలో ఉన్నది. చదువుకున్న నాయరు యువకులు ఆంగ్ల ప్రభుత్వోద్యోగులైనారు. ఉద్యోగించి సంపాదించిన సొత్తు తరవాద్ ఉమ్మడి ఆస్తులలో కలిపెయ్యటానికి వారు వ్యతిరేకులు. తరవాద్‌కు వెలుపల వారు సొంత ఆస్తులు సమకూర్చుకుంటున్నారు. అంతేగాక వీరు ఉద్యోగం చేస్తున్న చోట, ఈ దేశంలోని మిగిలిన ప్రాంతాల వారితో కలిసి పనిచేయటం వల్ల నాయర్ స్త్రీల సంబంధం వగైరాలు బహిర్గతమైయ్యాయి. దీనికి తోడు ఆంగ్లేయులు చేస్తున్న నీతి బోధలు! దానాదీనా నాయర్ పురుషులు వీటిని అవమానకరమనుకున్నారు. మరుమక్కతాయం, నాయర్ తండ్రికి తన పిల్లల బాధ్యతగాని వారిమీద హక్కుగాని లేకపోవటం, నాయర్ స్త్రీల లైంగిక పద్ధతులు, మొదలైనవన్నీ తలవంపులని ఉద్యోగాలు చేస్తున్న నాయర్లు భావించారు. ఇది చిలికి చిలికి గాలివానైనందున చివరకు చట్టంలో మార్పులు తేవాల్సి వచ్చింది.

ఇక కథలోకి వస్తే – చందుమీనన్ రచనాశిల్పం చాల నాటకీయంగా ఉంటుంది. సునిశితమైన హాస్యధోరణి కథనంలో అంతర్లీనంగా ప్రవహిస్తుంది.

చాత : వాణ్ణి ఆయన తీసుకెళ్లే సంగతి నాన్న మీకు చెప్పానన్నాడు.

పంచు : ఏ నాన్న? కొమట్టా?

చాత : నాన్న మీ అనుమతి తీసుకున్నాడని గోపాలన్ చెప్పాడు.

పంచు : "గోపాలన్‌కు కబురు పెట్టు" అని అరుస్తాడు. అది ఆజ్ఞగా తీసుకున్న చాతర్ మీనన్ గోపాలన్‌ను రప్పిస్తాడు.

పంచు : మీ నాన్న కొమట్టి నీకేం చెప్పాడ్రా?

గోపా : మా నాన్న కొమట్టి కాదు. పట్టర్

తలబిరుసు వెధవా అని మండిపడి అతని వీపు పగలగొట్టాడు.

ఎవరి తండ్రి ఎవరో పంచుమీనన్‌కు తెలియకపోవటం ఆశ్చర్యం కాదు.

అలాగే కన్నాఝి మూర్ఖిల్లత దేవిడీకి యజమాని సూరి నంబూద్రిపాద్. అతనిది ద్వితీయ స్థానమైనా పెత్తనం అతనిదే. అతని వయసు నలభైఅయిదు దాటి ఉంటుంది. ముదురు బ్రహ్మచారి. చీర కనిపిస్తే చాలు లుంగలు చుట్టుకు పోయే రకం. అనాకారి కాకపోయినా అందగాడు కాడు. డబ్బు కోసం అతని చుట్టూ చేరేవారు అతన్ని సర్వ సమర్థుడనే భ్రమలో పడవేస్తారు.

అతనితో సంబంధం ఉన్న స్త్రీలు అతన్ని మన్మథుడనే నమ్మించారు. ఇది కూడ డబ్బు మహిమే. సూరి నంబూద్రి భృత్యుడు చెరుసరి. అతని సలహా ఇతనికి వేదవాక్కు. ఈ సంభాషణ వినండి.

సూరి : నేను ఈ గౌను వేసుకుంటాను. ఇందులేఖను చూడాలి.

చెరు : గజం 95 రూ. మెరవదామరి. మీరదే వేసుకోవాలి.

సూరి : ఇందులేఖ చాయ ఎలాంటిది?

చెరు : బంగారు వర్ణం.

సూరి : నాకంటేనా?

చెరు : నన్నెందుకు అడుగుతారు. మీ చాయ, మీరంగు, మీకథ అంతా ప్రత్యేకమే!

సూరి : ఇందుగో చెరుసరీ, ఎగతాళి చేస్తున్నావు. ఇందులేఖ కంటే మంచి రంగులో ఉంటానా?

చెరు : మరీ విడ్డూరం, స్పష్టంగా కనిపించే విషయం గురించి మాట్లాడతారెందుకు.

ఈ విధంగా విషయము, హాస్యము కలగలిపి కథనం సాగుతుంది.

చక్కని ప్రేమ సన్నివేశాలు, విరహ సందర్భాలు ఎంతో సముచితంగా కథా సందర్భంలో చోటుచేసుకుంటాయి. మాధవన్, ఇందులేఖల విద్యాగంధం గుభాళిస్తుంటుంది. కాళిదాసు శాకుంతలంలో ఉన్న శ్లోకాలు వల్లెవేస్తుంటారు. ఉదాహరణకు :



అనన్తరవన్

శ్లో. యామినీ కామినీ కర్ణకుండలం చంద్రమండలం
మారనారాచ నిర్మాణ శాణ చక్రమిపోదితం

రాత్రి అనే స్త్రీ యొక్క చెవి కుండలాల లాంటి చంద్రమండలం మన్మథ బాణ నిర్మాణానికి ఉపయోగించే సాన చక్రము వలె ఉదయించినది.

అప్పటి సాంఘిక చరిత్ర ఈ నవలకు నేపథ్యమే కాకుండా ముఖ్యమైన కథాభాగం కూడా.

పంచుమీనన్ పళ్ళు మాత్రము తోముకొని స్నానశాల నుంచి బయటపడ్డాడు. కడుపులో ఎలుకలు పరుగెడుతుండగా మొహం వేలాడేసుకుని, ఇంటి ముందు వసారాలో కూర్చున్న కేశవన్ పక్కన చతికిలబడ్డాడు. 'ఇదేమిటి స్నానం చెయ్యకుండానే వచ్చారు?' అని కేశవన్ ఏడవలేని నవ్వొకటి నవ్వాడు.

పంచు : ఏం లేదు, ఇందాక చెప్పలేదు. మరొక్కమాట చెప్పాలి. నిన్న నీకు ఇందులేఖ సంగతి చెప్పాను. ఈ విషయంలో కేశవన్ నంబూద్రిగారికి నీముందే (గోవిందన్) మరొక మాట చెప్పాలి. ఇందులేఖను మాధవన్‌కు ఇవ్వనని మాత్రమే నేను ఒట్టు పెట్టుకున్నాను. అంతేగాని, సూరి నంబూద్రికి ఇస్తానని కాదు. అమ్మాయి ఇష్టపడితేనే, ఒప్పుకుంటేనే, సంబంధం. తనకు ఇష్టం లేకుండా బలవంతంగా ఏదీ జరగదు. సంబంధం కుదరక పోతే నా పూచి లేదు. అని ఆ అమాయక వృద్ధుడు ప్రశాంతంగా స్నానానికి వెళ్ళాడు.

సూరి నంబూద్రిపాద్ రాకతో మొదలయిన సందడి, హడావిడి మాటలలో చెప్పలేం. పల్లకీలు ఎనిమిది మంది బోయీలు, సరంజామా మోస్తున్న మరో ఆరుగురు, బరువులు మార్చుకునేందుకు మరికొందరు ఇదంతా యుద్ధ వాతావరణాన్ని తలపిస్తుంది. హే! హూ! హో! అని గొంతులు చించుకుని అరుస్తున్న హంగుదారులు దొరవారి రాకను ఎరుక పరుస్తున్నారు. వీరిని చూడ్డానికి పూవల్లి తరువాడ్‌లోను, పూరంగ్ ఇంటిలోను ఉన్న ఆడామగా, పిల్లాపీచు, ముసలీముతకా – ఇందులేఖ, గోవిందన్ కుట్టి మినహాయించి అందరూ ఒకరినొకరు తోసుకుంటూ నోళ్ళు వెళ్లబెట్టి ఊరేగింపును చూడ్డానికి వచ్చారు. స్త్రీ జనాభా ఎక్కువమంది మేడమీది గదుల్లోంచి, తమ మొహాలను కిటికీలకు ఆనించి మరీ చూస్తున్నారు.

ఆర్భాటంగా పల్లకీనుండి బయటకు దూకిన సూరి నంబూద్రిపాద్ సూర్యరశ్మిలో నిలువెల్లా బంగారపు పోగులతో, పదివేళ్ళకు బంగారపు ఉంగరాలతో, బంగారపు పై పంచతో, బంగారపు తొడుగులో ఒక బంగారపు విగ్రహంలాగ ఎండలో మెరిసిపోయాడు. ఆ మెరుపులకు జనం మాటా పలుకూ లేకుండా స్థాణువులైపోయారు. సూరి ఆశ ఎక్కడినుంచైనా ఇందులేఖ చూడకపోతుందా అని.

ఈ కథనంలో ఆశ్చర్యం, హాస్యం, అమాయకత్వం అన్నీ కలగలిసి ఉన్నాయి. సూరి నంబూద్రి, ఇందులేఖ సంభాషణ చూస్తే అతని పిరికితనం ఆమె మానసిక స్థైర్యం తెలియవస్తుంది.

పంచు మీనన్ మొదట్లో మాధవన్ మీద పెట్టిన ఒట్టుకు పందొమ్మిది అక్షరాలుంటాయి. చివరలో మాధవన్‌కు ఇందులేఖనిచ్చి వివాహం చేసేముందు పందొమ్మిది అక్షరాలకు పందొమ్మిది సార్లు ప్రాయశ్చిత్తం చేసుకుంటాడు.

చివరిలో అప్పటి స్వాతంత్ర్యోద్యమం, కాంగ్రెస్ ఆవిర్భావం, పాశ్చాత్య విద్యాప్రభావం, హేతు, నాస్తికవాద దృక్పథాల ప్రభావం ఇలా ఎన్నో విషయాలు గోవింద ఫణిక్కర్, మాధవన్, గోవిందన్ కుట్టిల మధ్య చర్చలు సంభాషణల ద్వారా ఎంతో విపులంగా తెలియ జేస్తారు రచయిత. ప్రభుత్వోద్యోగుల అలసత్వం, డబ్బు పరపతి ఉన్న వారికి సాగిలపడటం ఇవన్నీ అప్పుడూ, ఇప్పుడూ ఉన్నాయని తెలుస్తుంది.

తెలుగులో ఇటువంటి రచన ఆ కాలం నుంచి ఇప్పటి వరకు ఒక్కటైనా వచ్చినదా అని వెతకవలసిందే.

ఇంత మంచి నవలను నాసిరకం కాగితం మీద, వెలిసిపోయిన ముఖచిత్రంతో ప్రచురించటం ఎంత వరకు సబబు?

ఇందులేఖ నవల :
మళయాళం : చందుమీనన్
అనువాదం :
పాటిబండ్ల క్రాంతికుమార్
ఫోన్ : 9441265688

బ్రిటన్ నాటక రంగం

– చాట్ల శ్రీరాములు

ఇంగ్లాండులో నాటక ఆవిర్భావం మతపరమైన ఆరాధనల నుంచి జరిగింది. క్రీ.శ. పదవ శతాబ్దంలో ఈస్టర్ సందర్భంగా నాలుగు పంక్తులు నాటకీకరణ చేయడం జరిగింది. క్రీస్తు సమాధిని పరిరక్షిస్తున్న ఒక దేవతకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక మతగురువు, మేరీ మాతకు ప్రతిరూపంలో ఉన్న ముగ్గురు మత గురువులను సంభాషణ రూపంలో ప్రశ్నిస్తాడు. ఈ విధంగా లాటిన్ భాష తెలియని సామాన్య ప్రజలకు, క్రీస్తు జీవితాన్ని నాటకరూపంలో అదనపు పాత్రలను సృష్టించి, చర్చిలలో ప్రదర్శించేవారు. వినోదం అతి తక్కువగా లభించే ఆ రోజుల్లో అతి సామాన్య నాటక ప్రదర్శన కూడా ప్రజలను అమితంగా ఆకర్షించింది. క్రమక్రమంగా చర్చి ప్రాంగణాన్ని దాటి బయటి ప్రదర్శనలు నిర్వహించటంతో, మతపరమైన కట్టుబాట్లకు లోబడని వారు కూడా ప్రదర్శనల్లో పాల్గొనటం ప్రారంభించారు. చర్చి ఆవరణలను దాటి బయటి ప్రదర్శనల్లో పాల్గొనటాన్ని నిషేధించినపుడు మత గురువులు కానివారు ఈ పాత్రలలో నటించారు.

13వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు క్రైస్తవ మతపరమైన అద్భుత నాటకాలు (Miracle Plays) విరివిగా ప్రదర్శించారు. మధ్యయుగపు నాటకాలు ఆరుబయట ప్రదేశాలలో ప్రదర్శించేవారు. 14వ శతాబ్దంలో భగవంతుని స్తుతిచేసే నాటకాలలో సుగుణ, దుర్గుణాలను రూపీకరించి వాటిలో పరస్పర ఘర్షణ చూపేవారు. 15వ శతాబ్దంలో బైబిల్ ప్రాశస్త్యాన్ని వివరించే పద్ధతుల మాదిరిగా, కొత్త నాటకాలను ప్రయోగించే విధానం మొదలైంది. మానవాళికి ప్రాతినిధ్యం వహించే విధంగా నాటకాలలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దారు. వృత్తిపరంగా సంచార గాయక నటుల్ని ఔత్సాహిక బృందాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ శతాబ్ది చివరి భాగంలో బాగా ప్రచారంలో ఉన్న ఫ్రెంచి ప్రహసనాలకు 16వ శతాబ్దపు ప్రథమ భాగంలో తర్జుమాలు వచ్చాయి. జాన్ హేవుడ్ అనే రచయిత మధ్యయుగపు సత్ప్రవర్తన లేదా అద్భుత (Miracle Plays) నాటకాలనూ, ఎలిజబెత్ కాలంనాటి హాస్య నాటకాలను, సంధియుగంలోని ఫ్రెంచి ప్రహసనాలనీ ఇంగ్లీషులోకి అనువదించాడు. ఇంతకు ముందున్న మొరాలిటీ నాటకాలలో ఉండే మూసపాత్రలు కాకుండా వాస్తవిక పాత్రలను, హాస్యాన్ని సృష్టించే సన్నివేశాలతో ఇంటర్‌లూడ్స్ రాశాడు. 16వ శతాబ్దంలో అనువాదాలు ప్రాముఖ్యాన్ని వహించాయి. టెరెన్స్, ప్లాటస్ వేదాంత నాటకాలు ఇటలీ నుంచి ఇంగ్లాండ్‌కు చేరి అనుదితమైనాయి. విద్యార్థులే ఈ నాటకాలను ప్రదర్శించారు.

గ్రీకు నాటకం గురించి ఇంగ్లాండులో తెలియదు. అయితే తొలి విషాదాంత నాటకం ఆధారాలు లాటిన్ భాషలో ఉన్నాయి. 1562 లో కోర్టు ఆవరణలో ప్రదర్శించిన గోర్బోడక్ నాటకాన్ని థామస్ నార్టన్, థామస్ సాక్‌విల్ రాశారు. ఈ నాటకం సెనెకా ధోరణిలో ప్రతీకారాన్ని ఆధారం చేసుకొని రాయడం జరిగింది. సత్ప్రవర్తనను లక్ష్యంగా పెట్టుకొని చారిత్రక ఆధారంతో రాసిన తొలి బ్రిటీష్ నాటకం.

టాంబుర్లేన్ ప్రపంచాధిపత్య కాంక్షతో సరిపడేవిధంగా నిషిద్ధ జ్ఞానాన్ని సంపాదించుకునే విపరీతమైన తృష్ణతో ఉన్న డాక్టర్ అతడు సామాన్యుడు. అతి సామాన్యులుగా పుట్టిన వారిద్దరికీ అధికారంపైన అంతులేని కోరిక. మార్లో ఉద్దేశ్యం ప్రకారం ఆయన రాసిన *టాంబుర్లేన్ దిగ్రేట్* (1587) నాటకంలోని ప్రధానపాత్ర, అహంకారంతో భగవదాజ్ఞను తిరస్కరించి, ధిక్కారం చేసినా అతడు శిక్షార్హుడుగా భావించలేదు. ఈ నాటకం మొదటి భాగం విజయవంతం కాగా, రెండవ భాగంలో రక్తపిపాసి అయిన మంగోల్ నాయకునికి తగిన శాస్తి జరుగుతుంది. అయితే థామస్ కిడ్ రాసిన *ది స్పానిష్ ట్రాజెడీ* (1558) టాంబుర్లేన్ కన్నా ప్రశస్తిని, ప్రశంసలను పొందింది.

పదహారవ శతాబ్దంలో షేక్స్పియర్ (1564-1616) ఆవిర్భావం ఇంగ్లీషు నాటక రంగంలో ఒక నూతన శకానికి నాంది పలికింది. నాలుగు శతాబ్దాలు గడిచినా ప్రపంచ నాటకరంగంలోని నాటక కర్తలలో అగ్రగణ్యుడుగా నేటికీ కీర్తింపబడుతూ ఉండటం ఒక్క షేక్స్పియర్‌కే చెల్లింది. ప్రపంచంలోని అన్ని ముఖ్యభాషలలోకి షేక్స్పియర్ నాటకాలు అనువదించబడటం ఇంగ్లీషు నాటక రంగానికి గర్వకారణమైన విషయం. షేక్స్పియర్ రాసిన 38 నాటకాల్లో సగం కూడా అతని జీవితకాలంలో ముద్రించబడలేదు. రాత ప్రతులను భద్రపరిచే అలవాటు లేనందువల్ల అవి చాలా కాలం ముద్రణకు నోచుకోలేదు. ఆనాటి నటులు దాచుకొన్న రాత ప్రతులే అక్కరకు వచ్చాయి.

షేక్స్పియర్ నటుడుగానే జీవిక ప్రారంభించి, క్రమక్రమంగా నాటక బృందాల నిర్వహణలో భాగస్వామిగా, నాటక రచయితగా స్థిరపడ్డాడు. ఆనాడు సమాజంలో నటుల పట్ల చులకన భావం ఉండేది. నటులను పనీపాటా లేని వ్యర్థ జీవులుగా, దేశదిమ్మరులుగా, దోపిడీ దార్లుగా భావించేవారు. షేక్స్పియర్ కాలంలో నాటక ప్రదర్శనలు పట్టణాల వెలుపల, తాత్కాలికంగా నిర్మించుకొన్న ప్రదేశాల్లోనో, విశ్రాంతి గృహాల్లోనో పగటి వూట ప్రదర్శించారు. షేక్స్పియర్ నటనా వైదుష్యానికి, రచనా పాటవానికి ముగ్ధులైన ప్రజల నుంచి క్రమక్రమంగా మంచి ఆదరణ లభించింది. ఆ ఆదరణే అతనితో అన్ని నాటకాలు రాయించింది.

షేక్స్పియర్ తన నాటకాలకు కథావస్తువును చరిత్ర, పురణాకథలు, ఇతిహాసాలు, జానపద కథల నుంచి పరిగ్రహించేవాడు. స్వీకరించిన వస్తువు అతని చేతిలో సుందర శిల్పంగా మారేది. షేక్స్పియర్ నాటకాలను విషాదాంత నాటకాలు, సుఖాంత నాటకాలు, చారిత్రక నాటకాలు, కాల్పనిక నాటకాలుగా వర్గీకరించవచ్చు. షేక్స్పియర్ రచనా శిల్పంలోని విశిష్టత, ఇతివృత్త నిర్మాణం, సంభాషణ శైలి, పాత్రచిత్రణ ముందు తరాలకు మార్గదర్శకంగా నిలిచాయి.

అతని నాటక శ్రేణిలోని *జూలియస్ సీజర్* (1599) మొదలైనవి విషాదాంత నాటకాలు, *మర్చెంట్ ఆవ్ వెనీస్* (1596); *మచ్ ఎడో ఎబౌట్ నథింగ్;* మొదలైనవి సుఖాంత నాటకాలు, *మూడవ రిచర్డ్* (1592) ; *ఆరవ హెన్రీ* (1591); *ట్వెల్త్ నైట్* (1599); *హేమ్లెట్* (1600); *ఒథెల్లో* (1604); *కింగ్ లియర్* (1605); *మాక్బెత్* (1606); మొదలైనవి చారిత్రక నాటకాలు, *ది వింటర్స్ టేల్* (1610); మొదలైన కాల్పనిక నాటకాలు ఆధునిక కాలంలో కూడా వివిధ దేశాలలో ప్రదర్శింపబడుతూ ఉండడమే ఆ నాటకాల ప్రాశస్త్యానికి తార్కాణం. షేక్స్పియర్ రాసిన ఇతర నాటకాలైన *ట్రాయిలెస్ అండ్ క్రెసిడా* (1601), *మెజర్ ఫర్ మెజర్* (1604)లలో కథలు రాజకీయాలకు, లైంగిక సంఘటనలకు సంబంధించినవై, నైరాశ్యాన్ని, ఆధునికతను తెలియజేస్తాయి. *ఆంటోనీ అండ్ క్లియోపాత్రా* (1606) నాటకంలో సెక్స్ ప్రాబల్యం, రాజకీయంపై వత్తిడిని పెంచినా, నిర్మాణంలోనూ, ధోరణిలోను, నాయక లక్షణాలకు వ్యతిరేకంగా ఆంటోనిలోని బలహీనతలను ఎత్తిచూపింది.

షేక్స్పియర్ సృష్టించిన అనేక పాత్రలు నేటికీ జన సామాన్యంలో శాశ్వతంగా నిలిచిపోయాయి. షైలాక్, ఆంటోనీ, మాక్బెత్, హేమ్లెట్, ఒథెల్లో, ఫాల్‌స్టాఫ్ - ఇంకా ఎన్నో పాత్రలు చిరంజీవత్వాన్ని సంతరించుకొన్నాయి. తన జీవిత కాలంలో షేక్స్పియర్ నాటకాల మీద విమర్శకుల, మేధావి వర్గం నుంచి అంతగా స్పందన రాలేదు. అతని సమకాలికులైన బెన్ జాన్సన్, ఫ్లెచర్ వంటి నాటక రచయితల కంటె షేక్స్పియర్ నాటకాలు అచ్చు రూపంలో వెలువడిన తరువాత అతని గొప్పతనం ప్రస్ఫుటమైంది. 17వ శతాబ్దంలో షేక్స్పియర్ రచనలకు విశ్వవ్యాప్తమైన కీర్తి లభించింది. 19వ శతాబ్దంలో షేక్స్పియర్ కీర్తి శిఖరాగ్రాన్ని తాకింది. షేక్స్పియర్ రచనలపై పరిశోధనలు, విశ్లేషణాత్మక గ్రంథాలు వేల సంఖ్యలో వెలువడినాయి. నేటికీ వెలువడుతూనే ఉన్నాయి.

బెన్ జాన్సన్ (1572-1637), షేక్స్పియర్ సమకాలికుడైనా ఇద్దరి రచనా రీతులు వేరు. షేక్స్పియర్ రాజుల కథలు, జానపద వీరుల కథలు రచిస్తే, జాన్సన్ సమకాలీన సమాజంలోని వ్యక్తుల భిన్న మనస్తత్వాల పైన దృష్టి నిలిపాడు. *ఎవ్వరిమేన్ ఇన్ హిజ్ హ్యూమర్* (1598); *వాల్‌పోల్* (1606); *ది ఆల్ కెమిస్ట్* (1610); *బెర్త్ లో మ్యూన్యుఫేర్* (1614); ఇతని ప్రసిద్ధ నాటకాలు. బెన్ జాన్సన్‌కు రాజాదరణ లభించింది. ఈయనను ప్రభుత్వం ఆస్థాన కవిగా నియమించింది. ఉపకార వేతనం కూడా ఇచ్చింది.

థామస్ డెక్కర్ (1572–1632) మానవత్వానికీ, నైతిక విలువలకూ ప్రాధాన్యమిస్తూ నాటక రచన చేశాడు. *ది షూమేకర్స్ హాలిడే* (1599); *డెక్కర్* ప్రసిద్ధనాటకం. థామస్ హేవుడ్ (1574–1641) కూడా ఆ కాలంలో ప్రజాదరణ పొందిన నాటక రచయిత. శతాధికంగా నాటకాలు, వాటిలో అధిక భాగం విషాదాంతాలు రచించాడు. *ఏ ఉమన్ కిల్డ్ విత్ కైండ్‌నెస్* (1603); జాన్ ఫ్లెచర్ (1579–1625); ఫ్రాన్సిస్ బోమాంట్ (1584–1616)తో కలిసి సుమారు 50 నాటకాలు రాశాడు. *ది మెయిడ్స్ ట్రాజడీ, ఫిలాస్టర్, ఎ కింగ్ అండ్ నో కింగ్* మొదలైనవి ప్రజాభిమానాన్ని చూరగొన్న నాటకాలు. ఫిలిప్ మెసెంజర్ (1583–1639/40) రాసిన నాటకాలలో *ఎ న్యూ వే టు పే ఓల్డ్ డెట్స్* (1622) ప్రసిద్ధి చెందింది. జాన్ ఫోర్డ్ (1586–1639), జేమ్స్ షిర్లే (1599–1666) మొదలైన రచయితల నాటకాలు కూడా 16వ శతాబ్దిలో ప్రఖ్యాత నాటకాలుగా గుర్తింపు పొందాయి.

షేక్స్పియర్ సమకాలికుడైన జాన్ వెబ్‌స్టర్ రెండు విషాద రూపకాలతో ప్రసిద్ధుడయ్యాడు. ఆ నాటకాలు *ది వైట్ డెవిల్* (1611). *ది డచెస్ ఆఫ్ మాల్ఫి* (1612). ఇటాలియన్ పునరుజ్జీవన కాలంలోని రెండు సంఘటనలకు సంబంధించిన నాటకాలివి. జాన్ మార్స్టన్; థామస్ మిడిల్టన్, జార్జి చాప్‌మెన్, జాన్ ఫోర్, జేమ్ షిర్లీ మొదలైన ప్రముఖ నాటకకర్తలు ఈ కాలంలో మంచి నాటకాలు రచించారు. థామస్ ఆట్ వే *ది ఆర్ఫన్* అనే నాటకం బ్లాంక్‌వర్స్‌లో రాయడం జరిగింది. ఉత్కంఠ భరితమైన విషాద నాటకంగా దీనికి గుర్తింపు లభించింది. వెనీసుకు వ్యతిరేకంగా పోప్ పై జరిగిన కుట్ర ఆధారంగా రాసిన వెనీస్ ప్రిజర్వ్‌డ్ (1682) నాటకం రచయితకు పేరు తెచ్చింది.

రెస్టోరేషన్ నాటకాలు ఐశ్వర్యవంతులకు సంబంధించినవి కాగా, 18వ శతాబ్దపు నాటకాలు ప్రధానంగా మధ్య తరగతి మనుషుల గురించి రాయబడినవి. ప్రేక్షకుల దృష్టిలో వీరులు, శూరులు మాత్రమే ప్రశంసనీయులు కాదనీ, సాధారణ మనిషిలోని మానవత్వం కూడా ప్రశంసార్హమే అనే భావన వ్యాపించింది. జార్జి ఫార్ ఖుహార్ రాసిన *ది రిక్రూటింగ్ ఆఫీసర్* (1706) నాటకంలో మిలిటరీ న్యాయవ్యవస్థలోని అధికార దుర్వినియోగాన్ని దుయ్యబట్టాడు. సెక్స్ పరమైన మోసాల ప్రాబల్యాన్ని, మానవ స్వభావాల వైలక్షణ్యాన్ని *ది బోస్టాటజమ్* అనే నాటకంలో సునిశితంగా విశ్లేషించాడు. ఐర్లాండులో విద్యాభ్యాసం చేసి మండన్ నగరంలో కవిగా స్థిరపడిన గోల్డ్‌స్మిత్ ప్రధానంగా కవిత్వం రాసేవాడు. వ్యాసరచన, నవలా రచన కూడా అనతికాలంలో చేపట్టి అన్ని ప్రక్రియల్లోనూ ఖ్యాతి గడించాడు. క్రమంగా నాటక రచనకు కూడా పూనుకొని, తొలిసారిగా *ది గుడ్ నేచర్డ్ మాన్* (1768) నాటకం రచించాడు. అది అత్యున్నతమైన ఆహ్లాద రూపకంగా జాన్‌సన్ అభివర్ణించాడు. అతని మరో నాటకం షి స్టూప్స్ టు కాన్‌క్యర్ (1773) ఆహ్లాద రూపకం. అప్పుడూ ఇప్పుడూ కూడా ప్రేక్షకులను అలరిస్తూ గోల్డ్‌స్మిత్ కీర్తి స్తంభానికి బాసటగా నిలిచి ఉంది. ఇంగ్లీషు నాటకరంగానికి పసందైన మోదాంత రూపకాలను అందించినవారిలో షెరిడాన్ (1751– 1816) గణనీయుడు. ఈయన రాసిన *ది రైవల్స్, ది డ్యూయెన్నా, ది స్కూల్ ఫర్ స్కాండల్స్* మొదలయిన నాటకాలు విజయవంతంగా ప్రదర్శించబడటమే కాక వివిధ భాషల్లోకి అనువదింపబడి, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. ఈ శతాబ్దిలో రిచర్డ్ స్టీల్, నికొలాస్‌రో, జోసెఫ్ ఎడిసన్, జార్జి కోల్మోన్ మొదలైన వారు రచించిన నాటకాలు ప్రజాదరణ పొందాయి.

ప్రసిద్ధ కవులు నాటక రచన పట్ల ఆకర్షితులు కావటం 19వ శతాబ్దంలో ఒక పరిణామం. వర్డ్స్‌వర్త్, కీట్స్, షెల్లీ, బైరన్, బ్రౌనింగ్, టెన్నిసన్ వంటి ప్రసిద్ధ కవులు నాటకాలు రాయడానికి పూనుకున్నారు. కాని వారు రచించిన నాటకాలలో ఒకటి రెండు మినహా ఏవీ రాణింపుకు రాలేదు. కొన్నయితే రంగస్థలాన్ని తాకిన దాఖలాలు లేవు. 1819లో షెల్లీ రాసిన *ది సెన్సీ* అనే నాటకం మాత్రం ఈయనకు పేరు తెచ్చిపెట్టింది. ఈ నాటకంలో రచయిత 16వ శతాబ్దపు సమస్యలు, సంపర్కం, శారీరక హింసలు మొదలైన అనేక అంశాలను చర్చించటం జరిగింది.

మెలోడ్రామాలు వినోదానికి ఆటపట్టుగా నిలవడం ఆనాటి ప్రేక్షకుల అభిరుచికి తార్కాణం. రాను రాను శ్రవ్యానికి ప్రాముఖ్యం తగ్గి దృశ్యానికి ప్రాధాన్యం పెరిగింది. అందుచేత వ్యాపార దృష్టి పెరిగిన రచయితలు తమ నాటకాలలో దృశ్యపరమైన ఎఫెక్టుని పొందుపరిచి ప్రేక్షకుల్ని ఆకట్టుకొనేవారు. ప్రతి నాటకంలోను ఒక ప్రత్యేక సంచలనాత్మక రంగాన్ని విధిగా రాసేవారు. వెబ్‌స్టర్, టోర్నియర్, మిడిల్టన్ రచించిన నాటకాలలో ప్రేతాత్మలు,

స్మశానాలు, కంకాళాలు, గాలివానలు మొదలైన భయానక దృశ్యాలు పుష్కలంగా ఉండి ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేశాయి.

19వ శతాబ్దం పూర్తిగా మెలోడ్రామాలు రాజ్యం ఏలిన కాలం. థామస్ హోల్‌క్రాఫ్ట్ రాసిన ఎ టేల్ ఆఫ్ మిస్టరీ (1802), *టామ్ టేలర్ ది టికెట్ హెన్రీ ఆర్థర్ జోన్స్ ది సిల్వర్ కింగ్* (1862), *ఆఫ్ లీవ్ మాన్* (1863), *లియోపాల్డ్ లీవిస్ ది బెల్స్* (1872) వీటికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. శతాబ్దం ముందుకు జరిగిన కొద్దీ, రచనలో ఆధునికత ఎక్కువైంది. పినెరో 1898లో రాసిన *ది ట్రెలానీ ఆఫ్ ది వేల్స్* అరవయ్యో దశకంలో టి.డబ్ల్యూ. రాబర్ట్‌సన్ ప్రవేశపెట్టిన వాస్తవికతావాదాన్ని అనుసరిస్తూ రాసిన నాటకం, రాబర్ట్‌సన్ సొసైటీ (1865), కేస్ట్ (1867) అనే అద్భుత నాటకాలను రాశాడు.

హెన్రీ ఆర్థర్ జోన్స్ రచించిన నాటకాలు మెలోడ్రామాలే అయినప్పటికీ, సాంఘిక సమస్యలను గంభీరంగా చర్చించటంలో ఇంగ్లీషు నాటకాన్ని ముందడుగులు వేయించాయి. ఆస్కార్ వైల్డ్ రాసిన *లేడీ విండర్ మియర్స్ ఫాన్* (1892) భావనలోను, నిర్మాణంలో మెలోడ్రామాయే. ఈ నాటకంలో మెలోడ్రామా పాలు ఎక్కువైనా చక్కని లోకోక్తులతో రాయడం వల్ల ప్రేక్షకుల్ని బాగా ఆకర్షిస్తుంది. ఆస్కార్ వైల్డ్ రాసిన ఎ ఉమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్, ఏన్ ఐడియల్ హజ్బెండ్ (1893), ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్ (1895) నాటకాలు కూడా బహుళ జనాదరణ పొందినవి. సర్ జేమ్స్ ఎం. బారీ రాసిన క్వాలిటీ (1901), *ది ఎడ్మిరిబుల్ క్రిచ్‌టన్* (1902), *పీటర్ పాన్* (1904) నాటకాలు కూడా రంగస్థలం మీద బాగా రాణించాయి.

నాటకాన్ని శక్తివంతమైన ఆయుధంగా చేసుకొని మత, రాజకీయ, సామాజిక వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరవేసిన ఘనత జార్జి బెర్నార్డ్ షాది (1856–1950). సంప్రదాయం నిర్వచించిన విలువల్ని ప్రశ్నించాడు. మత మౌఢ్యాన్ని ఖండించాడు. సమసమాజాన్ని కాంక్షించాడు. ఈయన రచించిన నాటకాలు భావోద్వేగాన్ని, ఆశయాలను అభివ్యక్తం చేసే వాహికలయ్యాయి. మురికివాడల్లో ఇండ్ల యజమానులు పేదవారిపై చూపే దౌష్టాన్ని, అమానుషత్వాన్ని తూర్పారపడుతూ *విడోయర్స్ హౌసెస్* (1892) అనే నాటకం రాశాడు. అది ధనికుల, అధికరణం గుండెల్లో గుబులు పుట్టించింది. మిసెస్ వారెన్స్ ప్రొఫెషన్ (1902) నాటకంలో వేశ్యా వృత్తిలోని స్త్రీ జీవితాన్ని స్పృశించి, సమాజంలో సంచలనం సృష్టించాడు. *ఏపిల్ కార్ట్* (1929), *టూట్రూటుబిగుడ్* (1932), జెనేవా (1938) రాజకీయ వ్యవస్థపై సంధించిన అస్త్రాలు. వైద్యవృత్తిలో సంస్కరణావశ్యకతను ప్రతిపాదిస్తూ రాసిన *డాక్టర్స్ డైలమా* (1906) విమర్శకు తావిచ్చింది. *పిగ్మేలియన్* (1914), *మాన్ అండ్ సూపర్‌మాన్* (1905) నాటకాలు బెర్నార్డ్ షా కీర్తిని శిఖరాగ్రానికి చేర్చాయి. *ఆర్మ్స్ అండ్ ది మాన్* (1894), *కాండిడా* (1897), *డెవిల్స్ డిసైపుల్* (1897) మొదలైన 30 నాటకాలు షా కలం నుంచి వెలువడి, రచయిత ఖ్యాతిని ఇనుమడింప జేశాయి. ఈ శతాబ్దిలో ఇంగ్లీషు నాటకరంగాన్ని పరిపుష్టం చేసిన వారిలో షా అగ్రగణ్యుడు కాగా, జాన్ గాల్స్ వర్దీ, సోమర్ సెట్ మామ్, నోయల్ కవర్డ్, టెరెన్స్ రాటిగన్, టి.ఎస్. ఇలియట్, హారాల్డ్ పింటర్, జాన్ ఆస్బర్న్, జె.బి. ప్రీస్ట్లీ ప్రభృతులు ముఖ్యులు. జాన్ గాల్స్ వర్దీ (1867–1933) నవలా రచయిత, నాటక కర్త. కార్మిక వ్యవస్థలో జరిగే అన్యాయాలపై ధ్వజమెత్తాడు. న్యాయవ్యవస్థలో సామాన్యుని గోడు అరణ్యరోదన అవుతుందనడానికి ఆర్తి జస్టీస్ (1910) నాటకమే దర్పణం. జైల్లో ఖైదీలు అమానుష చర్యలకు గురౌతున్నారనీ, జైలు సంస్కరణలు జరగాలని ఎలుగెత్తి చాటాడు. గాల్స్ వర్దీకి సిల్వర్ బాక్స్ (1906), స్ట్రైఫ్ (1909) నాటకాలు సమస్యాత్మక నాటకాలుగా అతనికి పేరు తెచ్చాయి. ఈయన నాటకాలలో కళాత్మకత కంటె ప్రచార ధోరణి అధికంగా ఉంటుందనే విమర్శ ఉంది.

సోమర్ సెట్ మామ్ (1874–1965) 19వ శతాబ్దం చివరలో నాటకరచనకు పూనుకొని *లేడీ ఫ్రెడరిక్* (1903), ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. 1908లో మామ్ రాసిన నాటకాలు ఒకేసారి 'వెస్టెండ్' నాటక మందిరాలలో ప్రదర్శింపబడటం విశేషం. *జాక్‌స్ట్రా, ది ఎక్స్ ఫ్లోరర్, ది సర్కిల్, అవర్ బెటర్స్, ది కాన్‌స్టెంట్స్ వైఫ్* (1926), *ది లెటర్* (1927), *ది సెంకడ్ ఫేమ్* (1928) మొదలైన నాటకాలు వెస్టెండ్ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడ్డాయి.

డ్రాయింగ్ రూమ్ కామెడీ రచనలో మరో సిద్ధహస్తుడు నోయల్ కొవర్డ్ (1899–1973). తొలుత నటుడుగా జీవితం ప్రారంభించి 1920 నాటికి రచయితగా స్థిరపడ్డాడు. 1920–40 మధ్యకాలంలో ఆహ్లాద రూపక పరంపరతో నాటకరంగాన్ని పులకింప చేశాడు. ఈయన రచనలలో *హేఫీవర్* (1925), *ప్రైవేట్ లైవ్స్* (1930), *బ్లైత్ స్పిరిట్*

(1941), *ప్రెజెంట్ లాఫ్టర్* (1942), *ఫాలన్ ఏంజెల్స్* (1925) ప్రజాదరణ పొందిన నాటకాలు.

జె.బి.ప్రీస్టీ (1894–1984) ప్రసిద్ధ నవలా రచయిత, నాటకకర్త, విమర్శకుడు. సుమారు 50 నాటకాలు రాశాడు. వాటిలో రాజకీయ నాటకాలు, అభివ్యక్తి శైలిలో రాసిన నాటకాలు, హాస్యనాటకాలు కూడా ఉన్నాయి. ఈయన రాసిన నాటకాలలో *ఐహావ్ బీన్ హియర్ బిఫోర్* (1933), *ఎన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్* (1946) నాటకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి. *ది గుడ్ కంపానియన్స్* (1931), *ది డేంజరస్ కార్నర్* (1932), *ఈడన్ ఎండ్* (1934), *వెన్ వుయ్ మారీడ్* (1938) నాటకాలు ప్రీస్టీ నాటక పరంపరలో కొన్ని, *టైమ్ అండ్ కాన్వాస్, ఐ హేవ్ బీన్ హియర్ బిఫోర్, ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్* నాటకాలలో భూత, వర్తమాన, భవిష్యత్కాలాల సమ్మేళనం కనిపించడం ఓ ప్రత్యేకత.

1940 దశకంలో టెరెన్స్ రాసిన (1911–77) సున్నిత ఆహ్లాద రూపక రచయితగా పేరు గడించాడు. *ఫ్రెంచ్ విథౌట్ టియర్స్* (1936) అనే నాటకాన్ని పాతికేళ్ల వయసులోనే రాశాడు. ఇతని రచనల్లో *వన్ స్లోబాయ్* (1946) ఇతర దేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. *ఫ్లేర్ పాత్* (1942), *వైల్ ది సన్ షైన్* (1943), *ఇన్ ఐడిల్‌నెస్* (1944) మొదలైనవి ఈయన ప్రసిద్ధ నాటకాలు.

అమెరికాలో జన్మించిన టి.ఎస్. ఇలియట్ (1888–1965) 1915లో ఇంగ్లాండ్‌లో స్థిరపడ్డాడు. ఈయన కవి, నాటక కర్త, పద్య నాటకాలకు ప్రాధాన్యమిచ్చిన రచయిత. ప్రతి నాటకంలోను పద్యాలు, పాటలను పొందుపరచడం ఈయనకు అలవాటు. *మర్డర్ ఇన్ ది కెథడ్రాల్* (1935) బహుళ జనాదరణ పాత్రమైంది. ఇందులో కవిత్వ ధోరణి అధికం. *ది ఫామిలీ యూనియన్* (1939), *ది కాక్‌టెయిల్ పార్టీ* (1949), *ది కాన్ఫిడెన్షియల్ క్లార్క్* (1953) నాటకాలు ఇలియట్‌కు పేరు తెచ్చాయి.

ఇంగ్లీషు నాటకరంగంలో ప్రయోగాత్మక నాటకాలు రాసిన వారిలో హారాల్డ్ పింటర్ (1930) ప్రముఖుడు. నాటక రచయిత, దర్శకుడు, నటుడు కూడా. 1957లో *ది రూమ్* నాటకంలో రచనా వ్యాసంగంతో అడుగు పెట్టిన పింటర్ 1993 వరకూ సుమారు 15 నాటకాలు నాటక రంగానికి అందించాడు. *ది రూమ్, ది బర్త్‌డే పార్టీ* (1958) నిశిత విమర్శకు గురి అయ్యాయి. *ది కేర్ టేకర్* (1960) నాటకం పింటర్‌కి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టింది. పింటర్ నాటకాల్లో అత్యధిక భాగం నాటక అబ్సర్డ్ నాటక శైలికి చెందినవి. *ది హోమ్ కమింగ్* (1965), *సైలెన్స్* (1969), *నో మ్యాన్స్ లాండ్* (1975) *బిట్రేయల్* (1978) పింటర్ నాటకాలలో ముఖ్యమైనవి. 2005 సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారం ఈయనకు లభించింది.

అగథాక్రిస్టీ (1891–1976) ప్రసిద్ధ అపరాధ పరిశోధక నవలా రచయిత్రి, నాటకకర్త. తాను రచించిన నవలల్లో కొన్నింటిని స్వయంగా తానే నాటకీకరించింది. *టెన్ లిటిల్ నిగ్గర్స్* (1943), *మర్డర్ ఆన్ ది నైల్* (1946) మొదలైనవి రంగస్థలం మీద రాణించాయి. 1952లో రాసిన *మౌస్ ట్రాప్* అనే నాటకం ప్రపంచ నాటకరంగంలో చరిత్ర సృష్టించింది. వెస్ట్ ఎండ్‌లో అంబాసిడర్ థియేటర్‌లో 1952లో ప్రదర్శన ప్రారంభమై, రోజు వారీ ప్రదర్శనలలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఇంకా ఆ నాటకం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడా నాటకం సెయింట్ మార్టిన్ థియేటర్‌లో ప్రదర్శింపబడుతూంది.

ఇంగ్లీషు నాటకరంగానికి ఖ్యాతి తెచ్చిన నాటక కర్తలలో జాన్ ఆస్బో (129–94) మొదట నటుడుగా రంగప్రవేశం చేసి, నాటకకర్తగా గుర్తింపు పొందాడు. ఈయన రాసిన *లుక్ బ్యాక్ ఇన్ ఏంగర్* (1957) అత్యంత ప్రజాదరణ పొందింది. ఈ నాటకాన్ని ఇంగ్లీషు థియేటర్ కంపెనీ విస్తృతంగా ప్రదర్శించి, రచయితకు జిమ్మిపోర్టర్ పాత్ర ఇంగ్లీషు సాహిత్యంలో ఆవేశ పరుడైన సమాజం మారాలని, సంస్కరించబడాలని నిశితంగా విమర్శించే వ్యక్తులను యాంగ్రీయంగ్ మెన్‌గా వ్యవహరించడం జమ్మీ పోర్టర్ తోనే మొదలైందని చెప్పవచ్చు. *ఆస్బో ఎంటర్‌టైనర్* (1957), *లూథర్* (1961), *ఇన్ ఎడ్‌మిసబుల్ ఎవిడెన్స్* (1964) నాటకాలు రంగస్థలం మీద విజయవంతంగా ప్రదర్శితమై రచయితకు పేరు తెచ్చాయి.

1970 తరువాత వస్తున్న నాటకాలలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నాటకాలు లేవు. నాటక కర్తలూ లేరనటం సత్యదూరం కాదు.

చాట్ల శ్రీరాములు
నాటకానికి చిరునామా
హైద్రాబాదు, ఫోన్ : 9885819100

సుగాలీల సామెతలు

– డుంగావత్ నరేష్ కుమార్ నాయక్

సుగాలీ సాహిత్యంలో కథలు, గేయాలు, నమ్మకాలు ఎంత విశిష్టమైనవో సామెతలు కూడా అంతే వైశిష్ట్యాన్ని కలిగి ఉన్నాయి. ఇవి సాహిత్యాభివ్యక్తి విధానాలే కాకుండా మన జీవనవిధానాన్ని, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, కట్టుబాట్లను యథాతథంగా ప్రతిఫలిస్తుంటాయి. సామెతలు తీక్షణమైన బాణాల్లా వినేవారి హృదయాల్లో హత్తుకు పోతాయి. కొండంత అర్థాన్ని స్ఫురింపజేస్తాయి. ఆయా జాతులు, ప్రాంతాల ప్రత్యేకతలను అక్కడున్న సామెతలు తెలియజేస్తుంటాయి. ప్రపంచంలోని ప్రతి భాషలోనూ, సాహిత్యంలోనూ సామెతలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయి. తెలుగులోని సామెతలను ఆంగ్లంలో ప్రోవర్బ్స్, సంస్కృతంలో లోకోక్తి, సూక్తి, సుభాషితం, కన్నడంలో గాదె, నాణ్ణుడి, సామెతె, తమిళ మరియు మళయాళంలో పళమొళి, పళచొల్లు, హంగరీలో పెల్డ బెగడ్, అరబ్బీలో మతల్ ఇలా ఎన్నో ప్రపంచ భాషలలో ఎన్నో రకాల పేర్లతో సామెతలు ప్రఖ్యాతిగాంచినాయి.

నానుడులు, జనశ్రుతులు, సుద్దులు, మాటలు, శాస్త్రాలు అనే పదాలను, రాయలసీమ ప్రాంతంలో సాటువ, సాటవ, చాటువ, చాటవ వంటి పదాలను సామెతకు మారుగా తెలుగులో ఉపయోగిస్తారు.

సుగాలీ భాషలో సామెతలను "కావత్" అని అంటారు. కావత్ అనే పదం ఉత్తర భారతదేశ భాషలైన హిందీ, గుజరాత్, రాజస్థానీ భాషల్లో పేర్కొనే 'కహావట్' అనే పదం నుండి అవిర్భవించిందనేది ఒక భావన. కావత్‌లు సుగాలీల జీవనంలోని వివిధ సందర్భాలతో సమ్మిళితమై ఉంటాయి. సందర్భానుసారంగా కావత్‌లను సుగాలీలు ఉపయోగిస్తారు. తమ జీవితంలో తారసపడే వివిధ సంఘటనల సందర్భంలో కావత్‌లు ఎక్కువగా వారి సామాజిక జీవనానికి సంబంధించిన అంశాలను వ్యక్తపరుస్తాయి. అంటే వారికున్న సామాజిక అవగాహనను సూచిస్తాయి. సామెతలను అనుభవాలసారంగా మనం అనుభవిస్తున్నాం సామెత అన్న పదం 'సామ్యం' నుండి ఆవిర్భవించింది. ఏదైనా ఒక విషయం గురించి విస్తారంగా చెప్పేటప్పుడు పోలిక కోసం చెప్పే సమానార్థంతో కూడిన ఒక వాక్యమే సామెత. (Cervantas) అనే పండితుడు "Short sentences drawn from long experience") తరతరాల అనుభవం సృష్టించిన సంక్షిప్త వాక్యాలు సామెతలు అని పేర్కొనగా డా॥ ఆర్వీయన్ సుందరం ఆంధ్రుల జానపద విజ్ఞానంలో సంక్షిప్తమైన, తీక్షణమైన, సాంప్రదాయకమైన, జనప్రియమైన, అనుభవమూలమైన అభివ్యక్తి సామెత అని నిర్వచించాడు. హమీద్ అనే విద్వాంసుడు "A proverb is to speech what salt to food " ఆహారానికి ఉప్పులాంటిది భాషకు సామెత అని వివరించారు.

కావత్ ఏ భాషకు సంబంధించినవైనా వాటిని పరిశీలిస్తే సూక్ష్మంగా అవి ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటాయి. అయితే అట్టి సామెతలు సంక్షిప్తతలోనూ, ప్రాచుర్యంలోనూ కొంత మార్పు ఉంటుంది. ప్రధానంగా సామెతలు సామ్యం, ప్రాచుర్యత, తరతరాల అనుభవ మూలం. సాంప్రదాయకత, సంక్షిప్తత, శ్రావ్యత మొదలగు లక్షణాలను కలిగి ఉంటాయి.

సామెతలు అతి ప్రాచీన గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, బైబిలు గ్రంథాలలో కన్పిస్తాయి. మానవుడి మనుగడ స్థాయి నుండే సామెతలు పుట్టుకొచ్చాయని చెప్పవచ్చు. కుటుంబం, సంఘంలో వ్యక్తికి గల సంబంధాలు, అనుబంధాలు, అనుభవాలు, పురాణాలు, చరిత్ర, జానపద కథలు, సన్నివేశాలు, సూక్తులు, పరిభాష సామెతలు, జానపదగేయాలు, నమూనా సామెతలవంటివన్నియు సామెతల పుట్టుకకు ఆధారాలుగా చెప్పుకోవచ్చు.

సామెతల వ్యాప్తికి భాష సాధనంగా ఉంటుంది. సామెతల వ్యాప్తి భాషా వ్యాప్తినిబట్టి ఉంటుంది. ఒక భాష ఎంతైతే వ్యాప్తిని కలిగి ఉంటుందో అంతగా భాషలోని సామెతలు వ్యాప్తిలోకి వస్తాయి. సుగాలి భాషకు లిపిలేదు. భాషా సాహిత్యం వ్యాప్తి చెందలేదు కాబట్టి సుగాలీల సామెతలు వారి సమాజంలోనే వ్యాప్తి చెందివున్నాయి. ఇతరులకు వారి సామెతలు తెలిసే అవకాశం లేదు. సామెతలు

దాదాపుగా ఏ భాషా సాహిత్యాలలోనైనా ఒకే విధంగా ఉంటాయి. నుగాలీ సమాజంలోని జనప్రియమైన సామెతలను శరీరాధారమైన, వస్త్వాధారమైన, పశు, కీటకాధారమైన, జీవనాధారమైన మరియు ప్రకృతి ఆధారమైన సామెతలుగా వర్గీకరించవచ్చు.

జీవేర్ కావత్ (శరీరాధారమైన సామెతలు) :

గరీబ్ మూండో ఫాడతో పేటేమార్ అంతర్ దకావచ్: (పేదవాడు నోరు తెరిస్తే కడుపులోని పేగులు కనబడుతాయి.)

సుగాలీలు చాల బీదవాళ్ళు. ఒక వ్యక్తి బీదతనాన్ని గురించి మరొక వ్యక్తికి తెలిపేటప్పుడు ఈ సామెతను వాడుతారు. పేదవాడు నోరు తెరిస్తే పేగులు కనబడటం అంటే నిజంగా పేగులు కనబడడం కాదు. ఆ పేదవాడు ఆర్థికంగా ఎంతటి నిస్సహాయ స్థితిలో ఉన్నాడో తెలియజేయడానికి ఈ సామెతను వాడతారు. ఆకలి బీదతనానికి గుర్తు. బీదవాని కడుపులో పేగులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి కదా! అందుకే బీదవాడు నోరు తెరిస్తే కడుపులోని పేగులు కనబడతాయని సామెత.

హంనజేరజ్ దాంత్ దకావచ్ (నవ్విన వారి పళ్ళే బయటపడతాయి) :

సమాజంలో మనుషులు ఒకే విధంగా ఉండరు. ఏదో ఒక విధంగా ఎదుటి వారిని చూసి హేళన చేస్తుంటారు. సాధారణంగా శారీరకంగాను, మానసికంగాను, ఆర్థికంగాను దెబ్బతిన్నవారిని ఎక్కువగా హేళన చేస్తుండటం మనం సమాజంలో గమనించవచ్చు. అలా తమను అవహేళన చేసినప్పుడు ఎవరికైనా బాధ కలుగుతుంది. ఇలా బాధ నుండి ఉపశమనాన్ని కలుగజేసే ప్రయత్నంలో తోటివారు అవహేళనకు గురైన వ్యక్తిని ఓదారుస్తూ "నువ్వేమీ బాధపడకు, ఎవరైతే నిన్ను చూసి అవహేళన చేస్తూ వెకిలి నవ్వు నవ్వారో వాళ్ళ పళ్లే బయటపడ్తాయి. వారి మాటల్ని నువ్వు పట్టించుకోవద్దు. అని చెప్పడానికి ఈ సామెతను ఉపయోగిస్తారు. అవహేళన చేసిన వారిని పట్టించుకోవడం అనవసరమని పరోక్షంగా చక్కని ఉపదేశాన్ని ఈ సామెత తెలియజేస్తుంది.

చీదేర్ కావత్ (వస్తువు ఆధారమై సామెతలు) :

కాణిన కాసేర్ ధాళి దినేతో సీపీన్ పేట్ ఫోల్దీదికచ్ : (గుడ్డిదానికి కంచు పళ్ళెం ఇస్తే కడుపు పగిలే వరకు తాగిందట).

దేనికైనా హద్దు అంటూ ఒకటి ఉంటుంది. కాని మనిషి ఆశకు మాత్రం హద్దే ఉండదు. మనిషి యొక్క వెల్తితనానికి దర్పణం పట్టేదే ఈ సామెత. ఎవరైనా తన తాహతుకు మించింది దొరికినప్పుడు దాన్ని కాపాడుకోవాలని, స్థాయికి తగ్గట్టుగా మెలగకపోతే ఎటువంటి అనర్థమైన జరగవచ్చు అనే నేపథ్యంలో నుంచి ఈ సామెత ఆవిర్భవించింది. అంధురాలికి కంచుపళ్లెం ఇస్తే కడుపు పగిలేదాకా తాగిందనడంలో ఆమె అత్యాశ కనబడుతుంది. ఒక విలువైన వస్తువు లభించినప్పుడు దాన్ని అతిగా వాడకూడదనీ, దాని విలువను తెలుసుకొని మసలుకోవాలని ఇందులోని నీతి.

బాటీ తూటన్ ఫీయేమా ఏడ్గీ (రొట్టె విరిగి నేతిలో పడింది)

ఈ సామెత ప్రధానంగా తెలుగుతో పాటు అనేక భాషా సాహిత్యాలలో కన్పిస్తుంది. కొందరికి అదృష్టం లాభాలే కలుగుతుంటాయి. అప్పుడు మనం రొట్టె విరిగి నేతిలో పడిందనటం సహజం. రొట్టె విరిగి నేతిలో పడితే నష్టం లేదు. కాని అది కిందపడితేనే నష్ట కలుగుతుంది. నేతిలో పడిన రొట్టె ఇంకా రుచిగా ఉంటుంది. అదృష్టం కలసి రావడాన్ని రొట్టె నేతిలో పడటంతో పోల్చి చెప్పడంలో చక్కని అలంకారం కన్పిస్తుంది. ఈ సామెత సుగాలీల సంస్కృతికి అద్దం పడుతుంది. సుగాలీలకు రొట్టెలంటే చాల ఇష్టం. సుగాలీలు రొట్టెలను ఇష్టపడినంతగా మరే ఆహారపదార్థాన్ని ఇష్టపడరంటే అతిశయోక్తి కాదు. వారి ఆహారానికి సంబంధించిన జీవన నేపథ్యంలో నుంచి పుట్టుకొని వచ్చిందే ఈ సామెత.

ధోర్, కీడా కావత్ (పశు, కీటకాధారమైన సామెతలు)

సుగాలీల నుండి, పశువులు మరియు పెంపుడు జంతువులను వేరుగా చూడలేము. ఎందుకంటే సుగాలీలున్న చోట తప్పక పశువులు, పెంపుడు జంతువులు తప్పక ఉంటాయి. సుగాలీల దైనందిన జీవనంలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అంతేకాదు ఈ రకం సామెతలు వారి ఆచార విశ్వాసాల్ని, సంస్కృతిని తెలుపుతాయి.

బళ్లేన బేటా జణాయే నాలో (ఎద్దు ఈనిందంటే ఎవరు నమ్ముతారు)

కొందరు ఎప్పుడూ ప్రగల్భాలు పలుకుతుంటారు. అటువంటివారు కోకొల్లలు. ఉన్నదాని కంటే ఎక్కువగా చెప్పే ఎదుటివారిని మోసం చేయడం కొందరికి వెన్నతో పెట్టిన విద్య. అటువంటి వారి చేతిలో మోసపోయిన వాళ్ళు

సమాజంలో నేటికి మనకు తారసపడుతూనే ఉంటారు. అయితే ఎన్ని మాటలు నమ్మ బలికినా ఎవరూ నమ్మరన్నది గుర్తించాలి. ఎద్దు ఈనిందంటే నమ్మలేం కదా! ప్రగల్భాలు పలికి సమాజాన్ని తప్పుదోవ పెట్టే వారిని దృష్టిలో పెట్టుకొని వచ్చిందీ సామెత.

బపేవాళ్లో కొత్రా, కన్నాయి కాటేని (మొరిగే కుక్క ఎన్నటికీ కరవదు)

నిత్యజీవితంలో మనుషుల తీరు అనేక రకాలుగా ఉంటాయి. కొందరు కరాఖండిగా మాట్లాడుతారు. మరి కొందరు నర్మగర్భంగా మాట్లాడుతారు. ఇంకొందరు చిన్న విషయానికే అరుస్తారు. కసిరినట్లు మాట్లాడుతారు. మానసిక శాస్త్రవేత్తలు మనుష్యులను వారి వ్యక్తిత్వాలను ప్రవర్తనలను బట్టి పరిమిత వ్యక్తిత్వం కలవారు (Dissertive personlity), మధ్యస్థ వ్యక్తిత్వం కలవారు (Assertive Personality), అపరిమిత వ్యక్తిత్వం కలవారు (Aggressive Personality)గా పేర్కొన్నారు. వారు లోలోపల భయపడుతున్నా మీదికి మాత్రం అరుస్తారు. అటువంటివారు సమాజానికి ఎటువంటి హాని చేయరనే అభిప్రాయం ఉంది. ఈ అభిప్రాయమే ఈ సామెతలో వ్యక్తమవుతూంది. చాల వరకు వీధికుక్కలలో కొన్ని అరుస్తాయి, కాని కరవవు. మనుషుల వ్యక్తిత్వంలోని వైవిధ్యాన్ని ప్రతిఫలించే ఈ సామెత బాగా విస్తృత ప్రచారంలో జనాల నాలుక మీద నర్తిస్తుంది.

బంచేర్ కావత్ (జీవనాధారమైన సామెతలు)

మూండేవాళేర్ భూండాయి వక్జా, బనామూండే వాళేర్ జార్ సదాయ్ వక్కేని :

(మాటలు నేర్చినవాడు జొన్న పొట్టునైనా అమ్ముతాడు. మాటలు నేర్వనివాడు జొన్నలు కూడా అమ్మలేడు).

తెలుగులో నోరుంటే బతికేయవచ్చు అనే సామెతకు సారూప్యత కలిగిన సామెత ఇది. సుగాలీలు చాకచక్యంతో మాట్లాడే వ్యక్తులను ఉదహరిస్తూ చెప్పే సామెత ఇది. కొంతమంది మాటకారితనం కలిగి అందరిని మాటలతో లొంగదీసుకుంటారు. మాటల గారడీలో ఎదుటివాళ్లను మాయచేస్తారు. ఎప్పుడూ తమ మాటే చెల్లుబాటు అయ్యేటట్లు చూసుకుంటారు. ఈ సామెతలో మాటకారి జొన్న పొట్టునైనా అమ్మేస్తాడు కాని, మాటకారి కానివాడు మంచి జొన్నలను కూడా అమ్మలేడని అర్థం. అంటే ఒక వ్యక్తి సామర్థ్యం. చురుకుదనం తెలుస్తుంది. బంజారాలది వ్యవసాయక జీవనం. నీటి జాడే తెలియని అనంతపురం జిల్లాలో వర్షపాతం తక్కువగా ఆధారపడే సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను సుగాలీలు పండిస్తారు. అంతేకాకుండా సుగాలీలు ఎక్కడున్నా ఏ ప్రాంతంలో వున్నా ఈ పంటలను పండించడం పరిపాటి.

గర్‌బేర్ తాండ్రి, సగటేర్ భొజాయి (బీవాని భార్య అందరికీ వదినే)

వెలుతురు ముందు చీకటి లోకువ అన్నట్లుగా ధనికుని దృష్టిలో పేదవాళ్ళు ఎప్పుడూ లోకువే. సమాజంలో బాగా ఆర్థికంగా వెనుకబడిన జాతుల్లో సుగాలీలు కూడా ఒకరు. కాని వీరిలో నూటికో కోటికో ఒక్కరు అన్నట్లుగా ధనికులున్నారు. వీరు వారిని ఎప్పటికీ సమానంగా చూడనే చూడరు. ఇలాంటి సామాజిక రుగ్మత అన్ని జాతుల్లోనూ, ఉన్నదే. బీదవానితో పాటు, వానికి కట్టుకున్న భార్యను కూడా చాలా హీనంగా చూస్తారు. ఒకడు పేదవాడు అయినంత మాత్రాన చులకనగా ఎందుకు చూడాలి? మరీ అతని భార్యను హీనంగా ఎందుకు చూడాలనే ప్రశ్నలను సమాజమే సమాధానం చెప్పవలసి ఉంది. వాస్తవానికి ఈ సామెత ద్వంద్వార్థాలను తెలియజేస్తుంది. డబ్బున్నవారు ఏం చేసినా చెల్లుతుందని, వారిని ఎదిరించి నిలదీసే స్తోమత లేదనే భావన ధనకులలో ఉండటం గమనించవచ్చు.

తాట్కార్ర్ ఛేండి కత్రాకో, భాయార్ ఆస్రో అత్రా (తాటిచెట్టు నిడెంతో జీతగాడి ఆధారమూ అంతే)

కొందరు ప్రతి చిన్న పనికి ఎదుటి వాళ్ళ మీద ఆధారపడుతుంటారు. కాని సుగాలీలు స్వతహాగా కష్టజీవులు. ఎవరికి వారు కష్టపడి పనిచేస్తే జీవనం సుఖమయంగా సాగుతుందని వారి నమ్మకం. ఒకరిపై ఆధారపడడం అంత మంచిదికాదని, ఒకవేళ ఆధారపడ్డ వారి ఆధారం మాత్రం నామమాత్రమేనని వీరు బలంగా విశ్వసిస్తారు. తాటిచెట్టు ఎంత పొడుగున్నా అది ఇచ్చే నీడ మాత్రం కొంచమే అలాగే జీతగాడు ఎంతవాడైనా జీతగాడేనని, యజమాని పూర్తిగా తన జీతగాడి మీద ఆధారపడడం వ్యర్థమని ఈ సామెత తెలియజేస్తుంది. ఎవరు ఎక్కడున్నా ఎటువంటి క్లిష్ట పరిస్థితులలోనైనా పరులపై నమ్మకాన్ని పెట్టుకోకుండా స్వశక్తినే నమ్ముకొని జీవనం కొనసాగించాల్సిన విధానాన్ని ప్రబోధిస్తుంది.

రాజ్‌బోలతో దళ్‌హోల, గరీబ్ బోలతో ధాడీ హోల (రాజు

చెబితే సైనికదళం కదులుతుంది. బీదవాడు చెబితే దవడ కదలుతుంది)

బీదవాడు ఏమీ చేయలేడని తెలిపే నేపథ్యంలో నుండి ఆవిర్భవించిందే ఈ సామెత. రాజు మాట్లాడితే దళం అనగా సైన్యం కదులుతుందని, అదే బీదవాడు మాట్లాడితే కేవలం అతని దవడ మాత్రమే కదులుతుంది. సమాజంలో ఎవరికి ఎంత సామర్థ్యం ఉందో ఈ సామెత వల్ల తెలుస్తుంది.

సుగాలీల సామెతల్లో వాళ్ల జీవన విధానం, సమాజం పై వారికున్న అవగాహన తెలుస్తుంది. కావత్‌లు మంచి జీవనానికి ఉపదేశాలుగా ఉపయోగపడతాయి. ఈ సామెతల్లోని మానవీయ, తాత్త్విక కోణాలను పరిశీలిస్తే సుగాలీల పామరులకు అవే వేదాలుగా అనిపిస్తాయి. జీవితాన్ని అన్ని కోణాల నుంచి పరిశీలించి అనుభవంతో చెప్పిన సామెతలు సుగాలీలవి. వీటిలో కొన్ని సామెతలు తెలుగువారి సామెతలను పోలి ఉంటాయి. వీరి సామెతలలో ప్రధానంగా వారి జీవన ఆర్థిక స్థితిగతులు, భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి, మానవ స్వభావం, మానవీయ సంబంధాలు, సమాజంలోని అంతరాలు. వైయక్తిక భేదాలు, మొదలగు వాటినన్నింటిని సుగాలీల కావత్‌లు అద్దం పడుతాయి.

సుగాలీలు అటవిక జీవన నేపథ్యం ఉన్నప్పటికీ, లిపి రహిత భాష అయినప్పటికీ కేవలం వాగ్రూపంలోనే మానవుడికి నిత్యం చైతన్యవరచే ఎన్నో విషయ పరంపరాగతమైనటువంటి సామెతలు విస్త్రృత ప్రచారం పొందినాయి. నేటికి లక్షలాది సుగాలీల నాలుకలపై నిత్యం ఏరులై పారుతున్న సామెతలు ఎన్నెన్నో సుగాలీలు ప్రధానంగా గిరి (కొండ) పరిసర ప్రాంతాల్లో, అడవులకు దగ్గరగా ఉన్నప్పటికి మైదానప్రాంత వాసులతోపాటు పోటీపడుతూ చమత్కారంగా మాట్లాడుతున్నారు. సామెతలు మానవుణ్ణి అనుక్షణం శాస్త్రీయ దృక్పథాన్ని ఒక సన్మార్గంలో ప్రయాణించడానికి తోడ్పడుతున్నాయి. అందుకే సాహిత్యకారులు "సామెతలేని ఇల్లు ఆమెత వంటిది" అని ఉద్బోధించారు.

సభ్యసమాజానికి దూరంగా, ప్రకృతి ఒడిలో, పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ వారిలో అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, అనే తేడా లేకుండా వారిలో చైతన్యం కలిగించి విజ్ఞానవంతులుగా తీర్చి దిద్దడటంలో సామెతలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.



డుంగావత్ నరేష్ కుమార్ నాయక్
ఫోన్ : 9908513432

తణుకులో పెనుమెచ్చ సత్యనారాయణరాజు గారి ఇల్లు. వారి వరండాలో ఒక ముసలాయన కొల్లాయి కట్టుకొని ఒక తువ్వాలు పైన వేసుకొని కూర్చొని ఉన్నారు. నా వంక చూశారు- ఎవరికోసం అన్నట్లుగా - "జయపురం మహారాజావారు వున్నారా?" 'మీరెవరు?' అని ప్రశ్నించారు.

"నా పేరు రావూరు సత్యనారాయణ. కృష్ణాపత్రిక నుండి వచ్చాను" అన్నాను.

"అలాగా? మీరా! రండి" అని ఎవరినో పిలిచారు.

"సత్యనారాయణరాజుతో చెప్పు - రావూరు సత్యనారాయణ వచ్చారని" అని ఇంట్లో నుంచి వచ్చిన వారితో చెప్పారు. అప్పుడు ఆ ముసలాయనే మహారాజా విక్రమవదేవర్మగారని పరిచయం చేస్తే ఆశ్చర్యపోయాను.

"వడగళ్ళు" శీర్షిక కృష్ణా పత్రికలో నడుపుతున్నందుకు వారికి సన్మానం రు.116లు. కొత్తబట్టలు సమర్పించాను.

"నాకీ మహారాజా వేషం మధ్యలో వచ్చింది. అసలు మనిషి వేరు. అవసరం వచ్చినపుడే ఈ కోట్లు, కిరీటాలు ధరిస్తాను. తక్కిన సమయాల్లో విక్రమదేవవర్మగానే వుండటం నాకిష్టం" అన్నారు.

మేఘదూతంలో యక్షుడు

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

కవికుల తిలకుడని పేరుపడిన కాళిదాసు పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చే అతడి రచనలు రెండు–

కాల్పనిక భావుకత్వానికి మేఘదూతం, నాటకీయ చతురతకీ, పాత్ర కల్పనకీ అభిజ్ఞాన శాకుంతలమూను–

ఇప్పుడు ప్రస్తావిస్తున్న మేఘదూత ఖండకావ్యాన్ని మేఘసందేశం అని కూడా కొందరు వ్యవహరిస్తుంటారు. వాస్తవానికి మేఘం, దూత మాత్రమే. సందేశం యక్షుడిది. ఈ కావ్యాన్ని మహాకావ్యం అనే వారు కూడా ఉన్నారు. ("మేఘ దూతాభిధానం మహాకావ్యమ్"– అని.) కాని – ఏకదేశమైన విషయానికి ప్రాధాన్యం ఇచ్చే కావ్యాన్ని, ఖండకావ్యంగా సాహిత్య దర్పణమ్ నిర్వచించింది. ఆ విధంగా మేఘ దూతమ్ ఖండకావ్యమే. ప్రధాన గ్రంథం అంతా 126 శ్లోకాలు మాత్రమే.

ఇప్పుడు – చర్చనీయాంశం, ఈ కావ్యంలో మేఘం ద్వారా భార్యకి సందేశం పంపిన యక్షుడు ఎవరు? అని. కాళిదాసు మాత్రం ప్రారంభ శ్లోకంలో "కశ్చిత్ యక్షః" అని మాత్రమే ఊరుకున్నాడు. ఈ విషయంలో, మేఘదూతానికి వ్యాఖ్య వ్రాసిన మల్లినాథసూరి – "సీతకు రాముడు పంపిన సందేశాన్ని మనస్సులో పెట్టుకొని, కవి, మేఘసందేశం ఏర్పాటు చేశాడని అంటుంటారు" – అంటూ తన నాటి పండితాభిప్రాయాన్ని మాత్రం ఉటంకించాడు. అయితే సాహిత్య పరిశోధకులు మాత్రం అంతటితో వదలలేదు. తెలుగు పండితులు కూడా కొంత చర్చ చేయకపోలేదు.

1938 జూలై నాటి నవ్య సాహిత్య పరిషత్తు వారి 'ప్రతిభ' పత్రికలో తల్లావజ్ఝల శివశంకరశాస్త్రిగారు ఒక పుస్తక సమీక్ష చేసే సందర్భంలో, యీ విచారణ చేశారు. నాటికి (1938) 1368 సంవత్సరాల నాడు కాళిదాసును సర్గూజా సంస్థానంలోని 'రామగిరి'కి ప్రవాసం పంపడం సంభవించగా, అక్కడ ఎనిమిది నెలలు ఒంటరిగా గడుపుతూ, అప్పట్లో హిమవత్పర్వతానికి దక్షిణంగా ఉన్న, అలకానగరంలో నివసిస్తున్న, తన ప్రియురాల్ని తలుచుకొంటూ, మేఘదూతం వ్రాశాడట. ఈ విశేషాన్ని కలకత్తాలో 'కాళిదాస సమితి' వ్యవస్థాపకుడు మన్మథనాథ భట్టాచార్య (1938 జూన్‌లో) వెల్లడించాడట. అంతకు ముందటి వ్యాఖ్యాతలు కొందరు (వీరిలో జైనులు కూడా ఉన్నారు) ఇందులో కనిపించే 'కుబేర శాపం–యక్ష విరహం మాత్రపు' సన్నదారం కథ, కల్పితమనే భావించారు.

మేఘదూతంపై విపుల పరిశోధన చేసిన బుర్లీ శ్రీనివాసాచార్య అనే ఆయన, *'బ్రహ్మ వైవర్తపురాణం'*లో ఈ కథ వుందని పట్టుకున్నారట. పౌరాణికమైన ఆ ప్రేమకథలో ప్రధాన సూత్రప్రాయంగా, సూచనామాత్రంగానే విషయం గ్రహించి, కాళిదాసు రెండు సర్గల కావ్యం వ్రాశాడని నిగ్గుతేల్చారట. 1939 ఏప్రిల్ *భారతి* మాసపత్రికలో, *'బ్రహ్మవైవర్తపురాణ'* మూల శ్లోకాల భాగాన్ని ఉటంకిస్తూ – *'మేఘసందేశ మూలకథ'* పేరిట మా నాన్నగారు (ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి) ఒక వ్యాసం వ్రాశారు. విష్ణుపురాణం నుంచి రఘువంశ కథనీ, శైవపురాణం నుంచి కుమార సంభవ కథనీ, తీసుకుని కావ్యాలు వ్రాసిన ధోరణిలోనే 'మేఘదూత' కథాసూత్రాన్ని బ్రహ్మ వైవర్తం నుంచి తీసుకుని, తనకు కావలసిన రీతిగా కాళిదాసు మెరుగు పెట్టుకున్నాడని, సారాంశంగా ప్రతిపాదించాడు–

ఇక – ఈ వ్యాసంలో నేను ముందుకు తేదలచిన 'మేఘదూత' కావ్య ప్రేరణ నేపథ్యం పూర్తిగా వేరైనది.

కాశీ *సంస్కృత గ్రంథమాల* (చౌఖంబా సంస్కృత సీరీస్, వారణాసి) పక్షాన 1973లో వెలువడిన ఆచార్య శ్రీ చరణ తీర్థమహరాజ్ 'మేఘదూత' సంస్కృత వ్యాఖ్య చాలా కొత్త సంగతులు బయట పెట్టింది. దీని పేరు 'కాత్యాయనీ వ్యాఖ్య'. సంస్కృతంతో పాటు ఇంగ్లీషు వ్యాఖ్య కూడా ఆయనే

వ్రాస్తూ, 134 పేజీల బృహత్ పీఠిక కూడా లోతైన విశ్లేషణతో ప్రకటించాడు. తెలుగు పండితులు దీనిని పట్టించుకున్నట్టులేదు. ఈ కాత్యాయనీ వ్యాఖ్య, సంప్రదాయ సంస్కృత కావ్య వ్యాఖ్యల్లాగ కాకుండా, 'ఆ శంక-సమాధాన' పద్ధతిలో చదువరికి చాలా సుఖంగా ఉంటుంది. పధ్నాలుగు లిఖిత ప్రతులు, మూడు ముద్రిత ప్రతులు శోధించి, అన్నింటిలోని శ్లోకాల క్రమాన్ని శ్రద్ధగా పరిశీలించి, శ్రీ చరణ తీర్థ మహరాజ్, ప్రస్తుత ప్రతిని పరిష్కరించి, 126 శ్లోకాలు +3 ప్రక్షిప్త శ్లోకాలు విడమరచి, రూపొందించాడు. "కాత్యాయనీ వ్యాఖ్యా విశేషాలు" చెప్పడానికి ఈ వ్యాసం ఉద్దేశించదు కనుక, - మేఘదూత కావ్యంలో ఆధార సూత్రంగా నిలిచిన యక్షుని పాత్ర నేపథ్యం చెప్పడానికే పరిమిత మవుతున్నాను. ఈ పరిశోధనంతా చరణతీర్థ మహరాజ్‌ది. నేను చేసేపని ఒక విధంగా పునఃకథనం; ఇంతవరకు తెలుగు వారికి తెలిసే అవకాశం లేదు కనక-

మేఘదూత కావ్యంలో కథ, ఇంతవరకు అరకొరగా, పురాణ కథగా ప్రచారంలో ఉన్నది కానే కాదనీ, కల్పన అసలు కాదనీ, చారిత్రక యథార్థమనీ, యక్షుడు (కశ్చిత్ యక్షః) ఎవరో కాదు, కాళిదాసేననీ - చరణతీర్థ మహరాజ్ ప్రతిపాదన. ఈ విషయాన్ని తనే తొలిసారిగా బయట పెడుతున్నానని కూడా ఆయన చెప్పాడు.

ఆ చారిత్రక సత్యం ఏమిటంటే, కాళిదాసు కలియుగం (లేదా) యుధిష్ఠిర సంవత్సరం 3018లో జన్మించాడు. ఇది విక్రమ శకానికి ఒక శతాబ్ది ముందుది. విక్రమాదిత్య మహారాజు, కాళిదాసు, ఒకే వయస్సు వాళ్లు. విక్రమ శకం 3043లో ప్రారంభమైంది. 3068 సంవత్సరంలో కాళిదాసు జ్యోతిర్విదాభరణం అనే జ్యోతిష గ్రంథం వ్రాశాడు. ఇది 22 అధ్యాయాల గ్రంథం. చివరి అధ్యాయంలో 17 శ్లోకాలలో, కాళిదాసు విక్రమాదిత్యుని చరిత్ర విశేషాలు చెప్పాడు. ఆ సందర్భంగా - జ్యోతిర్విదాభరణం గ్రంథాన్ని తాను 3068 వైశాఖ మాసంలో ప్రారంభించి కార్తీకం నాటికి పూర్తి చేశాననీ వ్రాశాడు.

తూర్పు, పశ్చిమ దేశాల సంస్కృత సాహిత్య పరిశోధకుల్లో చాలామంది కాళిదాస - విక్రమాదిత్యులు క్రీస్తు పూర్వం 57 కాలానికి జీవించి ఉన్నారని భావిస్తున్నారు. యుధిష్ఠిర సంవత్సరం (రక్తాక్షినామ సంవత్సరం) కార్తీక శుద్ధ పాడ్యమినాడు విక్రమ శకం ప్రారంభమైంది. ఉజ్జయిని రాజు వీరసేనుడి కొడుకు విక్రముడు - అంటూ అనేకానేక చారిత్రకాధారాలతో కాళిదాస-విక్రమాదిత్యులు క్రీస్తుపూర్వం 57 ప్రాంతాల సమకాలికులని - ఈ కావ్యవ్యాఖ్యాత నిరూపిస్తున్నాడు.

ఇక - యక్షుడు, కాళిదాసు అనే నిరూపణ విషయానికి వస్తే -

మేఘదూతం సూచించే కథ :

ఒక యక్షుడు ప్రియభార్యా లోలుడై, తన ప్రభువైన కుబేరుడి సేవలో అలక్ష్యం చూపించడం వల్ల - ప్రభుని ఆగ్రహానికి గురై, తన సహజ మహిమకోల్పోయి, ఏడాదిపాటు ప్రియ భార్యకు దూరమై, విరహావస్థలో, ఆషాఢ శుద్ధ పాడ్యమినాడు కళ్ళబడిన మేఘం ద్వారా ఒక సందేశం పంపించాడు. (ఈ మేఘానిది నిజంగా ఓదార్పుయాత్ర).

అసలు సంగతి :

కుబేరుడు విక్రమాదిత్యుడికి ప్రతీక, అప్పట్లో కొత్తగా పెళ్ళయి ప్రియభార్యా వైభోగంలో ఉన్న కాళిదాసే యక్షుడు. 'మేఘనాథు'డనే అతడి స్నేహితుడే మేఘం. విక్రమాదిత్యుడు కాళిదాసుని తన రాజ్యం నుంచి బహిష్కరించడమే శాపం. ఆ కాలంలో కాళిదాసు మేఘదూతం వ్రాసి, తన స్నేహితుడి ద్వారా, ప్రియభార్యకు పంపించుకుంటే, దానిని విక్రముడు చూడడం తటస్థించింది. కావ్యం చదివి ముగ్ధుడైన రాజు, కాళిదాసుపై బహిష్కరణ తొలగించాడు. ఈ నేపథ్య సందర్భాన్ని విస్తారంగా ఈ వ్యాఖ్యాత చెప్పాడు.

అదేమంటే :

కాళిదాసు విక్రమాదిత్యుని కొలువులో నవరత్నాలలో ప్రముఖుడు. అంతే కాదు, విదేశీ వ్యవహారాలు, దాన ధర్మాదికాలు, పర్యవేక్షించే శాఖల ఎనిమిదిమంది మంత్రులలో ఒకడు. (మిగిలిన ఎనిమిది మంది రత్నాలు - ధన్వంతరి,

క్షపణకుడు, అమరసింహుడు, శంకుడు, వైతాళిభట్టు, ఘటకర్పరుడు, వరాహమిహిరుడు, వరరుచి).

కాళిదాసుకు 32 ఏళ్ల వయస్సులో భార్య చనిపోయింది. ఆమె మీది ప్రేమకొద్దీ, ఏడాదిపాటు రెండోపెళ్ళికి ప్రయత్నాలు చెయ్యలేదు. ఇంతలో వింధ్యరాజు కూతురు (కాళిదాసు శిష్యురాలు, సంస్కృత పండితురాలు) అతడి గుణగణాలు, వ్యక్తిత్వం, పాండిత్యం ఇష్టపడి మోహించింది. ఇందుకు వింధ్యరాజు ఒప్పుకోలేదు. ఈ వింధ్య రాజు విక్రమాదిత్యుడికి బావగారు. అతడికీ ఈ పెళ్ళి ఇష్టం లేదు. మేనకోడలు ఏ రాజ్యాధినేతనో పెళ్ళి చేసుకోవాలని ఆశించాడు. ఈ ప్రయత్నం మానుకోమని కాళిదాసుకి నచ్చచెప్పాడు. రాజకుమారి మొండిపట్టు పట్టేసింది. వింధ్యరాజు, రాణి బలవంతం మీద, ఇక గతిలేక, పెళ్ళికి ఒప్పుకున్నాడు.

పెళ్ళయిన నాటి నుంచి కాళిదాసు రాజ వైభోగాలలో ములిగితేలుతూ, ప్రియ భార్యను వదిలి ఎక్కడికీ వెళ్లడం మానేశాడు. (ఈ పెళ్ళి ఎనిమిదవ విక్రమసంవత్సరంలో జరిగింది) కడకు మంత్రి వర్గ, పండిత వర్గ సమావేశాలకు వెళ్లడం కూడా మానుకున్నాడు. అన్ని విషయాల్లోనూ అశ్రద్ధ, అలసత్వం, పెరిగాయి. ప్రభుత్వ విధులు నెరవేర్చక తప్పని సరికద! పనులు చాలా నిలిచిపోయాయి. విక్రమాదిత్యునికి కాళిదాసు ప్రవర్తన చికాకు కలిగించి– అతడిని పదవుల నుంచి తొలగించాలనుకున్నాడుగాని, కవిగా అతడిమీద గౌరవం వల్ల ఆ పని చెయ్యలేకపోయాడు.

ఇలావుండగా–ఒక సందర్భంలో మగధ అంగనాయకులు రాజు మీద తిరుగుబాటు చేశారు. విదేశీ వ్యవహారాల శాఖామంత్రిగా ఆ వ్యవహారం కాళిదాసు సర్దుబాటు చెయ్యవలసి ఉంది. అతడసలు పట్టించుకోనేలేదు. విక్రమాదిత్యుడే చేసుకోవలసివచ్చింది. దీనికి తోడు రాజు పెద్దకొడుకు హఠాత్తుగా జబ్బు పడ్డాడు. కాళిదాసు దానినీ పట్టించుకోలేదు. రాజు కోపం పట్టలేక పోయాడు. రాజ్యం నుంచి ఏడాది పాటు కాళిదాసుకు రాజ్య బహిష్కారం విధించాడు. ఇది విక్రమ సంవత్సరం కార్తీక మాసంలో దశమినాడు జరిగింది. (శుక్ల పక్షమో, కృష్ణపక్షమో తెలియదు).

కాళిదాసుకి ఇప్పటికి తన తప్పిదం తెలిసింది. రాజును చూడడానికి ముఖం చెల్లలేదు. వెంటనే ఉజ్జయిని సరిహద్దులు దాటి వెళ్ళిపోయాడు. ఈ క్లిష్ట సమయంలో కాళిదాసు ప్రాణమిత్రుడు మేఘనాథుడు కూడా అతడి వెంటనడిచాడు. ఈ సంఘటన ఉజ్జయినీ రాజ్యం అంతటా కలకలం రేపింది. రాజకుటుంబంలో కూడా, విషాదం కమ్ముకుంది. రాజుకి బాధ ఆశ్చర్యం కలిగాయి. రాజు చర్య చాలా కఠినంగా ఉందని జనం చెప్పుకోసాగారు. కాళిదాసు తననొకసారి కలిసి క్షమాపణకోరవచ్చు కదా! అని రాజు ఆశించి, భంగపడ్డాడు.

రాజుతో కాళిదాసుకు వచ్చిన విభేదం తెలిసిన ఇతర ప్రభువులు, అతడి కవితా శక్తి మీద ఇష్టం కొద్దీ, తమ తమ స్థానాలకు ఆహ్వానించినా, కాళిదాసు వెళ్లలేదు. ఉజ్జయిని విడిచాక – ప్రచ్ఛన్నంగా మారువేషం ధరించి, 'యక్షుడు' అని పేరు మార్చుకుని, తన మిత్రుడు మేఘనాథుడితో కలిసి– అమరనాథ్, కాశ్మీర్, కైలాస్, మానససరోవర్, తీర్థయాత్ర కొనసాగించాడు. అనంతరం నాశిక్, పంచవటి, చేరుకున్నాడు. అప్పటికి దాదాపుగా అతడి ప్రవాసకాలం పూర్తయింది. వేసవి ముగిసి, వర్షాకాలం ముంగిట ఆషాఢం మొదలు కాబోతోంది. ప్రియభార్యకు దూరంగా అతడప్పుడు తీవ్రవిరహాన్ని చవి చూశాడు. ఆషాఢం మొదటి రోజున– అన్యోక్తి పద్ధతిలో – మేఘదూత కావ్యం ప్రారంభించాడు. పూర్తిచేసి, తన ప్రాణ స్నేహితుడు మేఘనాథునిద్వారా, కేవలం పదిహేను రోజులలో, పంచవటి నుంచి ఉజ్జయినికి ఆ కావ్యాన్ని పంపించాడు. దానితోపాటు ఒక ఉత్తరాన్ని కూడా ప్రియభార్యకు అందజేశాడు. తన కందిన వెంటనే చదివి, దానిని రాజుకు ఆమె పంపించింది. కావ్యం చదివి రాజు పరవశించి పోయాడు – ఒక శ్లోకంలో... "యాచ్ఞామోఘా వర మధిగుణే నాధమే లబ్ధకామా" అనే వాక్యం చదివి కాళిదాసు, తనని అన్యాపదేశంగా క్షమ కోరినట్టే భావించాడు. ఆ వాక్యాని కర్థం!

"ఉన్నత సంస్కారవంతుణ్ణి వేడుకుని వెల్తిపడినా బాధలేదు; అధముడి ద్వారా కోరిక తీరడం కంటె అది చాలా నయం" అని. రాజు వెంటనే బహిష్కరణ ఎత్తివేసి, కాళిదాసును ఆహ్వానించడానికి అట్టహాసంగా గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు, సైన్యపరివారం, పంపించాడు– ఇదీ విశేషం!! ప్రియభార్యావియోగమనే యదార్థఘటన, కాళిదాసును తీర్థయాత్రలకు తిప్పి, మేఘదూతమనే గొప్ప కాల్పనిక కావ్యానికి జన్మనిచ్చింది.

ఇంతకథ చరణ తీర్థ మహారాజ్‌కి ఎక్కడ దొరికింది? దానికీ చరిత్ర ఉంది.

సుమారు 1913 సంవత్సరం ప్రాంతాల తన విద్యాగురువైన శ్రీ కేవల్‌రాం లీలాధర్‌శాస్త్రి, 'రాజ్‌కోట'కు

చెందిన కథియవార్ సంస్కృత పండితుడు శ్రీ జీవనరాం శాస్త్రి, 'మోర్వి'కి చెందిన మరొక పండితుడు శ్రీ శంకరలాల్ శాస్త్రి జరిపిన ఒక విస్తృత చర్చ, ఈ ప్రతిపాదనకు ఆధారమట.

ఇప్పుడు ప్రతిపాదించిన మేఘదూత కావ్యనేపథ్య చరిత్ర విశేషాలు, ఆ 'శాస్త్రిత్రయం' సేకరించుకున్న గ్రంథ సంచయంలోనో, పత్రాలలోనో, ఉండి ఉండాలని చరణతీర్థ మహరాజ్ గట్టిగా నమ్ముతున్నాడు. ఆ ముగ్గురు మహావండితులకు ఈ చరిత్రకు సంబంధించి ఏకాభిప్రాయం ఉందని ఆయన నమ్ముతున్నాడు. అరవై ఏళ్లక్రితం, వారు చర్చించడం నేను విని ఉన్నాను. (1973కి పూర్వం) ఈ విషయం వ్రాసి ఉన్న ఒక పాత లిఖిత ప్రతి జీవన్‌రామ్ శాస్త్రిజీ వద్ద ఉండేది. అది శ్లోకాల రూపంలో ఉంది. అప్పట్లో నేను విద్యార్థిగా ఉండడం వల్ల పెద్దగా పట్టించుకోలేదు కాని, తరవాత ముప్ఫయ్యేళ్లకి విశదంగా చదివాక, (మేఘదూతకావ్యం) నాకా సంగతులన్నీ గుర్తుకు వచ్చాయి. ఈ వ్యాఖ్య వ్రాసే సందర్భం వచ్చింది కనుక, ఇప్పుడు బయటపెడుతున్నాను. ఆ 'శాస్త్రి త్రయాని'కి సంబంధించిన వారసులు, బంధువులు వంటివారి వద్ద ఈ వివరాలు తెలిపే సమాచారం దొరకవచ్చు.

సారాంశం ఏమంటే– చరణ్‌తీర్థ మహరాజ్ మేఘదూత కాత్యాయనీ పీఠికలో పేర్కొన్న 'చరిత్ర', తాను ఆ శాస్త్రిత్రయం చర్చిస్తూండగా విని – జ్ఞాపకం పెట్టుకుని, వ్రాసినది. సాధికారికంగా లిఖిత సమాచారం తన కంటితో చూసి, చెప్పినది కాదు. ఉండడం మాత్రం యథార్థం.

ఇప్పుడొక సారి వెనక్కి చూసి, ఊహిస్తే, 1938లో, కలకత్తా కాళిదాస సమితి వ్యవస్థాపకుడు మన్మథనాథ భట్టాచార్య కూడా కాళిదాసు 'ప్రవాస' సమాచారం ప్రస్తావించడం కూడా పరిగణనలోకి తీసుకుంటే – మేఘదూతంలోని 'యక్షుడు' అతడే కావచ్చునని నిర్ధారించగల అవకాశం ఉంది.

లిఖిత పూర్వకమైన, సాధికారికమైన, ఆ సమాచారం బయటపడితే – ఆత్మాశ్రయంగా 'భావకవిత్వం' చెప్పిన కవి – తొలిభారతీయకవి – కాళిదాసే కాగల వీలున్నది. మి

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
సికింద్రాబాదు,
ఫోన్ : 9848078079

ఇల్లు

ఈ నవల ఒళ్లు దగ్గర పెట్టుకొని కొంచెం భయంతోనూ కొంత భక్తితోనూ కూడా రాసేను. నిజాయితీతో కూడా రాసేనని అనుకొంటున్నాను.

ఇందులోని పాత్రలన్నీ కేవలం కల్పితాలు. ఎవవర్నీ ఉద్దేశించి చిత్రించినవి ఎంత మాత్రం కానేకావు. ఈ నవల్లో కొంతవరకూ కుల ప్రస్తావనా (బ్రాహ్మలు అనబడే వారిలో) శాఖాభేద ప్రస్తావనా కొంతమేరకి వుంది కాని పాత్రల్ని వ్యక్తులుగానే వర్ణించేను. ఆయా కులాల శాఖల ప్రతినిధులుగా ఎంతమాత్రం చిత్రీకరించలేదు.

నేను వెలనాటి బ్రాహ్మణులు అని పిలువబడే శాఖలో పుట్టేను. కాని, బ్రహ్మణ సాంప్రదాయంలో పెరగలేదు. మా నాన్నగారూ, అమ్మగారూ కూడా కుంభకోణం గురువుగారు అని మా ఇంట్లో పిలువబడే మాస్టర్ సి.వి.వి. గారికి అనుంగు శిష్యులుగా వుండేవారు. నాకు తెలిసినంత మట్టుకు వారి శిష్యులకి కులమత భేదాలు లేవు. ఆ సాంప్రదాయమే నాది కూడా.

నాకు మృత్యువు ఆసన్నం అవుతోంది. నేను ఎవ్వర్నీ మోసం చేసి, అబద్ధాలు ఆడి మూటగట్టుకొని మోసుకుపోవలసింది ఏమీ లేదు. అందుచేత –

ఈ నవల్లో తప్పులు ఏమైనా చేసి వుంటే వాటిని క్షమించమని పాఠకులకి విజ్ఞప్తి చేసుకొంటున్నాను.

- రాచకొండ విశ్వనాథశాస్త్రి

తెలుగు స్వీయచరిత్రలలో -

తల్లి ప్రస్తావన

- కణుగుల వేంకటరావు

నా సవతి తల్లి సుభద్రమ్మ ఒక తాసీల్దారు గారి అమ్మాయి. (నా మొట్టమొదటి ఖండకావ్య సంపుటి ప్రభవ ఈవిడకే అంకితం.) సవతి తల్లిని రాక్షసిగా అందరూ ఎందుకు చిత్రిస్తారో నా కర్థం కాదు. మా సుభద్రమ్మ నా పాలిటి దేవత. *- శ్రీశ్రీ అనంతం లో...*

ఇరవయ్యవ శతాబ్దపు మొదటి దశకం నుంచే, తెలుగులో ఆత్మకథలు (స్వీయచరిత్రలు) మొదలైనాయనీ, ఒక శతాబ్ది కాలంలో ఇటువంటివి రెండు వందల రచనలు రావడం చెప్పుకోదగ్గ విషయమనీ ప్రముఖ సాహితీ వేత్త డా॥ అక్కిరాజు రమాపతిరావు ఒకచోట వ్రాశారు. వాటిలో 19వ శతాబ్దంలోనూ, 20వ శతాబ్దపు పూర్వార్ధంలోనూ జన్మించినవారి స్వీయచరిత్రలలో పెక్కింటిని పరిశీలిస్తే మనకొక ఆసక్తికరమైన విషయం వెల్లడౌతుంది. ఈ తొలినాటి స్వీయచరిత్రలను వ్రాసుకున్నవారు దాదాపు అందరూ మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. స్వశక్తితో పైకి వచ్చిన వారు, ప్రసిద్ధులైనవారు. అన్ని రంగాలకూ చెందినవారు. అయితే ఆ స్వీయచరిత్రలలో తల్లిని ఆప్యాయతతోనూ, కృతజ్ఞతాభావంతోనూ జ్ఞాపకం చేసుకున్నవి కొన్ని మాత్రమే! ఆదిభట్ల నారాయణదాసు, జాషువా తమ తల్లులను ఎంతో ఆప్యాయంగా పద్యరూపంలో వర్ణించినప్పటికీ, తన తల్లిని అందునా సవతితల్లిని తనపాలిటి దేవతగా చెప్పుకున్నవారు శ్రీశ్రీగారే!

కొందరి స్వీయచరిత్రలు వారి వారి ఆధ్యాత్మిక అనుభవాలకు, సాహిత్య, సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు పరిమితమైనందున వాటిలో తమ బాల్య జ్ఞాపకాలను కుదించి చెప్పడం ఒక కారణం కావచ్చును. అటువంటి స్వీయచరిత్రలను మినహాయించినా, మిగిలిన వాటిలో తల్లి ప్రస్తావన ఎంతోకొంత వివరంగా కలవి కొన్ని మాత్రమే! కొన్ని తల్లి ప్రస్తావనలు చూడండి :

స్వీయచరిత్ర - కందుకూరి వీరేశలింగం :

జననం : 16-4-1848, తొలి ప్రచురణ - 1911

"పురిటి దినములలో నాకు చేసిన యపథ్యదోషము నా దగ్గనకు కారణమని నా తల్లి నాతో నెన్నియో సారులు చెప్పి నేను కాస బాధచే శ్రమపడుచున్నప్పుడు నన్ను గూర్చి పరితపించుచుండెను."

అప్పుడెల్లవారు నా జీవితముదెస నిరాశచేసికొనిరట. కన్నులు మూతపడగా నొకదినమెల్ల నేను కాలుచేయి సహితము ఆడించక నిర్జీవ ప్రతిమవలె నుంటినట. చచ్చితిననుకొన్న నేను ఎట్లు బ్రతకగలిగితినో తనకే ఆశ్చర్యము కలిగించెనని పలుకుచు నా జనని తానప్పుడు నా నిమిత్తము పడిన మనోవేదనయు మ్రొక్కుకున్న మ్రొక్కులును మసూచి రోగము వచ్చిన వారిని గూర్చిన ప్రసంగము వచ్చినపుడు తోడివారితో చెప్పి నన్ను వారికి జూపుచువచ్చెను.

నా యెఱుక - ఆదిభట్ల నారాయణదాసు :



జననం : 31-8-1964, ప్రచురణ - 1976

సీ॥ బహుదేశ భాషల బ్రభుల మెప్పించిన
మరునాడు వెంకన్న మనుమరాలు
పార్వతీ శివులని ప్రఖ్యాతి గొన్న జ
గ్గయ్య సీతమ్మల నాల్గవ కుమార్తె
గున్న టేన్గుల వలె నున్నతి గన్న యై
దుగురన్నదమ్ముల తోడఁ బుట్టు
పసితనంబున భాగవత పురాణము నాకుఁ
గఱపి నన్బెంచు నా కన్నతల్లి
కడుపుచల్లగ నేపురు కొడుకు లమంది (జి)
కూతులన్నల్వురన్గాంచి కులము పొదల
నైదవతనంబు మోయ నిల్లాలు చదువు
లవ్వయను బిరుదంచు నాయమ్మ నరస(యు).

తండ్రి కొట్టగా నింటికి బర్విడి పారిపోయి మా యమ్మతో నీ సమాచారము చెప్పగా నాపె నా యొడలంతయు నిమిరి, కన్నీరు నించుచు నెంతలేసి దెబ్బలు కొట్టినారు క్రూరులని నన్నోదార్చెను. పదిమంది పిల్లలను గన్నదిగాని, యెంత కోపము వచ్చినను "నీ యమ్మ కనులు మండా" యనుట తప్ప మాతల్లి మమ్మెప్పుడైన తిట్టిగాని, కొట్టిగాని యెరుగ దెంత శాంతురాలోగాని.

స్వీయచరిత్ర : చిలకమర్తి లక్ష్మీనరసింహం :

జననం : 26-9-1867, తొలి ప్రచురణ - 1944

ఇచ్చట మా తల్లి గురించి కొంత చెప్పవలసి యున్నది. ఆమె కోదరికపు బాధ మిక్కిలి పడెను. మా పితామహి మిక్కిలి కోప స్వభావురాలు. ఆమె చేత మాయమ్మ పడిన బాధలనేకములు. మా తండ్రి గూడ మాయమ్మ యెడ కఠినముగనే ప్రవర్తించెను. అప్పుడప్పుడు మా యమ్మను మా తండ్రిగొట్టుటజూచి నే నేడ్చెడి వాడను. మాయమ్మ గర్భవతియై చుట్టుప్రక్కల నూతులకు బోయి, నీళ్ళుతెచ్చి, చెరువునకు బోయి అంట్లుదోముకొని, మంచినీళు ళ్ళదెచ్చి ధాన్యము గూడ దంపు కొనవలసినదయ్యెను. ఆమె కష్టములు మా తండ్రిగాని, మా పితామహిగాని, కనిపెట్టెడి వారుకారు. మా మేనత్త మాత్రము మాతల్లియెడ నించుక దయగనుండెడిది.

నేనొకసారి రాను 13 మైళ్ళు పోను 13 మైళ్ళు నడచుటచే పాదములు పొక్కెను. నెత్తురు గ్రమ్మెను. మా తల్లి మిక్కిలి విచారించి, వేడినీళ్ళతో పాదములు కడిగించి బాధ తగ్గించెను."

నా జీవిత యాత్ర - టంగుటూరి ప్రకాశం :

జననం : 23-8-1872,

''ఒకరి కుటుంబము మీద ఆధారపడి, వారికి బాధ కలిగించడం కన్న స్వోదర పోషణార్థం నలుగురికింత అన్నంపెట్టి జీవించడమే గౌరవప్రదమని మా అమ్మగారు నిర్ణయించింది. ఎల్లాగైనా నాలుగు కాలాలపాటు శ్రమపడి తలకాచుకొని ఈ పిల్లల్ని ప్రయోజకుల్నిగా చేస్తే తన కష్టాలు గట్టెక్కుతాయని ఆమె నమ్మకం. అదే మాతృప్రేమలో ఉండే అమృతం.

చిన్ననాటి ముచ్చట్లు : కె. ఎన్. కేసరి

జననం : 1886కు కనీసం పదిసంవత్సరములు ముందు. తొలి ప్రచురణ - 1953

నాకు ఉన్న ఊరులో బిచ్చమెత్తుకొనుటకు లజ్జగా ఉండేది. అందుచేత కృష్ణయ్యతో కూడా బసవన్న పాలెమునకు జోలె కట్టుకొని భిక్షమునకు పోతిని. కృష్ణయ్య జోలికన్న నాది పెద్దదయినది, మోయజాలనైతిని. అప్పుడు నా అవస్థను చూచి కృష్ణయ్య నా మూటను కూడ కొంచము దూరము వారే తీసుకొనిరి. మధ్యాహ్నమునకు ఇంటికిజేరినాము. అప్పుడు నాతల్లి జోలె మూటను చూచి సంతసించినది, గాని వెంటనే నా చెమటను, అలసట, ఆయాసము చూచి భోరున ఏడ్చినది. తక్షణమే నన్ను స్నానము చేయించి, కడుపునిండ అన్నము పెట్టి నిదుర పొమ్మని ఆమె భోజనమునకు పోయినది. ఆమె భోజనము చేసి వచ్చేలోపలనే నేను నిద్రపోతిని. నా తల్లి నా కాళ్ళవైపున కూర్చుండి ఏడ్చుచుండెను. నాకు మెలకువ వచ్చి ''ఎందుకేడ్చెదవమ్మా'' అని నేనడుగగా నా కాళ్ళలో ముళ్ళు గుచ్చుకొని యుండుటను జూసినది. నేను భిక్షాటనకై పోయివచ్చిన డొంకన తుమ్మముళ్ళు విస్తారముగా నాకాలిలో విరిగియుండెను. వాటినన్నిటినీ ఆమె సూదితో మెల్లగా తీసివైచి మరల ఎన్నడునూ అట్లా భిక్షాటనమునకు పోనని నాచే ప్రమాణము చేయించినది.

నవ్యాంధ్రము : అయ్యదేవర కాళేశ్వరరావు

జననం : 22-1-1881

మాతల్లి వరలక్ష్మమ్మగారు గొప్ప సాధ్వీమణి. మహాలక్ష్మీదేవి విగ్రహమును ప్రతిదినము పూజించెడిది.

మాయింటికెవ్వరు వచ్చిననూ నాదరించి యతిథి సత్కారము చేయుటలో మాతల్లిగారు పేరెన్నికగన్నది. దయార్ద్ర హృదయురాలు. ఆమె పుట్టింటివారు మాదిరాజువారు. తెలంగాణములో ఖానాతు తాలూకా పరిటాలకు దేశముఖు దేశపాండ్యాలు. అప్పుడప్పుడు మా అమ్మ తనతో కూడ నులకమంచపు సవారీలో నెక్కించుకొని తనపుట్టింటికి జుజ్జూరుకు తీసుకొని వెళ్ళేది.

స్వీయచరిత్ర : కామరాజు హనుమంతరావు :

జననం : 1885, తొలి ప్రచురణ - 14-9-1976

చాలా గారాబముతో నాతల్లి నన్ను పెంచుట తెలియును. పంచదార, నెయ్యి, పాలు వేసి నాకు అన్నము తినిపించెడిది. వీపు మీద నన్ను మోసికొనుచు ఆమె ఉదయమున ఇంటిపనులు చేసికొనుచుండెడిది. ఆడుపిల్లలవలె నాకు చెవులకు జూకాలు, మెడలో హారములు పెట్టెడిది. నా కిష్టమయిన మధుర పదార్థములు తినిపించుచు ఎప్పుడునూ

చూడండి 50వ పుట...

ఈ నల్లని రాలలో...

– ఎన్నార్కె

రాళ్లను దర్శించి, వాటి గుండెలను స్పృశించాలను కోవటం ఎంతగొప్ప ఆలోచన!

ఆ ఆలోచనను ఆచరణలో పెట్టాడు రోహిణీకుమార్. రోహిణి అంటేనే మనకు ఎండ వేడిమి గుర్తుకొస్తుంది. మనకో సామెతుంది. రోహిణీ ఎండలకు రాళ్ళు పగులుతాయని. కానీ రోహిణికుమార్ తన కుంచెతో వాటి ఆత్మను చల్లగా ఆవిష్కరించాడు.

మన పురాతన సంపదలలో అత్యంత సహజ సంపద అరణ్యాలు, నదులు, రాళ్ళు, రప్పలు. డక్కన్ పీఠభూమిలో నున్న రాళ్ళకు ఒక ప్రత్యేకత ఉంది. అవి రకరకాల ఆకృతులను పోలివుంటాయి. ఎన్నో రాళ్ళు నైరూప్య శిల్పకళ రూపాలుగా, కానవస్తాయి. కొన్ని శిల్పాలను అక్కడ నుంచి ఎత్తుకొచ్చి, ఇప్పుడు జరుగుతున్న ఆధునిక శిల్ప ప్రదర్శనలో ఎక్కడైనా పెట్టవచ్చు. దాని క్రింద బ్లేక్ అనో పికాసో అనో మూర్ అనో వ్రాస్తే చాలు విస్తుపోయి చూస్తారు వెఱ్ఱి జనం. అవి ప్రకృతి చెక్కిన శిల్పాలని గుర్తించలేరు.

నిలువుగా, కాపలా దారులుగా కనిపించేవి కొన్ని, అడ్డంగా ప్రకృతి సోయగాన్ని చూస్తూ విశ్రాంతి తీసుకున్నట్లు కొన్ని, ఏ క్షణంలో క్రిందికి జారిపడతాయో అన్నట్లు నునుపు తేలిన కొండ అంచుల్లో కొన్ని, జారిపడుతూ మధ్యలో ఆగినవి కొన్ని, గంపెడు సంతానంగా ఒక దానిపై మరొకటిగా పేర్చబడి రాశులుగా కనిపించేవి మరికొన్ని.

మనకు చూసే కళ్ళుండాలి, మనసులో చూసి వాటిని ప్రేమించే భావుకత ఉండాలి, అప్పుడు అందులో ఎంత కవిత్వం దాగి ఉందో తెలుస్తుంది. వీనుల విందైన నిశ్శబ్ద రాగాలాపనలవి. మనుషులు పుట్టక పూర్వం నుంచి అవి అక్కడనే ఉన్నాయి. భూమిలోని ద్రవ పదార్థం ఘనీభవించిన తరువాత అవి రూపు తీసుకున్నాయి. ఇవి ప్రకృతి చెక్కిన సహజ కళాకృతులు.

వేడిమికి దూరంగా ప్రకృతి నేసిన పందిరిలా చల్లగా ఉండే కోనసీమలో పుట్టి, పెరిగాడు రోహిణీకుమార్. 1947లో జన్మించిన రోహిణీకుమార్ అమలాపురం హైస్కూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేసినపుడు అక్కడ డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న పేరి సుబ్బారావుగారి నుంచి ప్రభావితం అయినాడు. ఆయనే అతని తొలి గురువు. ఆ తరువాత కాలంలో విజయనగర లలిత కళాశాలలో పనిచేసి వచ్చిన బి. మాధవరావుగారు ఆయనను ప్రభావితం చేసినవారిలో ముఖ్యుడు.



రోహిణీకుమార్

తండ్రి యల్లమిల్లి భీమశంకరం కెప్టెన్ భీమశంకరంగా అమలాపురంలో ప్రసిద్ధుడైన డాక్టరు. కుటుంబ సభ్యులందరిలోనూ జన్మతః అబ్బిన కళాభినివేశం ఉంది. ఇంటిలో అందరూ ఏదో ఒక కళలో నిష్ణాతులే.

నాన్న కెప్టెన్ భీమశంకరం మిలట్రీలో పనిచేసి వచ్చిన డాక్టర్. యమ స్ట్రిక్ట్. కొడుకును డాక్టర్‌ను చేయాలనుకున్నాడు. రోహిణికది బలవంతపు బ్రాహ్మణార్థమైంది. చెప్పా పెట్టకుండా వరంగల్ ఆయుర్వేద కళాశాల నుంచి రెండు సంవత్సరాల అనంతరం ఇంటికి వచ్చేశాడు. తండ్రికి ఇష్టం లేకున్నా తన అభివ్యక్తి వరంగా జీవితాన్ని కొనసాగించాలనుకున్నాడు. లలిత కళాశాలలో ప్రవేశార్హత పొంది,

ఉన్నత స్థానంలో 1973లో ఉత్తీర్ణుడై తానేమిటో ప్రజలకు చూపించాడు. తరువాత జి.డి.సి. క్రియేటివ్ అడ్వర్టైజ్‌మెంట్ స్థాపించి ఎన్నో కార్పోరేట్ సంస్థలకు తన క్రియేటివ్ అడ్వర్టైజ్‌మెంట్ ద్వారా సహాయ సహకారాలందించాడు. కాని జీవితంలో ఏదో ఒక వెలితి అతన్ని వెంటాడసాగింది. కళాకారునిగా కాక వాణిజ్యపరంగా తాను ఒక మూసలో బంధించబడ్డాననే భావనకు లోనై స్వతంత్ర జీవనం ప్రారంభించాడు.

ఎన్నో అవార్డులు మరెన్నో రివార్డులు పొందారు. హైదరాబాదు ఆర్ట్ సొసైటీలోఆయన వేసిన చిత్రాలు 1995, 2006, 2007, 2008, 2009, 2010, 2011 సంవత్సరాలలో ప్రశంసనీయమైన కళాకృతులుగా (Highly Commended award) గుర్తింపు పొందాయి. లేపాక్షి శిల్పాలపై ఆయన వేసిన చిత్రాలు మరో ప్రశంసనీయమైన కళాకృతులు. శిలలపైనున్న సన్నటి గరుకు కాగితంలాంటి గచ్చుతనాన్ని సుతిమెత్తగా మనకి తగిలేలా చిత్రించటం అతని ప్రత్యేకత. ఈ విషయంలో తన గురువు శ్రీ కొండపల్లి శేషగిరిరావు అని చెప్పి మురుస్తాడు.

రోహిణీ కుమార్‌ది చిన్నకుటుంబం, చింతలు లేని కుటుంబం. భార్య భాగ్యలక్ష్మి సార్థకనామధేయురాలు. కొడుకు భీమశంకరం ఎంబియే చదివి ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు అన్నపూర్ణ తండ్రిలానే కళాకారిణి. ఎమ్.ఎఫ్.యే. పూర్తి చేసింది.

రాళ్ళు, రప్పలను చిత్రాలలో బంధించి, వాటి సౌందర్యాన్ని అందరికీ చూపిన రోహిణీకుమార్ ప్రస్తుతం తాను పుట్టి పెరిగిన కోనసీమలో అమలాపురానికి కూతవేటు దూరంలోనున్న ఇందుపల్లి గ్రామంలో, చుట్టూ తోట దాని మధ్య ఒక ఆధునిక కుటీరంలో నివాసం ఏర్పరచుకొని ప్రతిదినం ప్రకృతిని పలకరిస్తూ ఉంటారు. అన్ని మాధ్యమాలలోనూ చిత్రాలు గీస్తాడు.

జలవర్ణ చిత్రాలు అతని ప్రత్యేకత. జలవర్ణాలు ఎప్పుడూ లలితకోమలంగా ఉంటాయి. అందుకనే అతని చిత్రాలలో కొండలు, కోనలు, రాళ్ళు, రప్పలు వెన్న రాసుకున్నట్లుగా మెత్తగా ఉంటాయి.

రూపం ఉన్నా ప్రాణం లేని రాళ్ళు, రప్పలకు తన చిత్ర కళ ద్వారా జీవం ప్రసాదించాడు.

మూడవ అట్ట : దక్కన్ పీఠం, చిత్రం వీరు వేసినదే.

ముఖచిత్రం : ఈ బొమ్మ నాది; చిత్రకారుడు – రోటమ్ గ్రూస్.

రెండవ అట్ట : చరిత్ర పుటలు; చిత్రకారుడు – విజయ్ చౌహాన్.

నాల్గవ అట్ట : ఈ నేల నాది; చిత్రకారుడు – మార్టిన్ గ్రిల్లీ. అమెరికా దేశంలోని టెక్సాస్ రాష్ట్రంలో కొండకోనల్లో పుట్టి పెరిగాడు. తన చుట్టూ ఉన్న నేటివ్ అమెరికన్ ఇండియన్స్ జీవన విధానాలను అధ్యయనం చేసి రంగుల్లో బంధించాడు. 18 సంవత్సరాల వయసు నుంచి కౌబాయ్‌గా జీవించాడు. 20 ఏళ్ళ వయసునుంచి చిత్రకళకు అంకితమై పశ్చిమ అమెరికా జీవన శైలిని నిశితంగా పరిశీలించటమే కాక, ప్రకృతి దృశ్యాలను గాఢమైన రంగులతో బొమ్మ కట్టి మనకు చూపించాడు. ఈ చిత్రంలో చెప్పినట్లు నిజానికి అమెరికా వాళ్ళదే కదా!

సంతోషము గొలుపుచుండెడిది. ఇట్టి అత్యంత ప్రేమ పూర్వక పరిచర్యలు నా స్మరణకు వచ్చుచున్నవే కాని, ఆమె పావన రూపము స్పష్టముగా నామనస్సుకు తట్టుటలేదు. నేను పసివాడిగా నున్నపుడే నా మూడవ ఏట ఆమె గతించెను.

నాకథ : జాషువా :

జననం : 28-10-1895

కొడుకులు కన్న స్వర్గములు గొప్పవిగావను నాడెమైన ప్రే
ముడి నవనాదులందొణికి పొంగులు వార స్వకీయ రక్తమున్
బిడిచి కుమార్తనోవి కనిపెంచిన గుఱ్ఱము లింగమాంబ మేల్
కడుపున బుట్టితిన్ గరుడు గట్టిన తెల్గుదేశంబు దంబునన్

పుత్రప్రేమము రోమ రోమమున దీప్తుల్ జిమ్ము చుండంగనే
మాత్రంబైన శ్రమంబు బిడ్డలకు సంప్రాప్తింపగా నీకహో
రాత్రంబు న్నిజదేహ సౌఖ్యములు సర్వస్వంబు వెచ్చించు మా
స్తోత్రార్హున్ జననీమణిన్ దలపజిందున్నేడు దుఃఖాశ్రువుల్.

మూసిన కన్ను విప్ప కిరుమూడునెలల్ జ్వరపీడితుండనై
గాసిలు నేను నేలపయి గాలిడి లేచిన దాక గంగయే
గ్రాసముగా తపించిన పురాతన మాతృచరిత్ర ప్రేక్షక
స్త్రీ సముదాయమిప్పుడును జెప్పినుతించెడి తల్లి ప్రేముడిన్.

స్వీయచరిత్ర : దువ్వూరి వేంకటరమణ శాస్త్రి :

జననం : 25-3-1898, తొలి ప్రచురణ : 1976

(విజయనగరం సంస్కృత కళాశాలలో అధ్యాపకులయిన మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ తాతా సుబ్బరాయ శాస్త్రి గారి భార్యను దువ్వూరి వారు దొడ్డమ్మా అని పిలిచేవారు.) వారు ఒకసారి దువ్వూరి వారి ఒడిలో తలపెట్టుకొని పడుకొని భర్తతో కబుర్లు చెప్పుకుంటుండగా చూచిన దువ్వూరి వారి తల్లి అన్న మాటలు –

"నాయనా! నిన్ను కన్నానన్న పేరేగాని, దొడ్డమ్మ గారి మాదిరిగా నీమీద వాత్సల్యం చూపడం" నాకు చేతకాలేదు.

అనంతం : శ్రీశ్రీ జననం : 1910

"నేను ఏణ్ణర్థం శిశువుగా ఉన్నప్పుడు మా అమ్మ చనిపోయింది. నాకు తల్లీ తండ్రీ మా నాన్నగారే. ఏడిస్తే ఎక్కడ నేను అమ్మా అని ఏడుస్తానో అని నా నోటంట ఆమాట రాకుండ నన్ను మా నాన్న పెంచాడని మావాళ్ళు చెప్పు కుంటారు."

తన సవతి తల్లి తన పాలిటి దేవత అని వర్ణించిన శ్రీశ్రీగారు ఆమె మరణించాక ప్రభవ అనే తన తొలి కావ్యాన్ని ఆమెకు అంకితం ఇస్తూ ఈ విధంగా రాశారు.

నా శిశుత్వా జ్ఞాన వేళా
నష్టమాతృ చరిత నెఱుగను
తావకా నిర్వాచ్య సద్వా
త్సల్యమున దల్లీ !
ఇపుడు నీవు గతించి నంతట
నెచట దెలియని లోప మొదలెడు
ఇవి నితాంతాజ్ఞాత నిష్ఠుర
దివస నిచయములు

అంకితము : సుభద్రమ్మ అమ్మకి.

గోరాతో నా జీవితం : సరస్వతీగోరా :

జననం : 28-9-1912, తొలి ప్రచురణ: 15-11-1992

మా అమ్మ ఎంత సనాతన ధర్మపరాయణురాలో అంత నిండుగా, హుందాగా ఉండేది.

మా అమ్మ ఎవరితోనూ పల్లెత్తి తన బాధను చెప్పెడిది కాదు. చివరికి మాకైనా తెలియనిచ్చేది కాదు. పిల్లలకు ఆర్థిక బాధలు తెలిస్తే వారి లేతమనసులు ఎక్కడ కందిపోతాయో అని ఆమె భయం.

చిన్ననాటి జ్ఞాపకాలు : కోదాటి నారాయణరావు :

జననం : 15-12-1914, తొలి ప్రచురణ : మార్చి, 1957

ఆమెకు సూర్యాపేటలో తన రెండవ మామగారి కుటుంబపుటొన్నత్యము దృష్టిలో ఉండేది. ఆ కుటుంబము లోని సిరిసంపదలట్లుండగా, తన పిల్లలకు చదువు సంధ్యలైనా అబ్బునా లేదా? అనే బాధ మనసులో ఉండేది. ఆ బాధలో తన సంతానాన్ని చూచి తరచుగా "రత్నాలన్నీ ఒకచోట, నత్తగుల్లలన్నీ ఒకచోట" అనేది. ఆమె తనపైగల నగలలో కొన్ని సంసారానికి పెట్టగా, మరికొన్నిటిని నా చదువుకు పెట్టింది. నేను చదువుకొని సంసారాన్ని ఉద్ధరించ గలననే ఆశతో ఆ పనిని ఆమె ఎట్టి విచారం లేకుండ చేసింది.

మొత్తం మీద మాతల్లి అదృష్టవంతురాలు అని చెప్పవచ్చు. కష్టకాలాలన్నీ గడచిన పిదప ఆమె మంచి కాలాన్ని చూచింది. ఆమె సంతానం కూడ మంచి దశలోనే ఉన్నారు. తాను తలచినట్లు ఇతర కుటుంబాలతో పోల్చి చూస్తే ఏ విధంగానూ తీసిపోని మర్యాదతో కాలక్షేపం చేస్తున్నారు.

శతపత్రం : గడియారం రామకృష్ణశర్మ :

జననం : 6-3-1919

ఇంట్లో వంటావార్పులు చేయలేక మా అమ్మ విశ్రాంతి లేకుండా పనిచేస్తూ ఉండేది. ఆమెను చూస్తే జాలికలిగేది.

నేనూ-నా రచనలు : డా॥ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి :

జననం : 1920, ప్రచురణ : 2003

మా అమ్మ వెంకటరత్నమ్మ 80 ఏళ్ళ క్రిందటే అనసూయ అనే స్త్రీల మాసపత్రిక నడిపింది. స్త్రీలకు సంబంధించిన అనేక విషయాలు, గృహాలంకరణ, శిరోజాలంకరణ, వంటలు, కుట్టుపనులు, సాముద్రికం, ముగ్గులు, గర్భిణీ స్త్రీలకు పిల్లలకు మందులు, చిట్కాలు, పూజలూ - మన సంస్కారాలు, రకరకాల అంశాలన్నీ అనసూయ పత్రికలో ఆరోజుల్లోనే ప్రచురించబడ్డాయి.

ఈ తరానికి మాఅమ్మ నాగరికురాలే అనవచ్చు. ప్రాచీన సంస్కృత-సభ్యతలు పాటిస్తూ పిల్లలు భావి ఉత్తమపౌరులుగా తయారు చేయడానికి దోహదం కల్పించడంలో లోపం చేయ లేదా తరంవారు.

ఆచంట జానకిరాం :

(జననం : 1904) వీటన్నింటికి భిన్నమైనది ఆచంట జానకిరాం తమ స్మృతి పథంలో నిలిచిపోయిన తన తల్లిగారిని వర్ణించిన తీరు.

"తెల్లని జరీచీరె, బంగారపు వడ్డాణము, చేతులకు వంకీలు, మెళ్ళో కంటె, కాసులపేరు, చెవులకు బావిలీలు, ముక్కున అడ్డబాస, చెంపలకు చేర్చి దువ్విన తలకట్టు, ఒంపైన కొప్పు, పెద్ద అరకాసంత కుంకుమ బొట్టు, కప్పుదేరిన పలువరుస (నా స్మృతి పథంలో)

మొత్తం మీద స్వీయచరిత్రలలో తల్లి ప్రస్తావనకంటె, నాన్నమ్మలు, అమ్మమ్మల, తాతల ప్రస్తావనలే అధికంగా ఉండటానికి, పిల్లల పెంపకంలో తల్లి పాత్రకు పూర్తి ప్రాధాన్యత లేక పోవడానికి ఆనాటి సాంఘిక పరిస్థితులు కుటుంబ స్థితి గతులు కారణాలనిపించాయి.

మనది వ్యావసాయిక దేశం. గ్రామాలే మన సంస్కృతికి, సాంప్రదాయానికి పట్టుగొమ్మలు. ఉద్యోగాల వేటలో ఊళ్ళు విడిచి ఇతర ప్రాంతాలకు పోవడం ఇంకా పుంజుకోలేదు. కుటుంబాలు కలిసికట్టుగా ఉండేవి. బాల్య వివాహాలు, సర్వసాధారణం. అగ్రకులాల వారిలో భర్త మరణిస్తే, స్త్రీకి పురుషుని వలె పునర్వివాహంచేసే ప్రసక్తి లేదు. ఆమె వితంతువుగా జీవితాంతం ఉండిపోవలసిందే. అందులో చాలా చిన్న వయసులోనే వితంతువులయిన స్త్రీల దయనీయ స్థితికి తల్లడిల్లిపోయినందువల్లనే మహానుభావుడు కందుకూరి వీరేశలింగం వితంతు వివాహ ఉద్యమాన్ని ఆనాడు చేపట్టవలసి వచ్చింది.

అప్పట్లో వైద్యసదుపాయాలు సరిగా లేక, గ్రామీణ ప్రజలకు మరీ అందుబాటులో లేక, పురిటి చావులు అధికంగా ఉండేవి. భార్య మరణిస్తే భర్త మరల వివాహం చేసుకుంటాడు. కావున భర్తకు భార్యకు మధ్యగల వయోభేదం అధికంగా ఉండేది. భర్త మరణిస్తే, ఆమె వితంతువై తన జీవిక కొరకు పిల్లలుంటే, వారితో సహా తమ బంధువుల పంచను చేరవలసి వచ్చేది. కాలక్రమాన వారే ఆ యింటి బాధ్యతలను పూర్తిగా స్వీకరించి, ఇంట్లోని పిల్లల ఆలన పాలన కూడ చూసుకోవడం జరిగేది. చిన్న వయసులోనే వివాహమయి, 13, 14 ఏండ్ల అపరిపక్వ దశలోనే స్త్రీలు అత్తవారిళ్ళకు కాపురాలకు రావడం మూలాన అట్టి వివాహితలకు ఇంట్లోని పెద్దల అండ తప్పని సరి అయ్యేది. అందుచేత పిల్లలు కూడ తమ తల్లులపై కాకుండ నాయనమ్మల, అమ్మమ్మల, మేనత్తలపై అధికంగా ఆధారపడడం, తమ తల్లులకంటే, వారే చేరువకావడం జరిగిందనే అభిప్రాయం ఎవరికైనా కలుగక మానదు. ఆనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కూడ అందుకు దోహద పడింది.

"నాముూడవ ఏట నుంచీ అన్నీ కళ్ళకు కట్టినట్లు జ్ఞాపకం ఉన్నాయి. 1923వ సంవత్సరం. అమ్మమ్మల, నాయనమ్మల రోజులు. మధ్య తరగతి కుటుంబాల జీవితాలు చీకూ చింతా లేని ప్రశాంతమైన రోజులు. సంతృప్తితో కూడుకున్న అమాయకపుటానంద జీవితాలు. క్రమజీవితాలూ, శ్రమజీవితాలూ కూడ. అయినా ఆ శ్రమ ఏ ముఖంలోనూ కనబడేది కాదు."

"ఆ రోజుల్లో చాల వరకు ఉమ్మడి కుటుంబాలే. ఏ విశేషం వచ్చినా పండుగలకీ, పబ్బాలకీ, పురుళ్ళకీ. పూజలకీ, కూడ అందరూ కలిసేవారు. ఆఖరికి చావులకు కూడ" అని డా॥ అవసరాల (వింజమూరి) అనసూయ తమ స్వీయ చరిత్ర నేనూ-నా రచనలులో అన్న అభిప్రాయం ఆనాటి పరిస్థితులకు అద్దం పడుతుంది.

కణుగుల వేంకటరావు
శ్రీకాకుళం, ఫోన్ : 8330 949562.

తెలుగు సంస్కరణోద్యమం

– ఎలవర్తి విశ్వనాథరెడ్డి

ఆధునిక సాహిత్యంలో అత్యుత్తమ స్థానం నవలదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏ సాహిత్య ప్రక్రియైనా ప్రజల ఆదరణపైనే దాని మనుగడ ఆధారపడి ఉంటుంది. తెలుగులో నవల, ఆవిర్భవించిన నాటినుండి ప్రజాభిరుచికి అనుగుణంగా మారుతూ విస్తృతమైన పాఠకలోకాన్ని సంతరింపజేసుకుంది.

"ప్రజ్ఞానవనవోన్మేషశాలినీ ప్రతిభామత్" అని భట్టకేతు నిర్వచనం. ప్రతిభావంతుడైన రచయిత స్వకపోల సృష్టి ద్వారా కల్పనాలోకంలో విహరించి, నూతనమైన ఆలోచనల్ని చేయాలి. ఈ నిర్వచనం నవలకు సరిగ్గా సరిపోతుంది. అశేష పాఠకాదరణకల ఈ ప్రక్రియద్వారా ప్రజల అంతరంగాల్లోకి దూసుకుపోవాలంటే ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల నాధారంగా రచన జరగాలి. సమాజంలో ఉన్న లోటుపాట్లను ఎత్తిచూపి ఒక మంచి మార్గాన్ని ప్రజలకు చూపించగలగాలి. అసలు తెలుగునవల ఆవిర్భావం. సంస్కరణోద్యమమే భూమికగా మొదలయ్యింది.

1711లో ఇంగ్లండు దేశంలో పుట్టిన 'పారిశ్రామిక విప్లవం' యూరప్ ప్రజల ఆలోచనాధోరణిలో మార్పును తీసుకురావడమే కాక ప్రపంచమొత్తం మీద వినూత్నమైన ప్రభావాన్ని చూపింది. కమ్యూనిజం. ప్రజాస్వామ్యం వంటి రాజకీయ సిద్ధాంతాలు ప్రపంచ పటం మీద అవతరించడంతో మేధావుల దృష్టి ఆధ్యాత్మికత నుండి హేతువాద దృష్టికి మళ్ళింది. ఈ కారణంగానే నవల వంటి నూతన ప్రక్రియలు ఉద్భవించాయి.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే భారతీయ నవలకూడా ఆవిర్భవించింది. ఆంగ్లం నేర్చిన తెలుగు రచయితలు భారతదేశం వెలుపల ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే విశ్వదృష్టిని అలవర్చుకొన్నారు. అప్పటికే క్షీణించిపోయిన సాహిత్యరంగం, సమాజంలో విలువలకు ప్రాధాన్యం లేకపోవడం వంటి నేపథ్యంలో ఆవిర్భవించిన తెలుగు నవల ప్రాథమిక దశలో సంస్కరణోద్యమమే మూలస్తంభంగా నిలిచింది. తెలుగువారి ఆచారవ్యవహారాల్ని విశ్లేషిస్తూ, మూఢవిశ్వాసాల్ని, దురాచారాల్ని విమర్శిస్తూ, హేతువాద దృష్టితో ఖండిస్తూ సంఘ సంస్కరణే ధ్యేయంగా వెలువడింది.

తెలుగు సంస్కరణోద్యమం – ఆవిర్భావం :

1872లో నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి రచించిన 'శ్రీరంగరాజచరిత్ర అనే చిన్న వచన ప్రబంధం చారిత్రకమైన పాత్రలు, ఇతివృత్తంలో రచింపబడినప్పటికీ ఆనాటి సంఘంలో పాతుకుపోయిన కులాచారాలు, మూఢ నమ్మకాలు, కట్టుబాట్లు సాంఘిక దురాచారాలపై ధ్వజమెత్తిందని చెప్పవచ్చు. కర్నూలు జిల్లాలో డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి తన రచన ద్వారా విమర్శనాస్త్రాల్ని కురిపించి, సంస్కరణోద్యమానికి అంకురార్పణ గావించారు. వీరి ప్రభావం వీరేశలింగంపై కూడా కన్పిస్తుంది. వీరేశలింగం తన నవలకు రాజకీయ చరిత్రమని నామకరణం చేయడం, సాంఘికపరమైన దురాచారాల్ని వ్యతిరేకిస్తూ, అనేక సందర్భాలలో వివరించడం దీనికి తార్కాణాలు.

వీరేశలింగం గారి రాజశేఖర చరిత్ర ఆనాటి సాంఘిక జీవితానికి నిలువు దర్పణం వంటిది. సంఘంలో ఆనాడు అత్యంత ప్రాచుర్యంలో ఉన్న గుడ్డినమ్మకాలు, దురాచారాలు, ప్రతిభావంతంగా ఈ నవలలో చిత్రీకరించ బడ్డాయి. వివేకవర్ధని అనే పత్రికను స్థాపించి, తన సంస్కరణలకు ఆయుధంగా వాడుకున్నాడు. ప్రజల్ని నిత్యం చైతన్యపరచి, దురాచారాలను రూపుమాపే విజ్ఞానాన్ని కలిగించడం కోసం, తన రాజశేఖర చరిత్రమనే నవలను ధారావాహికంగా 1878లో స్థాపించి, 1883లో సత్యవతీచరిత్రం అనే సాంఘిక నవలను కూడా ధారావాహికంగా ప్రచురించాడు. ఈ నవల శిల్పరీత్యా పేలవంగా కనిపించినప్పటికి, సమకాలీన సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేసిందని

చెప్పవచ్చు. స్త్రీ వంటింటికే పరిమితం కారాదని, అనేక తరాలుగా స్వేచ్ఛకు, విద్యకు దూరమైన స్త్రీలు అభ్యుదయమార్గంలో, సంస్కరణల నేపథ్యంలో సాగాలనే ఇతివృత్తంతో సాగిన ఈ నవల స్త్రీవిద్య, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమాజంలో స్త్రీకి గల స్థానం మొ॥ ఎన్నో విషయాల్ని విశ్లేషించింది. సమాజ సౌభాగ్యానికి, నాగరికతా వికాసానికి స్త్రీజన సముద్ధరణం ఎంతో అవశ్యకమని వీరేశలింగం ఈ నవలద్వారా ప్రతిపాదించారు.

వీరేశలింగం *గలివర్స్ ట్రావెల్స్* అనే ఆంగ్ల గ్రంథ ఆధారంగా రచించిన *సత్యరాజాపూర్వదేశయాత్రలు* అనే నవల రచించాడు. నిజంగా ఈ నవల ఆనాటి దురాచార సమాజానికి గొడ్డలిపెట్టు. నాటి సమాజంలో స్త్రీలకు జరిగే అన్యాయాల్ని, దురాచారాల్ని, హింసాత్మక సన్నివేశాల్ని, పురుషులకు ఆపాదించి ఆడమళయాళంలో అధిక్షేపించారు. ఇలా చేయడం వల్ల అనుభవిస్తేగానీ అందులోని సాధక బాధకాలు అర్థం కావనే ధోరణి కన్పిస్తుంది. భార్య చనిపోయిన భర్తలకు ముక్కులు కోయడం, భార్య మరణిస్తే భర్తను కూడా సజీవసమాధి చేయడం, స్త్రీలు ఉద్యోగాలు చెయ్యడం, పురుషుడు ఇంట్లోనే ఉంటూ వ్రతాలు, నోములు చేయడం, స్త్రీలు భోగపురుషుల్ని ఉంచుకోవడం వంటి సన్నివేశాల్ని కల్పించి, స్త్రీల సమస్యల్ని పురుషులకు ఆపాదించి వ్యంగ్యంగా హేళనాపూర్వకంగా రచించారు. అర్థం లేని ఆచారాలు, వేశ్యాలోలత, విలాసవంతమైన జీవితం, అనుభవిస్తూ పురుషులు స్త్రీలను బానిసల కంటె నీచంగా చూస్తున్నారని వారిలో సంస్కరణను తీసుకురావాలనే ధ్యేయం వీరేశలింగంగారి ఈ రచనలో సుస్పష్టం. అలాగే *లంకా ద్వీపమనే* రెండవభాగంలో ముహూర్తాలు, శకునాలు, ప్రశ్నలు, జాతకాలు వంటి గుడ్డినమ్మకాలపై కూడా వీరేశలింగం కొరడా ఝుళిపించారు.

వ్యక్తుల జీవిత చరిత్రల్ని వర్ణించడమేకాక, మానవవ్యక్తిత్వంలో కూడా సంస్కరణ రావాలనే ఆకాంక్షతో ఎన్నో నీతుల్ని ఆయా సందర్భాల్ని బట్టి బోధించారు. ఈ కాలంలో వచ్చిన సంస్కరణే ధ్యేయంగా నడిచిన ఈ నవలలకు ప్రధానమైన పేరుతో పాటుగా మరో పేరు కూడా పెట్టడం నవలాకారులందరికి అలవాటుగా మారింది. *శ్రీరంగరాజు చరిత్ర* కే *సోనాబాయి పరిణయం* అని *రాజశేఖర చరిత్రకు వివేకచంద్రిక* అనే నామాంతరాలున్నాయి. సాంఘిక పరమయిన దురాచారాలను ఖండించడంతో పాటుగా, ఆనాటి సాంఘిక జీవనాన్ని ప్రతిబింబింపజేసి సాంఘిక మర్యాదను కాపాడాలనుకొనే ధ్యేయంతో రచనలు చేశారు. *శ్రీరంగరాజు చరిత్ర, రాజశేఖర చరిత్ర* నవలల్లో సమకాలీన జీవన చిత్రణకన్నా, దురాచారాఖండనకే అధిక ప్రాధాన్య మిచ్చినట్లు కన్పిస్తుంది. ఆనాటి సనాతనధర్మంపైన, వర్ణాశ్రమ ధర్మాలపైన, సమాజంలో స్త్రీస్థానం మొదలగు విషయాలపై దృష్టి కేంద్రీకరించిన రచనలు ప్రాథమిక దశలో వచ్చాయి. అనంతరకాలంలో ఖండవల్లి రామచంద్రులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గార్లు గోదావరి మండలంలో, కోనసీమ ప్రాంతాల్లో ఉండే బ్రాహ్మణకుటుంబ ఆచారవ్యవహారాల్ని చిత్రీకరించారు.

దురాచారాల్ని ఖండించి ప్రజల్ని విజ్ఞానవంతుల్ని, వివేకవంతుల్ని చేయడం మాత్రమే సంస్కరణోద్యమం కాదు. ప్రజలు అజ్ఞానంతో మూఢవిశ్వాసాలతో ప్రవర్తించడం మాని మంచి లక్షణాల్ని పొంది, ఆరోగ్యవంతమైన జీవన వాతావరణంలో జీవింపజేసే విధంగా రచనలు చేయడం అవసరమని గుర్తించిన వారు కందుకూరి వీరేశలింగం. వీరు రచించిన *చంద్రమతీ చరిత్ర*లో కథాకల్పన ఎంత మాత్రమూ లేదు. సమాజంలో అజ్ఞానాంధకారంలో ఉన్న వ్యక్తులకు విజ్ఞాన బోధగావించడమే ఇక్కడ వీరి ధ్యేయం. చంద్రమతికి బాల్యావస్థలో ఆమె గురువు విద్యాసముద్రుడు నీతుల్ని బోధిస్తాడు. ఆరోగ్యం, సత్ప్రవర్తన, సర్వభూతదయ, ధర్మం, సత్యం, శౌచం వంటి నియమాల్ని పాటించినప్పుడే మనిషి మనీషి కాగలడనే ఆకాంక్షను, ప్రజలకు ఈ రెండు పాత్రలద్వారా అందించి సంస్కరించే ప్రయత్నం చేశాడు.

వీరేశలింగం భాషా విషయకంగా తనవట్టు సడలించినా సంఘ సంస్కారానికి ఒక ఆయుధంగా వినియోగించుకోవాలన్న ఆలోచన కలిగినప్పుడే తన నవల శైలి జటిలంగా ఉండకూడదని, సరళంగా, ఉండాలనే ఆలోచనకు వచ్చారు. నరహరి గోపాలకృష్ణమ శెట్టి శైలి కంటే వీరేశలింగం శైలి సరళమైనదైతే, వీరికంటే చిలకమర్తి శైలి ఇంకా సరళమైనది.

1892-99 మధ్య నడచిన చింతామణి పత్రిక తెలుగు నవలారంగంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. చిలకమర్తి వంటి ప్రతిభావంతులైన నవలాకారుల్ని అందించిన ఘనత చింతామణి పత్రికదే. పనప్పాకం అనంతాచార్యులుగారు

1892లో రచించిన *మంజువాణీ విజయ* అనే నవల వర్ణాంతర వివాహాన్ని ప్రోత్సహించింది. ఒక వణిజపుత్రిక అయిన మంజువాణి ఒక రాజకుమారుణ్ణి ప్రేమించడం, వారి వివాహం జరగడానికి పడిన కష్టాలు, సమాజంలో కులాలు ఎంతగా పాతుకుపోయాయో మొ॥ వాటిని ఈ నవల చిత్రీకరించింది. *శ్రీరంగరాజ చరిత్ర*లో వర్ణాంతర ప్రణయం ప్రస్తావించబడింది. శ్రీరంగరాజు ఒక రాజకుమారుడు. అతని తండ్రికి ఒక వేశ్య వలన ఇంకొక కుమారుడు పుడతాడు. వేశ్యపుత్రుణ్ణి తనతో సమానంగా చూడడాన్ని సహించని శ్రీరంగరాజు ఇల్లు వదలి పారిపోయి 'సోనాబాయి' అనే లంబాడీ కన్యను ప్రేమిస్తాడు. ఇక్కడ వరకు నరహరి గోపాలకృష్ణమ శెట్టిగారు వర్ణాంత ప్రణయాన్ని ప్రస్తావించినప్పటికి వర్ణాంతర వివాహాన్ని చెయ్యలేకపోయారు. కథానయకుడు శ్రీరంగరాజు కథానాయిక సోనాబాయి వీరిద్దరూ ప్రేమించుకున్నారు. కాబట్టి వివాహం చేయాలి. తప్పదు. కానీ వర్ణాంతర వివాహాన్ని చేసే సాహసం అప్పట్లో ఆయన తన రచనలో చూపించలేదు. అందుకే చివరికి పెళ్ళిదాకా వచ్చే సరికి సోనాబాయి అనే లంబాడీ కన్య కాస్తా రాజకుమార్తెగా మారుతుంది. శ్రీరంగరాజుకు మేనమామ కూతురవుతుంది. *శ్రీరంగరాజు చరిత్ర* ప్రాథమిక దశలో ఆవిర్భవించిన నవల. దానికి తదనంతరకాలంలో వచ్చినది కాబట్టి అనంతాచార్యులు గారి *మంజువాణీ విజయం*లో వర్ణాంతర వివాహం సమర్థింపబడింది. ఇది నవలా పరిణామంలో వచ్చిన క్రమవికాసం.

కందుకూరి వారి ఆశయాలకు, వారి సంస్కరణాభిలాషకు అతి సన్నిహితులయిన తల్లాప్రగడ సూర్యనారాయణ *సంజీవరాయ చరిత్రము* సంఘ సంస్కరణోద్యమ నేపథ్యంలో వెలువడిన విశిష్టమైన నవల. ఇది రాజశేఖర చరిత్రకు నకలు అనదగిన నవల. స్త్రీ విద్య ఆవశ్యకతను ప్రధానంగా భావించి ఒక పురోహితుని కొడుకు తన భార్యను చదివించడానికి అందర్నీ ధైర్యంగా ఎదిరించడం ఈ నవలలో కన్పిస్తుంది. సనాతన ఆచారాల పేరిట స్త్రీని విద్యకు దూరం చేసిన ఈ సమాజంలో స్త్రీని విద్యావంతురాలిని చెయ్యాలంటే ఎంతగా సంఘర్షణకు గురికావాలో ఈ పాత్రచిత్రణ ద్వారా తెలుస్తుంది. చివరికి తండ్రి పశ్చాత్తాపం చెంది, కొడుకును – కోడలిని ఆదరించడం అనే సన్నివేశం ద్వారా సనాతన సంప్రదాయ వాదులందరూ వారు చేస్తున్న తప్పును గ్రహించి సంస్కరణల దిశగా సాగాలనే దిశా నిర్దేశం ఈ నవలలో కన్పిస్తుంది.

1884లో నంబూరు తిరునారాయణ స్వామి రచించిన సుబ్బారావు అనే నామాంతరం కల *ప్రణయమహిమము* అనే నవల కుటుంబ జీవితాన్ని ప్రధానంగా వర్ణించినప్పటికి వేశ్యాలోలిత అనే అంశపై ప్రత్యేక ప్రాధాన్యత చూపించి నాయక పాత్రను చిత్రించడం జరిగింది. సమకాలీన సంఘంలోని అవినీతి, వేశ్యా వృత్తి వంటివి సంస్కరింపబడాలనే ఆకాంక్షని రచయిత ప్రకటించారు. ఈ నవలలో భర్తను కోల్పోయి యుక్తవయస్సులోనే వైధవ్యాన్ని అనుభవిస్తూ, కోర్కెల్ని చంపుకోలేని పరిస్థితుల్లో, వారు చేసే దుశ్చర్యల్ని వారి మానసిక ప్రవృత్తిని కళ్ళకు కట్టినట్టు వివరించారు. వీటి ద్వారా విధవా వివాహాలు జరిగితే ఈ రకమైన ఆలోచనలనుండి స్త్రీలు బయటపడి కుటుంబ సంక్షేమంకోసం పాటుపడతారనే ఆలోచనను వ్యక్తం చేశారు.

1894లో నవలారచనను ప్రారంభించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం *రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి* మొ॥ నవలల్ని రచించారు. అయితే వీటిలో రామచంద్రవిజయం సంస్కరణోద్యమ నేపథ్యంతో ఆవిర్భవించిన సాంఘిక నవల. సంఘసంస్కరణ ప్రధాన విషయమైనా భారతీయ పునరుజ్జీవనోద్యమ ప్రభావం కూడా వీరి నవలల్లో కన్పిస్తుంది. వీరి నవలల్లో వస్తువు, విన్యాసం ఈ రెండూ స్ఫూర్తివంతంగా చిత్రింపబడతాయి.. హాస్యం, వ్యంగ్య ధోరణి, సాంఘికపరమైన ముఢాచారాలపట్ల విసుర్లు ఇవన్నీ పాఠకుల్ని ఇట్టే ఆకట్టుకొని చదివింపజేస్తాయి.

రామచంద్రవిజయం కథా నిర్మాణంలోనూ, కథన విధానంలోనూ సంఘటల్ని రూపొందించుకోవడంలోనూ ముమ్మూర్తులా రాజశేఖర చరిత్రను పోలి ఉంది. మూఢనమ్మకాల్నిగాని, దురాచారాల్నిగాని ఖండించటానికి అంతకుముందు వరకు రచయితలు ఒక పాత్రనో సన్నివేశాన్నో కల్పించుకొనేవారు. కానీ చిలకమర్తి వారు ఈపద్ధతికి స్వస్తి చెప్పి, తాను ఆశించిన సంస్కరణాభిలాషని కేంద్ర బిందువుగా చేసుకొని ఇతివృత్త స్వీకారం చేయడం ప్రారంభించారు. సాంఘిక దురాచార విమర్శ కోరి తెచ్చుకొని చేసినట్లు కాకుండా కథలో ఒక అంతర్భాగమై, రచనకు

మరింత పుష్టిని కలిగించేవిధంగా ఉండేది. ఈ నవలా నాయకుడు రామచంద్రుడు విద్యకోసం, జీవనభృతికోసం ఎన్నో అగచాట్లు పడి చివరకి మంచితనంతో అన్నింటినీ నెట్టుకొచ్చి విజయంతో నిలుస్తాడు. అదే *రామచంద్ర విజయం*. లోకం తీరు, ధనవంతుల ప్రవృత్తి, ఉదార మొ॥ అంశాల్ని యథార్థంగా చిత్రిస్తూనే దురాచారాల గురించిన తీవ్రమయిన విమర్శ ఈ నవలలో కన్పిస్తుంది. ఆ కాలంలో వచ్చిన అనేక నవలలో కుల, మత వర్గాల మీద విమర్శలు. సంఘంలో రూపుమాపడం సాధ్యంకాని విధంగా పాతుకుపోయిన దురాచారాలు. ఆర్థిక, సాంఘిక, రంగాలలో వస్తున్న పరిణామాల్ని, భేదాల్ని, తీవ్రమైన సంఘర్షణని అత్యుత్తమంగా చిత్రీకరించాయి.

ఒకవైపు సంస్కరణాభిలాషను వ్యక్తం చేస్తూ, నాటి కాలంలోని సామాజికాంశాలనే ఇతివృత్తంగా స్వీకరించి, అనేక కోణాలలో విశ్లేషిస్తూ నవలలు వెలువడుతున్న కాలంలోనే చారిత్రక నవలలు కూడా వచ్చాయి. ఈ కాలంలో వచ్చిన తల్లాప్రగడ వారి హేలావతి (1913) వేంకట పార్వతీశ కవుల మాతృమందిరము (1919) అనే నవలలో సాంఘిక వర్ణవ్యవస్థను గురించిన నిశితమైన విమర్శ చేసిన ఉత్తమ నవలలు హరిజన సమస్యను ప్రధానంగా ప్రస్తావిస్తూ హరిజనోద్ధరణకు చేపట్టవలసిన కార్యక్రమాలను ఎంతో వివరంగా పేర్కొన్నాయి. అప్పటికింకా గాంధీజీ హరిజనోద్ధరణకు పిలుపునివ్వలేదు. సంఘాన్ని సంస్కరించే దిశలో అభ్యుదయ మార్గాన్ని అన్వేషిస్తూ, ఆ సమస్యను పోగొట్టేందుకు మార్గాలను అన్వేషిస్తూ రచనలను చేయడం ప్రశంసనీయం.

వీరేశలింగం తలపెట్టిన సంస్కరణోద్యమాన్ని సమగ్రంగా విస్తరింపజేయడానికి ఆవిర్భవించినవే *విజ్ఞాన చంద్రిక మండలి* సంస్కరణోద్యమ ఆశయాల్ని, ఆకాంక్షల్ని సమన్వయ పూర్వకంగా బహుముఖీనంగా వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో సాగింది. *విజ్ఞాన చంద్రిక మండలి, ఆంధ్ర ప్రచారిణీ* గ్రంథమాల అనేకమైన నవలలపోటీల్ని నిర్వహించి జాతీయోద్యమ స్ఫూర్తిని ఉత్తేజాన్ని కలిగించాయి. ఈ విధంగా 1867 నుండి 1920 దాకా వచ్చిన నవలల్ని, నవల పరిణామక్రమాన్ని పరిశీలిస్తే అటు సంస్కరణోద్యమం, ఇటు భారతీయ పునరుజ్జీవనోద్యమమూ రెండూ నవలల్ని ప్రభావితం చేశాయి.

అందుకే సంస్కరణవాద నవలలు వచ్చిన కాలంలోనే విరివిగా చారిత్రక నవలలు కూడా వెలుగు చూశాయి.

ఆ తరువాతి కాలంలో 1922లో ఆవిర్భవించిన మాలపల్లి నవల తెలుగు నవలాచరిత్రలో సమున్నతమైన స్థానాన్ని పొందింది. ఉన్నవలక్ష్మీనారాయణ గారి ఆశయాలకు, ఆలోచనాధోరణికి నిలువెత్తు సాక్ష్యంలో నిలచిన ఈ నవల నవలాలక్షణానికి ఒక సుస్థిరతను తీసుకొచ్చిందని చెప్పవచ్చు. శ్రీరంగరాజు చరిత్ర నుండి మాలపల్లి నవల వచ్చేంత వరకు నవల అనేకానేక సందిగ్ధావస్థలకులోనై ఉంది. నవల శిల్పం, వస్తువు, మొ॥ అనేక విషయాలలో ఒక స్థిరమైన ఆయువుపట్టు మాలపల్లి నవల ద్వారా సంక్రమించింది. 1920 వరకు ఉన్న కాలాన్ని నవలకు ప్రారంభయుగంగా భావిస్తే "మాలపల్లి నవల రెండవ యుగానికి గోపుర ద్వారం" అన్న అడవి బాపిరాజుగారి మాటలు అక్షర సత్యాలు.

మాలపల్లి నవల ఆవిర్భవించడానికి ఎన్నో శక్తులు కలగలసి ఊనికగా నిలిచాయి. వాటిలో ప్రధానమైనది. సంస్కరణోద్యమమయితే, భారతీయ పునరుజ్జీవనోద్యమం, స్వాతంత్ర్యసంగ్రామం, సోషలిస్టు ఉద్యమం, మొదటి ప్రపంచయుద్ధం, మొదలైన దేశ విషయాలు, అంతర్జాతీయ విషయాలు, ఉద్యమాలు కూడా కీలకంగా పనిచేశాయి. మాలపల్లి నవలకు సమాజమే ఇతివృత్తమైంది. మానవ జీవితం సంపూర్ణంగా సాఫల్యాన్ని పొందాలంటే వ్యక్తి సంస్కరణ, తద్వారా సామాజిక సంస్కరణ, వీటిని పొందడానికి కావలసిన మానవత్వం, ఆధ్యాత్మిక భావధార వంటివి కీలక పాత్రను పోషిస్తాయని ఈ రచనద్వారా స్పష్టం చేశారు. *సంగ విజయం* అనే పేరుగల ఈ నవలను కాశీనాథుని నాగేశ్వరరావుగారు మహాభారతంతో పోల్చారంటే ఈ నవలను మహాభారతం వలెనే సంస్కరణాభిలాష ప్రధాన భూమిక అవుతుందని వేరే చెప్పనక్కర్లేదు.

తెలుగునాట రాజకీయ వాతావరణాన్ని, మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ఆవిష్కరించిన ఈ నవల మధ్య తరగతి, అట్టడుగు వర్గాల జీవన స్థితి గతుల్ని, వర్గ -వర్ణ వ్యవస్థల్ని, స్త్రీ-పురుష సంబంధాల్ని, అస్పృశ్యతా దురాచారాన్ని వివరించి, సంస్కరింపబడాలన్న ఆకాంక్షను చూపడమే కాకుండా ఖైదీల, పరిస్థితులు, జాతుల

మధ్య సెటిల్‌మెంట్ వ్యవహారాలు వంటి సామాజిక సమస్యల్ని, అత్యంత సహజంగా వివరించింది.

ఈ నవలలో ప్రధాన పాత్ర రామదాసు. అతడు జీవితంలో రుచిచూసిన చేదు అనుభవాలు, ఎదుర్కొన్న దుఃఖతరంగాలు, రాగద్వేషాలు, మమకారం, అహంకారం వంటి వాటన్నింటినుండి, సంస్కరింపబడిన ఆత్మచైతన్యంతో విజయంపొందుతాడు. ఆంధ్రదేశ జీవితాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడానికి, ఆనాటి పరిస్థితుల్లో అవసరమైన సంస్కరణల్ని తెలుసుకోవడానికి మాలపల్లిని మించిన సమగ్ర నవల సమగ్ర నవల వేరొకటి లేదు.

ఈ విధంగా *శ్రీరంగరాజు చరిత్ర* నుండి మాలపల్లి వరకు వచ్చిన నవలల్లో చారిత్రక నవలలు కూడా ఉన్నప్పటికి ఈ కాలంలో సంస్కరణోద్యమ స్ఫూర్తి, ఆకాంక్షలతోనే నవల నిర్మింపబడిందని చెప్పవచ్చు. సంస్కరణవాదంతో పాటుగ భారతీయ పునరుజ్జీవనోద్యమం కూడా ప్రాచుర్యంలోనికి రావడంతో చారిత్రక నవలలు, సంస్కరణవాద నవలలతో కలిసి రావడానికి అవకాశం ఏర్పడింది. తదనంతర కాలం నుండి నేటివరకు శిల్ప, వస్తు, ఇతివృత్తరీత్య, కథాకథనం, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విషయాల రీత్యా తెలుగు నవల ఎన్నో కొత్త పుంతల్ని తొక్కింది. నవల ప్రక్రియలో ఇతివృత్తంగా స్వీకరింపబడని వస్తువేదీ ఉండదంటే అది అతిశయోక్తి కాదు.

"సామాజిక ప్రయోజనాత్మకమైన నవల సమాజ ప్రగతికి దోహదం చేసే మంచి సాధనం... ఎన్నో గంభీరవిషయాల్ని నవలలో వివరించడానికి వీలుంది. నవల చరిత్రకు ప్రత్యామ్నాయం" అని హెచ్.జి. వెల్స్ పండితుని అభిప్రాయం ప్రకారం సంస్కరణోద్యమ స్ఫూర్తితో అవతరించిన నవలలన్నింటిలో అంతఃసూత్రంగా కన్పించే సామాజికపరమైన, హితమైన మార్పు నాటికాలానికే కాదు ఏనాటికైనా ఎంతో అవసరం. అప్పుడే "విశ్వంశ్రేయః కావ్యమ్" అన్నట్లుగా సాహిత్య పరమ ప్రయోజనం నెరవేరినట్లవుతుంది.

ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి
విశ్రాంతాచార్యులు, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు
ఫోన్ : 9849258010

గ్రామఫోను రికార్డు

(కపిలవాయి రామనాథ శాస్త్రిగారు గొప్ప గాయకులు. నాటకాలలో ఎన్నో ప్రధాన పాత్రలు పోషించారు. వారి పాటల గ్రామఫోను రికార్డులకు అప్పట్లో విపరీతమైన గిరాకీ.)

అప్పుడు పెడనలో కపిలవాయి కాఫీ హోటల్ ఉన్నదనే సంగతి రామనాథశాస్త్రి గారికి తెలియజేశాను. శాస్త్రిగారు చాలసేపు నవ్వుకున్నారు.

ఆ హోటలులో ప్రవేశించాము. ఒక మూల కూర్చొన్నాం. 'ఒక చౌక బేరం' అని కొందరు, 'రాముని వంటి కొడుకు' అని కొందరు ఇలా కేకలు వెయ్యడం విన్నాం. సర్వరు వచ్చాడు. "మూడు కప్పుల కాఫీ కపిలవాయి" అన్నారు. శాస్త్రిగారు "అలా అంటే ఎలా ? ఏ పాటకావాలో చెప్పండి. అన్నీ ఆయనగారి పాటలే. "మూడు సెట్లు అరిగిపోయాయి. నిన్ననే కొత్తది వచ్చింది. ఏది కావాలి?" అన్నాడు సర్వరు.

శాస్త్రిగారు మళ్లీ కపిలవాయి అన్నారు. సర్వరు విసుక్కున్నాడు. నేను చెప్పాను, "ఆయన పాడింది ఏదైన సరే, అన్నీ ఆయనగారికి ఇష్టమేనట" అని. "అయితే వేరే మేం పెట్టడమెందుకు అవిగో వినండి" అని వెళ్లి కాఫీ తెచ్చాడు. ఆ పాటలన్నీ వింటూ శాస్త్రిగారు తన్మయులయ్యారు. అప్పుడు నా వంక చూసి "సత్యనారాయణ గారూ! మీరు నాకు ఇవ్వాళ గొప్ప సన్మానం చేశారు. ఎన్నో జరిగాయి. కానీ ఇలాంటిది జరగలేదు. నా సంగీతం మీద ఇంత ప్రీతి గలవారు ఇక్కడ ఉండటం, పాట వింటూ ఫలహారాలు చెయ్యడం ఎంత గొప్పగా వుంది. నా పాటలన్నీ ఇలా ప్రచారం చేసినందుకు హోటలు యజమానిని నేను అభినందించాలి" అన్నారు.

సేకరణ : కణుగుల వేంకటరావు.

కళారంగంలో నూజివీడు

– జి.వి.ఆర్.కె. సుబ్బరాయ మూర్తి

జాతి పౌరుషం

16వ శతాబ్దంలో అప్పన్నగారు తమ గొల్లపల్లి దుర్గం నుంచి వేటకై పరిసరారణ్యంలో సంచరిస్తుండగా నువ్వు చేలలో మేక ఒకటి తోడేలును ఎదిరించి తరమటం చూసి ఆశ్చర్యపోయారు. ఆ ప్రదేశాన్ని శౌర్యనిలయంగా గుర్తించారు. అప్పుడాయనకు ఒక ఆలోచన వచ్చింది. తమ గొల్లపల్లి కోటను ఎటూ పునర్నిర్మించవలసి ఉంది. దానికి బదులు ఇక్కడ కట్టిస్తేనే బాగుంటుందని నిశ్చయించారు. దాని ప్రకారం యాభై ఎకరాల విస్తీర్ణంలో కోట నిర్మాణం జరిగింది. చుట్టూ ఊరు ఏర్పడింది. రాజధాని గొల్లపల్లి నుంచి నూజివీటికి మారి పోయింది. నువ్వు చేలలో నిర్మించబడినది కనక 'నూజేలవీడు' అని పేరు పెట్టారు. అదే క్రమంగా వాడుకలో 'నూజివీడు'గా మారి సుమారు నాలుగు శతాబ్దుల పాటు రాజధానియై విలసిల్లింది.

'మా'మిడి', 'వీణ', ఈ రెంటికీ ఆకర్షణ ఎక్కువ.

ఒకటి చవులూరిస్తే రెండవది చెవులూరిస్తుంది. వీటికి ప్రాతినిధ్యం వహించటం నూజివీడుకు ప్రకృతి ప్రసాదించిన వరమే. నిజానికి ఈ అదృష్టం అనేక విధాలుగా ఉంది.

కృష్ణా, గోదావరీ మధ్యస్థమైన ఈ ప్రాంతాన్ని 13వ శతాబ్ది నుంచి, అర్ధశతాబ్ది క్రితం జమీందారీ వ్యవస్థ రద్దయే వరకు 8 శతాబ్దాల పాటు ఒకే రాజవంశం పాలించింది. ఇది చరిత్ర లోనే అపూర్వం. పాలకులు 'పద్మనాయక వెలమలు'. వీరు పూర్వం మగధ చక్రవర్తి మహా పద్మనందుని వంశీకులు. వారు దక్షిణా పథానికి వలసివచ్చి ఇక్కడ వున్న సామ్రాజ్యాలలో ముఖ్యమైన పదవులు నిర్వహించి విశ్వాసపాత్రులుగానూ, సమర్థులుగానూ, పేరు పొందారు.



నూజివీడు కోట

'వెలమ' అనే మాట 'వెలిమల' అనే పదం నుంచి వచ్చిందంటారు. 'మల' అంటే పర్వతం. – వింధ్య పర్వతాలకు ఆవలివారు కనక 'వెలిమలవారు' అని స్థానికంగా వ్యవహరించే వారు. ఆ మాటే 'వెలమ'గా రూపాంతరం చెందింది. పరిపాలకులు కనక 'దొరలు' అయ్యారు. రెండూ కలిసి 'వెలమదొరలు' అనే మాట వాడుకలోకి వచ్చింది.

అలాంటి యోధులలో ఒకరైన 'మేకా బసవన్న' 13వ శతాబ్దిలో కాకతీయ సామ్రాజ్యంలో రుద్రమ దేవి చక్రవర్తిని అంతరంగిక భద్రతా విభాగంలో దండ నాథులుగా

ఉండేవారు. ఆయనే ఈ రాజవంశానికి మూలపురుషులు. వారు విప్పర్ల గోత్రీకులు. ఆ కాలంలో నెల్లూరి సీమను పాలించిన మహారాజును పాండ్యులు జయించి ఆక్రమించారు. రుద్రమదేవి పనుపున బసవన్న పాండ్యులను తరిమివేసి ఆ రాజ్యాన్ని మనుమసిద్ధికి తిరిగి అప్పగించారు.

ఆ సందర్భంగానే అనేక బిరుదులు, రాజలాంఛనాలతో పాటు 'హనుమధ్వజాన్ని' కూడా చక్రవర్తికి ప్రసాదించారట, ఆ ధ్వజాన్నే తరువాతి వారందరూ భక్తితో తమ రాజ్యధ్వజంగా కొనసాగించారు. వీరి శిల్పం నూజివీడు కోటలోని శివాలయం ప్రాకారంపై ఇప్పటికీ వుంది.

తరువాతివారైన తిమ్మన్న రెండవ ప్రతాప రుద్రుని సేనాని. ఆ తరువాతి వారైన అన్నప్ప అశ్వారావుగారు భద్రాచలం రాజధానిగా గోదావరి ప్రాంతాన్ని పాలించినట్లు, బ్రిటిష్ గెజిట్ వల్ల తెలుస్తోంది. ఇప్పటి అశ్వారావుపేట వీరి పేరు మీదనే నిర్మించ బడివుండవచ్చు.

ఆ తరువాత కళింగ సామంతులై వేకా వారు నూజివీడుకి సమీపంలోని గొల్లపల్లి, కొండపల్లి దుర్గాలను పాలించారు.

కళింగ చక్రవర్తి తన కుమార్తెకు సింహాచలం నుంచి గుంటూరుసీమ వరకూ కల ప్రాంతాన్ని అరణంగా ఇవ్వటంతో అప్పటి నుంచీ నూజివీటి వారు విజయనగర సామంతులయ్యారు. వీరి వంశంలో 7వ తరం వారు అప్పన్నగారు. ఆయన 1596లో అహమ్మద్‌నగర్ 'చాంద్‌బీబీ'కి బాసటగా పోరాడి మొగలాయి సైన్యాన్ని తరిమి వేసారు. ఆయన రణ కౌశలాన్ని అభినందిస్తూ ఆ రాణి 'విజయ' అనే పౌరుష నామంతో సన్మానించారు.

గోల్కొండ నవాబు కూడా తన వంతుగా 'రావు' అనే బిరుదుతో సత్కరించారు. 'విజయ-అప్ప(అప్పన్న) 'రావు' (శత్రురుద్రుడు) 'విజయఅప్పారావు' అయ్యారు.

ఈ పరాక్రమ శాలి 1598 ప్రాంతాల్లో మొగలాయి సైన్యాలు దక్షిణాపథంపై దాడిచేయగా గోల్కొండ నవాబుకు సహాయులై గోదావరీ తీరాన గల 'సోనేపూర్' వద్ద యుద్ధం చేస్తూ వీరస్వర్గమలంకరించారు. వీరు నిర్మించిన 'నూజివీడు' గురించి ఆసక్తి కరమైన కథ ఒకటి వుంది.

16వ శతాబ్దంలో అప్పన్నగారు తమ గొల్లపల్లి దుర్గం నుంచి వేటకై పరసరారణ్యంలో సంచరిస్తుండగా నువ్వు చేలలో మేక ఒకటి తోడేలును ఎదిరించి తరమటం చూసి ఆశ్చర్యపోయారు. ఆ ప్రదేశాన్ని శౌర్యనిలయంగా గుర్తించారు. అప్పుడాయనకు ఒక ఆలోచన వచ్చింది. తమ గొల్లపల్లి కోటను ఎటూ పునర్నిర్మించవలసి ఉంది. దానికి బదులు ఇక్కడ కట్టిస్తేనే బాగుంటుందని నిశ్చయించారు. దాని ప్రకారం యాభై ఎకరాల విస్తీర్ణంలో కోట నిర్మాణం జరిగింది. చుట్టూ ఊరు ఏర్పడింది. రాజధాని గొల్లపల్లి నుంచి నూజివీటికి మారి పోయింది. నువ్వు చేలలో నిర్మించబడినది కనక 'నూజేలవీడు' అని పేరు పెట్టారు. అదే క్రమంగా వాడుకలో 'నూజివీడు'గా మారి సుమారు నాలుగు శతాబ్దుల పాటు రాజధానియై విలసిల్లింది. నూజివీటి కోటకు ప్రధాన సంఘటనోత్పత్తికి మూలమైనది 'మేక' కనక విప్పర్ల వంశం వారైన నూజివీటి శాఖకు 'మేకా' వారని పేరు వచ్చింది. అప్పన్నగారి బిరుద నామమైన 'అప్పారావు' వంశ నామంగా అప్పటి నుంచే స్థిరపడింది. ఇక ఆ వంశలో అందరికీ పేరు చివర 'అప్పారావు' అనే గౌరవ నామం ఆనవాయితీ అయింది.



మేకా అప్పారావు

కోట లోపల శ్రీరాజగోపాల స్వామి వారి ఆలయ నిర్మాణమే గాక అత్యవసర సమయాల్లో ఉపయోగించటానికి రహస్య సొరంగ మార్గం కూడా ఏర్పాటు చేసారట. ఆలయగోపురం పై ఒక దేవతా మూర్తికి 'ఆంధ్రమాత' అని పేరు పెట్టారు. సుమారుగా ఆ కాలంలోనే సర్వప్ప అశ్వారావు గారు సమర్థ పాలకులై సింహాచల దేవస్థానానికి విలువైన కానుకలను సమర్పించినట్లు 1604 నాటి దేవాలయ శాసనం తెలుపుతున్నది.

11వ తరానికి చెందిన 'నరసింహఅప్పారావు' వారు 'సాహితీ వల్లభ' బిరుదాంకితులు.

శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాల్లో ఒకరైన ధూర్జటి మనుమడు 'కుమారధూర్జటి' నుంచి ఇతడు కృతిని

స్వీకరించారట. వీరి కాలంలో రాజ్యం సుభిక్షంగా సిరిసంపదలతో తులతూగింది.

18 వ శతాబ్దిలో జగన్నాథ అప్పారావుగారు సాహితీ కదన రంగాలు రెంటిలోనూ అపర శ్రీకృష్ణదేవరాయలు లాగా ప్రతిభ చూపి రాజలోకానికి ఆణిముత్యంగా ఖ్యాతి గడించారు.

13వ తరానికి చెందిన 'నారయ్యప్పారావు' అనే నరసింహప్పారావుకు చాల ప్రాధాన్యత ఉంది. భారత స్వాతంత్ర్య పోరాటానికి వీరపా ండ్య కట్టబ్రహ్మన ఆద్యుడంటారు. వీరిద్దరూ సమకాల విక్రములు, పాండ్యుని పోరాటం 1789లో జరిగినట్లు చరిత్ర తన పౌరుష పరాక్రమాలతో బ్రిటిష్ వారిని ఒంటరిగా ఎదిరించి ఆయన అమరుడయ్యాడు. దానికి లోపలి శత్రువులు కూడా కారణమయ్యారు. కానీ ఇక్కడ అంతకు 6 సంవత్సరాల ముందే 1783లో నూజివీడు ముట్టడి జరిగింది. ఈస్టిండియా కంపెనీవారు తమ దురాక్రమణ క్రమంలో ఫ్రెంచి వారిని పారద్రోలి నిజాంతో ఒడంబడికలు చేసుకొని 'ఉత్తరసర్కారులు' అనే కోస్తా ఆంధ్రను పాలించసాగారు.

నూజివీడు రొచరికం

నూజివీడు విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. ఊరికి 4 శతాబ్దాల చరిత్రవుంటే–అంతకు 4 శతాబ్దాల పూర్వం నుంచే ఈ పద్మనాయక వెలమల పరిపాలన మొదలైంది. వారిలో ఒకరు 'విప్పర్ల' గోత్రీకులైన మేకా బసవన్నగారు. 12వ శతాబ్దిలో రుద్రమదేవి చక్రవర్తి కొలువులో దండనాథులు. అంతరంగిక భద్రతా దళాధ్యక్షులు. ఆయనే ఈ వంశానికి మూలపురుషుడు.

మేకా బసవన్నగారి బిరుదులలో – కొన్ని కన్నడ పదాలు కనిపిస్తాయి. అప్పటి తెలుగు పదాలు కొన్నిటిని గమనించవచ్చు. అందులో కొన్ని మాటలు ఇప్పుడు వాడుకలో లేవు. "శరణాగతవజ్ర పంజర" 'స్వామి ద్రోహకులాంతక' 'పరానారీదూర' వంటి పదాలు వారి వ్యక్తిత్వాన్ని సూచిస్తున్నాయి.

'నరసింహఅప్పారావు' గారు శనివారప్పేట రాజధానిగా పాలించారు. ఈ పేరు ఆ కాలంలోనే ఎవరికీ తెలిసి వుండక పోవచ్చుగానీ 'ధర్మ అప్పారావు' అంటే మాత్రం ఇప్పటికీ అందరికీ గుర్తే.

"ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరిగింది నూజీవీటిలో
ప్రథమయోధుడు, విజేత నారయ్యప్పారావు
నారయ్యప్పారావు కుమారుడే ధర్మ అప్పారావు
పేరే చెబుతుంది అప్పరాయల ధర్మాన్ని"

తేలప్రోలు రాజా శోభనాద్రి అప్పారావుగారి కాలంలో నూజివీడులో వీణల తయారీ మొదలయింది. బొబ్బిలి నుంచి తెప్పించిన వీణను చూసి ఆయన తన దివాణంలో సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న వరాటి నరసయ్యగారిచే వీణను తయారు చేయించారు. ఆయన తండ్రిగారి పర్యవేక్షణలో మొదట టేకుతో, వీణను తయారు చేశారు. దానిని ఆస్థాన వైణిక విద్వాంసులు ఇంద్రగంటి విశ్వనాథశాస్త్రి పరీక్షించి ఆమోదించాక, క్రమంగా పనస చెక్కతో వీణల తయారీని ప్రారంభించారు.

మీర్జాపురం రాజా వెంకటరామ అప్పారావు గారు సినిమా రంగంలో కూడా పేరు పొందారు. ఈ మధ్య కాలానికి చెందిన శ్రీ యం.ఆర్.అప్పారావుగారు గతానికీ, వర్తమానానికీ వారధి. నూజీవీటిలోని ప్రాచీన వెంకటేశ్వరస్వామి దేవాలయం క్రీ.శ.శక సం॥ 1509 లో నిర్మించబడిందట. అంటే 420 సంవత్సరం నాటిది. ప్రాచీనమైన "అడవి ఆంజనేయస్వామి" ఆలయంలో ఇతర ఉపాలయాల దేవతలతో బాటుగా త్యాగరాజస్వామి వారి విగ్రహం కూడా ప్రతిష్ఠించబడింది.

నారయ్యప్పారావు

వారి దుష్పరిపాలనను సహించని రాజావారు కప్పం కట్టకుండా స్వతంత్రంగా వ్యవహరించసాగారు. అప్పటికి ఏమీ చేయలేని బ్రిటిష్ వారు 4 సంవత్సరాల తరువాత ఒత్తిడి మొదలెట్టారు. నూజివీడు ప్రభువు కూడా లొక్యంగా రాయబారము నడిపి కాలయాపన చేస్తూ వచ్చారు. అలా రెండు పక్షాలు కాలయాపననే తమ వ్యూహంగా వ్యవహరించాయి.

ఈయనను కనక లొంగదీసుకోకపోతే దక్షిణభారతం లోనే తమ ఆధిపత్యం దెబ్బతింటుందని భావించిన మద్రాసు గవర్నరు కోట ముట్టడికి ఆజ్ఞ ఇచ్చాడు. రాగల పరిణామాలను ముందే పసిగట్టి రాజావారు అన్ని విధాలా సన్నాహాలను చేసుకున్నారు. బందరు, ఏలూరు నుంచి 4 వేల మంది బ్రిటిష్ సైనికులు వివిధ మార్గాల నుంచి వచ్చారు. వచ్చాకగానీ తెలియలేదు. తమ కంటే కోటలోని బలమే చాలా ఎక్కువని. అది రోజు రోజుకు ఎలా పెరిగిపోతున్నదో కూడా అర్థం కావడం లేదు.

ముట్టడి 20-11-1783న ప్రారంభమయినా యుద్ధం ప్రారంభించటానికి 'కంపెనీ'కి ధైర్యం చాలలేదు. కొంత కాలం ముందు జరిగిన బొబ్బిలి యుద్ధ విషాదం గుర్తుకు రాగా అవసరమైతే అగ్ని ప్రవేశానికి అనుమతిని కోరిన రాణి వాసం విన్నపాన్ని తిరస్కరించి, ముందు జాగ్రత్తగా వారినీ, కుమారులనూ రాజగోపాల స్వామి ఆలయ రహస్య మార్గం ద్వారా బయటికి పంపి అంచెలంచెలుగా పాలవంచ దివాణానికి చేర్చారు. శత్రువును లోపలి నుంచీ, బయటి నుంచీ కూడా ఎదుర్కొని చక్రబంధంలో బిగించటానికి వ్యూహం కూడా సిద్ధమైంది.

అయినా ఈ వ్యవహారాన్ని ఇంకా పొడిగించటం ఇష్టంలేక ప్రజల మధ్య ఉంటేనే తమకూ, కోటకు కూడా భద్రత ఉంటుందని భావించిన రాజావారు 10-12-1783 రాత్రి శత్రు సైనికులను చీల్చుకొని భద్రగజంపై వెళ్ళిపోయారు. అలా చాలా దూరం వెళ్ళినట్లు సమాచారం అందేవరకూ లోపలి నుంచి దాడి జరుగుతూనే ఉంది. అనలు జరుగుతున్నదేమిటో ఇంగ్లీషు సైన్యానికి అర్థమయ్యేసరికి రాజు సురక్షితంగా వెళ్ళిపోయారు. ఇక లోపలికి వెళ్ళటానికి కంపెనీ సేనానులకు ధైర్యం చాలక వెనుతిరిగారు. అలా 21 రోజుల ముట్టడి ప్రశాంతంగా ముగిసిపోయింది.

పన్నుల మాట అటుంచి, ప్రజల నుంచి ఏ మాత్రం సహకారం లభించటం లేదని 'కంపెనీ' వారు తమ నివేదనలో వ్రాసుకొన్నారట. నరసింహప్పారావు అలా 4 సంవత్సరాలు ప్రజల్లోనే ఉండి పరిపాలన చేశాడు. ఏమీ సాధించలేని ఆంగ్లేయులు రాయబారాలు నడిపి ఆయనను తిరిగి కోటకు ఆహ్వానించారు.

అయినా ఆంగ్లేయులు ఆయనకు 'రెబల్' (తిరుగు బాటుదారు) అని ముద్ర వేసారు. అప్పటి నుంచీ ఆ మాటే ఆయనకు బిరుదు అయిపోయింది. భాషాపరంగా అనాటి 'స్పెల్లింగు'ల్లో కూడా తేడా వుంది. నూజివీడుకు నూజెడ్ అని, అప్పారావుకు ఒప్పారావ్ అని ఇంగ్లీషు ప్రథమ భారత స్వాతంత్ర్య సమరం నూజివీడులోనే ప్రారంభం అయినట్లు అనుకోవచ్చునని పరిశోధకుల అభిప్రాయం.

నారయ్యప్పారావుగారి తదనంతరం మారిన రాజకీయ పరిస్థితుల వల్ల 18 పరగణాల సంస్థానం పాలనా సౌలభ్యం కోసం ఏలూరు, కొండపల్లి సర్కారులుగా ఈస్టిండియా కంపెనీచే విభజింపబడింది. ఆయన కుమారుడు వెంకట నరసింహప్పారావు ఏలూరు ప్రక్కనగల శనివారప్పేటను రాజధానిగా చేసుకొని పాలించారు. ధర్మ అప్పారావుగా ఆయన ప్రసిద్ధుడు. ఆయన అంతటి ధర్మ ప్రభువు.

ఆయన దానాల వల్ల ఖజానా ఖాళీ అయిపోయింది.

ఎవరినీ రాజదర్శనానికి అనుమతించటం లేదు. దర్శనం కోసమే ఎదురు చూస్తున్న ఒక కవి, ఒకనాటి తెల్లవారు జామున చంద్రగ్రహణానంతరం తమకోట నుంచి తమ్మిలేటికి స్నానానికి వెడుతుండగా ఆయన వినేటట్లు నిందాస్తుతితో ఈ పద్యం చెప్పాడట.

"వెలమకులంబునందు నిలువెల్లరు కాంతలనంగ విందునప్పలు కులబద్ధమాయె"

రాజాగారిది విన్నంతనే కోపంతో ఊగిపోతూ మేనా నాపించి దిగబోతుండగా, ఆ పండితుడు మళ్ళీ ఇలా అందుకున్నాడు. ''కులపాలక ధీమణి అప్పరాయరా ట్కులభము! కీర్తికాంత, కృతికాంత, మహీజయకాంత మువ్వురుం

గలజగమంతయున్ దిరుగగా కనుగొంటిమి చోద్యమిద్ధరన్"

"వెలమ కులంలో పుట్టిన మహిళలు ఇంటిలో నుండి బయటకు రారని విన్నాము. కానీ అది అబద్ధమని తేలింది. ఎందుకంటె అప్పరాయని కీర్తి కాంత, కృతి కాంత, విజయ కాంతలు ప్రపంచమంతా తిరుగుచున్నారు కదా!" ధర్మ అప్పారావు పేరు పండిత, పామరుల నోళ్ళలో పాశ్చాత్యమైంది.

అంతేకాదు కాశీ, హరిద్వారాల దాకా కూడా పాకిందట. 40 ఏళ్ళక్రితం స్థాపించబడిన 'ధర్మఅప్పారావు కళాశాల దిన దినాభివృద్ధి చెందుతున్నది.

ఆ తరువాతివారైన శ్రీశోభనాద్రి అప్పారావు గారు నూజీవీటి శాఖకు మూల పురుషులు.

ఈయన సంతాన దోషనివారణార్థం కోటలో ఒక శివాలయాన్ని నిర్మించారు. అందరు జమీందారులూ హరిహరులను సమానంగా కొలిచినవారే. అంతేగాదు– మహమ్మదీయులను కూడా సమానంగా గౌరవించి మసీదులూ, పంజాలూ ఏర్పాటు చేసారు. వారి పండుగలను కూడా 'దసరా' వలెనే జరిపించేవారు. వీరి కుమారులు 'నారయ్యప్పారావు' నీటి వసతిని పెంచి మరింత వ్యవసాయానికి దోహదం చేసారు. వీరి శిల్పచిత్రం సమీపంలోని ఆగిరిపల్లి శ్రీశోభనాచల స్వామివారి దేవాలయంలో ఉంది.

ఆ స్వామి ఈ కుటుంబానికి కులదైవం. సోదరులు 'రంగయ్యప్పారావు' పర్షియా భాషలో కూడా పండితులు. కవి పండిత విద్యాపోషకులు. వీరి పేర, విజయవాడలో కూడ ధర్మసంస్థలు నెలకొల్పబడ్డాయి. విజయవాడలో ఒక వీధికి వీరి పేరు పెట్టారు. ఒక సోదరుడు పేరొందిన అశ్వశిక్షకులైతే, ఇంకొకరు గజశిక్షకులు. మరొకరు ప్రజారంజకులు. 18 ఏనుగులను కలిగి ఉండేది ఈ సంస్థానం. ఒకసారి ఆ ప్రాంతంలో తీవ్ర క్షామం ఏర్పడితే – వందల పుట్ల ధాన్యాన్ని స్వల్ప ధరకు కొలిపించి, ఆ శక్తి కూడా లేని వారికి ఉచితంగా ఇప్పించి అన్నం పెట్టారట.

ఆ తరువాతి వారైన వరదరాజు అప్పారావు వారు మంచి హస్త కళా ప్రవీణులు. స్వయంగా తయారు చేసిన వస్తువులు అమ్మించి ఆ సొమ్ముతో దాన ధర్మాలు చేసేవారట. స్థానికంగా వున్న మామిడి పై పరిశోధనలను చేసి కొత్త జాతులను రూపొందించారు. వారి ధర్మపత్ని రాణీ చెల్లయ్యమ్మారావు లక్షరూపాయలతో ఒక సత్రాన్ని నిర్మించారు. అదే ఇప్పటి 'రాణీగారి సత్రం'.

ఇరవైయవ శతాబ్దిలో ఉయ్యూరు రాజాగారనే పేరుపొందిన "వెంకటాద్రి అప్పారావు" "సాహితీ వల్లభ", "కళాప్రపూర్ణ" బిరుదాంకితులు, అనేక లలిత కళలలో ఉన్నత స్థాయిని పొందినవారు. ఆంధ్రాయూనివర్సిటీ మ్యూజిక్ యం.ఎ. విద్యార్థులకు పరీక్షకునిగా ఉండేవారట.

బహుభాషాకోవిదులు, బహుకృతికర్త, భర్త. గీత గోవిందానికి ఆయన అనేక విధాల ప్రచారం కల్పించారు. ఒక పద్యంలో తమ రైతులకు కూడా కృతజ్ఞతలను తెలిపిన సంస్కారి. తమ వద్దకు వచ్చిన అతి సామాన్యులను కూడా గౌరవించేవారు. కోట సింహద్వారంపై విజయ అప్పారావు వారి శిల్పానికి, దిడ్డీ దర్వాజా పై వున్న తండ్రి, పినతండ్రుల శిల్పాలకి, విజయవాడ యస్.ఆర్.ఆర్. కళాశాలలో గల తండ్రిగారి శిల్పాలకు స్వయంగా స్వయంగా రూపకల్పన చేసి ఏర్పాటు చేసారు.

ఇంతేకాక మద్రాస్ హౌరా రాజమార్గం, బందరు తిరువూరు రహదార్లు కలిసే కూడలి వద్ద నిర్జనంగా ఉన్న ప్రదేశంలో భవిష్యత్తును ఊహించి నిలువెత్తు హనుమద్విగ్రహాన్ని ప్రతిష్టించారు. అదే ఇప్పటి హనుమాన్ జంక్షన్.

తండ్రిగారి పేరున 2 హైస్కూళ్లు, ఒక కాలేజీని స్థాపించిన విద్యాదాత. సమీపంలో విద్యావకాశాలు లేని ఆ రోజుల్లో ఈ ప్రాంతానికే ఆధారం నూజీవీడు హైస్కూలు. సంస్కృతంతో పాటు, ముస్లిం విద్యార్థుల కోసం ఒక 'మున్షీ'ని కూడా నియమించి ఉర్దూ భాషాధ్యయనానికి కూడా దోహదం

చేసారు. ఉయ్యూరు ఎస్టేట్ కోనేరు స్వచ్ఛమైన నీటితో ఊళ్ళో చాలా మందికి చిరకాలం దాహాన్ని తీర్చింది. ఈ నీటిని మద్రాసులో ఉండే రాజకుటుంబీకులు ప్రతిరోజూ తెప్పించుకొని తమ ఊర్లోనే ఉన్నట్లు తృప్తిపడేవారు.

వెంకటాద్రి అప్పారావు బ్రిటిష్ వారిని లెక్కచేయక మహాత్ముని తమ దివాణానికి ఆహ్వానించి కుమారుడైన ఎమ్.ఆర్. అప్పారావును గాంధీజీకి అప్పగించిన ధైర్యశాలి. ప్రజలకు ధర్మవైద్యం చేయించి, గ్రంథాలయ వ్యాప్తికి కూడా దోహదం చేసారు.

తేలప్రోలు రాజా శ్రీశోభనాద్రి అప్పారావు గుప్త దాత, బహుభాషాభిమాని. మీర్జాపురం రాజా వెంకటరామ అప్పారావు వారు జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను జరిపించారు. తెలుగు సినిమా చరిత్రలో ఆయనకూ స్థానముంది. రాణీ భూదేవమ్మగారు బస్తా నూకలతో జావ కాయించి అన్నార్తులకు అందించాకే తాము భుజించేవారట.

యలమర్రురాజా శ్రీశోభనాద్రి అప్పారావు వారు తమ పేర యలమర్రులో ఒక హైస్కూలును స్థాపించారు.

"మా కోటలోని మధ్యవర్తి రాజగోపాల మూర్తి" అని తమ పూర్వీకులు చెప్పినట్లు అందరు జమీందారులు నడుచుకునేవారు. వారంతా రాజ పత్రాల మీద "శ్రీశోభనాద్రీశ" అని సంతకం చేసేవారు.

ఎమ్.ఆర్. అప్పారావు ఆ వంశంలో 18వ తరానికి చెందినవారు. రాచరికానికీ, ప్రజాస్వామ్యానికీ వారధి వంటివారు. ఆయన, 'పి.జి. సెంటరు' కోసం కపిలేశ్వరపురం ఎస్టేటును ఇప్పించారు. ఇప్పుడది బాగా విస్తరించింది.

ప్రభుత్వ ఆసుపత్రికోసం తమ ఎస్టేటులోని తోటను విరాళంగా ఇచ్చారు. కళాశాలలు స్థాపించారు. సాహిత్య రంగంలో ఆయన ఎంతో కృషిచేశారు. 'గీతగోవిందం' ఆంగ్లానువాదకులలో ఆయన ఒకరు. నాటక రంగానికి పెద్దదిక్కు అటువంటి మహామనీషి 88 ఏళ్ళు జీవించి అమరులయ్యారు.

శ్రీ ప్రతాప అప్పారావు తమ పూర్వీకుల మార్గంలోనే నడుస్తూ వివిధ రంగాలలో కృషి చేస్తున్నారు. కోట సింహద్వారంపై ఉన్న శిలాఫలకంలోని ఈ పద్యం గమనించతగ్గది.

"రమ్య పర్వత పంక్తి రహిచుట్టు గల చోటు
విపులామవన లక్ష్మి వెలయుచోటు
కులపూర్వులొగి దండికోటకట్టిన చోటు
గురుపాదరజము చేతరలు చోటు
రాజగోపాలు సంరక్షగల్గిన చోటు
పరమేశు కరుణతో ప్రబలుచోటు
వీర రక్తపు ధారలూరి కారిన చోటు
దీనజనత్రాణమైన చోటు"
"ఘనతరాంధ్ర భాషల మెప్పుగాంచు చోటు
పదియునెన్మిది పరగణాల్ మొదటి చోటు
అప్పరాణ్మండల నిధానమైన చోటు
నుతులు రాజిల్లు చోటు మా నూజివీడు"

నూజివీడు పట్టణం కృష్ణాజిల్లా మెట్ట ప్రాంతానికి ముఖద్వారం వంటిది. విజయవాడకు 50 కి.మీ. దూరంలో ఉంది. జమీందారీ వ్యవస్థ రద్దయిన అర్ధశాబ్దిపై బడిన కాలంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అయినా తరాల నాటి సత్సంప్రదాయాలను ప్రజలు కొనసాగిస్తున్నారు.

వీరపూజకు సంకేతమైన దసరా ఉత్సవాల్లో 'బుట్టబొమ్మలు' ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. కోటలోని మహిషాసురమర్ధని అమ్మవారిని కీ.శే.బసవరాజు అప్పారావు తమ ఖండకావ్యంలోని 'నూజివీటి పోతుగడ్డ' అనే శీర్షికలో స్తుతించారు.

ఈ ఊరికి మారుపేరైన 'మామిడి' వేసవిలో మూడు నెలలపాటు అనేక మందికి భుక్తి నిస్తున్నది. వీణల తయారీ తగ్గింది. తయారైనవి దూరప్రాంతాలకు వెడుతున్నాయి. ఇక్కడ శతాబ్దాల తరబడి ఒకే రాజవంశం చేత ఒక మంచి సాంప్రదాయం కొనసాగించబడింది. రాచరికం అంతరించిపోయింది. అయినా తమ మంచికోసం పని చేసిన వారినెప్పటికీ ప్రజలు మరిచిపోరు.

(శ్రీకోటగిరి వెంకట నరసింహ సత్యనారాయణ రావు(అంపాపురం బుచ్చినాయన) రచించిన 'పద్మనాయక వెలమలు-నూజివీటి అప్పరాయలు' అనే గ్రంథం ఈ వ్యాసానికి ఆధారం. బుచ్చి నాయన గారికి కృతజ్ఞతలు.)

జి.వి.ఆర్.కె. సుబ్బరాయ మూర్తి
ఫోన్ : 93951 47333 / 08656-234003

భారతీయ చిత్రలేఖనోదయము

– తలిసెట్టి రామారావు

పరిచయ వాక్యములు

– కా. నాగేశ్వరరావు.

ఆంధ్ర గ్రంథమాలయందు శ్రీ తలిశెట్టి రామారావు గారు రచియించిన భారతీయ చిత్రకళ పదవ కుసుమము. ఈ గ్రంథ మాంధ్రమునందు చిత్రకళావిషయమునకు సంబంధించిన మొదటి గ్రంథము. చిత్రకళాభినివేశము లేని పరిచయ వాక్యములును ప్రయోజనకరములు గావు. విశ్వ ప్రవృత్తి యందు రసానందమునకు భావరూపములు సాధనములుగ నున్నవి. భావరూపములవినాభావ సంబంధమును గలిగి అనిత్యములైన రూపముల ద్వారా నిత్యమైన ఆత్మానందమును గలుగజేయుచున్నవి. మానవవిజ్ఞానాంకురములు రూపలేఖనములతో నారంభమై కాలక్రమమునను మహావికాసమును బొందినవి. ఆదియుగవాసులు రచియించిన చిత్రములు ప్రాచీన గుహల యందు గనుపట్టుచున్నవి. ప్రపంచమునందు భిన్న దేశములందు చిత్రకళ వారి సంస్కారాశయముల కనురూపముగా వికసించుచు మానవధర్మాభ్యుదయమునకు సాధనంబగుచున్నది.

పాశ్చాత్యశిల్పమునకు రూపమును, ప్రాచ్యశిల్పముకు భావమును మూలాధారములై వికసించిన విధమును శిల్ప పరిశోధనలు విశదము చేయుచున్నవి. యవన రోమక శిల్పమునకు రూప సౌందర్యమును, రూపవ్యామోహమును హృదయముగను బరిణమించినది. యవన రోమక శిల్ప ప్రభవమైన పాశ్చాత్య శిల్పమునకు భౌతిక విభూతులు హృదయముగను బరిణమించినవి. భారతీయ శిల్పము నకును, విజ్ఞానమునకును భావగాంభీర్యము హృదయము గను బరిణమించినది. విశ్వప్రవృత్తియందు పాశ్చాత్య శిల్ప మాది భౌతికకల్పనలను, ప్రాచ్యశిల్ప మాధ్యాత్మిక కల్పనలను ప్రత్యక్షము చేయుచు రూప భావ రసానందమును గలుగజేయుచున్నవి. సకలేంద్రియముల యందును ప్రధానమైన నయనేంద్రియము రూప భావానందములను గలుగజేయుచున్నది. భారతీయ శిల్పము భారతీయ విజ్ఞానమువలె స్వతంత్ర వ్యక్తిత్వము గలిగియున్న విధమును శిల్ప హృదయము విశదము చేయుచున్నది.

విశ్వావృతమైన ఆత్మ స్వరూపమునే కావ్యములు వర్ణించుచు చిత్తమునకు బ్రహ్మానందమును గలుగ జేయుచున్నవి, చిత్రములు నేత్రములకు ఆనందము గలుగ జేయుచున్నవి. గానములు వీనులకు విందు గొల్పుచున్నవి. సామాన్యముగ కావ్యములు, రూపలేఖనములును, గీతములు, భౌతికమైన రూపప్రదర్శనమునకు వినియోగపడినపుడు రూపాతీతమైన ఆనందము గలుగజాలదు.

సాహిత్య కళావిషయములందు ప్రాచ్యపండితులకును, పాశ్చాత్య పండితులకును రూపభావాశ్రయమునందు భేదము గోచరమగుచున్నది. పాశ్చాత్యులకు రూపము నందును, ప్రాచ్యులకు భావమునందును అభినివేశము గోచరమగు చున్నది. ప్రవృత్తి యందు భావాశ్రయము లేని రూపముగాని, రూపాశ్రయములేని భావముగాని యసంభవములు, సాహిత్య కళలు రూపాశ్రయమును వ్యక్తముచేయునపుడు భౌతిక వైభవమును, భావాశ్రయమును వ్యక్తము చేయునపుడాత్మవైభవమును ప్రదర్శించుచున్నవి. ఆత్మాశ్రయము లేని పాశ్చాత్య శిల్పులకు భారతీయ చిత్రకళ విచిత్రముగ దోచుట సహజము. పాశ్చాత్య శిల్పము

రూపాశ్రయము. ప్రముఖమైన గ్రీకు శిల్పము ననుకరించిన విధమును పాశ్చాత్యశిల్పము వెల్లడించుచున్నది. పాశ్చాత్య వైఖరి లేని భారతీయ చిత్రలేఖనము పాశ్చాత్య శిల్పజ్ఞుల పరిహాసమునకు పాత్రమైనది. లోపము విమర్శకులదె కాని చిత్రకళది కాదు. రూపలేఖన మపరితమైన భావ ప్రదర్శనమును జేయుట దుష్కరము గాని పరిమితమైన రూప ప్రదర్శనము జేయుట దుష్కరముగాదు. ఈ పరమార్థమును గ్రహించిన పాశ్చాత్యపండితులు ప్రాచ్య చిత్రలేఖనమందలి ఔన్నత్యమును కొనియాడుచున్నారు. నూఱేండ్ల క్రిందటను భారత చిత్రకళను నిరసించిన పాశ్చాత్యకళాకోవిదులు వర్తమానకాలమందు భారతీయ చిత్రకళను ప్రశంసించుచున్నారు.

ప్రజల స్వాతంత్ర్య స్థితి సాహిత్యకళా వికాసమునకును, పారతంత్ర్య స్థితి సాహిత్యకళాక్షీణతకును, సాధనమగుచున్న విధమును సాహిత్యకళా చరిత్రము విశదము చేయుచున్నది. బ్రిటిషు పరిపాలనము భారతీయ విజ్ఞానమును స్తంభింపజేసిన విధముననే భారతీయ శిల్పమును స్తంభించజేసినది. భారతీయ సాహిత్యశిల్పములకు రాజప్రజాదరములు లేకపోవుటయే కాక అనాదరణము కూడా నేర్పడి సాహిత్య శిల్పములు జీవకళావిరహితము లైనవి. భారత జాతీయప్రబోధము సాహిత్య కళోద్ధరణమునకును, ఆత్మవిశ్వాసమునకును, సాధనమైనది. పాశ్చాత్య పండితులు భారతీయ చిత్రములందు రూపాతీతమైన భావార్థమును గమనించి దాని యౌన్నత్యమును ప్రశంసించుటకుపక్రమించిరి.

మానవ సౌభాగ్యమునకు సాధనములైన ప్రకృతి విభూతులను దైవాధిష్ఠితములుగ భారతీయశిల్పము పరికల్పించుచున్నది. కైలాసశిఖరము శివునకు నివాసము. క్షీరసాగరము నారాయణునకు శయనస్థానము. గంగా నది భీష్మునకు జనని. ప్రవృత్తియందలి సుందర గంభీర స్వరూపములు దైవాధిష్ఠితములుగ పరిగణింపబడిన విధమును భారతీయ పురాణేతిహాసములు విశదము చేయుచున్నవి. దేవతార్చనతో నారంభమైన భారతీయ శిల్పము బౌద్ధ విహారములతో పూర్ణ వికాసమును బొందిన విధమును బౌద్ధగాథలు, విహారములు విశదము చేయుచున్నవి. అమరావతీ, సాంచి స్తూపములు, అజంతా చిత్రములు భారతీయ శిల్పమునందు ఆధ్యాత్మిక హృదయమును విశదము చేయుచున్నవి. రూపప్రదర్శనము నందును, లావణ్యమునందును, భావగాంభీర్యమునందును, అంగవిన్యాసమునందును, అజంతా చిత్రములు చిత్రలేఖన మందు నిరుపమానములై కళాకోవిదుల ప్రశంసలకు పాత్రములగుచున్నవి.

అజంతా చిత్రముల ప్రాశస్త్యమునకు మూలకారణము రేఖా విన్యానము. సామాన్యముగ చిత్రకారులు రంగులపొందికతో వ్యక్తము చేసెడి రూపకల్పనను అజంతా చిత్రములు రేఖలతోనే వ్యక్తము చేయుచున్నవి. అజంతాచిత్రములందు అంగసౌష్ఠవము, అంగవిన్యాసము, అంగాలంకారములు, కాంతిచ్ఛాయలు, రేఖామాత్ర కల్పితములై అపూర్వమైన శృంగార లావణ్య విలాసములను రూప లేఖనమునందు ప్రదర్శించుచున్నవి. భారతీయ చిత్రకళకు జీవాధారములైన దైవవిభూతులు, రేఖావిన్యాసము అజంతా చిత్రములందు సర్వత్ర ప్రత్యక్ష మగుచు పాశ్చాత్య ప్రాచ్య చిత్రకళలందు గల భేదమును వ్యక్తము చేయుచున్నవి. ధ్యానబుద్ధ స్వరూపమునందు ప్రకృతి పరవశులైన పాశ్చాత్య శిల్పులకు జడస్వరూపము మాత్రమే గోచరంబైనను ప్రాచ్యశిల్పులకు రూపాతీతమైన శాంత, సుందర, శివస్వభావములు గోచరమగుచున్నవి.

భారతీయుల ప్రత్యభిజ్ఞానము భారతీయ చిత్రలేఖనమునకును ప్రత్యభిజ్ఞానమును గలుగజేసినది. పాశ్చాత్య కళాకోవిదుల యవజ్ఞతను నిర్లక్ష్యము చేయుచు ప్రాచీన సంప్రదాయముల కనురూపముగ భారతీయ చిత్రకళ నుద్ధరించుట భారతీయ ప్రబోధమునకు నిదర్శనముగ నున్నది.

భరతవర్షమునందు బౌద్ధమతము క్షీణించిన తరువాత చిత్రలేఖనమును క్షీణించినది. చిత్రకళయందు రేఖా విన్యాసమునకు బదులు వర్ణవిన్యాసము ప్రముఖత నొందినది. చిత్రకళయందు రాజపుత్రకళాశైలి, మొగలాయి కళాశైలి ప్రబలి ప్రాచీనశైలిని క్షీణింపజేపినవి. పాశ్యాత్య సంపర్కము ప్రాచ్య రచనల కనాదరణమును, పాశ్చాత్య రచనల కాదరణమును గలుగజేసినది. పాశ్చాత్యయంత్రాలయము లందు ముద్రితములైన చిత్రపటములు భారత గృహముల నలంకరించి లలితకళా ప్రయోజనమును సంకుచితము చేసినవి. భారత జాతీయ ప్రబోధముతో చిత్రకళయందును నవయుగ నిర్మాణము ప్రారంభమైనది. నవయుగ చిత్ర

నిర్మాణమునందు వంగరచనలు, ఆంధ్రరచనలు వ్యక్తిత్వము గలిగి ప్రాచీనసంప్రదాయములకును, నవీన సంప్రదాయములకును సంయోగసాహచర్యములను గల్పించుచున్న విధమును చిత్రలేఖనములు విశదము చేయుచున్నవి.

వంగ దేశమునందు అవనీంద్రనాథ ఠాకూరు, నందలాలు బోసు, అసితకుమార హల్దారు, ప్రమోదకుమార ఛటోపాధ్యాయుడు మొనూరునందు వెంకటప్ప, పంజాబునందు అబ్దుల్ రహమాను చుగ్తాయి, హకీము మహ్మదు ఖాను, ఆంధ్రదేశమునందు దామెర్ల రామారావు మొదలగువారు రచించిన చిత్రములు భారతీయ చిత్రకళయందు ప్రాచీన సంప్రదాయ సిద్ధమైన సంస్కారమును నిరూపించుచు చిత్రకళాప్రతిభను విశదము చేయుచున్నవి.

ఆంధ్రదేశస్థమైన అజంతా చిత్రములకును వర్తమాన చిత్రములకును చిత్రలేఖనమునందుగల భేదము ఆంధ్రులవతనమును విశదము చేయుచున్నది. ఆంధ్రజాతీయ కళాశాలయును, రామారావు చిత్రకళా మందిరమును చిత్రకళాభ్యు దయమునకు జేయుచున్న ప్రయత్నములు కళాభిమానుల పోషణమునకు పాత్రములగుచున్నవి.

'భారతీయ చిత్రకళ'ను రచించిన శ్రీ రామారావు గారు భారతీయ చిత్రకళ యొక్క వృద్ధి క్షయములను, ఔన్నత్యమును సప్రమాణముగ వారి గ్రంథమునందు వివరించి చిత్రకళాభ్యుదయమున కుపకారమొనరించిరి. ఈ గ్రంథమునందు చిత్రలేఖనోదయము, బౌద్ధయుగము, అజంత గుహలు, బాఘ్ చిత్రములు, మొగలు చిత్రలేఖనము, రాజపుత్ర లేఖనము మొదలగు విషయములకు సంబంధించినవి పండ్రెండు అధ్యాయములు గలవు. అజంతా చిత్రములకు సంబంధించిన పటములును, వర్ణచిత్రములును భారత చిత్రకళాచరిత్రను విశదము చేయుచున్నవి. గ్రంథమునందు గ్రంథకర్త తెలిపిన క్రింది భావములు చిత్రకళా వికాసావసరమును తెలుపుచున్నది.

"వేష భాషలందేకాక ఆత్మానుభవమును వెల్లడిచేసి, యాత్మను, పరిపక్వము జేయజాలి, జాతీయతను నిలువబెట్టజాలిన లలితకళలందును పాశ్చాత్యభావము లగ్రస్థానమును వహించినను చూచుచు నిద్రావస్థ యందుండుట యాత్మహత్యను గోరుటకు సమానము. ఈ ప్రమాదమును కొందఱు గ్రహించుటచే తక్కిన జాతీయోద్యమములతో పాటు హైందవ చిత్రకళా ప్రపంచమునగూడ సంచలనము కలిగెను.

భారతీయ చిత్రకళయందు జొరబడిన విదేశరుచులను బారద్రోలి నిజమగు హైందవ వ్యక్తిత్వమును మరల సింహాసనమున స్థాపింపజూచుచున్న యువకులకు అవనీంద్రనాథ ఠాకూరు నాయకుడు. రాజపుత్ర చిత్రరచనయందు పర్షియావిధానములు కలవు. కాన సుప్రసిద్ధ అజంత, సీగిరియచిత్రములు భారతకళ నుద్ధరించుటకు మూలాధారములుగ నుండవలయునని వీరి కోరిక. కాని తరువాతి దేశానుభవమును కళాభిమాని మఱువరాదు. రాజపుత్రులచే నావొదింపబడిన విధానములందనేకములు వాంఛనీయచిహ్నములు కలవు. జపాను, ఐరోపా విజ్ఞానములచే పోషింపబడిన చిత్రరచనయందును క్రొత్తరుచులు కలవు. ఇంత విశాల భావముతో ప్రారంభమైన చిత్రకళ జాతీయతను నిలపుకోగలదాయని సంశయింపవచ్చును.

కాశీనాథుని నాగేశ్వరరావు

ఏ దేశపు విజ్ఞానమునైనను తిరస్కరింపక భారతచిత్రముల కట్టుబాట్లు మఱువక వ్రాయుటయే కళకు క్షేమకరము.

ఆత్మ సందర్శనమునకును, దైవ సందర్శనమునకును సాధన భూతములైన లలితకళల నాంధ్రు లారాధించి పురుషార్థమును బడయుదురుగాత!

భారతీయ చిత్రలేఖనోదయము

అజంతా, సీగిరియాలయందు గల సుప్రసిద్ధములగు చిత్తరువులను వ్రాయుటకు బూర్వము భారతభూమి యందీవిద్య యభివృద్ధి చెందియుండెనని చెప్పుటకు ప్రబలాధారములు విశేషముగ గానరాకయున్నవి. మానవుడెంత ప్రయత్నించినను పూర్వ సాంప్రదాయములు లేనిది యిట్టి చిత్తరువులను తొలుదొలుతనే వ్రాయ జాలుట యసంభవము కాన తురుష్కులైనను, యవనులైనను, మనదేశమునకు వచ్చి చిత్ర రచనను నేర్పిరనియు, తదుపరి

అజంతా మొదలగు గుహలయందలి చిత్తరువులు నిర్మింప బడెననియు గొందరూహించుటకు వీలు కలుగుచున్నది. విదేశీయుల రాకపోకలు కలచోట నజంతా గుహలుండుట వలన నిట్టి యూహలకు బలము కలిగెను. కాని ఉత్కళమునందును, తదితర స్థలములందును కానవచ్చు చిత్తరువులను జూచిన నీవాదము ఊహామాత్రమని తోచును. అజంతా మొదలగు గుహల చిత్తరువులకు, పాశ్చాత్య చిత్రములకు నెట్టి సంబంధము గానరాకయున్నది. ఆ కాలమునాటి తురుష్క చిత్రముల కంటె అజంతా చిత్తరువు లెన్నియో రెట్లుత్తమముగ నున్నవి. తురుష్క హైందవాది ఆసియాఖండపు చిత్రకళా విధానములకు తురుష్క స్థానము జన్మస్థలమై యుండిన నుండవచ్చును కాని, మనదేశమున నీ విద్య ప్రత్యేకముగ నభ్యసింపబడి, నూతన మార్గముల ద్రొక్కి యున్నత దశకు వచ్చెనని చెప్పజాలుటకు తగినన్ని నిదర్శనములున్నవి. పిమ్మట హైందవ చిత్రవిద్య యితర దేశములందు గౌరవింపబడెననియు, అభ్యసింపబడెననియు చెప్పుటకు నిదర్శనములున్నవి.

చిత్రరచన, వర్ణలేపనము హిందూ దేశమున రెండువేల సంవత్సరములకు బూర్వము నుండియు నభ్యసింప బడుచుండెను. తరువాత వ్యాపించిన శిల్పవిద్యకిది మార్గదర్శకమయ్యెను. ఆ కాలమున నైరోపా శైశవ దశయం దుండుటయే కాక, ఇటీవల పదునాలుగు, పదునైదు శతాబ్దముల వరకు నచ్చట నిట్టి చిత్తరువులను వ్రాయజాలక పోయిరని విన్సెంటు స్మిత్తుగారి యభిప్రాయము. కాని ఆకాలపు చిత్తరువు లిప్పుడింత యల్పముగ గాన వచ్చుటకు హైందవ వాతావరణమే కారణము. మన పూర్వులచే గోడలమీద జిత్రింపబడిన చిత్తరువులన్నియు వర్ష జలాపాతమున దడిసి, మండువేసవియందు బీటలు వారి నశించినటులు గోచరించు చున్నది.

కైమూరు పర్వతములందు గల గుహా కుడ్యముల పైన పురాతనములయిన చిత్తరువులు కొన్ని కానవచ్చుచున్నవి. వింధ్యపర్వతములందుకూడ నిట్టి చిత్తరువులు, కొంతయెరుపు రంగు, రంగులను నూరెడు రాతిపలకలు లభించినవి. ఈ చిత్తరువులు మంచివి కాకపోయినను హిందూ దేశమునందలి చిత్రవిద్యకు తొలిప్రయత్నము లగుటజేసి, చరిత్రకారుల దృష్టి నాకర్షించినవి. కొలది కాలము క్రిందట మధ్య వరగణాలందలి రామగఢ, రాజ్యమునకు జేరిన సంగనుపురము దగ్గర గుహాముఖమున నొకరాతిపై నెరుపువర్ణముతో వ్రాయబడిన చిత్తరువులు లభించెను. ఇచ్చట మానవుని తొలిరాతిపనిముట్లు కూడ దొరకుటచే నీ చిత్తరువులు వేలకొలది సంవత్సరములకు బూర్వము వ్రాయబడెనని స్పష్టమగుచున్నది. ప్రపంచము నందంతటను మానవుడు ప్రథమమున క్రూరమృగములను, ఆహారమునకు దగిన మృగములను వేటాడి తన కాలమును గడుపుచుండెను. కాన నీతడిట్టి చిత్తరువులనే రచించుచెండెను. ఇచ్చటి చిత్తరువులును వేటకు సంబంధించినవి. ఇందు ఏనుగు, లేడి మొదలగు జంతువు లనేకరకములు వ్రాయబడినవి. ఒకచోట ఒక యెనుబోతును జయించు యతనమున ననేక మృగములు దానిచే పరాభవింపబడి నటులు గలదు. మరియొక చోట నొక యెనుబోతును వేటకాండ్రు తమ బల్లెములతో బొడుచుచున్నటులును, తమ ప్రయత్న ఫలమును జూచి తక్కినవారానందించు చున్నటులును కలదు. ఇందు కొన్ని చిత్తరువుల యర్థమంతగా తెలియకున్నను, హైందవ పురాతన చిత్రకారుడు కొంత ప్రవీణతను సంపాదించెనని తోచును.

మీర్జాపురము జిల్లాయందు జిల్లాయందు కూడ పురాతనములయిన చిత్తరువు లనేకములు కానవచ్చు చున్నవి. ఈ ప్రదేశమునకు సమీపమున సురుగుజా రాజ్యమునందలి రామగఢ పర్వతమున గల 'జోగిమారా' యని పిలువబడు గుహలయందు చిత్తరువులు కలవు. వీటిపై నితరులెవరో దిద్దుటవలన నివి తొలిరూపుచెడి వికారముగ గనబడును. కాని నిదానించి చూచిన యెడల మొదటి సౌందర్యము గ్రహింప వీలగును. ఎరుపు, పసుపు వర్ణములతో చదరమునందు చదర మిమిడియున్నటులివి కలవు. ఈ చదరముల చుట్టు మకరము మొదలగు నీటి జంతువుల రూపము లలంకారముగ గలవు. చదరములందు మనుష్యులయు, జంతువులయు, వృక్షములయు నాకారములున్నవి. ఒక చదరమునందు చెట్టుక్రింద నొక పురుషుడును, ఎడమవైపున గాయకులతో నొక నర్తకియు, కుడివైపున ఏనుగులతో నొక యుత్సవమును కలవు. మఱియొక చదరమున నొక దిగంబరుడును, రథము, ఏనుగు మొదలగు రాజచిహ్నములును కలవు. ఈ చిత్తరువుల యర్థము పూర్తిగా తెలియకపోయినను,

దిగంబర విగ్రహమువలన నివి జైనులకు జెందినవని తోచును. తెలుపు, నలుపు, ఎరుపు, పసుపు రంగులతో మాత్రమే యివి వ్రాయబడుట వలనను, ఇచ్చటగల శాసనములవలను, సాంచి, బార్‌హత్ నందుగల శిల్పములతో బోల్చి చూచుట వలనను, ఇవి చాల పురాతనములనియు, బహుశః క్రీస్తుకు పూర్వము మొదటి శతాబ్దము నాటివనియు గోచరించును. తరువాతి చిత్తరువులతో సరిపోల్చి చూచిన యెడల నివి హైందవ చిత్రలేఖనము యొక్క శైశవదశకు జెందునటుల గాన్పించును.

పైన జెప్పిన చిత్తరువులందు కళానైపుణ్య మంతగా కానరాదు. ఎంత వెదికిన నిదివరకు నితరాధారములు లభించలేదు. అజంత, సీగిరియా చిత్తరువులను, అప్పటి వాఙ్మయమును బరిశీలించిన నంతకు పూర్వమే యీ విద్య యున్నత దశయం దుండెనని స్పష్టపడుచున్నది. ఈ విరుద్ధ నిదర్శనములను జూడ జోగిమారా గుహల చిత్తరువులును, కళాజ్ఞాన మల్పముగ గల వారిచే చిత్రింపబడియుండవలెను; లేక, వాఙ్మయమునందు కవులు తక్కిన వర్ణనలవలె నీకళను గూడ మితిమీర బొగడి యుండవలెను– అని తోచును. కవుల యుత్ప్రేక్ష కొంత యథార్థము కావచ్చును కాని అజంత గుహల చిత్రసౌరభమును బట్టి చిత్రలేఖనము మహోన్నత దశయందుండెననియు, మధ్య రెండు వందల సంవత్సరములందు లిఖింపబడిన చిత్తరువులు నశించెననియు జెప్ప సాహసింపవచ్చును.

వేదము, తదితర విద్యలు దేవత వలన మనకు లభించెనని వాడుక. చిత్రలేఖనోత్పత్తి విషయమైకూడ నిట్టికథ యొకటి కలదు. పూర్వ మొకబ్రాహ్మణ పుత్రుడు మరణింప నాతని తండ్రి దుఃఖము నాపజాలక పుత్రభిక్ష నిడుమని యముని ప్రార్థించెను. యముని హృదము కరగలేదు. అంత నా భూసురుడు బ్రహ్మను ప్రార్థించెను. సృష్టికర్తయగు నీవేల్పు పంచభూతములలో లీనమైన దేహమును మరల సృజింపజాలక యాకుమారుని రూపమును వ్రాయుటను నేర్పి, కుంచెలను, రంగులను ప్రసాదించెను. బ్రాహ్మణుడు తన ప్రియకుమారుని రూపమును స్మరించి యొక విగ్రమును నిర్మింప, దానియం దాదేవుడు ప్రాణమును బోసెను. తరువాత నీ విద్య యెల్లెడల వ్యాపించెను. ఈ కథ నిజమయినను, కాకపోయినను, చిత్రలేఖనమునందు హిందువుల కెట్టి గౌరవము కలదో దీనివలన తెలియగలదు.

రాజగృహములందు వివాహము తలపెట్టినప్పుడు రాకొమరితలయు, రాకొమరులయు చిత్రపటములను తరుచుగ నుపయోగపరచు చుండిరి. కొన్ని సమయము లందు వీరి యన్యోన్య ప్రేమకివి కారణములయ్యెను. దీని నుదాహరించుట కొక ప్రసిద్ధిజెందిన చక్కని కథ పురాణములందు గలదు. ''శ్రీకృష్ణుని మనుమడగు అనిరుద్ధుడు ఉషయను రాజకన్యకకు స్వప్నమున గాన్పించెను. ఆమె తన చెలికత్తెయగు చిత్రలేఖ కీవార్త దెలిపి యా సుందర యువకు డెవడని సంశయించెను. చిత్రలేఖ తనకు దెలిసిన అందఱు రాకొమరుల చిత్రముల వ్రాసి చూప ఉష స్వప్నమున తన హృదయమును హరించిన వానిని పోల్చగలిగెను. కొంత కాలమునకు వారిరువురికి వివాహమయ్యెను''. రామాయణ మహాభారతములందు చిత్రశాలల వర్ణనలు కలవు. భాసుడు, కాళిదాసు, భవభూతి వ్రాసిన గ్రంథములందును చిత్రకళను గూర్చి కలదు. వ్యక్తుల కాలిగోరును. దలవెంట్రుకలను, ఇతరావయములను జూచి వారి రూపచిత్రములను వ్రాయుట కలదని చెప్పుట వినుచున్నాము.

హిందూ వాఙ్మయమునందే కాక బౌద్ధుల వాఙ్మయమునందును చిత్రలేఖనము సామాన్యముగ నుండెనని చెప్పుటకు చాల నిదర్శనములు కలవు. క్రీస్తుకు పూర్వము నాల్గవశతాబ్దమున పాళీభాషయందు వ్రాయడిన బౌద్ధుల వినయపిటకమను గ్రంథమందు పాసెనాడ నృపుని చిత్రగృహ మనేకములగు చిత్రములచే నలంకరింపబడెనని కలదు. సయామ దేశమున అంకోరు నందును, జావాద్వీపమున బోరుబందరునందును చిత్రశాలల చిహ్నములు కానవచ్చుచున్నవి. దుత్తగామిని యను రాజుచే నిర్మింపబడిన డగోబా చిత్తరువులచే నలంకరింపబడెనని యైదవ శతాబ్దమున వ్రాయబడిన మహావంశమను గ్రంథమున గలదు.

ఈ నిదర్శనములబట్టి చూడ మన నృపులీకళను విశేషముగ నాదరించుచుండిరని తెలియును. లాఫర్‌గారు చిత్రలేఖనము రాజగృహములందే జన్మించెనని తలచుచున్నారు. ఇవన్నియు అజంత, సీగిరియా చిత్తరువుల వలె గోడలమీదనే వ్రాయబడుట స్పష్టము. ఇప్పటికిని హిందూ దేశమున గొన్ని భాగములందు ఉత్సవములకు

గోడల నలికి వాటిపై చిత్తరువులను వ్రాయుదురు. ఆంధ్రులును ముగ్గులతోను, బొమ్మలతోను ఇండ్లను, గోడలను అలంకరించుచున్నారు.

ఐదు, ఆరు, ఏడు శతాబ్దములందు చైనాదేశము నుండి వచ్చిన యాత్రికులు బౌద్ధుల చిత్రకళానైపుణ్యము నధికముగ గొనియాడియున్నారు. పదునేడవ శతాబ్దమున టిబెట్టునందు నివసించియుండిన తారానాథుడను బౌద్ధ చిత్రకారుడీ కళను బుద్ధునకు బూర్వమునుండియు బ్రసిద్ధి జెందియుండెనని వ్రాసెను. పురాతన కుడ్యచిత్రముల సౌందర్యమును జూచి యవి దేవతలచే చిత్రింపబడి యుండవలెనని అతడు తలచెను. అశోకునిచే నియమింపండిన యక్షులును, నాగార్జునుని యాధిపత్యము క్రింద నాగులును చిత్రములను జిత్రించుచు వచ్చిరని వీరు వ్రాసిరి.

ఒకానొక రాజున కర్పించుట కొక చిత్రకారుడు గౌతముని యెదటనే గౌతముని రూపమును జిత్రించుచున్నటులును, ఆ చిత్తరువును జూచి యాసృపు డాశ్చర్యపడి దాని నారాధించుచు బౌద్ధమతమును స్వీకరించినటులును టిబెట్టునందు చిత్తరువులు గలవు. పూర్వమును రూపచిత్రములను వ్రాయుట కలవనుట కది మరియొక చక్కని నిదర్శనము.

బౌద్ధుల కాలమునకు పూర్వమే చిత్రలేఖనము విషయమై కొన్ని నిబంధన లేర్పడినటులు కానవచ్చుచున్నది. మూడవ శతాబ్దమున వాత్స్యాయనుడు తన కామశాస్త్రము నందు రూపభేదము, ప్రమాణము, భావయోజనము, లావణ్యయోజనము, సాదృశ్యము, వర్ణికాభంగము చిత్రలేఖనమునకు షడంగములని వ్రాసెను.

శ్లో. రూపభేదాః ప్రమాణాని భావలావణ్య యోజనమ్;
సాదృశ్యం వర్ణికాభంగ మితి చిత్రం షడంగకమ్.

1. రూపభేదము : మానవులు, జంతుజాలములు, తదితర వస్తువులు ప్రకృతియందెటులు గానవచ్చునో చిత్రకారు డెరుంగవలెను. వీటి వివరములు, వివిధ వస్తువులకు గల భేదము చిత్తరువునందు ప్రదర్శించుట ముఖ్యము.

శ్లో. అంగా న్యబూషితాన్యేన కేనచి ద్భూషణాదినా;
యేన భూషితవ ద్భాతి తద్రూప మిత కథ్యతే

ఐరోపా చిత్తరువులందువలె, ఛాయాచిత్రములందు వలె వస్తువులరూపములు చాయ వెలుతురుల వలన స్ఫుటముగ దెలియును. కాని హైందవ చిత్రకారులీ ప్రకృతి జ్ఞానము నొకమూలద్రోసి, రేఖలతో తమచిత్తరువులను నిర్మించిరి. లోకమునగల యన్నిటియొక్క రూపముల యర్థమును గ్రహించి, యాలోపలి రహస్యమును వెలిబుచ్చుట శిల్పియొక్క పవిత్రమైన విధి. ఛాయాచిత్ర మాత్రముగ వ్రాయుటకంటె నిది యెక్కువ ప్రయోజనకారి.

2. ప్రమాణము : ప్రతి వస్తువు యొక్క పరిమాణము చిత్తరువునందు చాల అవసరము. ప్రకృతియందు కొన్ని వస్తువులు పెద్దవిగను, కొన్ని చిన్నవిగను ఉండును. పర్వతము, ఏనుగు చూపరుల కొకేదూరమున నున్నప్పుడు ఏనుగుకంటె పర్వతము పెక్కు రెట్లు పెద్దదిగ గనబడును. కాని ఏనుగు దగ్గరగను, పర్వతము దూరముగ నున్నప్పుడు పర్వతమే చిన్నదిగ కన్పించవచ్చును. కాని హైందవ చిత్రకారునకు ఆధ్యాత్మిక చింత ముఖ్యమని జ్ఞాపక ముంచుకొనవలెను. మాయాదేవి నిద్రించుచున్నటు లొక శిల్పము కలదు. ఇందు మాయాదేవి ముఖ్యము. తక్కిన వన్నియు నాధ్యాత్మిక దృష్టియందు చిన్నవి. ఆమె పండుకొనియున్న శయ్య, చుట్టునున్న పరిచారికలు మాయాదేవికంటె పెక్కురెట్లు చిన్నగ చిత్రింపబడిరి. ఇట్టి శిల్పములనేకములు మనదేశమునందు కలవు. ఈ నియమమును మనుష్యుల విగ్రహముల వివిధాంగములను వ్రాయునప్పుడు మనపూర్వులు విశేషముగ బాటించిరి. వివిధాంగముల కొలతలన్నియు నియమింపబడెను. అజంతా చిత్తరువులందీ కొలతలన్నియు బాగుగ జూపబడెను.

శ్లో. శరీరేంద్రియ వర్గస్య వికారాణాం విధాయకాఃు;
భావానుభావజనితా శ్చిత్తవృత్తయ ఈరితాఃు

3. భావము : మనంబున గల భావములను ముఖమున జూడగలము. నవ్వునప్పుడు, ఏడ్చునప్పుడు, కోపముతో నున్నప్పుడు, ఆతురతో నున్నప్పుడు వదనమనేక రూపములను దాల్చును. వదనమే కాదు; దీనికి మనము రవివర్మ చిత్తరువులందు బాగుగజూడగలము. అజంత చిత్తరువులం దీయంగము నేల లక్ష్యపెట్టలేదని ప్రశ్నింపవచ్చును. దేవునిపై లగ్నమైన హృదయమున నీభావముల కంతగా చోటులేదు. శాంతియే ముఖ్యము.

బుద్ధుని రూపమును జూడుడు: ఇందు ఆనందము, దుఃఖము, కోపము మొదలగు మనోవికారము లెవ్వియు కానరావు. వీటిని త్యజించుటవలననే యాతడు నిర్వాణమును

కాంచగలిగెను. అతని ప్రతియంగము నందును శాంతి మూర్తీభవించి యున్నది. ఇదేయేకద వాంఛనీయము! ఇంతకు మించిన జ్ఞానఫలిత మింకొకటి లేదు. ఈ భావ ప్రదర్శనము విశేషముగ లేకపోయినను అజంత చిత్తరువులందొక పవిత్రత కలదు. మతమునకు సంబంధించని చిత్తరువులలో కొన్నిటియందు మాత్రము భావము చక్కగ గనబడుట వలన నాటి చిత్రకారులిందు ప్రవీణులై యుండియు ప్రదర్శించుట మానుకొనినటులు దోచును.

4. లావణ్యయోజనము : చిత్తరువు చూపరుల మనంబుల నాకర్షించవలెనన్న నది సుందరముగ నుండవలెను. సుందరమైన వస్తువులను జూడ నందరు నిచ్చగింతురు. కాని కాముకునకు యౌవనమున గాన్పించు సౌందర్యము, లోభికి బంగారమున గాన్పించు సౌందర్యము, సౌందర్యము కానేరదు. అన్ని చిత్తరువులయందును సుందరమైన వస్తువులను వ్రాయుట యసంభవము. యౌవనమునకుగల సౌందర్యము వార్ధక్యమున కుండదు. నెమలికున్న సౌందర్యము కాకికి లేదు. కాని వార్ధక్యము నందు నొక సౌందర్యము కలదు. నెమలి జీవితమున నెట్టి సార్థకత కలదో, కాకి జీవితమునందును దానికి తగిన సౌందర్యము కలదు. రక్తము స్రవించుచున్న యుద్ధభూమి యందును నీతియు, ఆధ్యాత్మికలావణ్యము కలవు. ఇందును దేవుని యాజ్ఞ నిర్వహింపబడును. బుద్ధదేవుని శుష్కములైన యంగములందుగల యాంతరంగిక సౌందర్యము వారకాంత యంగములందు లేదు. బుద్ధుని యంగముల నుండి వెలువడు తేజము, నిర్మలత, ముఖ్యములయినవి. రామచంద్రుని కృష్ణవర్ణము నుండి వెలువడు నిజమగు క్షత్రియ తేజము లక్ష్మణుని శ్వేతవర్ణమున లేదు.

శ్లో. ముక్తాఫలేషు ఛాయాయా స్తరళత్వ మివాంతరే,
ప్రతిభాతి యదంగేషు లావణ్యం తదిహోచ్యతే.

ఇందు ముత్యముల గుండ్రతనము, వర్ణములకంటె వాటి నుండి వెలువడు తేజము ముఖ్యము. తెల్లని గాజుపూసల యందిట్టి తేజము లేదు. కాని ఈ హైందవ దృక్పథము నందు లావణ్యయోజనమన భౌతిక సౌందర్యము నిమిడి యుండకపోదు.

5. సాదృశ్యము : సాదృశ్యమన సత్యము. విషయమెట్టిదైనను, చిత్రకారుని రుచి యాధ్యాత్మికమైనను, భౌతికమైనను చిత్తరువునందు సత్య మత్యంతావశ్యకము. ఇదిలేని చిత్రము నిస్సారమైనది. తన మనోభావములను స్ఫుటముగ వ్యత్యాసము లేక ప్రదర్శింప జాలని శిల్పి నిజమగు శిల్పికాడు. చూపరులను తప్పుద్రోవను బెట్టుట చిత్రకళ యుద్దేశము కాదు. సృష్టియొక్క నిజమగు అర్థమును ప్రదర్శించుట యాతని విధి.

6. వర్ణికాభంగము : ఈ చిత్రవిద్యాంగము చిత్రకారుడు తన రంగులను, కుంచెలను ఎటులుపయోగపరుపవలెనో చెప్పును. వీటి యుపయోగమునందు చిత్రకళాకోవిదుని ప్రవీణత కొంతవరకు దెలియును. ఇందును పాశ్చాత్య చిత్రకారునకును ప్రాగ్దేశపు చిత్రకారునకును భేదము కలదు. భారత చిత్రకారుడు రంగులను కొంత వరకు భావమున కనుగుణముగ జిత్రించును.

మన దేశమున చిత్రలేఖము మిక్కిలి యున్నత స్థితియందుండకపోయిన నిట్టి సూక్ష్మబుద్ధితో చిత్రకారుని కార్యక్రమమును విమర్శింపజాలక పోదురు. బౌద్ధులచే నిది శ్రద్ధాభక్తులతో నభ్యసింపబడెను. ఈ కళ క్షీణదశకు వచ్చిన కాలమున కళాభ్యాసకులు భావస్వాతంత్ర్యమును వీడి పూర్తిగ నీ నియమములపైనే యాధారపడి యుండిరి. ఇట్టి నిబంధనలే చైనాయందాదరింపబడుచుండెనని ఆరవ శతాబ్దమున హియాహెూ (Hsieh Ho) వ్రాసెను. హిందూ దేశపు షడంగములనే వీరవలంబించినటులు గాన వచ్చుచున్నది.

సనాతన హైందవచిత్ర విద్యాధిక్యమును నిర్ధారణ చేయుటకు చిత్రలక్షణమను గ్రంథము మరియొక యాధారము. ఈ గ్రంథము మతవిషయిక చిత్రలేఖనమును గూర్చి ముఖ్యముగ పూజ మొదలగు ఆరాధనము లందుపయోగపడు దేవతల విగ్రహములను గూర్చి-తెలియజేయును. కాని యిందొక ప్రకరణమున 'ప్రమాణము'ను గూర్చి కలదు. మానవులయు, దేవతలయు ప్రతిమలెటులుండ వలెనో విపులముగ వ్రాయబడి యున్నది.

ఈ గ్రంథమును బట్టి మానవుని ముఖము సుందరముగ నుండవలెను. గుండ్రముగను, వంకరగను, త్రిభుజమువలె ఉండకూడదు. ఇట్టి నిబంధననుసరించి చిత్రించువారు వర్ధిల్లెదరు. ముక్తిని గోరు మానవుని ముఖము పొడవుగను, గుండ్రముగను, త్రిభుజమువలెను ఉండవచ్చును. నృపుల యొక్కయు, దేవతల యొక్కయు శిరోజములు మృదువుగను, వలయములుగను, దివ్యమైన నీలిరంగు గలవిగను ఉండవలెను. స్త్రీల యాకృతి యెటులైన నుండవచ్చును కాని యంగముల పొందిక మాత్రము ముఖ్యము. వారు వృద్ధులవలె

వంగి యుండరాదు. సాధారణముగ యౌవనులవలె నుండుట మంచిది.

శ్లో. ధ్యానయోగస్య సంసిద్ధౌ ప్రతిమా లక్షణం స్మృతమ్;
ప్రతిమాకారకో మర్త్యో యధా ధ్యానరతో భవేత్.
తధా నాన్యేన మార్గేణ ప్రత్యక్షేణాపి వా ఖలు
దేవానాం ప్రతిబింబాని కుర్యా చ్చైయస్మరాణిచ.
స్వర్గాణి మానవాదీనా మస్వర్గ్యాణ్య శుభానిచ;
అపి శ్రేయస్కరం నౄణాం దేవ విలంబలక్షణమ్.
సలక్షణం మర్త్యబింబం నహి శ్రేయస్కరం సదా.

దేవతలరూపముల నెటులు వ్రాసినను శ్రేయస్కర మనియు, మానవుల రూపములను, సలక్షణముగ వ్రాసినను సదా శ్రేయస్కరము కాదనియు, శ్రీ శుక్రాచార్యుని యుద్దేశము.

చిత్రలక్షణమునందు నృపుల యొక్కయు, దేవతల యొక్కయు, "ప్రమాణము"ను గూర్చి ఇటులు గలదు. దేవతల విగ్రహములకంటె రాజులవి చిన్నవిగను, రాజుల విగ్రహములకంటె తదితరులవి చిన్నవిగను ఉండవలెను. ఇదివరకు జెప్పినటులు స్థూలశరీర బలముకంటె ఆధ్యాత్మిక బలము ఎక్కువ యనియు, పూర్వజన్మమునందు జేసిన సుకృతమువలన రాజులట్టి యున్నత జన్మము నందెదరనియు హిందువులు నమ్మెదరు. దేవగధ దేవాలయమున అనంతశయనుడగు విష్ణుని విగ్రహమునందును, అనేకములగు ఇతర శిల్పములందును ఈ ప్రమాణ నియమము స్ఫుటముగ గాన్పించును.

సాముద్రిక శాస్త్రము ననుసరించి చిత్తరువులను వ్రాయవలెనని యొక ముఖ్య నియమమున్నటుల గోచరించును. ఇవికాక గుప్తవంశపు రాజుల పాలనలో వ్రాయబడిన శిల్పశాస్త్రములందు శిల్పచిత్రలేఖనముల విషయమై యనేక నిబంధనలు కలవు. వీటి నిప్పటికిని హిందూ దేశమున వాడుచున్నారు.

సనాతన హైందవ యువతులు మతమునందును, భాషలయందును మంచి ప్రవేశమును గలిగియుండి రనుటకు నిదర్శనములు కలవు. చిత్రరేఖ చిత్రలేఖనమున బ్రవీణురాలని మన పురాణముల నున్నది కాన స్త్రీలును చిత్రవిద్యయందు బ్రవేశము కలిగియుండిరని చెప్ప సాహసింపవచ్చును.

ప్రాచీన హైందవచిత్రకారుడు రాజపోషణపై ముఖ్యముగ నాధారపడియుండెను. దేశీయ సోదరుల గౌరవమును పొందుచుండెను. రాజపండితులు, రాజపురోహితులవలె నీతడును రాజగృహము నాశ్రయించియుండుట సంభవము.

హైందవ చిత్రకారుడు తన మనంబున గల భావములను వెల్లడించు నుద్దేశముతో గళాప్రపంచమున మునిగియుండెను. తన చిత్తరువులందు నవీనులవలె తన పేరును వ్రాసుకొనలేదు. కాన నాతని గూర్చి విశేషముగ వ్రాయుటకు తగిన యాధారములు లేవు.

చాలవరకు మలినమై తొలిరూపము చెడియున్నను, ఇప్పుడు మనకు మిగిలియున్న చిత్తరువులను బట్టి యాకాలపు వర్ణికాభంగమును గూర్చి కొంత తెలిసికొనగలము. ప్రపంచమునందన్ని దేశములందువలె భారతదేశమునందును నాగరికత శైశవమున నుండిన కాలమున మానవుడు తన చిత్తరువుల నెరుపురంగుతో వ్రాయుచుండెను. చాయను జూపవలసిన చోటుల నీవర్ణమునే కొంచెము నలుపురంగు కలిపి పూయుచుండెను.

ఈ రంగు రాళ్ళకును, గోడలకును అంటుకొనుట కిందు కొవ్వును గలిపి యుండవచ్చును. మోటుకుంచెలతో వర్ణలేపనమును జేసి, సన్నని పుడకలతో రేఖలను గీయుచుండినటుల గానవచ్చుచున్నది. జోగిమారా గుహలందు గరుకుగనున్న రాళ్ళపైని, కొన్ని చోటుల పలుచగ బూయబడిన మంటిపైని చిత్తరువులు గలవు. ఇందు చిత్రములు ఎరుపు, తెల్లని సుద్ద, కరక్కాయల నలుపుతో చిత్రింపబడినవి. ఈ రంగులను నూరు శిలాఫలకము లిచ్చట లభించెనని యిదివరకు వ్రాసియుంటిని. ఇట్టి మోటు పరికరములతో చిత్తరువులను వ్రాయు మానవుడనాగరికుడై యుండవలెను.

కాని యీ కాలము నాటి యితర దేశముల వారికీ విద్యయందు భారతీయుడెంతమాత్రము వెనుక బడలేదని తక్కిన దేశముల చరిత్రలను జూచిన స్పష్టపడును.

తలిశెట్టి రామారావు
తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారులు

ప్రసార సాధనాలలో తెలుగు

– బి. నాగశేషు

మానవుడు సంఘజీవి. ఒంటరిగా, మౌనంగా జీవించలేడు. మనిషి అనుక్షణం భావాల ఆధారంగా ఆలోచనల్లో మునిగి తేలుతూ ఉంటాడు. ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంటాడు. సంభాషణమనే ప్రక్రియకు సాధనం భాష. కాబట్టి వ్యక్తికి భాషకు అవినాభావ సంబంధం ఏర్పడింది. భాషింపబడేది భాష. 'భాష్యతి ఇతి భాష' భాషించడమంటే మనస్సులోని భావాలను కంఠ ధ్వనుల ద్వారా తెలియజేయడం. ఇలా మన భావాలను వ్యక్తం చేయడానికి అనేక రకాల సాధనాలున్నాయి. వాటిలో కెల్లా అత్యంత ప్రధానమైనవి, ప్రభావ వంతమైనవి, ప్రసార సాధనాలు. ప్రసార సాధనాల ప్రాధాన్యత ఆధునిక కాలంలో విపరీతంగా పెరిగింది. ప్రసార సాధనాల ప్రాధాన్యతను మనం గమనిస్తే కొంతమంది ప్రముఖుల మాటల్లో వాటి విలువలను మనకు చాటారు. "వెయ్యి తుపాకీ గుండ్ల కన్నా శతృత్వం వహించిన నాలుగు పత్రికలు భయంకరమైనవి" అని నెపోలియన్ బోనపార్ట్ అన్నారు. "పత్రికలు పదునైన బాణాలతో వ్యాఖ్యానించ గలిగినపుడే పత్రికా స్వాతంత్ర్యం గౌరవం పొందుతోందని భావించవచ్చు" అని జాతిపిత గాంధీ అన్నారు. "పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తలు, వ్యాఖ్యానాలు చరిత్రకు ముడిసరుకులాంటివి" అని ప్రముఖ భారతీయ పాత్రికేయుడు ఫ్రాంక్ మొరేస్ అభిప్రాయపడ్డారు.

"పత్రికే నియంత పక్కలో బల్లెమ్ము, పత్రికే ప్రజాళి పట్టుగొమ్మ, ప్రభుత్వ వక్రమౌను పత్రిక లేనిచో" అని నార్లగారన్నారు. ఇలా నెపోలియన్ నుండి నార్ల వరకు పత్రికల గూర్చి చెప్పారంటే అర్థం చేసుకోవచ్చు. పత్రికల ప్రాధాన్యత. ఆధునిక వచన వ్యాప్తికి ప్రసార మాధ్యమాలు చాలా వరకు దోహదం చేశాయి. తెలుగుభాష ఆధునికం కావడానికి సకల సమాచార అభివ్యక్తి సాధనంగా రూపొందించడానికీ ప్రసారమాధ్యమాల రంగంలో జరిగిన కృషి ప్రధాన కారణం సమాచార భావ ప్రసారానికి రాసే భాషను మాట్లాడే భాషను ప్రసారమాధ్యమాలు సమర్థంగా వినియోగించుకుంటున్నాయి. అవన్నీ సినిమాలలోను, సీరియల్స్‌లోను (ధారావాహికల్లో) పత్రికలలోను వాడినవే జనప్రచారంలోకి వచ్చి చేరుతున్నాయి.

ప్రసారమాధ్యమాలు రెండు రకాలు : 1. ముద్రణా మాధ్యమాలు 2. దృశ్యమాధ్యమాలు. వార్తాపత్రికలు ముద్రణా మాధ్యమాలు. రేడియో, టెలివిజన్, సినిమా, ఉపగ్రహ ప్రసారాలు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ శ్రావ్య, దృశ్య, మాధ్యమాలకు చెందుతాయి. పై రెండింటిలో ముద్రణా మాధ్యమమైన వార్తా పత్రికలు చారిత్రకంగా ప్రాచీనమైనవని చెప్పవచ్చు. ప్రసార మాధ్యమాలన్నీ ఆధునిక పరిస్థితుల్లో పుట్టినవే. కావున ప్రసార మాధ్యమాలు భాష అభివృద్ధికి భాష ఆధునికీకరణకు తోడ్పడ్డాయనడంలో సందేహం లేదు. ప్రసార మాధ్యమాల భాష ఇతర విధాలైన భాష ఆధునికీకరణకు ప్రోద్బలంగా వుంటుంది. వేగవంతమైన సమాచారు ప్రసారపు ఆవశ్యకతను జనబాహుళ్యంలో అత్యంత వేగంగా ప్రసారం చేయాలంటే ప్రజలకు అనుకూలమైన భాషలో చెప్ప వలసి ఉంటుంది.

1835లో బళ్ళారి క్రైస్తవ సభ వెలువరించిన 'సత్యదూత'ను తొలి తెలుగు పత్రికగా కొందరు పేర్కొంటారు. అటు తర్వాత వృత్తంతి, వర్తమాన తరంగిణి, గీతవాది, దినవర్తమాని, ఆంధ్రభాషా సంజీవని వివేకవర్ధని, మొదలైనవి. 1902లో వెలువడిన కృష్ణాపత్రిక నుండి ఈనాటి దినపత్రికల వరకు తెలుగు పత్రికలు రాశిలోను, వాసిలోను, శ్రేష్ఠమైనవిగా పేరు తెచ్చుకొన్నాయి. ఇలా అనేక పత్రికలు తెలుగు భాషను వాడుకలోకి తీసుకువచ్చాయి.

పత్రికా రచయితలు, వర్ణనలు చేసేటప్పుడు సముచితమైన పదబంధాలను ఉపయోగిస్తారు. ఉదా. మహత్తరమైన స్వాగతం లేదా బ్రహ్మాండమైన స్వాగతం అని రాయవచ్చు. కోలాహలమైన స్వాగతం అని వ్రాస్తే ఎబ్బెట్టుగా వుంటుంది. ఏడ్చాడు అనే పదాన్ని హృదయ విదారకంగా విలపించారు. కుయ్యోమొర్రో అని ఏడ్చాడు. హత్యను దారుణహత్య అని, ఉపయోగించే భాషా పదజాలాన్ని బట్టి దాని తీవ్రతను మనం అర్థం చేసుకోవచ్చు.

ఇటీవలికాలంలో ఉత్తమమైన వార్తల్ని వ్రాయడంమాని రెచ్చగొట్టే వార్తాంశాలను కొన్ని పత్రికలు ప్రచురిస్తున్నాయి.

పత్రికా రంగానికున్న శైలీ పత్రినికిలోబడే వార్తాంశాలను వ్రాయాల్సి ఉంటుంది.

1920 ముందుకాలంలో ఉన్నటువంటి పత్రికల భాష పరిశీలిస్తే గ్రాంధికంగా సాగేవి. గ్రాంథిక శైలిలో వ్రాయడం, మాట్లడడం. సంస్కృతి సంరక్షణకు ప్రతీకగా భావించేవారు. గ్రాంథిక శైలినుండి వ్యవహారిక శైలి వైపు అడుగులు వేయడం ఆధునికీకరణగా చెప్పవచ్చు.

పత్రికా రంగం వాడేటువంటి భాషా ప్రభావం ప్రజలపై తప్పకుండా ప్రభావం చూపుతుంది. శాస్త్ర విషయాలు. సాంఘిక రాజకీయ విషయాలను సామాన్యులకు అందించే ప్రయత్నంలో కొన్ని మార్పులు చేస్తుంటారు. According to knowledge sources అనే ఆంగ్ల పదబంధాన్ని విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం Walking grace-fully సుతారంగా అమలు చేస్తూ meanwhile ఇదిలా వుండగా Black market నల్లబజారు మొదలగు పదాలు వాడుతుంటారు. అటు తర్వాత దృశ్య శ్రవ్యమాధ్యమాల విషయానికొస్తే –

1930లో ప్రారంభమై అనతి కాలంలో విస్తృతంగా వ్యాప్తి చెందిన రేడియోలో పాడిపంటలు కార్యక్రమంలో మాండలిక భాషా శైలిని ఉపయోగించి ప్రజల మన్ననలు పొందాయి. ఇటీవల కాలంలో దూరదర్శిని, సినిమాలు, ఇంటర్‌నెట్‌లు. జనబాహుళ్యం పొందిన ప్రసార మాధ్యమాలు. అయితే వీటిలో 95 శాతం వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ కేవలం 5 శాతం మాత్రమే ప్రయోజనాత్మకమైన, సందేశాత్మకమైన అంశాలను ప్రసారం చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

అనుసంధాన కర్తలు (యాంకర్స్) మాట్లాడే భాషయితే తెలుగు భాషా పదాలు టార్చిలైటు వేసి వెతికాన దొరకవు. హాయ్, హల్లో, ఆదాబత్స్, వణక్కం, వెల్‌కం టు యువర్ ఫేవరెట్ ప్రోగ్రాం అని ప్రారంభించి, మన ప్రోగ్రాంకి చీఫ్ గెస్టులుగా వచ్చిన వారికి వెల్‌కమ్ చెబుదాం అంటూ వివరాలు తెలుసు కోబోయేముందు take a small break అంటారు. అభిరుచి, మావూరివంట, అని తెలుగు పేర్లు పెట్టి, ఒక్క తెలుగుపదం కూడా ఉపయోగించకుండా ఆంగ్లపదాలతోనే ముగిస్తారు. అవకాశం వున్నా ఉపయోగించరు. వారి భాష ఇలా వుంటుంది. ముందుగా పాన్‌పెట్టి, ఆయిల్‌వేసి, హీట్ చేసి, వెజిటబుల్ పీసెస్‌ని కట్ చేసి మిక్సిలో వేసి, గ్రైండ్‌చేసి అంటుంటారు. మిర్చి, ఫ్రైచేసి, వీటిలో మిక్సీ, గ్రైండ్ లాంటివి తప్పితే మిగతావాటికి తెలుగు పదాలున్నా ఉపయోగించడం లేదు. చివరిగా బై, బై వచ్చే ఎపిసోడ్‌లో కలుద్దాం అని ముగిస్తారు. యువతను బాగా ప్రభావితం చేస్తున్న రంగం సినిమారంగం. యువత ధరించే వస్త్రాలను మొదలుకొని జుట్టు, గెడ్డం, భాష అన్నీ కథానాయకుల్నే అనుకరిస్తుంటారు. సినిమా ప్రజల భాషను ప్రభావితం చేయగల అతి బలమైన దృశ్య శ్రవణ మాధ్యమం. తెలుగు చలన చిత్రాలలో సామాజిక చలన చిత్రాలలో కూడా విలక్షణమైన గ్రాంధిక భాషను ఉపయోగించేవారు. అయితే సాంఘిక చిత్రాలన్నీ వ్యవహారిక భాషను ఉపయోగించడం ప్రారంభంచేశాయి.

భాషా శైలిలో ఇపుడు వస్తున్న కొన్ని సినిమాలను మినహా ఇస్తే మిగతావన్నీ ఆదర్శవంతంగా లేవనే చెప్పవచ్చు. వినోదాన్ని పండించే క్రమంలో ఇప్పుడు వస్తున్న సినిమాల్లో భాష శృతిమించిందనే చెప్పవచ్చు. పాత సినిమాల్లో హుందాగా వుండేవి. సంభాషణల్లో అసభ్యత కనపిస్తోందిప్పటి సినిమాల్లో సమాజం పై ప్రభావం చూపించే వ్యక్తుల పలుకుల్లో బాధ్యతాయుత వంతమైన భాషను ఉపయోగించాలి. ఏంటి నాతొక్కా, ఏం పీకుతావ్, జప్పాగా, దూల తీరిందా, కోసి చేతిలో పెడతా, అంటూ కథానాయకులే కాదు కథానియికల సంభాషణల్లో కూడా మిళితమై వుంటాయి. వినోదం పండించే సైగలు సైతం ఎబ్బెట్టుగా వుంటాయి. పాటల్లో సగం ఆంగ్లపదాలే రాజ్యమేలు తుంటాయి. డైరెక్టరు, ప్రొడ్యూసర్, కెమెరామన్, ఆర్ట్ డైరెక్టర్ లాంటి పదాలకు తెలుగు పదాలున్నా అవి వాడడం లేదు. మూల భాషా పదాలు తెలుగు భాషా వ్యాకరణానికి అనుకూలంగా మార్చి చెప్పటం కూడా ఆధునికీకరణలో భాగమే. బహుళ ప్రజా సంక్షేమానికి అవసరమైన అనేక అంశాలలో ఈ మాధ్యమాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యా వైద్య సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఇవి చేపట్టాల్సిన ప్రణాళికలు సాధించాల్సిన లక్ష్యాలు చాలా వున్నాయి. ఆ దిశగా వీటిని నడిపించడానికి ప్రభుత్వం, ప్రజలు కూడా పూనుకోవాలి. అనుసంధాన కర్తలకు, సినిమావాళ్ళకు సంబంధించిన వాళ్ళు వాడే ఇతర భాషా పదాలను తెలుగులోకి అనువదించి పారిభాషిక పదజాలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరంవుంది.

ఉపగ్రహ ప్రసారాలు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, ఉపగ్రహాల ద్వారా సమాచార ప్రసారం సాధ్యమైనప్పటి

నుంచి సమాచార సాంకేతిక రంగంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. ప్రసార మాధ్యమాల్లో వాడుతున్న భాష అవసరాలను బట్టి పరిస్థితులను బట్టి మార్పులకు లోనవుతుంది. మిశ్రమ భాషా పదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవి తెలుగు సంభాషణలో నుండి విడదీయరానంతగా కలిసిపోయాయి.

"నుడిలేని సాహిత్యం మతిలేని ఊరు మనలేదు" అన్నారు. ప్రస్తుతం చాలా నుడువులు ప్రమాదంలో పడ్డాయి. ముందు తరాలవారి నుండి వెలువడే జాతీయాలు, పదబంధాలు, సామెతలు ఇప్పటి తరం వారు అంతో ఇంతో అందుకో గలిగారు. రాబోయే తరాలవారికి అవి అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిమీదా ఉంది. ఒక భాష మారకుండా ఉండడానికి ఆ భాషా వాని, సమాజమంతటికీ సరిగా మాట్లాడేటట్లు, ఉచ్చరించేటట్లు, వ్రాసేటట్లు చూస్తే అదే ప్రయోజనకరమైన పద్ధతి. అంతవరకు ఎన్ని ప్రపంచ తెలుగు మహాసభలను జరిపినా ప్రయోజనం శూన్యం. భాషాభివృద్ధి ప్రభుత్వస్థాయి నుంచి జరిగితే ప్రభావవంతంగా ఉంటుంది. వాటి ఫలితాలు తొందరగా కనిపిస్తాయి.

భవిష్యత్ తరాలపై ప్రభావితం చూపి, విలువలు దిగజారకుండా చూసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీవుంది. ఆంగ్లభాషను తిట్టిపోసుకుంటూ వుండే బదులు, వాటి స్థాయికి మన భాషను తీసుకెళ్ళాలి. ఇప్పటికీ తెలుగు భాష సజీవంగా నిలిచివుండేది జానపదుల్లోనే. వారి కళలకు ప్రోత్సాహమిచ్చి, జానపద కళారూపాలను, కళాకారులను బ్రతికించుకొంటే కనీసం భాషవారి వద్దనైనా, సజీవంగా వుంటుందనేది నా అభిప్రాయం. మి

బి. నాగశేషు
పరిశోధక విద్యార్థి, బెంగుళూరు
ఫోన్ : 9985509053

మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేరండి, చేర్పించండి

అరుదైన బహుమతి



నెల నెలా **మిసిమి** పత్రికను మీ ఇంటిదగ్గర అందుకొనేందుకు చందాదారులుగా చేరండి.
నాలుగు సంవత్సరాలకు వెయ్యి రూపాయలు పంపండి.
మీకు ప్రతినెల **మిసిమి** పత్రిక మీ ఇంటికే వస్తుంది.
చందా అందిన వెంటనే మీకు **అరుదైన బహుమతి చార్లీ చాప్లిన్** (నా కథ) **ఉచితంగా పంపిస్తాము.**

ఈ అరుదైన అవకాశాన్ని పాఠకులు
ఉపయోగించుకొంటారని ఆశిస్తాము.

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

మా తెలుగు మాష్టారు

– వేలూరి వేంకటేశ్వరరావు

మనలోని ఏ ఒక్కరినో ఇద్దరినో మినహాయిస్తే, మిగిలిన అందరం వృత్తిరీత్యా తెలుగుభాషలో కాని, తెలుగు సాహిత్యంలో కానీ, ప్రత్యేకమయిన ప్రవేశం వున్న వాళ్ళం కాము. భౌగోళికంగా భారతానికి దూరంగా వుండబట్టి కావచ్చు, తెలుగు సాహిత్యం మీద మనకి ఎనలేని మమకారం, గొంతుకలో తడారిపోతున్నట్టు ఏదో చెప్పరాని బెంగ... దాంతో ఆ సాహిత్యానికి మనమేదన్నా మంచి చేద్దామన్న కోరిక కలగడం మన ఆవేశానికి నిదర్శనం అవుతుందేమో కాని, అసహజం మాత్రం కాదు.

తెలుగునాడులో వుంటున్నప్పుడు ఎప్పుడూ గుడికెళ్లని వాళ్లమూ, అసలు గుడి ఎక్కడుందో తెలియని వాళ్లమూ కూడా, పిట్స్‌బర్గ్ వేంకటేశ్వరుణ్ణీ, చికాగో బాలాజీని, శాన్‌ఫ్రాన్సిస్కో శ్రీనివాసుణ్ణీ పనికట్టుకు వెళ్లి పలకరించి, ముడుపులు చెల్లించుకుంటాం. ఇక్కడ తేలిగ్గా దొరకనిదీ, లేనిదీ, అక్కడ వున్నదీ, తేలిగ్గా దొరికేదీ, పదే పదే గుర్తుకొచ్చి, దాని పట్ల మమకారం పెంచుకోడాన్ని – నాస్టాల్జియా అంటారు. తెలుగులో జ్ఞాపకాలు అనచ్చు.

నా మటుకు నాకు తెలుగు 'రెండో భాష'. తెలుగు తప్ప మిగిలిన పాఠాలన్నీ ఇంగ్లీషు అనే మొదటిభాషలో నేర్చుకోవడం మూలంగా, మొదటి నుంచి తెలుగు మీద చిన్నచూపే. నిజంగా మీరు గుండె మీద చెయ్యి వేసుకుని మరీ చెప్పండి. తెలుగులో డిగ్రీలు తెచ్చుకుంటే అదేమన్నా కూడు పెట్టేనా, గుడ్డపెట్టేనా? పైగా, ఆ కాలంలో... అసలు తెలుగు చదువుకునేవాడు, ఇంకెందులోనూ పనికిరాని వాడే!

ఇంగ్లీషు మేష్టర్లలాంటి వాళ్లు అనర్గళంగా కామాలు, ఫులిస్టాపులు పెట్టకుండా గొలుసుకట్టు రాతలాగ గడగడ గడగడ మాట్టాడేస్తుంటే, అదంతా, తప్పుల తడకైనా సరే... ఆ యాభై నిముషాలు క్లాసులో కిక్కురుమనకుండా కూచునే వాణ్ణి, నోరు వెళ్లబెట్టుకొని చూస్తూ! ఆరోజుల్లో క్లాసులకి బాగానే వెళ్లేవాళ్లం. ట్యూషనుల వ్యాపారం కనీవినీ ఎరగని రోజులవి!

అయితే, అప్పుడప్పుడు ఏ క్లాసైనా ఎగ్గొట్టబుద్ధయ్యేది కానీ, తెలుగు క్లాసు మాత్రం సుతరామూ ఎగ్గొట్టబుద్ధయ్యేది కాదు. ఎందుకో చెప్పనా? తెలుగు క్లాసులో అల్లరి చెయ్యొచ్చు. కేవలం, అల్లరి చెయ్యటానికే తెలుగు క్లాసుకెళ్లటం. చెప్పొద్దూ! తెలుగు మేష్టార్లంటే మహాలోకువ. ఆమాటకొస్తే తెలుగు క్లాసులో అల్లరి చెయ్యని వాడు వుండడు. ఎవరైనా, 'అబ్బాయి బంగారం వంటి వాడండి. తెలుగు క్లాసులో కూడా అల్లరి చేసేవాడు కాదండి', అని అంటే, వాడు పెద్ద అమాయకచక్రవర్తి అని అర్థం. పెద్ద యెద్దుమొద్దు స్వరూపం అని గూడార్థం! తెలుగు క్లాసులో అల్లరి చెయ్యక పోవడం ఎంతో హీనమైన పాపం!

తెలుగు మేష్టారంటే లోకువని చెప్పాను కదూ, ఇందాక–దానికి ఓ ముఖ్యమైన కారణం; ఆయనకి ఇంగ్లీషు రాకపోవడం. అస్సలు ఒక్క ఇంగ్లీషు ముక్క కూడా ఆయనకి అర్థం కాకపోవడం! (అదేదో మనకి మహా వచ్చి చచ్చినట్టు!) ఇంగ్లీషు రానివాడు లోకువకాడూ మరి! అప్పుడే కాదు, ఇప్పుడు కూడా అంతే, తెలుగు దేశంలో!

ఇంగ్లీషు రానివాడు చిల్లిగవ్వకు కూడా మారడు! స్వాతంత్ర్యం వచ్చిన యాభై యేళ్ళ తరువాత కూడా! ఇంగ్లీషు మీద వ్యామోహం పోనుపోను పెరిగిపోతున్నది కూడాను...

తెలుగు మేష్టారంటే లోకువకి మరో ముఖ్య కారణం ఆయన వేషం, ఆయన భాష, ఆయన కట్టు, ఆయన బొట్టు. ఆ రోజుల్లో తెలుగు మేష్టారిని ఆమడ దూరం నించైనా ఇట్టే గుర్తుపట్టచ్చు. మిగతా మేష్టర్లలా కాకుండా, తెలుగు మేష్టర్లు ఏదో చాదస్తంగా వుండేవాళ్లు. ముతకలాల్చీ,

బిళ్లగోచీతో ఓ ముతకపంచె, జరీ కండువా, ముక్కుపొడుం కాయ, నల్లగా మాసిన ఒక జేబురుమాలు... గుండో, పిలకో... లేకపోతే రెండూనో... అయితే ఇంత నిలువుబొట్టు. కాకపోతే ఒక పెద్ద అడ్డబొట్టు. మా మేష్టారు ముతకఖద్దరు తప్ప ఇంకేదీ కట్టేవారు కాదు... ఆయన ఉప్పు సత్యాగ్రహం తొలిరోజుల్లో జైలుకెళ్లారట! విశ్వనాథ సత్యన్నారాయణ గారినీ, ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రిగారినీ, దీపాల పిచ్చయ్య శాస్త్రి గారినీ ఏదో మీకు తోచిన పాళ్లలో కలిపేస్తే మా మేష్టారు అవుతారు!

అల్లరని చెప్పాను కదూ! మా మేష్టారి క్లాసులో నిరభ్యంతరంగా ఈలలు వెయ్యచ్చు. కప్పల్లా బెక బెకలాడచ్చు. కాయితం బాణాలు చేసి వెనక బెంచీల్లోంచి కనపడకుండా అతిలాఘవంగా విసరవచ్చు. ముందు బెంచీలో కూర్చున్న వాణ్ణి గిల్లి, వాణ్ణి 'కయ్'మని అరిపించవచ్చు. మేష్టార్ని ముందే ఏదో నోట్స్ రాస్తున్నట్టు నటిస్తూ పక్కవాడితో చుక్కలాట ఆడచ్చు. ఆయనచేత తిట్లు, చివాట్లు తినచ్చు. ఆయన, "వెధవలు, పోకిరీ వెధవలు, పనికిమాలిన గాడిదలు," అని అనంగానే గాడిదల్లా ఓండ్ర పెట్టచ్చు. ఇంతకన్నా స్వతంత్రం ఇంక యెక్కడ దొరుకుతుంది చెప్పండి! 'బూతు' మాటలకి అర్థం మళ్లీ మళ్లీ అడిగి ఆయన్ని చికాకు పెట్టచ్చు. "మేష్టారూ! పయోధరాలంటే ఏమిటండీ?" అని పట్టుపట్టి పదోసారి అడగచ్చు. క్లాసులో అందరూ గొల్లుమని నవ్వితే, మనమెంతో గొప్పగా లేని మీసం దువ్వచ్చు. 'చిరు'నవ్వుతో, అదేదో సినిమాలో చవకబారు హీరోలాగా! మరి, ఇల్లాంటి తెలివి మీరిన చొప్పదంటు ప్రశ్నలు ఇంగ్లీషు మేష్టారి క్లాసులో కాని, బయాలజీ మేష్టారి క్లాసులో కాని అడగటానికి గుండే, చెరువా? ఒకవేళ దుస్సాహసం చేసి అడిగితే, వారం రోజులు 'సస్పెన్షన్' అంటాడు, హెడ్మాష్టరో, ప్రిన్సిపాలో! తెలుగు మేష్టారి క్లాసులో ఎంత అల్లరి చేసినా, ఆయన మనమీద ఫిర్యాదు చెయ్యడు. ఏతావాతా చేశాడే అనుకో, హెడ్మాస్టర్లు. ప్రిన్సిపాళ్లూ ఖాతరు చెయ్యరు! అదీ మన ధీమా!!

తెలుగు మేష్టారంటే లోకువకి మరో కారణం; ఆ రోజుల్లో తెలుగు మాష్టారి జీతం ఇంగ్లీషు మేష్టారి జీతంలో సగం, ఈ విషయం అందరికీ తెలిసిందే. ఆయనకి రెండు భాషల్లో సమప్రావీణ్యం వున్నా, ఆ రెండో భాష ఇంగ్లీషు కాదాయె! అది 'దేవభాష.' అంటే సంస్కృతం అవడం ఆయన చేసుకున్న మహాపాపం! దేవభాష అంటే గుర్తుకొచ్చింది... అసలు విషయం చెప్పొద్దూ! మా తెలుగు మేష్టారు పాఠ్యపుస్తకంలో ఏ పద్యమైనా సరే, ముచ్చెంగా మూడుసార్లు చదివే వారు. మొదట, చక్కగా రాగయుక్తంగా... ఆయనకి సంగీతం కూడా వొచ్చేమో అన్నంత బాగా చదివేవారు, ఛందస్సుకి సరిపడే లయతోటి. అప్పుడు మాత్రం అందరం కిక్కురు మనకుండా మహదానందంగా వినేవాళ్లం... హాయిగా.

వెంటనే, అదేదో అసంకల్ప ప్రతీకారచర్యలా, "మేష్టారూ! మళ్లీ ఆ పద్యం పాడండి", అనడం కూడా మామూలే! రెండోసారి, మాటలు విడమర్చి పద్యాన్ని తాపీగా చదివేవారాయన. సగం పైగా పద్యం అర్థం అయిపోయినట్టే వుండేది. ఇక మూడోసారి సమాసాలని విరగ్గొట్టి అలంకారాలని విడమర్చి, మామూలు వాక్యాల్లోకి పద్యాన్ని అన్వయించేవారు. అప్పుడు నేపథ్యంలో ఏదో సంగీతం విన్నట్టుండేది.

అసలు, ఆయన రాగయుక్తంగా పద్యం చదివితే, ఛందస్సు కూడా తెలిసిపోయేది. ఒక్కొక్క ఛందస్సుని ఒక్కొక్క రాగంలో చదివేవాడు ఆయన!

అనవేమ మహీపాల స్వస్త్యస్తు తవ బాహవే
ఆహవే రిపుదోర్దండ చంద్రమండల రాహవే

"ఒక కవిగారు అనవేమారెడ్డి కొలువు కెళ్లి, పై శ్లోకం చదివాట్ట. అనవేమారెడ్డి సంతోషించి, కవిగారికి మూడువేల వరహాలిమ్మన్నాడట. వెంటనే కవిగారు అన్నాట్ట, 'అయ్యా! నేను మీకు నాలుగు 'వే'లిచ్చాను. (శ్లోకంలో 'వే' అనే అక్షరాలు నాలుగున్నాయి). మీరు మూడువేలివ్వటం ఏమి ధర్మం?"

రాజుగారు ఒక నవ్వు నవ్వి, "అయితే నాలుగువేలు పుచ్చుకోండి," అన్నాడట.

"నేను మీకిచ్చింది మీరు నాకు తిరిగిస్తే మీ గొప్ప ఏముంది?" అన్నాడుట కవి.

రాజుగారు మెచ్చి, అయిదువేల వరహాలు ఇమ్మన్నాడు. కవిగారు, "నేను ఆరు వేల నియోగిని మహాప్రభూ!" అన్నాడట.

అనవేముడు కవిగారి సమయస్ఫూర్తికి మెచ్చి, 'అయితే ఆరువేలు తీసుకొనండి," అన్నాడుట!

కవిగారు వెంటనే, "మళ్లీ మీరు నా దగ్గర వున్నదే

నాకు ఇస్తే మీ ఘనత ఏమిటి మహాప్రభో?" అన్నాట్ట.

అనవేమారెడ్డి కవిగారి యుక్తికి మెచ్చి, ఏడువేల వరహాలు ఇమ్మనాడట!

"ఏడు అంకె శుభసూచకం కాదు ప్రభూ! తరువాత మీ ఇష్టం!" అన్నాట్ట కవిగారు.

"అనవేమారెడ్డి కవికి ఎనిమిదివేల వరహాలిచ్చి సన్మానించాడట. ఇది కథే అనుకోండి," అలవాటుగా అని కథ ముగించారు మా మేష్టారు.

నిజంగా అదీ ప్రారంభం... నాకు పాతకవులు, వాళ్ల పుస్తకాలు, ఆ కథలూ చదవాలనే కతూహలం కలగడానికి. చెప్పొద్దూ! ఆ కుతూహలం అలవాటుగా కూడా మారింది. మా మేష్టారు అందరినీ తిట్టేవారు. ఆయన తిట్లు తియ్యగా ఎంతో ఆప్యాయంతో కూడి వుండేవి. 'వెధవా' అని ఆయన చేత మళ్లీ మళ్లీ తిట్టించుకోవాలని అనిపించేది. నాకే కాదు, క్లాసులో అందరికీనని నా అనుమానం!

నాకు కాస్తో కూస్తో (కాస్త కాదు, కూస్తోనే సరైనదని ఇన్నేళ్ళ తరువాత తెలిసింది!), తెలుగు సాహిత్యం మీద అభిమానం ఇంకా మిగిలి వుండటానికి మా తెలుగు మేష్టారే కారణం.

మా తెలుగు మేష్టారు గరికపాటి మల్లావధానిగారు 1899లో పుట్టారు. అంటే 1999లో శతవార్షిక సభ చేసి ఉండాలి. నాకు తెలిసినంతవరకూ అల్లాటి దుర్బుద్ధి ఎవరికీ పుట్టలేదు. కనీసం ఆయన పనిచేసిన కాలేజీ తెలుగుశాఖ భవనంలో ఆయన బొమ్మైనా పెట్టినట్టులేదు. అసలు, ఆయన అక్కడ పనిచేసినట్టు, సుమారు 25 సంవత్సరాల పాటు ఎంతోమంది విద్యార్థులకి మాతృభాషాభిక్ష పెట్టినట్టూ, అక్కడ ఇప్పుడు గద్దెనెక్కిన వారికి తెలిసినట్టు కూడా లేదు. తెలిసిన కొద్దిమందీ కిమ్మనకుండా బెల్లం కొట్టిన రాళ్ళల్లా కూర్చోవడానికి అసలు కారణం ఇప్పుడు చెప్పుకోవలసిన అవసరమూ లేదు.

కొవ్వూరు సంస్కృత విద్యాలయంలో మేష్టారి చదువు. తరువాత ప్రఖ్య సీతారామశాస్త్రి, పురిఘళ్ళ సుబ్రహ్మణ్యశాస్త్రి, తాతా సుబ్బరాయశాస్త్రుల శుశ్రూషలో సంస్కృతభాష సాహిత్యవు వెరుగులు నేర్చుకోవడం, కల్లూరి వెంకట్రామశాస్త్రి, వర్ధుల సీతారామశాస్త్రుల దగ్గిర తెలుగు సాహిత్యంలో ప్రావీణ్యం సంపాదించడమూ! ఈ పై పండితులెవరికీ ఏ డిగ్రీలూ లేవు; మల్లావధానిగారికి ఏ డిగ్రీ రాలేదు. అప్పట్లో, వేలూరి శివరామశాస్త్రిగారి అష్టావధానాల ఆకర్షణలో పడి, తనూ అవధానాలు చెయ్యడం; ఇవన్నీ, ఆయన జీవితంలో వంతెన కింద పోయిన నీరులా మరుగున పడిపోయాయి.

1921లో ఆయన చదువు మానుకొని సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరి గ్రామ గ్రామానికీ పోయి జాతీయ గీతాలు రాసి, పాడి, బ్రిటీషువాడికి వ్యతిరేకంగా ఉపన్యాసాలిచ్చి, జనాన్ని మేలుకొలిపారు! ఆయన అప్పుడు పాడిన జాతీయ గీతాలు ఆనాటి కాంగ్రెసు పార్టీ అచ్చువేసి అమ్ముకున్నదని వినికిడి.

స్వరాజ్యం వచ్చిన తరువాత కూడా, ఆయన ఒక్క పైసా సంపాదించుకోలేదు, రాజకీయబాధితుడి ముసుగు వేసుకొని! అటువంటి స్వచ్ఛంద సేవకులెంతో మంది కష్టపడ్డారు గనుకనే ఇవ్వాళ, మనం రాజకీయ స్వాతంత్ర్యం అనుభవిస్తున్నాం. ఇప్పుడు, మన మంత్రులు, మాజీ బాపతు, తాజా బాపతు మంత్రులందరూ, నిరాఘాటంగా నల్లబజారు బిలియనీర్లుగా మారిపోతూ వుంటే, వెర్రి మొహాలు వేసుకొని చూస్తూ ఉన్నాం!

1930లో గాంధీగారి పిలుపు విని ఉప్పు సత్యాగ్రహంలోకి దూకి, శ్రీకృష్ణ జన్మస్థానాన్ని దర్శించారు, మా తెలుగు మేష్టారు!

మిగిలిన వాళ్ల సంగతేమో నాకు తెలీదు కానీ, నాకు మాత్రం, తెలుగు మీద మమకారం, ఆనక్తి, ఈ దేశానికొచ్చిన తర్వాత కూడా ఇంకా కాస్తో కూస్తో మిగిలి వుండటానికి ఒక ముఖ్యకారణం, మా తెలుగు మాష్టారే!

ఆయన మా తెలుగు మేష్టారు.

మల్లావధానిగారు... గరికపాటి మల్లావధానిగారు... శతావధాని శ్రీ గరికపాటి మల్లావధానిగారు!

(మే 23-24, 1998 తారీఖుల్లో అట్లాంటాలో జరిగిన ప్రథమ తెలుగు సాహితీ సదస్సులో ప్రసంగవ్యాసం. నాటి నేటి అసలు సిసలు తెలుగు పండితులకు సభక్తికంగా అంకితం.)

ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చువేస్తూ పెట్టిన పేరు 'వాక్‌చిత్రం' ఆయనకి కృతజ్ఞతలు.



నాయకురాలు నాగమ్మ

– వై. హెచ్. మోహన్‌రావు

కేవలం ఒక రైతు కుటుంబ ఆడబిడ్డ. ఎలాంటి రాజకీయ, రాచరిక వారసత్వం లేని సాధారణ మహిళ. అందునా కుటుంబ సభ్యులనందరినీ కోల్పోయిన ఒంటరి. పసుపు కుంకుమలు చేజారిన వైధవ్య జీవితం. వీటన్నింటినీ అధిగమించి, విశాల దృక్కోణం, కృషి, పట్టుదలతో ప్రజలకు అత్యంత చేరువై, రాచకుటుంబ ఆశీస్సులతో మహామంత్రిణిగా ఎదిగిన వైనం అబ్బుర పరుస్తుంది. ఇదేదో ఇటీవలి ఆధునిక కాలపు సంఘటన అనుకుంటే పొరపాటే అవుతుంది. మధ్యయుగాలలో, వనిత వంటింటికి పరిమితమైన కాలంలో, ఐచ్ఛిక సహగమనం పాటిస్తున్న రోజుల్లో, 12వ శతాబ్దంలోనే అజేయమైన ప్రతిభతో అత్యున్నత స్థానానికి చేరుకున్న ఆమె జీవన కథనం మహిళాలోకానికి మహాద్భుత దిక్సూచి. ఆమే పలనాటి నాయకురాలు నాగమ్మ.

ఆమెకు పూర్వంగానీ, ఆమె సమకాలంలోనూ, ఆమె అనంతరం నేటి వరకూ ఆమెకు మినహా నాయకురాలు అనే కీర్తి కిరీటం మరొక మహిళకు దక్కకపోవడం విశేషం. ఈ కాలంలోనైతే ఆమెకు నోబుల్ శాంతి బహుమతి నిచ్చి ప్రపంచమంతా వేనోళ్ళ కొనియాడేది. ఎందుకంటే ఆమె సైన్యాలు, శత్రుసైన్యాలు యుద్ధ భూమికి చేరుకుని, యుద్ధానికి సన్నద్ధమైన ఒక విపత్కర ఉద్రిక్త పరిస్థితుల నుండి మొత్తం వాతావరణాన్ని శాంతివనం వైపు నడిపించిన ధీశాలి ఆమె. అందుకే నేను నాయకురాలిని శాంతి దూత అంటాను. ఎక్కుపెట్టిన విల్లు, సారించిన నారి, పొదిలో రణావేశంతో దూసుకు రాబోతున్న శరం, ఒర నుండి రక్తదాహంతో తొంగి చూస్తున్న కుంతం, మ్రోగడానికి సిద్ధమైన యుద్ధభేరీలు అన్నింటిని బుజ్జిగించి, శాంతపరిచి యుద్ధరహిత సమాజానికి బాటలు వేసిన ధీరవనిత. శత్రు వర్గీయుల గొంతెమ్మ కొర్కెలన్నీ సఫలం చేస్తామనే హామీలతో శాంతి మంత్రం జపించిన మానవీ. తెగిపడబోతున్న శిరములు, రాలిపోబోతున్న నల్ల పూసలు, దూరం కాబోతున్న ఐదోతనాలను అన్నింటినీ భవిష్యత్‌లోకి వెళ్ళి దర్శించి, సమరం దూకుడుకు కళ్ళెం వేసి శాంతి స్థాపన చేసిన మాతృమూర్తి నాగమ్మ.

12వ శతాబ్దిలో పల్నాడును ఏలిన హైహయ రాజవంశజుడు అనుగురాజు ఇచ్చిన వరాన్ని ఆసరా చేసుకుని ఆయన కుమారుడు నలగామరాజు పాలనలో ఏడు ఘడియలు మంత్రి పదవి చేగొని రాజ ఖజానాను దోచుకున్న గజదొంగలను పట్టి రాజ సంపదనంతా తిరిగి ఆస్థాన ధనాగారానికి చేర్చిన శౌర్యవంతురాలు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఈ సంఘటనతో తెలుగు లోకంలోనే ఆమె తిరుగులేని తొలి మహామంత్రిణిగా స్థానాన్ని పదిలపరుచుకుంది. సమర్ధవంతమైన పాలనతో పాలకునికి, ప్రజలకు అభిమాన నాయకిగా వారి హృదయాలలో సుస్థిరస్థానాన్ని సాధించుకుంది. త్రాగునీటికి, సాగునీటికి, చెరువులు, కుంటలు త్రవ్వించింది. వాగులకు అడ్డుకట్టలు వేయించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, మంచి పాలనాధ్యక్షురాలుగా పేరుగాంచింది. మతసామరస్యంతో తను శైవురాలు అయినప్పటికీ పల్నాడులోని వైష్ణవాలయాలను అభివృద్ధి పరిచింది. ప్రజారంజకమైన పాలనతో ప్రజలందరి అభిమానాన్ని చూరగొని, వారికి ఆత్మబంధువుగా మారింది. పొరుగు రాజ్య పాలకులతో ఆమె అత్యంత శ్లాఘనీయమైన మిత్ర సంబంధాలను ఏర్పరచుకుని పల్నాడు రాజ్యాన్ని బలోపేతం చేసిన కార్యశీలి.

పల్నాటి యుద్ధంలో అనేకమంది పొరుగు రాజ్యాధినేతలు తమతమ సైనిక బలగాలతో అందించిన సహకారాన్ని గమనించినపుడు నాయకురాలి అజేయమైన స్నేహసంబంధాలు వెల్లడౌతాయి. ఆనాడే ఐదు భాషలు నేర్చుకున్న బహు భాషానేర్పరి. సంగీతంలో ప్రావీణ్యురాలు. గుర్రపుస్వారీలో, ఖడ్గ యుద్ధంలో ఆరితేరిన అతివ నాగమ్మ. నూరు మంది మేధావుల మేధస్సు, నూరు మంది యోధుల సాహసం, నూరుమంది వీరులశౌర్యం మూర్తీభవిస్తే నాయకురాలు నాగమ్మ అనడంలో సందేహం లేదు. ఆమె మహిళా రాజకీయాలకు తల్లివేరు. ఆమె మధ్యయుగాల మహిళా ధిక్కారస్వరం. అచంచల విశ్వాసం, మొక్కవోని

ధైర్యం, అపారమైన స్వయంకృషి ఆమెను శిఖర సమానం చేశాయి.

ఒక వ్యవసాయక రైతుకుటుంబం నుండి వచ్చి అసాధారణ స్థానానికి చేరిన ఆమె వ్యక్తిత్వం చెరిగిపోని చారిత్రక చిహ్నం. దేశాంతర్గత విద్రోహశక్తుల ఆటలు కట్టించి రాజ్యాన్ని సమైక్య పరచడానికి నిరంతరం చేసిన కృషి రాచరిక రాజకీయాలలో ఒక అద్భుత ఘట్టం. మంత్రి పదవిలోకి రాక మునుపే మంచి తీర్పరిగా, పెద్దమనిషిగా పల్నాడు కితాబు అందుకుంది. ఆకలి గొన్నవారికి ఆమె గృహం ఒక అక్షయ పాత్ర. గొప్ప వితరణశీలి పల్నాటి యుద్ధానంతరం విరాగిగా జన్మస్థలమైన కరీంనగర్ జిల్లా పెగడపల్లి మండలం, ఆర్వేల్లి గ్రామం వెళ్తూ తన యావత్ సంపదనంతా పేదప్రజలకు పంచిపెట్టిన దానశీలి నాగమ్మ. అనన్యసామాన్యమైన సుగుణాలు, ధర్మనిరతి, మానవీయ విలువలు కలిగిన మానవతామూర్తి నాయకురాలును ప్రపంచ మహిళాదినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకోవడం ఒక సామాజిక బాధ్యత.

ఉత్తమ నాయకత్వ లక్షణాలు, సుపరిపాలనా నేతృత్వం, నత్సీలనా జీవితం, నిండైన మానవత్వం కలిగిన నాయకురాలు నాగమ్మను సరిగా అర్థం చేసుకుని చరిత్రకు న్యాయం చేద్దాం. ప్రత్యర్థుల కుట్రలను ఛేదించుకుని నైతిక విలువలతో తన మంత్రి స్థానాన్ని, రాజ్యాన్ని కాపాడుకున్న నీతివంతమైన ఆమె జీవిత గమ్యాన్ని ఆదర్శంగా చేసుకుందాం.

వై.హెచ్. మోహన్‌రావు
అధ్యక్షులు : పల్నాడు రచయితల సంఘం
గుంటూరు జిల్లా, ఫోన్ : 94401 54114

Statement about ownership and other particulars of **MISIMI**

FORM IV (SEE RULE - 8)

1.	Place of Publication	:	Hyderabad
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	ALAPATI BAPANNA
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P.
4.	Publisher's Name	:	ALAPATI BAPANNA
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P.
5.	Chief Editor's Name	:	CHENNURU ANJANEYA REDDY
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P.
6.	Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital	:	Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P.

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

ALAPATI BAPANNA
Publisher

Date : March 1, 2014.

నాటి పాలీ భాష :

పాలీ-సంస్కృత వ్యవహారిక రూపాలు

- కుర్రా జితేంద్రబాబు

వేదకాలం తర్వాత ప్రాకృతభాషలే జనసామాన్యంలో ఉన్న వాడుక భాషలగుట వలన క్రీ.పూ. మూడవ శతాబ్ది నుండి క్రీ.శ. మూడవ శతాబ్ది వరకూ భారతదేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు తెలుగునాట, మహారాష్ట్రలోను ప్రజలు మాట్లాడిన భాషలు పాలీ, ప్రాకృతాలే. అందువల్లే ఈ నాటివరకు తెలుగునాట 292 పాలీ, ప్రాకృత శాసనాలు, మహారాష్ట్రలో 250 పాలీ, ప్రాకృత శాసనాలు లభ్యమయ్యాయి. ఈ కాలంనాటి ఒక్క సంస్కృత శాసనం కూడా తెలుగునాట లభించలేదు. పల్లవ రాజుల పాలనా కాలం నుండి అనగా 6వ శతాబ్ది నుండి మాత్రమే సంస్కృత శాసనాలు లభిస్తున్నాయి. పాలీ, ప్రాకృత భాషలు జన వ్యవహారంలో ఉండుట వల్ల, జన సామాన్య భాషగా ఉండుట వల్ల బుద్ధుడు, మహావీరుడు తమ ఉపదేశాలను సర్వసాధారణమైన ఈ భాషలోనే చేశారు. బౌద్ధం ఈ నేల నేలినంతకాలం ప్రజల వ్యవహార భాషగా పాలీ, ప్రాకృతాలు, ఆ భాషాశాసనాలు మాత్రమే విస్తృతంగా లభిస్తున్నాయి. పాలీ, ప్రాకృతాలు లిఖిత భాషగా సంస్కృత భాషకంటే ముందే అభివృద్ధి చెందడం వల్ల అశోకుడు తన శాసనాలను ఈ భాషల్లో క్రీ.పూ రెండవ శతాబ్దంలో భారతదేశమంతటా వేయించినాడు. క్రీ.శ. 200 వరకు లిఖిత ప్రాకృతంలో ప్రాంతీయ బేధాలు వచ్చినట్లు లేదు. అందువల్ల శాసన భాష ఒకే విధంగా ఉంది. ఈ భాషకు నిశ్చిత రూపం ఇవ్వటానికి ప్రయత్నించటం వల్ల మహారాష్ట్రి, శౌరసేనీ, పైశాచి, భాషలలో ధ్వని పరివర్తనం తప్ప ఇతర విషయాలన్నీ సామాన్యంగానే ఉన్నాయి.

చాలామంది ప్రాకృతమనగానే మహారాష్ట్ర ప్రాకృతమే ప్రాకృతమనే భావన కలిగి ఉన్నారు. ప్రాకృత వ్యాకరణ కర్తలు మహారాష్ట్ర ప్రాకృతానికే పెద్దపీట వేయటం కూడా జరిగింది. ప్రాచీన వ్యాకరణ కర్తయైన వరరుచి తన ప్రాకృతప్రకాశలో తొమ్మిది అధ్యాయాలు, 424 సూత్రాలు మహారాష్ట్ర ప్రాకృతానికి కేటాయించి, ఇతర ప్రాకృతాలైన పైశాచి, మాగధి, మరియు శౌరసేనిలకు ఒక్కొక్క అధ్యాయం మాత్రమే కేటాయించి, వీటిని, 14,17, మరియు 32 సూత్రాలలో మాత్రమే వివరించాడు. వీటి మాండలికాలు మహారాష్ట్ర ప్రాకృతంను పోలి ఉంటాయని, తెలుపుతూ "శేషం మహారాష్ట్రివత్" అని తెలిపాడు. ఈ మూడు ప్రాకృతాలకు, హేమచంద్రుడు మరి కొన్ని ప్రాకృతాలైన, ఆర్ష, చూళికా పైశాచి, మరియు అపభ్రంశాలను జోడించి పేర్కొన్నాడు. దానినే, త్రివిక్రముడు (ప్రాకృత వ్యాకరణ వృత్తి) ; సింహరాజు (ప్రాకృత రూపావతారః) ; నరసింహుడు మరియు లక్ష్మీధరుడు (షడ్భాషాచంద్రిక) లలో అనుసరిస్తూ వచ్చినప్పటికి, త్రివిక్రముడు ఆర్ష ప్రాకృతాన్ని పేర్కొనలేదు.

మార్కండేయుడు తన 'ప్రాకృతసర్వస్వం'లో నాలుగు విభాగాలుగా విభజించాడు. అవి భాషా, విభాష, అపభ్రంశ, మరియు పైశాచిలు. మహారాష్ట్ర, శౌరసేని, ప్రాచ్య, అవంతి, మగధలు, 'భాషా' విభాగంలోను, చేరుస్తూ అర్ధమాగధిని మాగధిలో మాండలిక భేదంగా చూస్తూ, దక్షిణాత్య శౌరసేని భాషలకు వీటికి పెద్దగా భేదం లేదని పేర్కొన్నాడు. విభాష విభాగంలో శాకారి, ఛండాలి, శబరి, అభిరిక, సక్కిలను పేర్కొని ఓఢ్ర, ద్రావిడ భాషలను విభాషలో చేర్చడానికి నిరాకరించాడు.

అధిక సంఖ్యాకులైన సామాన్య ప్రజలు పతంజలి మహాభాష్యం రచించే కాలంనాటికి 'అపభ్రంశంగా' సంస్కృత వ్యాకరణకర్తలచే పిలవబడుతున్న ప్రాకృత భాషలు మాట్లాడుతున్నారనటానికి మహాభాష్యంలో గమనించవచ్చు.

"భూయాంసో॒ పశబ్దా అల్పీయాంసశ్శబ్దాः
నన్వేకస్య హి శబ్దస్య బహవో॒ప భ్రంశాः
తద్యథా గౌరిత్యస్య గావీ గోణీ గోతా గోపోతలికా +
ఇత్యేవమాదయోబహవో॒ పభ్రంశాः"

(పస్పశాహ్నికం, I..2)

అపశబ్దాలు ఎక్కువగాను, శబ్దాలు తక్కువగా ఉన్నాయి.

ఒక శబ్దానికి అపభ్రంశాలు చాలా ఉంటాయి. 'గౌః' (గోవూ) అనే పదానికి, 'గావీ', 'గోణీ', 'గోతా', 'గోపోతలికా' మొదలైన అపభ్రంశ రూపాలు ఉన్నాయి. అని పతంజలి చెప్పిన ఉదాహరణ వల్ల వ్యవహారిక భాషలో ఒక పదానికి అనేకరూపాలు ఉన్నట్లు గమనించవచ్చు. గావీ, గోణీ మొదలైన శబ్దాలను పతంజలి అపశబ్దాలని పిలిచినా ప్రాకృత గ్రంథ కర్తలు నిరాఘాటంగా ప్రయోగించారు. అను శాసనికులు ఈ ప్రయోగాలను ఆమోదించారు.

పతంజలికాలంలో యజ్ఞం చేసేటపుడు ఋత్విజులు వ్యవహారిక ప్రాకృత రూపాలు వాడకుండా జాగ్రత్త పడేవారని మహాభాష్యంలోని యర్వాణ – తర్వాణ కథ (పస్పశాహ్నికం, 9వవార్తికం I.11) ద్వారా గమనించవచ్చు.

ఏవం హిశ్రూయతే. యర్వాణ స్తర్వాణో నామ +
ఋషయో బభూవుః ప్రత్యక్ష ధర్మాణః
పరాపరజ్ఞా విదితవేదిత వ్యాఅధిగతాయాథాతథ్యాః
తే తత్రభవంతో యద్యాన స్త ద్వానః
ఇతిప్రయోక్తవ్యే యర్వాణ స్తర్వాణ ఇతి
ప్రయుంజతే. యాజ్ఞే పునః కర్ణణి నాపభాషంతే.

ఈ విషయం వినపడుతున్నది. యర్వాణః తర్వాణః అనే ఋషులు ఉండేవారు. వారు ధర్మం ఎరిగిన వారు. తెలుసుకోదగిన దాన్ని తెలుసుకొన్నవారు. (ఇహ, పరజ్ఞానాన్నెరిగినవారు). ఆ మహానుభావులు 'యద్వానః తద్వానః' అనటానికి బదులు 'యర్వాణః తర్వాణః' అని పలికే వారు. యజ్ఞకర్మలో మాత్రం తప్పుగా మాట్లాడేవారు కాదు. (యద్వానః తద్వానః అనగా ఏది మనదో అదే మనది అని అర్థం.)

పై ప్రస్తావన వల్ల పతంజలి కాలం నాటికి వ్యవహారిక భాషను సంస్కరించి 'సంస్కృత' రూపాలు వాడడం ప్రారంభమైనదని గమనించవచ్చు. పాణిని కంటె ముందు కాలంలో రచించబడిన వ్యాకరణాలు ఏవీ మనకు లభించలేదు. అవి లభించినట్లయితే ఆనాటి వ్యవహారిక ప్రాకృత రూపాలు లభించి ఉండేవి. పాణిని కాలంనాటికి దాదాపు పదిమంది వ్యాకరణ కర్తలు– ఆపిశలి, కాశ్యప, గార్గ్య, గాలవ, చాక్రవర్మణ, భారద్వాజ, శాకటాయన, శాకల్య, సేనక, స్ఫోటాయనులు వారి వ్యాకరణాలు ఉన్నాయని చెప్పటానికి అష్టాధ్యాయిలో ఆధారం, ఈ పూర్వవైయాకరణుల అభిప్రాయాలను సూచించటమే. వీరేకాక ఇంకను మహేశ్వరుడు, బృహస్పతి, ఇంద్రుడు, వాయువు, భరద్వాజుడు, భాగురి, పౌష్కరసాది, కాశకృత్స్నుడు, రౌఢి, చారాయణుడు, మాధ్యందిని, వైయాఘ్రపద్యుడు, శౌనకి, గౌతముడు, వ్యాడి అను పదునైదుగురు వ్యాకరణాచార్యులు (పాణిని కంటె పూర్వులు) ఉండెడివారని తెలియుచున్నది. పాణిని గ్రంథానికి గల గొప్పతనమే ప్రాచీన వ్యాకరణాల వినాశనానికి కారణమైందని మాక్స్‌ముల్లర్ పేర్కొంటూ ".... Panini's work acquired by its great merits such a celebrity as to supercede almost all that had been written on grammar before him, so that, except the names and some particular rules of former grammarians, we have little left of this branch of literature, except what occurs occasionally in the Pra:tisa:khyas". పాణిని గ్రంథం, దానిలో ఉన్న గుణాలవల్ల విశిష్టతను సంపాదించుకొని అతనికి ముందు కాలంలో రచితమైన వ్యాకరణాలన్నిటినీ త్రోసిపుచ్చింది. అందువల్ల కొందరు పూర్వవైయాకరణుల పేర్లూ, కొన్ని సూత్రాలూ తప్ప ఈ శాఖలో ఏమీ మిగలలేదు. కాని ప్రాతిశాఖ్యలలో ఉన్న కొంత భాగం మాత్రం దీనికి అపవాదం.

ప్రస్తుతము విదితములైయున్న పది ప్రాతిశాఖ్యము లందును, ఏడు ఇతర వైదిక వ్యాకరణములందును దాదాపు ఏబదితొమ్మిదిమంది ప్రాచీన వ్యాకరణ కర్తల పేర్లు పేర్కొనబడినవి. చంద్రవ్యాకరణాదులలో 'పాణినోపజ్ఞమ కాలం వ్యాకరణమ్' 'పాణిన్యుపజ్ఞమకాలం వ్యాకరణమ్' అను రెండు వాక్యములున్నవి. పాణినికంటె పూర్వమున్న వైయాకరణుల భూతవర్తమాన కాలాల స్వరూపాన్ని స్పష్టీకరించియున్నాడు. కాని పాణిని లోకప్రసిద్ధడగుటవలన ఈ విశేషాలను తన వ్యాకరణములో చూపలేదని పై వాక్యమునకు అభిప్రాయం. ఈ అభిప్రాయాన్నే మాక్స్‌ముల్లర్ పైన వెలిబుచ్చింది.

పాణినీ వ్యాకరణం సూత్రరూపంలో ఉన్న ఎనిమిది అధ్యాయాల గ్రంథం. దీనిని అష్టాధ్యాయి, అష్టకము, శబ్దానుశాసనము, వృత్తి సూత్రము, అష్టికా అని పిలుస్తారు. దీనికి 'వ్యాడి' అను ఆచార్యుడు 'సంగ్రహము' అను పేరుతో గొప్ప వ్యాఖ్యను లక్ష అనుష్టుప్ శ్లోకాలతో రచించాడు. ఇతని పేరు ఋక్ప్రాతిశాఖ్యములోను, మహాభాష్యములోను పేర్కొనబడినది. పురుషోత్తమదేవుడు 'భాషావృత్తి'యను గ్రంథములో 'ఇకాం యణ్ఖర్వ్యవధానం వ్యాడిగాలవయోరితి

వక్తవ్యమ్' అను సూత్రమున వ్యాడి మతమును ఉదహరించెను. ఈ గ్రంథం అలసులు, మందబుద్ధులు అగు వ్యక్తుల చేతులలో పడి కాలక్రమాన నశించిపోయిందని వాక్యపదీయంలో భర్తృహరి పేర్కొన్నాడు. బౌద్ధం విస్తృతంగా వ్యాప్తి చెంది తెలుగునాట మరియు ఇతర ప్రాంతాలలో ప్రజలు ఆదరిస్తూ ప్రాకృత భాషలలో వ్యవహరిస్తున్న కాలంలోనే ఈ గ్రంథానికి కాలదోషం పట్టింది. దీనికి ఆధారాలు భర్తృహరి రచించిన వాక్యపదీయంలో గమనించవచ్చు.

ప్రాయేణ సంక్షేపరుచీ నల్పవిద్యాపరిగ్రహాన్
సంప్రాప్య వై యాకరణాన్ సంగ్రహేఽస్త ముపాగతే. II. 476

కేవలము సుఖాపేక్షచేత పెద్ద గ్రంథాలను చదవలేక చిన్న చిన్న గ్రంథాలలోనే ఆసక్తి చూపే, విద్యయందు తక్కువ పరిశ్రమ చేసిన వయాకరణులు చాలామంది 'సంగ్రహము' అను మహాగ్రంథాన్ని ఆదరించకపోడటం వల్ల ఆ గ్రంథం కాలగర్భంలో కలిసిపోయింది.

కృతేఽథ పతంజలినా గురుణా తీర్థదర్శినా
సర్వేషాం న్యాయబీజానాం మహాభాష్యే నిబంధనే. II. 477
అలబ్ధగాధే గాంభీర్యా దుత్తాన ఇవ సౌష్ఠవాత్
తస్మి న్నకృతబుద్ధీనా నై వావాస్థిత నిశ్చయః II. 478

'వ్యాడి' రచించిన 'సంగ్రహ'మనే గ్రంథము నశించిన తరువాత, పతంజలి పాణినీయ వ్యాకరణానికి 'మహాభాష్య' మనువ్యాఖ్యను రచించాడు. అది సకల న్యాయములకును పుట్టినిల్లు. ఇది అతిగంభీరమైన మృదుమధురమైన శైలితో ప్రకాశిస్తుంది. పైకి తేలికగా కనిపించినప్పటికి, సామాన్య మానవులు ఆ గ్రంథసారాన్ని గ్రహించలేరు.

పాణిని అష్టాధ్యాయిపై విమర్శతో కూడిన వార్తికాలను వరరుచి అనే కాత్యాయనుడు రచించినాడు. వార్తికాలు చాలవరకు పాణిని సూత్రములను అధిక్షేపిస్తూ చేసిన రచన. సూత్రాలను, వార్తికాలను కూడ కలిపి సర్వతోముఖమైన విమర్శనను చేస్తూ, చివరకు కాత్యాయనుని ఖండించి, పాణినినే పతంజలి సమర్థించినాడు.

బైజి సౌభవ హర్యక్షైః శుష్మతర్కానుసారిభిః
ఆర్షే విప్లావితే గ్రంథే సంగ్రహప్రతికంచుకే. II. 479

బైజి, సౌభవుడు, హర్యక్షుడు అనువారలు ఆనాటి తార్కికులు. వారు తమ తర్కమును మాత్రమే అవలంభించి మహాభాష్య సారమును తెలుసుకోలేక క్రమంగా దాని వినాశనానికి కారకులైనారు.

(వైదికమతావలంబికులు సంస్కృత వ్యాకరణ శాస్త్రాలలో కృషి చేయగా, బౌద్ధావలంబిలికులు తర్క శాస్త్రంలో కృషి చేసినారు. బౌద్ధ తార్కికులు తమ గ్రంథాలను సంక్షిప్తీకరించి, చిన్న గ్రంథాలుగా ప్రచురించేవారు. బౌద్ధ తార్కికులైన నాగార్జునుడు, ఆర్యదేవుడు, వసుబంధు, ధర్మకీర్తి, దిఙ్నాగుడు, భావవివేకుడు మొదలైనవారు రచించిన గ్రంథాలు కొన్ని పేజీలు మాత్రమే. వైదిక తాత్వికులు తమ గ్రంథాలను వేల, లక్షల శ్లోకాలతో రచించారు. వాక్యపదీయము వ్రాసిన భర్తృహరికి, ప్రమాణ సముచ్ఛయ, హేతువిద్య, హేతుచక్ర అను తర్కశాస్త్ర గ్రంథాలు రచించిన బౌద్ధ తార్కికుడైన దిఙ్నాగునికి మధ్య జరిగిన 'స్ఫోటవాద' వివాదం వాక్యపదీయంలోను, ప్రమాణ సముచ్ఛయంలోను గమనించవచ్చు. వాక్యపదీయ రచనాకాలం నాటికి అనగా క్రీ.శ. 450 నాటికి బౌద్ధ తార్కికులకు, వైదిక మతావలంబికులకు మధ్య భావ సంఘర్షణ తీవ్రంగా జరుగుతూ ఉండింది.)

యః పతంజలిశిష్యేభ్యో భ్రష్టో వ్యాకరణాగమః
కాలే స దాక్షిణాత్యేషు గ్రంథమాత్రే వ్యవస్థితః II. 480

ఆ విధముగ శుష్క తార్కికుల చేతిలో, బుద్ధి వైభవములేని శిష్యుల చేతిలో పడి – 'కోతి చేతిలోని మహారత్నము' లాగ నిరుపయోగమై, పఠన పాఠనాది సంప్రదాయ రహితమై ఈ వ్యాకరణశాస్త్రము (మహా భాష్యము) కొంతకాలానికి లుప్తప్రాయమయ్యింది. ఎక్కడో దక్షిణాది ఇండ్లలో మాత్రమే, అది గ్రంథరూపములో మూలనపడి మూల్గుతుండేది.

పర్వతా దాగమం లబ్ధ్వా భాష్యబీజానుసారిభిః
స నీతో బహుశాఖత్వం చంద్రాచార్యాదిభిః పునః II. 481.

నశించిపోయిన ఈ వ్యాకరణ సంప్రదాయాన్ని చంద్రుడు, వసుధాతుడు మొదలైన విద్వాంసులు కొందరు, భాష్యన్యాయానుసారంగా వ్యాఖ్యానించి బహువిధాలుగా లోకములో వ్యాప్తి చేసారు. ఒకానొక కొండయొక్క రాతి పలకలపై వారికి వ్యాకరణాగమము లభించింది.

ఈ శ్లోకాలవల్ల పతంజలి మహాభాష్యం పూర్తిగా దొరకకుండాపోయి భ్రష్టమైంది. దొరికిన భాగాలను ఆధారం చేసుకొని చంద్రాచార్యులు వాటిని పూరించి ప్రచారంలో పెట్టినట్లు తెలుస్తుంది. దీనివల్ల మనకు లభ్యమవుతున్న మహాభాష్యం కాలగర్భంలో కలిసిపోయిందని లభ్యభాగాలాధారంగా చంద్రాచార్యులు పఠన పాఠనాలలోకి

తీసుకువచ్చినాడని అర్థం చేసుకోవచ్చు. అయితే అందులో ఆ తరువాత కాలంలో ప్రక్షిప్తమయిన భాగాలు ఉండి ఉంటాయనే విషయాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి.

పతంజలి మహాభాష్యం కాలగర్భంలో కలిసిన విషయాన్ని తిరిగి చంద్రాచార్యులు దాన్ని పునరుద్ధరించి, వ్యాప్తిలోకి తెచ్చిన విషయాన్ని పదకొండవ శతాబ్దివాడైన కల్హణుడు తన రాజతరంగిణిలోను ప్రస్తావించడం జరిగింది.

చంద్రాచార్యాధిభిర్ల బ్ధాదేశాత్తస్మాత్తదాగమం
ప్రవర్తితం మహాభాష్యం, స్వంచ వ్యాకరణం కృతం I. 176

"(అభిమన్యు మహారాజు) వద్దనుండి ఆదేశం పొందిన చంద్రాచార్యుని వల్ల మహాభాష్య పఠనం ప్రవర్తించబడింది. చంద్రాచార్యుడు తన వ్యాకరణం రచించాడు."

(ఈ చంద్ర వ్యాకరణం ఇంతవరకు ప్రచురించ బడలేదు. ఇది ఇండియా ఆఫీసు లైబ్రరీనందు కలదు. Aufrachat. cat. p. 180; chnadravyakarana, which has servived completly. ib. p.181 and Eggling's caltalogue of sanskrit m.ss in the India office Library. p. 193)

రాజతరంగిణి మరొకచోట–

దేశాంతరా దాగమయ్య, వ్యాచక్షాణాన్ మహీపతిః
ప్రావర్తయత విచ్ఛిన్నం, మహాభాష్యం స్వమండలే IV. 488

''(జయాపీడ) మహారాజు ఇతరదేశాల నుండి వ్యాఖ్యాతలని పిలిపించి, తనదేశంలో విచ్ఛిన్నమైన మహాభాష్య పఠనాన్ని ప్రవర్తింపజేశాడు." అని కూడా పేర్కొనటం వల్ల నష్టమైన మహాభాష్య గ్రంథాన్ని తిరిగి పూరించి ప్రచారంలో పెట్టినట్లు గమనించవచ్చు. ఈ గ్రంథం తెలుగునాటే లభించిందని, తిరిగి తెలుగునాటే ప్రచారంలోకి వచ్చి ఉండవచ్చు అన్న విషయాన్ని పరిశోధకులు పరిశీలించాల్సి ఉంది. తెలుగునాట ఏ విధమైన పాలీ ప్రాకృత భాషలు ఆనాడు ప్రచారంలో ఉన్నవి అన్న విషయంలో భాషావేత్తల మధ్య వివిధాభిప్రాయాలున్నాయి. క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి క్రీ.శ. 3వ శతాబ్ది వరకు తెలుగు ప్రాంతమంతా బౌద్ధమతమే వ్యాప్తిచెంది ఉన్నదన్న విషయం చరిత్ర వలన చారిత్రక ఆధారాల వల్ల మనం గమనించవచ్చు. గౌతమ బుద్ధుడు దాదాపు 80 సం॥లు జీవించాడు. అయినా 45 సం॥రాల పాటు దేశంలో వివిధ ప్రాంతాలలో పర్యటించి, సుదీర్ఘ కాలం ఆయన కొన్ని వందల సందర్భాలలో తన తాత్త్విక దృక్పథాన్ని ప్రశ్నోత్తరాల ద్వారా, సంభాషణల ద్వారా, ఉపదేశాల ద్వారా ప్రచారం చేశాడు. సంవత్సరం మొత్తం వేరు వేరు ఋతువుల్లో భిక్షువులు, అనుయాయులు ఆచరించవలసిన అనేక నియమాలను, సంఘాన్ని నిర్వహించవలసిన పద్ధతులను బుద్ధుడు నిశ్చయ రూపంలో వివరించాడు. అయితే బుద్ధుని తాత్త్విక దృక్పథాన్ని, బోధించిన సిద్ధాంతాల్ని, నియమాలను, బుద్ధుని కాలంలో గ్రంథస్థం చేయలేదు. బుద్ధుని మహాపరినిర్వాణాంతరం బుద్ధుని అనుయాయులు, ఆయన ఉపదేశాలను గ్రంథ రూపంలోతీసుకొని రావాలని, బౌద్ధ తాత్త్వికతకు ఒక నిశ్చిత రూపం ఇవ్వాలని బౌద్ధవిహారాలలో, పాటించవలసిన నియమాలు, క్రోడీకరించాలని నిర్ణయించారు. ఈ కార్యం సాధించడానికి వేరు వేరు కాలాలలో మూడు సంగీతులు జరిగాయి. బుద్ధుని మహాపరినిర్వాణం జరిగిన కొద్ది సంవత్సరాలకు మొదటి సంగీతి రాజగృహంలో జరిగింది. మహాపరినిర్వాణానంతరం వంద సంవత్సరాల తర్వాత వైశాలిలో రెండవ సంగీతి నిర్వహించబడింది. మహాపరినిర్వాణానంతరం 236 సం॥ల తరువాత అశోకుని కాలంలో మూడవ సంగీతి పాటలీపుత్రంలో జరిగింది. ఈ సంగీతికి మొగ్గలీపుత్తతిస్స అధ్యక్షత వహించాడు. ఈ సుదీర్ఘకాలం బుద్ధుని తాత్త్విక ఆలోచనలను అనుయాయులు అర్థం చేసుకోవడంలో అనేక విభేదాలు ఆవిర్భవించి ఎన్నో సంప్రదాయాలు, వాటికి అనుగుణంగా గ్రంథాలు రచించబడినాయి. పాలీలో ఉన్న 'తిపిటకం' థేరవాదులు రూపొందించిన గ్రంథం. ఇందులో మూడు విభాగాలున్నాయి. వీటిని బుద్ధుని ప్రవచనాలు, గాథలు, ఉదానాలు నియమనిబంధనలు సంకలనం చేయబడినాయి. వీటిన్నటికి మూడవ సంగీతిలో నూరుగురు బౌద్ధ భిక్షువులు తుది రూపం ఇచ్చారు. అశోకుని పుత్రుడైన మహేంద్రుడు, పుత్రిక సంఘమిత్రలను కొందరు భిక్షువులతో కలిపి బౌద్ధ ధర్మాన్ని, తిపిటక గ్రంథాలను సింహళానికి తీసుకెళ్ళాడు. వాళ్ళు బుద్ధుని భిక్షాపాత్రను, అస్థికలను, బోధి వృక్ష శాఖను తీసుకెళ్ళి, ఆ శాఖను అనూరాధ పురంలో నాటారు.

ఈ గ్రంథాలలో ఉన్న భాష పాలీభాష. ఈ భాష ఎక్కడిదను విషయమును పరిశోధించి, ఓల్డెన్ బర్గ్ తాను సంపాదకత్వం వహించిన తిపిటకములలో రెండవ సంపుటియైన 'చుల్లవగ్గ'కు రాసిన పీఠికలో ఈ పాలీభాష అశోకుని కుమారుడైన మహిందుని జన్మస్థలమైన ఉజ్జయిని

భాషకాదని, కళింగాంధ్ర ప్రాంతాలలో ఆ కాలంలో బౌద్ధధర్మం మిక్కిలి ప్రచారంలో ఉందని, బుద్ధఘోషుడు ఆంధ్రులకు సంబంధించిన బౌద్ధ గ్రంథమైన అట్ఠకథను తరచుగా స్మరించాడని, అందువల్ల నీ పాలీభాష ఆంధ్రదేశములోని ప్రాకృతభాష అని; ఆంధ్రరాజుల శాసనముల భాషకు పాలీ భాషకు పెద్దగా భేదములేదని, అందువల్ల ఆ కాలం నాటి తెలుగునాట భాషగా పాలీభాష ఉండి ఉండవలెనని అభిప్రాయపడినాడు. శాసనధారాలు కూడ ఈవిషయాన్నే ధృవపరుస్తున్నాయి. తెలుగునాట లభ్యమైన అశోకుని శాసనాలతో పాటు, శాతవాహనుల పాలనాకాలం వరకు లభ్యమయిన అన్ని శాసనాలు పాలీభాషా శాసనాలే. ఉదాహరణకు ఆ సమకాలీనకాలానికి చెందిన శాతవాహన రాజైన వశిష్ఠీపుత్ర సిరిపుళుమాయి వేసిన ఒకనాటి శాతవాహన రాజ్యాంతరభాగమైనట్టి నేటి నాసిక్ గుహలో రెండవ ద్వారం పై ఉన్న శాసనాన్ని పరిశీలించిన ఆనాటి పాలీ వ్యవహారిక రూపాలను గమనించవచ్చు. ఈ శాసనాన్ని చిలుకూరి నారాయణరావు తన 'ఆంధ్రభాషాచరిత్ర'లో ఉదహరించి వివరించాడు.

ఈ శాసనంలో వివిధ శాసన పరిశోధకుల చేసిన సవరణలను 'ఫుట్‌నోట్' లో ఇవ్వడం జరిగింది.

1. సిద్ధం[1] రఞో వాసిఠీపుతస[2] సిరిపుళుమాయిస సవీచ్ఛరె[3] ఏకునవీసె 19 గమ్హాణ[4] పఖె బితీయె 2 దివసె తెరసె 13 రాజరఞో గోతమీపుతస హిమవత – మెరు–
2. మదర– పవత సమసారస అసిక – అసక[5]– ముళక – సురఠ – కుకు – రాపరంత[6] – అనుప – విదభ – ఆకరావతి – రాజసవిఝు – చ్ఛవత – పారిచాత[7] – సహ్య – కణ్హగిరి – మచ్ఛ – సిరిటన – మలయ – మహింద –
3. సెటగిరి – చకోర – పవతపతిస సవరాజలోక[8] మడల పతి – గహీతనాసనస దివసకరకర[10] విబోధిత కమల విమల సదిసవదనస తిసముద – తోయపీతవాహన సపటిపుణ చదమడల నసిరీక–
4. పియదసనస వరవారణ వికమ చారువికమన భుజగపతి భోగపన వాట[11] – విపులదీఘ సుద. భుజస[12] అభయోచకదాన కిలినని భయకరస అవిపన మాతు సుమా సాక ససు విఛతతివగ దెనకాలస–
5. పోరజన నివిసెస సమసుఖ దుఖస ఖతియద పమాన మదనస సక – యవనధ – పల్హవ – నిసూదనస ధమోపజితకర వినియోగకరస కితాప రాధెపి సతుజనె అపాణహిసారుచిస దిజావరకుటుబ వివధ–
6. నస ఖఖరాతవస[15] నిరవసెసకరస సాతవాహన కులయస పతి ధావన[16] కరస సవమదలా[17] బివాడితచ ణస వినివతిత చాతువణస కరస అనెక సమరావజిత సతునఘన అపరాజిత విజయపతాక సతుజన దు– పధసనీయ[18]
7. పురవరస కులపురిస వరపరాగత విపులరాజసదస ఆగమాన[19] – నిలయస సపురిసానం అసయస సిరీయ్ – అధిఠానస ఉపచారాన[20] పభవస ఎక కుసస ఎకధనుధరస ఎక సూరన[21] ఎకబమ్హణస రామ–
8. కేస – వాజున – భీమసెన – తులపరక మస[22] చ్ఛణఘను సవ–[23] సమాజకారకస నాభాగ –[24] నహుస జనమెజయ – సకర – యయాతి – రా– మాబరీస – సమతెజస అపరిమితమ్ అఖయమ్ అచితమ్ అభుత[25] పవన – గరుళ –[26] సిధ – యఖ – రఖస – విజాధర – భూత – గధవ – చారణ–
9. చద – దివాకర – నఖత – గహ – విచిణసమరసిరసి జితరిపు సఘసనాగ[27] వరఖధాగగన తలమ్ అభివిఘూఢస కులవిపులసిరి కరస సిరి – సాతకణిస మాతుయ మహా – దెవీయ[28] గొతమియ బలసిరీయ సచవచన దాన ఖమా[29] హిసా[30] నిరతాయ తప – దమనియ–
10. మొపవాస తపరాయ రాజరిసి మధుసదమ్[31] అఖిలమ్ అను–విధీయమానాయ కారిత దెయ ధమ ... ... [32] సిఖరసదిసె తిరణ్హ – పవతసిఖ రె విమ్[33]. వర – నివిసెస మహిఢీకలెణ ఎతచలెణ మహాదేవ మహా రాజమాతా మాహారాజప్ × తామహీ[34] దదాతి నికాయస భదావనీ – యానం[35] ఖిఖుసఘస[36].
11. ఎతస చలెణస చితణ నిమిత[37] మహాదేవీయ అయకాయ సెవ– కామొ[38] పియకామొ చణట్ ... ... [39] పధెసరో[40] పితుపతియొ ధమ సెతుస దదాతి గామ[41] తిరణ్హ పవతస అపరదఖిణ పసె పిసాజిపతకం[42] నవజాత భొగనిరఠి.

* * *

1. సిద్ధర. 2. °సిఠిపు° 3. సవచ్ఛరే; సంవచ్ఛరే. ('వీ' లోని 'ఈ' స్పష్టముగా నున్నది.
అశోకుని సాహస్రముశాసనములో 'సంవిచ్ఛల' అని యున్నది. ప్రాకృతములో 'అ' 'ఇ' గా మాఱుటగలదు.
4. గిమ్హాణ. 5. అసిక – సుసక. 6. °పరాత°.
7. పరివాత° -- 8. 'లో' అంత స్పష్టముగా లేదు. 9. °మండల°
10. రెండవ 'కర' లోని 'క' అంత స్పష్టముగా లేదు. 11. °పేనవట°
12. 'ర'ను శాసన పరిశోధకులు పూరించారు.
13. °సుగుణ.° 14. 'దన' లోని 'న' మీది తలకట్టు ఉన్నది. 'మదణస' అని లేఖకుని యుద్దేశమేమో.
15. °వంస.° 16. °పతితాప.°; 'థ' తోడిపరూపమే సరియైనది.
17. °మండలా°. 18. °పధనసనీయ°. 19. °మాసం°. 20. °చారానం°.
21. °ఎకసూరన°. – దీనిని ఒక శాసన పరిశోధకుడు తీసివేశాడు. 22. °పరాక°. 23. °చ్ఛణయనుస°.
24. °నభాగ°. 25. °భుతం°.
26. °గరుడ°. 27. °ణగ°. 28. °దెవియ°.
29. °ఖమా°. లోని 'మా' మీది ఆత్వము సంశయాస్పదముగా నున్నది.
30. °హింసా°. 31. వధూసదమ్. 32. °(కెలాస) వ (వత) °– అని ఒక శాసన పరిశోధకుడు పూరించాడు.
33. °విమా(న)°– అని ఒక శాసన పరిశోధకుడు పూరించాడు.
34. పతామ; పితామ. ('పి' మీది గుడి కనిపిస్తుంది.) 35. °నియా°. °యానభి.
36. °సంఘన°. 37. °చితనా°. 38. °సెవాకామొ°.
39. °ణ (తా... ... ...దఖిణా.)°
40. °పరిసరో°. 41. °గామం°. 42. పిసాచి°.

ఈ శాసనంలోని పాలీ భాష సంస్కృత భాషకు అతి దగ్గరి సంబంధం ఉంది. ఈ సాదృశ్యాన్ని బట్టి సంస్కృత భాష, పాలీ భాష పరివర్తన రూపమే అని గమనించవచ్చు.

పాలీ భాష లౌకిక వాఙ్మయం మనకు లభ్యం కాకపోవటం వల్ల ఆ భాష మూలరూపాలను అర్థం చేసుకోవటం కష్టతరమవుతుంది.

వర్ణాగమం (కొత్త వర్ణం వచ్చి చేరడం); వర్ణలోపం (ఉన్న వర్ణం తొలగి పోవడం); స్వరభక్తి (సంయుక్తాక్షరాలు విడగొట్టి మధ్యలో అచ్చు చేర్చటం) ; అచ్చుల హ్రస్వ, దీర్ఘత్వాదులలో వచ్చే మార్పులు భాషల్లో సాధారణంగా వచ్చే పరిణామాలు.

ఈ పరిణామాలను అధ్యయనం చేయటం ద్వారా భాషల్లో వచ్చే మార్పులను గమనించవచ్చు.

కుర్రా జితేంద్రబాబు
చరిత్ర పరిశోధకులు,
హైదరాబాదు.
ఫోన్ : 9848882600

భగవద్గీతలో బౌద్ధం

హిందీ : భదంత ఆనంద కౌసల్యాయన్
తెలుగు : జె. లక్ష్మిరెడ్డి

గత సంచిక తరువాయి....

(ఈ ఆత్మను ఆయుధం ఖండించలేదు, దహించలేదు, నీరు తడపలేదు, గాలి ఎండిపోయేట్లు చేయలేదు.)

ఈ మాటకు కూడా ప్రయోజనం – అర్జునుని బాణాలతో ఒకవేళ ఛిద్రమైతే శత్రువుల శరీరాలే ఛిద్రమవుతాయికానీ వారి ఆత్మలు మాత్రం ఛిద్రం కావని చెప్పడం మాత్రమే కదా! కానీ అర్జునునికి వారి 'ఆత్మలు' ఛిద్రం అవుతాయా, కావా అనే చింత ఎక్కడుంది? అతడు వారి శరీరాలనే ఛిద్రం చేయడానికి ఇష్టపడడం లేదు. అతడీమాట స్పష్టంగా చెప్పాడుకూడా –

గురూనహత్వా హి మహానుభావాన్।
శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే।
హత్వార్థ కామాంస్తు గురూనిహైవ।
భుఞ్జీయ భోగాన్ రుధిర ప్రదిగ్ధాన్॥ (2-5)

(గురుజనులైన ఈ మహానుభావులను చంపి రక్తసిక్తమైన భోగాలను అనుభవించాలని నాకు లేదు. అందువల్ల ప్రపంచంలో భిక్ష ఎత్తుకొని జీవించవలసి వచ్చినా వీరిని చంపకుండా ఉండడమే నాకు శ్రేయస్కరం.)

అర్జునుడు వింటూ పోతున్నాడు. అతనిపైన శ్రీకృష్ణుని మాటల ప్రభావం కొంచెమైనా పడిన సూచనలు మనకు కనిపించడం లేదు. అప్పుడు స్వయంగా శ్రీకృష్ణుడు ఆత్మ అవినాశి, నిత్యమైంది అనే వాదాన్ని వదలిపెట్టి కొంత భిన్నంగా ఉండే తర్కాన్ని ముందుంచుతున్నాడు.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్।
తథాపి త్వం మహాబాహో నైనం శోచితుమర్హసి॥ (2-26)

(గొప్ప పరాక్రమం ఉన్న బాహువులు కలవాడా! నీవు ఒకవేళ దీన్ని (బహుశా జీవాత్మనే) నిత్యం జన్మించే, నిత్యం మరణించే దాన్నిగా భావించినా కూడా నీవు శోకించడం తగదు.)

దీనికి అర్థం నీవు ఆత్మను నిత్యమైందని భావించి యుద్ధం చేయగలిగితే దాన్ని నిత్యమైందని భావించి యుద్ధం చెయ్యి. అలాకాక ఆత్మను అనిత్యమని భావించి యుద్ధం చేయగలిగితే దాన్ని అనిత్యమని భావించి యుద్ధం చెయ్యి అని చెప్పడం మాత్రమే కదా!

ఆత్మ 'నిత్యత్వాన్ని' ప్రతిపాదించినా, దాని ప్రయోజనం 'యుద్ధస్వ'యే, ఆత్మ 'అనిత్యత్వాన్ని' ప్రతిపాదించినా కూడా దాని ప్రయోజనం 'యుద్ధస్వ'యే!

కానీ ఆ తర్వాతి శ్లోకం ద్వారానేమో ఈ జన్మ– మరణాల విషయం బహుశా శరీరానికి సంబంధించిందే నని, 'ఆత్మ'కు సంబంధించింది కాదని చెబుతున్నట్లు కనబడుతుంది–

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మాదపరిహార్యే-ర్థే న త్వం శోచితుమర్హసి॥ (2-27)

(జన్మించినవాడు మరణించడం తథ్యం. మరణించినవాడు మళ్ళీ జన్మించడమూ తథ్యమే. అందువల్ల ఏదైతే తప్పనిసరిగా జరిగి తీరుతుందో, దాన్నిగురించి చింతించడం తగదు.)

వైరాగ్యపరమైన ఈ ఉపదేశం ఒకవిధంగా సరైందే. కానీ దాన్ని ఉపయోగించి 'ఎవరు చావడం నిశ్చయమో', అలాంటివారినే చంపడానికి అర్జునున్ని ప్రేరేపించినప్పుడు నిజంగానే శ్రీకృష్ణుని ఈ మాటలోని సార్థకత ప్రశ్నార్థకంగా మారుతుంది.

తర్వాతి మూడు శ్లోకాల్లో కూడా శ్రీకృష్ణుడు తరచు వల్లించిన తాత్వికాంశాలనే అర్జునునిలోని యుద్ధవిముఖతను తొలగించడానికి ఉపయోగించాడు. అయితే వాటిని సదుపయోగం చేసినట్లుగానీ, వాటిద్వారా ఆయన తన ఉద్దేశ్యంలో సఫలత సాధించినట్లుగానీ మనకు కనపడదు.

ఇక గీతలోని శ్రీకృష్ణుడు తాత్వికత అనే ముసుగునంతా పూర్తిగా తీసిపారేసి తిన్నగానే వర్ణాశ్రమ పదజాలాన్ని ఉపయోగిస్తాడు.

స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితుమర్హసి।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయో– న్యత్ క్షత్రియస్య న విద్యతే॥ (2-31)

(యుద్ధం చేయవలసిన నీ (క్షత్రియ) ధర్మంవైపు చూసి నీవు సంశయించనవసరం లేదు. క్షత్రియునికి యుద్ధం చేసే ధర్మాన్ని మించిన ధర్మం మరొకటి లేదు.)

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్।
సుఖినః క్షత్రియాః పార్థ! లభన్తే యుద్ధ మీదృశమ్॥ (2-32)

(ఓ పార్థా! అప్రయత్నంగానే ఎదుట నిలిచిన ఈ తెరిచిన స్వర్గ ద్వారాన్ని – అంటే ఇలాంటి యుద్ధాన్ని – భాగ్యవంతులైన క్షత్రియులే పొందగలుగుతారు.)

శ్రీకృష్ణుని ఈ మాట వినగానే పాపం అర్జునుడు

కొంతసేపు లోలోపలే మండిపడి ఉంటాడని నా అభిప్రాయం. ఈయన ఎందుకు పుండుపైన కారం చల్లుతున్నాడు? అని అనుకొని ఉంటాడు.

ఏ యుద్ధంలోనైతే నాకు నా గురుజనులను, బంధువులను, మిత్రులను చంపడం తప్పదో, దాన్ని గురించి 'ఇలాంటి యుద్ధం' – ఇలాంటి 'తెరిచిన స్వర్గ ద్వారం' – భాగ్యవంతులైన క్షత్రియులకే లభిస్తుందని చెబుతున్నాడు!' అని అనుకొని ఉంటాడు.

ఈ తర్కం ద్వారా కూడా అర్జునుడు ప్రభావితుడైనట్లు కనిపించక పోయేసరికి శ్రీకృష్ణుడు ఇంకా తగ్గుస్థాయికి చెందిన లౌకిక తర్కం తెచ్చాడు.

(1) నీవీ ధర్మయుద్ధం చేయకపోతే నీ కీర్తి నశించి పోతుంది.

(2) యశస్వి అయిన వ్యక్తికి అపకీర్తి పొందడం మరణించడంకంటే కూడా ఎక్కువ బాధాకరం.

ఇలాంటి విషయాల్లో 'కీర్తి', 'అపకీర్తి' అనేవి ఆయా సమాజాల విలువల పైన విశ్వాసాలపైన ఆధారపడి ఉంటాయి. సమాజంలోని విశ్వాసాలే అనుచితమైనవైనప్పుడు వాటిని ధిక్కరించి ఆ 'ధర్మం' దృష్టిలో 'అపకీర్తి' పొందడమే ఎక్కువ యోగ్యమైన చర్యకాదా?

ఇక దీనితో కూడా పని జరిగేట్లు కనపడకపోయేసరికి శ్రీకృష్ణుడు ఒక్కసారి అన్నిటికంటే నిమ్నస్థాయికి చెందిన చివరి తర్కం ద్వారా తిన్నగానే ఆశ చూపుతాడు.

(1) ఓ అర్జునా! యుద్ధంలో నీవు చనిపోతే స్వర్గం ప్రాప్తిస్తుంది. గెలిస్తే భూమండల రాజ్యం లభిస్తుంది.

(2) సుఖం, దుఃఖం, లాభం, నష్టం, జయం, పరాజయం, అన్నింటిని సమానంగా భావించి యుద్ధం చెయ్యి. నీకు ఎలాంటి 'పాపం' అంటదు.

అర్జునుడు శ్రీకృష్ణున్నుంచి తన ధర్మమేమిటో తెలుసుకోవాలనుకున్నాడు. ధర్మానికి గీటురాయి ఔచిత్యమేగాని లోభం, లాభం కాదు. ఇక్కడ మనకు కనిపించేది శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధానికి ప్రేరేపించేందుకు మూడు గొప్ప 'లాభ'ల ఆశ చూపుతున్నాడు.

(1) గెలిస్తే భూమండల రాజ్యం లభిస్తుంది.

(2) మరణిస్తే 'స్వర్గం' లభిస్తుంది.

(3) ఇతరులను చంపడం, హతమార్చడంవల్ల ఎలాంటి పాపం అంటదు.

ఈ విధంగా ఆశపెట్టడం యోగీశ్వరుడైన ఏ కృష్ణునికి శోభస్కరం కాదని చెప్పనవసరం లేదు.

శ్రీకృష్ణుడు ఇన్ని విధాల మాటలు చెప్పినా కూడా ఆయన ప్రభావానికి లోను కానందుకు అర్జునున్ని మనం అభినందించాలి. కారణం స్పష్టంగానే కనపడుతూంది. శ్రీకృష్ణుడు ఇంతవరకు అర్జునుణ్ణి సందేహాలను, అతని మనసును కలచివేసే అంశాన్ని, స్పర్శించే మాట ఒక్కటి కూడా చెప్పలేదు.

ఒకవిధంగా భగవద్గీతలోని యుద్ధ సమర్థన ప్రకరణం ఇక్కడ ముగిసిపోతుంది. ఇక తర్వాతి అంశాలన్నీ యుద్ధపరంగా చూసినప్పుడు భగవద్గీత పరిమాణాన్ని పెంచేవి మాత్రమే.

రెండవ అధ్యాయం 39వ శ్లోకం తర్వాత నుంచి గీత స్వరమే మారిపోయినట్లు కనపడుతుంది. గీతను వేదాలననుసరించిన రచనగా చెబుతారు. కానీ గీతలో వేదాల తిరస్కారం ఉన్నంత చాలా తక్కువ గ్రంథాల్లో మనకు కనిపిస్తుంది.

రెండవ అధ్యాయంలోని 42వ శ్లోకం యొక్క భావార్థం ఇది.

"ఓ పార్థా! ఎవరు అవివేకులో, ఎవరు వేదవాదంలో లీనమై ఉంటారో... ఎవరు స్వర్గమే ఉత్కృష్టమైందని భావిస్తూ ఉంటారో, వారి బుద్ధి సమాధిలో నిలిచి ఉండలేదు."

తర్వాత ఈ అధ్యాయంలోనే 45వ శ్లోకం.

'ఓ అర్జునా! వేదాల్లో ఉన్న విషయాలు త్రిగుణాలు (సత్వరజస్తమో గుణాలు) మాత్రమే. అందువల్ల నీవు మూడు గుణాలను అతిక్రమించి త్రిగుణాతీతుడవు కా. ద్వంద్వాతీతుడవుకా."

దీని తర్వాతి శ్లోకంలో వేద నిరసన మరింత స్పష్టంగా ఉంది.

"జ్ఞాని అయిన బ్రాహ్మణునికి అన్ని వేదాల విలువ, నలువైపులా నీళ్ళు నిండి ఉన్నప్పుడు ఒక చెరువుకు ఎంత విలువ ఉంటుందో, అంతే ఉంటుంది..."

ఇంకొంచెం ముందుకు వెళ్తే 52 వ శ్లోకంలో.

"ఓ అర్జునా! నీ బుద్ధి మోహం అనే కాలుష్యంనుంచి బయటపడినప్పుడు నీవు శృతం (వేదం), శ్రోతవ్యం రెండింటిపట్ల విరక్తుడవై పోతావు."

తర్వాత 53వ శ్లోకంలో కూడా.

"ఓ అర్జునా! నీ బుద్ధి శ్రుతి (వేదం) పట్ల విముఖత చెంది నిశ్చలమైపోయినప్పుడే నీ బుద్ధికి సమాధి స్థితిలోని అచల బుద్ధియోగం ప్రాప్తిస్తుంది."

గీత రచనలో ఏదో ఒక అవైదిక సంప్రదాయం పాత్ర కూడా కొంత ఉన్నట్లు పైన ఉదహరించిన శ్లోకాలు సాక్ష్యమిస్తున్నాయి.

మనం మొదటి అధ్యాయం చివర్లో శోక సంతప్తుడైన అర్జునుణ్ణి రథం వెనుక భాగంలో కూర్చొని ఉండగా వదలిపెట్టి వచ్చాము. శ్రీకృష్ణుడు ఇన్ని మాటలు మాట్లాడుతూ వచ్చాడు. కానీ అర్జునుడు ఏ మాటకు బదులు చెప్పలేదు. ఇక గీతలో యుద్ధభూమిలో ఆయుధం స్వీకరించడం, స్వీకరించక పోవడం అనే విషయం ఒక విధంగా బాగా వెనకపడిపోయినట్లు కనిపిస్తూన్నప్పుడు అర్జునుడు హఠాత్తుగా అడుగుతాడు.

స్థితప్రజ్ఞస్య కా భాషా? సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిం? ॥ (2-54)

(ఓ కేశవా! సమాధిలో ఉండే స్థితప్రజ్ఞుని లక్షణమేమిటి? అతడు ఎలా మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా సంచరిస్తాడు?)

ఈ ప్రశ్నకు సమాధానంగా చెప్పిన పద్దెనిమిది శ్లోకాలు గీతలోని సర్వ శ్రేష్ఠమైన భాగంగా చెప్పడానికి యోగ్యత కలిగి ఉన్నాయి. ఈ శ్లోకాల్లో ఈ అధ్యాయం ఆరంభంలో శ్రీకృష్ణుడు ఇంత చర్చ చేసిన జీవాత్మవాదానికి ఏ స్థానమూ ఉన్నట్లు కనబడదు. ఈ శ్లోకాల మరో విశేషత ఏమంటే వీటిలో ఏ బ్రహ్మనిర్వాణ స్వరూపం గురించిన వర్ణన ఉందో, ఏ బ్రాహ్మీస్థితిని ఇంతగా కీర్తించడం ఉందో, అది ఉపనిషత్తుల్లోని సచ్చిదానంద 'బ్రహ్మ' వర్ణన కాక రాగ ద్వేషాల క్షయ రూపమైన నిర్వాణ వర్ణనే. 'పాలిపుత్త నిపాతం'లో, (ఇందులోని కొన్ని సుత్తల పురాతత్వ సంబంధమైన సాక్ష్యం కూడా అవి మూడవ శతాబ్దికి మునుపువని రుజువు చేస్తుంది.) ఒకచోట సరిగ్గా అర్జునుడు అడిగిన ప్రశ్నలాంటిదే ఉంది. బుద్ధ భగవానుడు ఆ ప్రశ్నకిచ్చిన సమాధానంలోను, శ్రీకృష్ణుని ఈ 18 శ్లోకాల సమాధానంలోను పెద్ద తేడా ఏమీ లేదు.

తులనాత్మక దృష్టితో అధ్యయనం చేసే విద్యార్థికి మరో ఆసక్తికరమైన విషయమేమంటే 'సుత్తనిపాతం'లోని ఆ గాథల సంఖ్య కూడా సరిగ్గా పద్దెనిమిదే!

భగవద్గీతలోని ఈ పద్దెనిమిది శ్లోకాల్లో ఒక ప్రధానమైన శ్లోకం ఇలా ఉంది.

నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయతః శాన్తిరశాన్తస్య కుతః సుఖమ్ ॥ (2-66)

భగవద్గీతకు భాష్యం రాసిన కొందరు పండితులు ఈ శ్లోకంలోని 'అయుక్త', 'భావనా' అనే పదాల అర్థాన్ని ఎక్కడెక్కడికో తీసుకెళ్ళారు. ఇలా తీసుకెళ్ళడంలో వినోభాజీలాంటి ఆధునిక భాష్యకారులు కూడా సహకరించారు.

వినయపూర్వకంగా నేను నివేదించుకొనేదేమంటే, 'అయుక్తస్య'కు అర్థం 'యోగి' కానివాడు అని. 'అభావయుతః'కు అర్థం అభ్యసించని వాడు, అని. మరింత నాగరికమైన పద్ధతిలో చెప్పాలంటే, బ్రహ్మ విహారాల 'భావన' చేయనివాడు అని. బౌద్ధుల యోగ పద్ధతిలో 'భావన' అనే పదాన్ని మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష (సమచిత్తత) అనే నాలుగు బ్రహ్మవిహారాలను తెలిపేందుకు వాడతారు.

(యోగాభ్యాసి (యుక్తుడు) కానివానికి బుద్ధి ప్రాప్తించదు. యోగాభ్యాసి కానివాడు మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష (సమచిత్తత). ఈ నాలుగు భావనలు లేనివాడుగా ఉంటాడు. ఎవరు ఈ నాలుగు భావనలు లేనివాడుగా ఉంటాడో, అతనికి శాంతి లభించదు. శాంతి లేనివానికి సుఖం ఎలా ప్రాప్తిస్తుంది?)

'యుక్త', 'భావన' ఈ రెండు పదాలు ఇక్కడ యోగసంబంధమైనవి. బౌద్ధుల యోగ పద్ధతిలో 'భావన' అనే పదం సుపరిచితమైందే. ఈ నాలుగు భావనల నన్నింటిని కలిపి. 'బ్రహ్మవిహారాలు' అని కూడా అంటారు.

గీత మూడవ అధ్యాయం మళ్ళీ అర్జునుని జిజ్ఞాసతో ఆరంభమవుతుంది.

"ఓ కేశవా! మీ అభిప్రాయం ప్రకారం 'కర్మ'కంటే బుద్ధి శ్రేష్ఠమైందైనప్పుడు నన్ను ఈ 'ఘోర కర్మ'లోకి ఎందుకు తోసేస్తున్నారు? మీరు అటు, ఇటు రెండువిధాలా మాట్లాడి నా బుద్ధిని అయోమయం పాలు చేస్తున్నారు. నేను శ్రేష్ఠత్వం పొందేందుకు మీరు ఏదో ఒకటి నిశ్చయంగా తేల్చి చెప్పండి."

అర్జునుని ఈ జిజ్ఞాసవల్ల – ఇంతవరకు అర్జునుడు యుద్ధంలో పాల్గొనడాన్ని 'ఘోర కర్మ' లేక 'పాపకర్మ'గానే భావిస్తున్నాడని, అతని దృష్టిలో శ్రీకృష్ణుని ఉపదేశమంతా అతని బుద్ధిని అయోమయంలోకి తోసేదిగానే రుజువవుతున్నదని స్పష్టంగా తెలుస్తుంది.

శ్రీకృష్ణుడు తన సమాధానంగా చెప్పిన మొదటి ఎనిమిది శ్లోకాల్లో 'అకర్మ'కంటే 'కర్మ' గొప్పదని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడతాడు. అర్జునుని జిజ్ఞాస –

'కర్మ'కంటే 'బుద్ధి' శ్రేష్ఠమైనప్పుడు నన్ను ఈ 'ఘోర కర్మ'లోకి ఎందుకు తోసేస్తున్నావు?' అని. గీతాచార్యుడు అర్జునుని ఈ సందేహానికి ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఆ తర్వాత 'కర్మ' గురించి చెబుతూ-చెబుతూ 'యజ్ఞం' గురించి చెప్పడం ఆరంభించాడు. మూడవ అధ్యాయంలోని పదిహేనవ శ్లోకం వరకు గీతలో 'యజ్ఞం-హవనం' వీటి మహిమను చెప్పడమే ఉంది. ఇది యుద్ధభూమిలో అర్జునుడు 'యజ్ఞం-హవనం' చేయాలని సూచించడమేనా?

ఈ అధ్యాయంలోనిదే అయిన 20వ శ్లోకం కూడా ప్రాధాన్యం కలదే.

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్కర్తు మర్హసి ॥ (3-30)

(జనకుడు మొదలైనవారు విహిత కర్మల ద్వారానే సిద్ధి పొందారు. నీవు 'లోక సంగ్రహ'ాన్ని (లోక కళ్యాణాన్ని) కూడా దృష్టిలో ఉంచుకొని కర్మే చేయాలి.)

భగవద్గీతకు ముందు వేదాల్లో, బ్రాహ్మణ గ్రంథాల్లో లేక ఉపనిషత్తుల్లో ఎక్కడైనా 'లోక సంగ్రహ' అనే పదం ప్రయోగించబడిందో, లేదో నాకు తెలియదు. బౌద్ధగ్రంథాల్లో మాత్రం 'లోక సంగ్రహ'లో తప్పనిసరిగా ఉండే నాలుగు అంగాల వర్ణన కూడా ఉంది: ఆ నాలుగు అంగాలు ఇవి- (1) దానం (2) పెయ్యవజ్జ ((ప్రియ వచనాలు), (3) అర్థచర్య (పరోపకారి అయిన జీవితం), (4) సమానత్తత (సమానతాభావం.)

యజ్ఞాల చర్చనుంచి వెనక్కి అనాసక్త కర్మల విషయానికి వచ్చి శ్రీకృష్ణుడు ఒకమాట అన్నాడు. అది అభ్యంతరకరమైందిగా కూడా భావించబడవచ్చు—

న బుద్ధి భేదం జనయేదజ్ఞానాం కర్మసఙ్గినామ్ ।
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ ॥ (3-26)

(అజ్ఞులైనవారిలో, కర్మలో ఆసక్తి ఉన్నవారిలో 'బుద్ధి భేదం' సృష్టించరాదు. అంటే వారి బుద్ధిని సంశయగ్రస్తం చేయరాదు. పండితుడైనవాడు, (కర్మ) యోగి అయినవాడు స్వయంగా అన్ని కర్మలు చేస్తూ వారితో కూడా అలాంటి కర్మలే చేయించాలి.)

స్పష్టవక్త అయిన స్వామి భగవతాచార్యులవారు తన 'గీతాభాష్య' పీఠికలో ఈ శ్లోకాన్ని చర్చిస్తూ ఇలా రాశారు. "ఇక్కడ భగవానుడు పిరికివాడయ్యాడు. ఇలా జరగడం బాగాలేదు. సమ్యక్ దృష్టికి ఎవరైనా అనుచిత కర్మల్లో లీనమై ఉన్నట్లు తోచినప్పుడు వాటినుంచి అతన్ని తప్పక మళ్ళించాలి. భగవానుడు మాత్రం అతనిలో బుద్ధిభేదం సృష్టించరాదు, అని అంటాడు (అంటే అతనికి తన కర్మల ఔచిత్యం విషయంలో సంశయం కలిగించరాదు, అని అర్థం) ఇది నిజంగానే ఉత్తమమైన ప్రణాళిక కాదు.

తర్వాతి కొన్ని శ్లోకాలు 'గుణా గుణేషు వర్తంతే' (గుణాలు గుణాల్లోనే ఉంటాయి, ఆత్మలో కాదు) అనే మాటను ఎంత బలంగా సమర్థిస్తాయంటే, దాన్ని కీర్తించే శ్రీకృష్ణున్ని ఆత్మవాది అనడం అసంభవంగా తోస్తుంది.

కానీ మధ్యమధ్యలో అనాసక్తతతో కర్మచేస్తూ ఉండే విషయాన్నేకాక 'యుద్ధస్వ'ను కూడా గుర్తుంచుకోవడం అవసరం. అందుకోసమే ఈ తర్వాతి శ్లోకం.

మయి సర్వాణి కర్మాణి సంన్యస్యాధ్యాత్మచేతసా ।
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ (3-30)

(అధ్యాత్మ చిత్తంతో సర్వకర్మలను నాకే సమర్పించి ఆశను, మమకారాన్ని త్యజించి, జ్వర (సంతాప) రహితుడవై యుద్ధం చేయి.)

ఈ శ్లోకంలో 'జ్వర రహితుడవై (సంతాప రహితుడవై) యుద్ధము చేయి' అనే మాట భలేగా ఉంది. 'కామం' లేకుండా రతిక్రియ సంభవమని భావించినప్పుడు 'జ్వరం' (సంతాపం, క్షోభం) లేకుండా యుద్ధం చేయడంకూడా సంభవమని భావించవచ్చు. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే మానసిక 'జ్వరం' లేనప్పుడు ఎవరైనా యుద్ధం ఎందుకు చేస్తాడు? అని.

శ్రీకృష్ణుడు అర్జునునికి రాజ్యం ఆశ చూపించాడు, స్వర్గం ఆశ చూపించాడు, పాప విమోచనం ఆశ చూపించాడు. అయినా అర్జునుడు యుద్ధం చేయడానికి సిద్ధపడకపోవడం చూసి బహుశా ఇప్పుడు 'జ్వర రహితుడవై యుద్ధం చేయి' అనే సిద్ధాంతం ఆవిష్కృతమైంది. ఈ తర్కంవల్ల కూడా పని జరగకపోవడం వల్లనేనేమో, తర్వాతి తర్కం ప్రవేశ పెట్టాడు

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ (3-35)

(స్వధర్మం గుణరహితంగా ఉండి పర 'ధర్మం' బాగా ఆచరింపబడినదైనా కూడా పర 'ధర్మం'కంటే స్వధర్మమే శ్రేష్ఠమైంది. స్వధర్మంలో మృత్యువు కలిగినా కూడా శ్రేయస్కరమే. పరధర్మం భయావహంగా ఉంటుంది.)

ఆ సమయంలో అర్జునుణ్ణి యుద్ధాభిముఖునిగా చేయడానికి శ్రీకృష్ణునికి ఈ తర్కం కొంత ఉపయోగపడి ఉండవచ్చు. ఎందుచేతనంటే, ఇలాంటి వర్ణాశ్రమ తర్కమే మునుపు కూడా ఆయన ఇచ్చి ఉన్నాడు కాబట్టి. కానీ, దీన్ని అందరికీ ఇవ్వదగిన

సర్వసాధారణమైన ఉపదేశంగా భావిస్తే మాత్రం ఇది నిస్సందేహంగా ప్రజలకు అకళ్యాణకరంగానే ఉంటుంది.

మరింత ముందుకు సాగితే మళ్ళీ తత్వచింతకుడు శ్రీకృష్ణుని స్వరూపం మన ఎదుటికి వస్తుంది.

ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్యః పరం మనః ।
మనసస్తు పరాబుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః ॥ (3-42)

(ఇంద్రియాలు (శరీరానికి) అతీతమైనవిగా చెప్పబడ్డాయి. ఇంద్రియాలకు ఆవల మనసు ఉంది. మనసుకావల బుద్ధి ఉంది. బుద్ధికంటే కూడా ఆవల ఉన్నది 'ఆత్మ.')

'బుద్ధి'కి ఆవల ఉన్నది ఆత్మ అనడం కూడా ఒక నిర్వచనమేనా? అని ఎవరైనా అడగవచ్చు.

'ఆత్మ'కు మరో 'నిర్వచనం' కూడా ఉంది- దీన్ని నిర్వచించడం సాధ్యం కాదని!

నాల్గవ అధ్యాయం ఆరంభంలో అర్జునుడు ప్రశ్నించకుండానే శ్రీకృష్ణుడు ఒక కొత్త ప్రకరణం మొదలుపెడతారు.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవే ఽబ్రవీత్ ॥ (4-1)

(ఓ అర్జునా! నాశములేని ఈ (కర్మ) యోగాన్ని నేను అందరికంటే ముందు సూర్యునికి చెప్పాను. సూర్యుడు (తన పుత్రుడు) మనువుకు చెప్పాడు. మనువు (తన పుత్రుడు) ఇక్ష్వాకునకు చెప్పాడు.)

ఇక్కడ శ్రీస్వామి భగవదాచార్య మహారాజు చెప్పిన మాటతో నేను నూటికి నూరుపాళ్ళు ఏకీభవిస్తాను. ఆయన ఇలా అన్నారు- "ఏ విధమైన కర్మయోగం శ్రీకృష్ణునికి ఇష్టమో, ఆ కర్మయోగం వివస్వాన్‌కు, మనువుకు మొదలైన వారికి తెలిసి ఉండే అవకాశం లేదు. తెలిసి ఉంటే, మనువు తన ధర్మశాస్త్రంలో దాన్ని సంగ్రహించి ఉండేవాడు. వివస్వాన్ తర్వాత రూపుదాల్చిన, ఇప్పుడు కూడా లభ్యమవుతున్న అనేక ధర్మగ్రంథాల్లో దేంట్లోకూడా ఈ కర్మయోగం గురించిన మాటలేదు. అందువల్ల భగవానుడు ఈ మాట అర్జునుణ్ణి యుద్ధోన్ముఖుణ్ణి చేయడంకోసమే అని ఉంటాడు. తర్వాతి శ్లోకం :

ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరన్తప ॥ (4-2)

(ఈ విధంగా పరంపరాక్రమంలో వచ్చిన (కర్మ-) యోగాన్ని రాజర్షులు తెలుసుకున్నారు. ఓ అర్జునా! ఆ తర్వాత చాలాకాలం గడిచిపోయినందువల్ల ఆ (కర్మ-) యోగం ఇప్పుడు కనిపించకుండాపోయింది.)

ఇక్కడ 'రాజర్షులు తెలుసుకున్నారు' అని అనడంలో ఆ (కర్మ-) యోగం క్షత్రియులకోసం మాత్రమే అనే అర్థం ధ్వనించడం లేదా? అలా కాకుండా ఉంటే 'ఋషులు తెలుసుకున్నారు, లేదా 'బ్రహ్మర్షులు కూడా తెలుసుకున్నారు అనే మాట ఉండేది.

ఇంతవరకు శ్రీకృష్ణుని మానవ రూపమే మన ఎదుట ఉంది. కానీ ఈ అధ్యాయంలో అకస్మాత్తుగా ఆయన 'భగవంతుడు' అయిపోయాడు.

అజో-పి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరో-పి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ (4-6)

(నేను అజుడను (పుట్టుక లేనివాడను). అవినాశిని (నాశము లేనివాడను). జీవులందరికి అధీశ్వరుడను. అయినా నేను నా ప్రకృతిని ఆశ్రయించి నా మాయాశక్తిచేత జన్మనెత్తుచున్నాను.)

ఏసుక్రీస్తును మనం 'ఈశ్వరవాది'గా స్వీకరిస్తాం. ఎందుచేతనంటే ఆయన తనకు వేరుగా ఒక భగవంతుడున్నాడని నమ్మాడు, తనను కేవలం 'భగవంతుని పుత్రుడు'గా భావించేవాడు కాబట్టి. అలాగే ప్రవక్త మొహమ్మద్‌ను కూడా మనం 'ఈశ్వరవాది'గా స్వీకరిస్తాం. ఎందుచేతనంటే ఆయనకూడా తనకు వేరుగా ఒక 'భగవంతుణ్ణి' నమ్మాడు, తను కేవలం 'భగవంతుని' పైగంబర్ (సందేశవాహకుడు)నని చెప్పేవాడు. కానీ శ్రీకృష్ణుడు మాత్రం 'నేనే భగవంతుణ్ణి' అని అన్నాడు. ఎవరైతే తననే భగవంతునిగా భావిస్తాడో, ఆయన్ను మనం 'ఈశ్వరవాది' అని అనకుండా 'నిరీశ్వరవాది' అని ఎందుకు అనకూడదు? శ్రీకృష్ణుడు బహుశా 'నిరీశ్వరవాదే' అయి ఉంటాడు.

అందువల్లనే ఆయన ఇలా అంటున్నాడు :

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥ (4-7)

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ (4-8)

(ఓ అర్జునా! ఎప్పుడెప్పుడైతే ధర్మానికి హాని, అధర్మానికి అభ్యుదయము కలుగుతుందో, అప్పుడప్పుడంతా ధర్మాన్ని ఉద్ధరించడానికి నేను అవతరిస్తాను (7). సజ్జనులను రక్షించడానికి, దుష్టులను నశింపచేయడానికి, ధర్మాన్ని నెలకొల్పడానికి నేను ప్రతి యుగంలోను అవతరిస్తాను (8).

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే

'భగవంతుడు' అవతారమెత్తుతాడని చెప్పడం జరగలేదు. శ్రీకృష్ణుడు 'నేను' అవతారం ఎత్తుతాను, అని అంటున్నాడు.

ఏ గ్రంథాన్నైనా ధర్మగ్రంథంగా భావించినప్పుడు అందులోని ప్రతి మాటను వ్యక్తి ప్రశ్నించకుండానే స్వీకరించడం జరుగుతుంది. అలా భావించినప్పుడు మాత్రం శ్రీకృష్ణుని ఈ హామీ, వెనుక 11వ అధ్యాయంలో వర్ణించబడిన 'భగవంతుని' స్వరూపానికి విరుద్ధంగా ఉందని అంగీకరించవలసి ఉంటుంది. ఆ తర్వాత తన గురించి ఇలా కూడా చెప్పాడు.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥ (4-13)

(ఓ అర్జునా! ఈ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర నాలుగు వర్ణాల విభజన ఉందే, అది గుణ-కర్మల ననుసరించి నేనే చేశాను. ఈ చాతుర్వర్ణ వ్యవస్థకు కర్తను నేనే అయినా కూడా నీవు నన్ను అకర్తగాను, అవినాశిగాను భావించు.)

ఇక్కడొక ప్రశ్న తలెత్తుతుంది. శ్రీకృష్ణుడే మొట్టమొదట బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైనవారి గుణ-కర్మలను సృష్టించాడా లేక గుణకర్మలు మొదటినుంచి వస్తూ ఉండగా ఆయన కేవలం వర్ణభేదాలను మాత్రమే సృష్టించాడా? ఒకవేళ గుణ-కర్మలు మొదటినుంచి ఉండి ఉంటే, మరి అవి మనుషులందరిలోను ఉండేవా లేక బ్రాహ్మణ క్షత్రియ వర్గీకరణ ననుసరించి ఉండేవా? అందరిలోను ఉండి ఉంటే, ఇప్పుడు కూడా అందరిలో ఎందుకు లేవు? ఒకవేళ అందరిలో లేకుండా ఉండి ఉంటే ఇప్పుడెందుకు అందరిలో కనిపిస్తూన్నాయి?

చరిత్రలో ఎప్పుడైనా బ్రాహ్మణుల స్వభావానికి, క్షత్రియుల స్వభావానికి ఒక జాతి ప్రాణులకు (ఎద్దు మొదలైన) మరో జాతి ప్రాణులకు (గుర్రాలు మొదలైన) ఉండేటువంటి తేడా ఉండేదా? ఉండేది, అని అంటే ద్రోణాచార్యుడు, అశ్వత్థామ, పరశురాముడు, వీరి స్వభావం 'బ్రహ్మకర్మ స్వభావజమ్' (ఈ కర్మలు బ్రాహ్మణులకు సహజమైనవి) అనే మాటకు సాక్షిగా నిలుస్తుందా? జ్ఞాన-విజ్ఞానమంతా బ్రాహ్మణుల తాత-తండ్రుల సొత్తే అని అంగీకరిస్తే ప్రాచీన యుగంలో భీష్మ పితామహుడు, యుధిష్ఠిరుడు మొదలైన క్షత్రియులు అంత పెద్ద ధర్మోపదేశకులుగా ఎలా ఎదిగారు? ఇటు ఆధునిక యుగంలో డా॥ అంబేద్కర్‌లాంటివారు ఇంత పెద్ద పండితులు ఎలా కాగలిగారు?

చాతుర్వర్ణం విషయంలో శ్రీకృష్ణుడన్నమాట పూర్తిగా నిరర్థకమైన మాట అనే చెప్పవలసి ఉంటుంది. ఆధునిక యుగంలోని ప్రతి మాట నా ఈ నిర్ధారణను ధృవపరుస్తుంది.

బహుశా అత్యంత ప్రాచీనమైన గీత రచన యుద్ధానికి సంబంధించిన ఒక చిన్న ప్రకరణంగా మాత్రమే ఉండి ఉంటుందనే, తర్వాత అర్జునుని నోట వెలువడినట్లు చెప్పబడిన ప్రశ్నలు, వాటి సమాధానాలు గీత పరిమాణం పెరగడానికి కారణమై ఉంటాయనే మాటనే ఐదవ అధ్యాయం ఆరంభంలోని శ్లోకం కూడా దాదాపుగా సూచిస్తుంది.

ఈ ఐదవ అధ్యాయంలో సాధారణంగా కర్మసన్యాసాని కున్న శ్రేష్ఠతను ప్రతిపాదించడమే ఉంది. ఇక్కడ 'భగవంతు'ని స్వరూపం కూడా 'కర్మసన్యాసి' స్వరూపంలాంటిదే –

నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జన్తవః ॥ (5-15)

(భగవంతుడు ఎవరి పాపాన్నిగానీ, పుణ్యాన్నిగానీ గ్రహించడు. జ్ఞానం అజ్ఞానం ద్వారా కప్పబడి ఉంటుంది. అందువల్ల జనులు మోహానికి వశులవుతున్నారు.)

ఆరవ అధ్యాయం మొదట్లో అర్జునుని జిజ్ఞాస ఏమీ లేదు. అడగకపోయినా చెప్పేవాడిలాగా శ్రీకృష్ణుడు తనకు తానే ఈ అధ్యాయాన్ని ఆరంభిస్తాడు. ఈ అధ్యాయం ఒకరకంగా గీతలోని 'యోగసాధనా' ప్రకరణం. ఇందులో ప్రాణాయామం, మొదలైనవాటికోసం ఎలాంటి ఆసనం పరుచుకోవాలి, మొదలైన చిన్న-చిన్న మాటలు కూడా ఉన్నాయి. ఈ కారణాన్ని సూచిస్తూనే స్వామి భగవదాచార్య మహారాజుగారు ఇలా అన్నారు– "భగవద్గీత హిందూ మతం యొక్క, హిందూ సంప్రదాయాల యొక్క, అవికల (చెక్కు చెదరని) చిత్రం మాత్రమే."

ఏడవ అధ్యాయం ఆరవ అధ్యాయం కొనసాగింపే.

కానీ ఎనిమిదవ అధ్యాయం మళ్ళీ అర్జునుని జిజ్ఞాసతో మొదలవుతుంది. అర్జునుడిలా అడిగాడు.

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే ॥ (8-1)

(ఓ పురుషోత్తమా! బ్రహ్మమనగానేమి? 'అధ్యాత్మ' మనగానేమి? 'కర్మ' అనగా ఏమిటి? 'అధిభూత'మనగా ఏమిటి? 'అధిదైవ'మనగానేమిటి?)

ఒకవిధంగా మొత్తం ఈ అధ్యాయానికి కృష్ణార్జునుల సంవాదంలోని ప్రధాన విషయమైన యుద్ధంతో ఏమీ

సంబంధం లేదు. కానీ, ఈ మొదటి శ్లోకంలోనే శ్రీ కృష్ణునికోసం ఉపయోగించిన 'పురుషోత్తము'డనే విశేషణం కొందరు పండితుల అభిప్రాయం ప్రకారం భగవద్గీత బుద్ధుని తర్వాతికాలం నాటిదని చెప్పడానికి ఒక రుజువు.

భగవద్గీత బుద్ధుని కాలానికంటే ముందు వచ్చిన రచన అని ఎవరూ అనలేదు. లోకమాన్య తిలక్‌తో సహా.

ఈ అధ్యాయానికి భగవద్గీతలోని 'యుద్ధస్వ'తో కొద్దిగానైనా సంబంధం ఉండాలనే ఉద్దేశ్యంతోనే కావచ్చు. ఇందులో ఈ ఒక శ్లోకం మాత్రం ఉంది.

తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।
మయ్యర్పిత మనోబుద్ధిర్మామేవైష్యసంశయమ్ ॥ (8-7)

(అందువల్ల అర్జునా! అన్ని కాలాల్లో నన్ను స్మరించు, యుద్ధం చెయ్యి. నీవు నీ మనసును, బుద్ధిని నాకు అర్పించినప్పుడు నిస్సందేహంగా నన్ను పొందుతావు.)

'సర్వకాలాల్లో నన్ను స్మరించు' అనే మాట సరే, బాగానే ఉందనుకోవచ్చు. కానీ, సర్వ కాలాల్లో యుద్ధం కూడా చేస్తూ ఉండాలా?

ఈ అధ్యాయంలో కొన్ని విచిత్రమైన శ్లోకాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు :

అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ (8-24)

(అగ్నిమయమైన జ్యోతి ఉన్నప్పుడు, పగలైనప్పుడు, శుక్లపక్షమైనప్పుడు, సూర్యుడు ఆరు నెలల దాకా ఉత్తరాయనంలో ఉన్నప్పుడు ఆ మార్గంలో పయనించిన బ్రహ్మవేత్తలు బ్రహ్మను పొందుతారు.)

ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ (8-25)

(చీకటి రాత్రి ఉన్నప్పుడు, కృష్ణపక్షమైనప్పుడు, సూర్యుడు ఆరునెలల దాకా దక్షిణాయనంలో ఉన్నప్పుడు చంద్రునికి సంబంధించిన జ్యోతిని పొంది యోగి మళ్ళీ ప్రపంచంలోకి తిరిగి వస్తాడు.)

నా టీకాలో నేను వీటిని శుక్లమార్గం (పుణ్యపథం), కృష్ణమార్గం (అపుణ్యపథం) అనే ఒక రూపకంగా మాత్రమే భావించాను. కానీ స్వామి భగవదాచార్య మహారాజ్‌గారు మాత్రం ఇవి నిరర్థకమైనవని, ఉపనిషత్తుల అనుకరణ మాత్రమేనని, వీటికి ఆవృత్తితో (మళ్ళీమళ్ళీ రావడంతో), అనావృత్తితో ఏ సంబంధమూ ఉన్నట్లు భావించకూడదని నమ్ముతారు.

తొమ్మిదవ అధ్యాయాన్ని కూడా స్వయంగా శ్రీకృష్ణుడే మొదలు పెడుతాడు. అందులో వర్ణించబడిన 'జ్ఞానా'న్ని 'గుహ్యతమ' (పరమ రహస్యం) జ్ఞానం అని చెప్పడం జరిగింది. కానీ అధ్యాయమంతా శ్రీకృష్ణుని ఆత్మ ప్రశంసతోనే నిండి ఉంది. భగవద్గీతతోపాటు ధర్మభావన కూడా చేరి ఉండనట్లైతే భగవద్గీతలోని ఈ "నేను-నేను" అధ్యాయం ఏ తటస్థ పాఠకునికైనా బోరుకొట్టిస్తుంది. ఇందులో ఒక హామీ ఇవ్వడం ఉంది.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥ (9-26)

(ఓ అర్జునా! ఎవరైనా భక్తిభావంతో నాకు పత్రం, పుష్పం, ఫలం, జలం, ఏమర్పించినా ప్రేమపాత్రుడైన ఆ వ్యక్తి ఇచ్చిన పత్ర పుష్పాదులను నేను (సాకార రూపంలోనా?) స్వీకరిస్తాను.)

భక్తులకు భగవానుడిచ్చిన ఈ హామీ ఎంత గొప్పదో, అది భక్తులకే తెలియాలి. అంతేకాక దీనిపైన నమ్మకం కూడా భక్తులు మాత్రమే ఉంచుకోగలరు.

తర్వాతి ఒక శ్లోకాన్ని సదాచారానికి సంబంధించిన నైతిక ప్రేరణలను సమూలంగా కూల్చివేసేదిగానే భావించవలసి ఉంటుంది.

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥ (9-30)

(ఎంత దురాచారి అయినవాడు కూడా అనన్య భావంతో నన్నారాధిస్తే అతడు ఉత్తముడుగానే ఎంచబడతాడు. అలాంటివాణ్ణి స్థిరచిత్తుడుగానే భావించాలి.)

ఇంకా చూడండి :

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుఃపాపయోనయః ।
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేపి యాన్తి పరాం గతిమ్ ॥ (9-32)

(ఓ అర్జునా! నా శరణుజొచ్చడం ద్వారా పాపపు జన్మనెత్తిన వారు ఎవరెవరైతే ఉన్నారో – వాళ్ళు స్త్రీలుగానీ, వైశ్యులుగానీ, శూద్రులుగానీ– ఉత్తమమైన గతిని పొందుతారు.)

ఇంకా వుంది...

హిందీనుంచి అనువాదం: జె. లక్ష్మిరెడ్డి
విశ్రాంత ఆచార్యులు, న్యూఢిల్లీ,
ఫోన్ : 9818431620

చదవండి...

– ఎన్నార్కె



✦ **సిక్కెంటిక కథలు :** రచయిత జిల్లెళ్ళ బాలాజీ – తిరువత్తూరులో జన్మించిన బాలాజీ ఆధునిక భావాలు గల రచయితగా కులాతీత, మతాతీతమైన లౌకిక రాజ్యాన్ని కలగన్నారు. ఆ కలలను వాస్తవ దృక్పథంతో విశ్లేషించి కథలల్లారు. ఈ కథలన్నిటిలోనూ వెనుక బడిన కులాల వారు తమ నేపథ్యంతో చేస్తున్న సాత్విక పోరాట పటిమను రచయిత కథలలో సూటిగా చెప్పుకొచ్చారు. మొత్తం కథలు 15.

పేజీలు :160, వెల : ₹ 90/–, ప్రతులకు – విశాలాంధ్ర, ప్రజాశక్తి

✦ **సంయుక్త రచనలు :** రచయిత్రి చింతం రాణీ సంయుక్త. డాక్టరుగా అమెరికాకు వెళ్ళిన రచయిత్రి విదేశాలలోని వినూత్న నాగరికతలోని మంచి లక్ష్యాలను స్వీకరిస్తూ మనదైన విశిష్ట వారసత్వపు లక్షణాలను అనుసరిస్తూ రెంటినీ మేళవిస్తూ సాగించిన రచనలివి. ఇందులో కథలు, కవిత్వాలు ఉన్నాయి.

పేజీలు :100, వెల : ₹ 60/–, ప్రతులకు – సాహితీ మిత్రులు, విజయవాడ, ఫోన్ : 94906 34849



✦ **విడని ముడి :** పాలపిట్ట మాసపత్రికలో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని పొందిన కవుల కవిత్వం, జీవన రేఖలు ధారావాహికంగా ప్రచురించబడ్డాయి. వాటన్నిటి సంకలనమే ఈ పుస్తకం. **మిసిమి** పత్రికలో వివిధ దేశాలు, భాషలలోని కవిత్వాన్ని మనకందించిన వారు ముకుంద రామారావు. వారి కలం నుంచి వెలువడిన ఆత్మీయ అనుబంధాల కవిత్వం ఇది.

పేజీలు : 200, వెల : ₹ 60/–, ప్రతులకు – పాలపిట్ట ప్రచురణలు, ఫోన్ : 98487 87284

✦ **మునగాల పరగణా కథలు :** మునగాల పరగణా చుట్టూ నిజాం రాజ్యం. మునగాలలో మాత్రం బ్రిటీషు ప్రభుత్వం. ఒక రాజ్యంలో ఉర్దూ, మరొక రాజ్యంలో ఆంగ్లం. మునగాల వాసులది రెండు భిన్నమైన సంస్కృతులతో పెనవేసుకుపోయిన జీవితాలు. ఇందులో ఉన్నవి 1848, అంతకు ముందు కాలంనాటి ప్రజల జ్ఞాపకాలలో ఇమిడిపోయిన కథలు, గాథలు. అందులో కొన్ని యథార్థ ఘటనలు, మరికొన్ని నమ్మశక్యం కాని కట్టుకథలు. దొరలు వారి అహంకారాలు, ఆభిజాత్యాలు, మాటపట్టింపువల్ల పోగొట్టుకున్న సంపదలు అన్నీ మనల్ని కలచివేస్తాయి. తాను చిన్నతనం నుంచి విన్నవీ, కన్నవీ గుడిపూడి సుబ్బారావు వ్రాసినవే మునగాల పరగణా కథలు. రచయితకు ప్రజల భాషతో పరిచయం ఉంది. తెలంగాణ పలుకుబడులపై పట్టు ఉంది. ఈ రెంటినీ కలుపుతూ ఆయన కథ చెపుతాడు. ఆయన శైలి పాదరసంలా సులువుగా జాలువారుతూ, మధ్య మధ్య మెరుపులందిస్తూ ఎంతో హృద్యంగా కథాగమనంతో పెనవేసుకుంటూ సాగిపోతుంది. చదవటం మొదలుపెడితే చివరి వరకు ఆపకుండా చదివించేలా మంచి ఉత్కంఠతతో సాగిపోతుంది. అట్టమీద, లోపల వేసిన చార్‌కోల్ చిత్రాలు పుస్తకానికి నిండుతనాన్నిచ్చాయి.

పేజీలు :92, వెల : ₹ 45/–, ప్రతులకు – ఫోన్ : 98661 15655



✦ **ముక్తకములు :** రచన డా॥వై. బాలరాజు. సామాన్యుని కవిగా పేరుగాంచిన బాలరాజు వ్రాసిన 100 కంద పద్యాల ముక్తకములు. రచయిత తెలంగాణా ఉద్యమ అంశాన్ని ఎత్తిపెట్టి వ్రాసిన అంశాలున్నాయి.

పేజీలు : 80, వెల : ₹ 90/-, ప్రతులకు – ఇంటి నెం: 2-9-12, బస్టాండ్ రోడ్డు, జనగాం – 506167.



✦ **హెూమర్ ఇలియట్ :** తెలుగు, ముత్తేవి రవీంద్రనాథ్. జగత్ ప్రసిద్ధమైన గ్రీకు ఇతిహాస కావ్యం ఇలియడ్. ఇది ఆ కావ్యానికి సవిమర్శక శాస్త్రీయ వ్యాఖ్యానం. ఇందులోని కథాంశాలను బట్టి చారిత్రక కాలనిర్ణయం చేయగలమా? భారతదేశపు ఇతిహాసాలతో దీని పోలిక ఎంతవరకు సబబు? రెంటి మధ్యా సారూప్యాలేమిటి? బేధాలేమిటి? హెూమర్ జీవితం ఆనాటి సాంఘిక జీవనం ఎలా ఉండేది? వీటన్నిటినీ రచయిత శ్లాఘనీయంగా, శాస్త్రీయంగా విశ్లేషించారు. 333 పేజీలున్న ఈ పుస్తకంలో మొదటి రెండువందల పేజీలు కథాంశానికి కేటాయించబడింది. మిగిలిన పేజీలలో కథలోని వ్యక్తుల వివరాలు హెూమర్ పేర్కొన్న భౌగోళిక వివరణలు పక్షి, జంతు, వృక్ష జాతుల వివరాలు పాఠకుల ఉపయోగార్థం పొందుపరచబడింది. కేవలం అనువాదంతోటే కాక మరిన్ని వివరాలతో దీనిని గ్రీకు జీవనానికి సంబంధించిన ఒక రిఫరెన్స్ పుస్తకంగా పొందుపరచిన రచయిత అభినందనీయులు.

పేజీలు :333, వెల : ₹ 175/-, ప్రతులకు – పీకాక్ క్లాసిక్ వారి ప్రచురణలు, ఫోన్ : 90102 04633



✦ **స్వర్ణ శకలాలు :** కపిలవాయి లింగమూర్తి. ఇది బంగారు నగలకు సంబంధించిన విషయ విశ్లేషణ. నన్నయగారి కేటు బంగారంతో ప్రారంభించింది. మూస బంగారంతో ముగిసిన నవల. తెలుగు సాహిత్యంలో వివిధ కవులు తమ కవితలలో వర్ణించిన స్వర్ణాభరణాల ప్రసక్తి రచయిత స్వర్ణశకలాలుగా మన ముందుంచారు. ఇందులో కవుల పద్యాలను సందర్భానుసారం రచయిత చక్కగా ఉటంకించారు.

పేజీలు :150, వెల : ₹ 120/-, ప్రతులకు – ఫోన్ : 92468 30320

✦ **విషాద మహనీయం :** రచయిత కె.ఎల్.వి.ప్రసాద్. తన అక్క స్మృతిలో వ్రాసిన వ్యాసాలు. గేయాల సంపుటి, సంరక్ష పబ్లికేషన్సు, హనుమకొండ వారి ప్రచురణ. వెల పేర్కొన బడలేదు.

పేజీలు : 50 వెల : వెల పేర్కొన బడలేదు, *ప్రతులకు – ఫోన్ : 98662 52002*



✦ **మెకంజీ కైఫీయత్తులు :** ఏడవ భాగం. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన మరో చారిత్రక ఆణిముత్యం ఈ రచన. వాడుక భాషలో గల స్థల చరిత్రల సంకలనాన్ని తయారు చేసిన మెకంజీ ప్రాతఃస్మరణీయులు. యోగి వేమన విశ్వవిద్యాలయం కడప వారి ప్రచురణ.

పేజీలు : 560 వెల : ₹ 500/-, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.



✦ **మోదుగు పూలు :** కవితా సంకలనం. రచన దూపాటి శేషకుమారాచార్యులు. వివిధ సాహితీ ప్రక్రియలతో సంబంధం ఉన్న రచయిత వ్రాసిన 54 కవితల సంపుటీ సమాహార మీ పుస్తకం. తేలికైన భాషలో అందంగా మలచబడ్డ భావాలివి.

పేజీలు :60, వెల : ₹ 50/-, ప్రతులకు – ఫోన్ : 94418 84744


బొయ్!
బొయ్!
బో! బో!!!
తలగొట్ల తమ్మయ్యలును,
పోకిరి పాట్యయ్యలును
పరధ్యానము పాపయ్యలును,
పోట్లాడు పోలయ్యలును,
గుడ్డి చెవిటి గుస్సెయ్యలును
మన రోడ్లుమ్ము పెట్టుబాధలను మరువరాదు
ప్రయాణంలో పదనిసలు

– తలిశెట్టి రామారావు

ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

I.	**మిసిమి ప్రచురణలు**	₹
1.	బాపు బొమ్మలు	200.00
2.	మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు	500.00
3.	బుద్ధుని దీర్ఘ సంభాషణలు – ఎ.వి.రెడ్డి	200.00
4.	బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ”	200.00
5.	బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ”	200.00
6.	బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ”	200.00
7	ఆచార్య నాగార్జునుడు	150.00
8.	దూర తీరాలలో... – వి. అశ్వినీకుమార్	60.00
9.	అమాహ ”	60.00
10.	అంతర్వీక్షణం ”	50.00
11.	సిద్ధార్థ ”	50.00
12.	నాలో నేను ”	30.00
13.	అగాధం ”	75.00
14	చార్లీ చాప్లిన్ (నా కథ) – వి. అశ్వినీకుమార్	299.00
15.	కథాంజలి–1 & 2 – ఎస్సారె	110.00
16.	THE THUNDERCLOUD ”	120.00
17.	మిసిమి వ్యాసాలు – నరిసెట్టి ఇన్నయ్య	125.00
18.	సప్తపర్ణి – కాంద్రేగుల నాగేశ్వరరావు	777.00

II.	**వేమన ఫౌండేషన్ ప్రచురణలు**	
1.	లోకకవి వేమన – ఎమ్. కోదండ రామిరెడ్డి	100.00
2.	మన వేమన – ఆరుద్ర	80.00
3.	వేమన – నార్ల వెంకటేశ్వరరావు	50.00
4.	VEMANA - *V.R. Narla*	50.00
5.	VEMANA - Through Western Eyes. - *V.R. Narla*	50.00
6.	విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి*	100.00
7.	పురాణ ప్రలాపం *(ప్రొ.హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)*	100.00
8.	THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)*	50.00
9.	వేమన – రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ	100.00
10.	వేమన ఉపదేశామృతం –ఎస్.ఎమ్. సుభాని	25.00

III.	**ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**	₹
1.	మహాపరిత్తం – *బోధ చైతన్య*	100.00
2.	జాతక కథలు – *శివశంకర స్వామి*	60.00
3.	బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)*	70.00
4.	మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)*	75.00
5.	మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య*	75.00
6.	బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు*	40.00
7.	వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)*	50.00
8.	జయమంగళం – *బొర్రా గోవర్ధన్*	40.00
9.	బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి*	30.00
10.	భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)*	150.00
11.	విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)*	50.00
12.	మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య*	150.00
13.	బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)*	100.00
14.	ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)*	60.00
15.	శీలం–ధ్యానం – *బోధ చైతన్య*	150.00
16.	లోకక్షేమ గాథలు – *బోధ చైతన్య*	75.00
17.	జాతకమాల – *బోధ చైతన్య*	150.00
18.	సంఘమిత్ర కథలు – *బొర్రా గోవర్ధన్*	75.00
19.	తథాగత – *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)*	50.00
20.	నిత్యజీవితంలో అభిధర్మం – *ఆంగ్లమూలం: ఉకోలే, తెలుగు: వోలేటి*	150.00
21.	బుద్ధవచనం – *బోధ చైతన్య*	200.00
22.	బుద్ధ – ధమ్మ – సంఘ – *ఆంగ్లమూలం: ధర్మానంద కోసంబీ, అనువాదం: జె. లక్ష్మిరెడ్డి*	80.00

IV.	**ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**	
1.	తెలుగా, ఆంధ్రమా? – వాగరి	40.00
2.	యతిగీతం – స్వామి వివేకానంద *(అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి)*	50.00
3.	తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి*	250.00
4.	రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి*	50.00
5.	తెలుగులో పాళీ పదాలు – చీమకుర్తి శేషగిరిరావు	50.00
6.	ఆంధ్రనగరి – సాయి పాపినేని	290.00

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.

మిసిమి *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

మిసిమి పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹300/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

1. పేరు: .....

2. చిరునామా:

ఇం.నెం. .....

వీధి .....

పేట .....

ఊరు .....

పిన్ .....

సెల్ .....

3. సంతకం: .....

Our A/c Details for Online Transfer :-

Bank	:	STATE BANK OF INDIA
Account	:	MISIMI
A/c. No.	:	10261569316
Branch	:	Saifabad, Hyderabad, INDIA
IFS Code	:	**SBIN0007315**

చందాలు ***మిసిమి*** *పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.*

★ **మిసిమి లో నూతన చందా దారులుగా చేరండి : *అగాధం* పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

★ రెండు సంవత్సరాల చందా దారులకు **బాపు బొమ్మల పుస్తకం పంపిస్తాము.**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **నా కథ చార్లీ చాప్లిన్ గంథాన్ని బహుమతి.**

★ ఐదు సంవత్సరాల చందా దారులు 2013 **మిసిమి సంచికల బౌండును అందుకోవచ్చు.**

మిసిమి
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



దక్కన్ పీఠం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14

ఈ నేల నాది